నుండి గుణవతియును శుభకరురాలును మనోహరురాలును నైనయొక్క యంగనా మణి వచ్చెననిన విని యావిష్ణు దాసిట్లనియె. ఓగురూత్తమా! గుణవతియగు నా యంగనామణి యెట్టిస్వభావము కలది? ఎవ్వనిపుత్రిక? ఎవ్వనిభార్య? ఆవృత్తాం తమును సర్వమును తెలియఁజెప్పుమనిన రామదాసు విని మరలనిట్లనియె.

ఇట్లని శతకోటి రామాయణాంతర్గత విలాసకాండమునందలి
యేడవసర్గము గిసెను.

✱ పింగల యనుదానికి వరదానముచేయుట ✱

ఓశిష్యోత్తమా! కృతయుగముయొక్క యంతమునందు మాయాపట్టణము నందు ఆత్రేయగోత్రోద్భవుఁడైన దేవశర్మయను బ్రాహ్మణోత్తముఁ డొకఁడు కలఁడు. ఆబ్రాహ్మణుఁడు వేదవేదాంగములను జక్కఁగనెఱిఁగినవాఁడు. మఱియు నాబ్రాహ్మణోత్తముఁడు అతిథిసత్కారమును చేయువాఁడును, అగ్నిశుశ్రూషను చేయువాఁడును, సౌరవ్రతపరాయణుఁడును నై దినదినమందును, సూర్యదేవుని నారాధించుటచేత ప్రత్యక్షసూర్యునివలెఁ బ్రకాశించుచున్నాఁడు. ఆబ్రాహ్మణో త్తమునకు మిగులఁ బావనురాలయిన గుణవతియను నామధేయముకల భార్యకలదు. ఆదంపతులకు పుత్రసంతతి లేక యొకపుత్రికమాత్రము కలిగియుండె. ఆపు త్రికను తమశిష్యుఁడగు చంద్రుఁడనువానికి నొసంగి వివాహమునుచేసె. మఱియు వారలు అల్లునినే పుత్రునిగాఁదలఁచుచుండిరి. ఆయల్లుఁడును వారలఁదల్లిదండ్రులను గౌరవించు విధముగఁ గౌరవించుచుండె. అంతట నొక్కనాఁడా దంపతులిరువురును హిమవత్పర్వత సమీపమునందు సంచరించుచుండిరి. అట్లుండఁగ నచ్చోటున నొక్క పులివచ్చి వారలభక్షించె. పిమ్మట నయ్యిరువురును చిరకాలము సూర్యదేవత నారాధించుటచేతఁ గలిగిన పుణ్యవశమువలన వైకుంఠమునకుఁ బోయిరి. మఱియు నోశిష్యోత్తమా! శైవులు సౌరులు గాణాపత్యులు వైష్ణవులు శాక్తేయులు మొదలగువారందఱును నారాయణలోకమగు వైకుంఠమునే పొందుదురు గాన సౌరులు వైకుంఠమునకెట్లు పోయిరని సందేహింపవలవదు. ఆనారాయణుఁడొక్కఁడే యైదు విధములయ్యె. దేవదత్తుఁడొక్కఁడే పుత్రాదినామములచేత ననేక నామములు కలవాఁడైనవిధముగ నారాయణుఁడొక్కఁడే యనేకనామములు కలవాఁడయ్యె. ఓశిష్యోత్తమా! అట్లు వైకుంఠమునకుఁ బోయిన యాయిరువురును విమానముల నధిష్ఠించువారును విష్ణుసారూప్యమును పొందినవారును నైరి. అంతనక్కడ నాగుణవతియను కన్యక తనభర్తయును తల్లిదండ్రులును ఆవ్యాఘ్రాసురునిచేతఁ జంపఁబడిన వృత్తాంతమును తెలిసికొని యత్యధికమైన దుఃఖముచేత విలాపమునుపొందె. అంతటఁ గొంతసేపటికి ధైర్యమును దెచ్చుకొని గృహోపకరణముల నన్నింటిని విక్రయించి శుభకర్మములను జేయుసదియయ్యె. అట్లు తలఁచి తనశక్త్యనుసారముగ

వారలకు పరలోకక్రియలను చేసె. పిమ్మట నాయంగన యాపట్టణమునందే మృతజీవినియైయుండె. మఱియును, ఆయంగనామణి విష్ణుభక్తి పరాయణురాలును, శాంతురాలును, సత్యశౌచములు కలదియును, జితేంద్రియురాలును, నై యెనిమిది వ్రతములను దప్పక చేయుచుండె. ఆవ్రతము లెనిమిదియు నెవ్వియనిన వివరించి చెప్పెదను. వినుము. ఏకాదశీవ్రతము, కార్తికవ్రతము, మాఖచైత్ర వైశాఖమాసములయందు స్నానములు, విష్ణుదేవాలయమునందు సమ్మార్జనాదికమును చేయుట, స్వస్తికాదినివేశనము, విష్ణుపూజనము, అను నెనిమిది వ్రతములను దప్పకజరుపుకొనుచుండె. అట్లు వ్రతములఁ జేయుచు నొక్కనాఁడు పౌరాణికుని వలన సరయూనదియందలి రామతీర్థమునందు చైత్రమాసంబున స్నానముచేయుటవలన నధిక పుణ్యఫలంబు కలుగునని వినియె. అందువలన నాయంగనామణి యొకనాఁడు బయలువెడలి సరయూనదికివచ్చి యక్కడ స్నానమునుచేసి యక్కడనే శ్రీరామునిజూచుటకు యత్నించె. ఆసమయమునందు శ్రీరాముఁడు నిజమందిరమునకుఁ బోయి యుండుటచేత పూజాపాత్రములను హస్తములచేత ధరించి శ్రీరాముని ద్వారమునందు నిలిచి తన యాగమనవృత్తాంతమును శ్రీరామునకుఁ దెలుపుఁడని ద్వారపాలకులతోఁ జెప్పె. అంతట శ్రీరాముని యాజ్ఞానుసారముగ ద్వారపాలకులతోఁ గూడ శ్రీరాముని వాసగృహమునందుఁ బ్రవేశించి శ్రీరాముని జూచె. ఆ సమయమునందు శ్రీరాముఁడు తమ్ములతోడను సీతామహాదేవితోడను పాచికల నాడుచుండె. మఱియు నప్పుడు శ్రీరాముఁడు నెమిలి పింఛములచేత చేయఁబడిన వింజామరములచేత వీచఁబడుచున్నవాఁడును, నానావిధములయిన యాభరణములను ధరించినవాఁడును, నానావిధములయిన ముక్తమాల్యాదులను ధరించినవాఁడును, మిగుల శ్రేష్ఠమగు చక్కఁదనము కలవాఁడును, నై యుండె. అట్టి శ్రీరామునిజూచి క్రిందఁబడి నమస్కరించె. అంతట శ్రీరాముఁ డా యంగనామణిని లేవఁదీసి యాయంగనచేతఁ బూజింపఁబడియె. అట్లు పూజించిన పిమ్మట నాయంగనచేత నీయఁబడిన యుపహారాదులచేతఁ బూజింపఁబడి శ్రీరాముఁడు సంతోషమును పొంది యిట్లనియె. ఓ నారీమణీ! నీవు నన్నునం దభిలషించిన వరమును గోరుమనిన విని యానారీమణి శ్రీరామునితో నిట్లనియె. పద్మపత్రములవంటి నేత్రములుకల యోరామా! నన్ను నీ దాసీజనములో నొకతెనుగాఁ జేర్చి కొనుము. ఇదియ నాయభీష్టమనిన శ్రీరాముఁ డందుల కంగీకారమును పొందెనని చెప్పుచు నిట్లనియె. ఓనారీమణీ! శుభకరములయిన వ్రతములు కలదానా! నీ వీ విధముగాఁ బలుకుటకుఁ గారణమేమి? నీవు విప్రాంగనవై యుండి యిట్టి నీచకృత్యమును గోరనేల? నీకు నన్ను సేవింపవలయునని కోర్కె కలిగియున్న యెడలఁ దగిన యుపాయమును చెప్పెదను. వినుము. ఓ గుణవతీ! నేను ద్వాపర యుగమునందు కృష్ణావతారము నవలంబింతును. అప్పుడు నీవు నాద్వారకయందుఁ బుట్టుము. ఆసమయమునందు స్త్రీరూపముతోడనే నాకుఁ

బరిచర్యను చేయుదువు. సత్రాజిద్దేవశర్మ యనువాఁడు నీకు తండ్రియగును. చంద్రుఁడను పేరుకల యక్రూరుఁడు ఆకాలమునందు నాకు మిత్రుఁడగును. మఱియు నీవు సత్యభామయను నామధేయముతో నాకు మిగులఁ బ్రియురాల వగుదువు. ఓ తరుణీ! నీమనస్సునందున్న విధముగ నప్పుడు నాకు దాస్యమును చేయు మనియె. ఇవ్విధముగ శ్రీరాముఁడు చెప్పినవాక్యములను విని యాగుణవతి యధికముగ సంతోషమును పొంది సీతారాములకు నమస్కరించి తన నివాసస్థలమునకుఁబోయె. పిమ్మట నాయుశ్శేషమును సమాప్తిని పొందించి తన శరీరమును గంగానదియందు విడిచిపెట్టె. అంతఁ గొంతకాలమునకు సత్రాజిత్తునకుఁ బుత్రికయై పుట్టె. అట్లు పుట్టి ద్వారకాపట్టణమునందు శ్రీకృష్ణునకు భార్యయయ్యె. ఓశిష్యోత్తమా! అంతట మఱియొకనాఁడు పింగలయను వేశ్యాంగన సీతామహాదేవితోఁగూడ శయనించియున్న రాముని దగ్గరకు రాత్రికాలమునందు వచ్చి తనకాలియందలి నూపురాదులను వదలి నిశ్శబ్దముగ నిటునటు తిరుగుచుండె. అట్లు తిరుగుచు సీతామహాదేవికి భయమునొందించి యుండె. మఱియు నానావిధములయిన యాభరణములచేతను పుష్పమాలాదులచేతను నలంకరింపఁబడినదై యుండె. మఱియు నా పింగల లోనికిఁబోవునప్పుడు ద్వారపాలకులకుఁ దెలియకుండఁ బోయె. అంతట ధైర్యమును దెచ్చుకొని మెల్లగా శ్రీరామునిపాదమును స్పృశించె. అప్పుడు శ్రీరాముఁడు మేల్కాంచి తనయెదుటనున్న యాపింగలయను కన్యకామణిని జూచె. ఆసమయమునందు సీతామహాదేవి శ్రీరాముని పాదములను గట్టిగఁ బట్టుకొని యిట్లనియె. ఓరఘుకులోత్తమా! నాయపరాధమును క్షమించి దయకలవాఁడవై నన్ను ననుగ్రహింపుమనిన విని కామబాణపీడితురాలగు పింగలతో నిట్లనియె. ఓతరుణీ! నా కీజన్మమునం దేకపత్నీవ్రతము కలదు. ఈవిషయమును నీవును నెఱుఁగుదువు. కావున నే నిప్పుడు నీకామమును దీర్పఁజాలను. అయినను నే నొక్కవిషయమును దెలిపెదను. సావధానచిత్తవై వినుము. నేను ఇంకొక్కజన్మమునందు శ్రీకృష్ణుఁ డనునామధేయముతో నవతరింతును. అప్పు డొక్కనాఁడు కంసవధ నిమిత్తము మధురాపట్టణమునకు వచ్చెదను. ఆసమయమునందు నీవు కుబ్జారూపముతో నన్నుఁబొందఁగలవు. అప్పుడు నీవు అనేకమందిచేత ననుభవింపఁబడిన యీశరీరమును విడిచిపెట్టిన పిమ్మట నీవు కుబ్జవై పుట్టుదువని చెప్పి నీవు పొమ్మనియె. అంతట నయ్యంగన బయలువెడలి పోయె. పిమ్మట శ్రీరాముఁడు ద్వారదేశమునందు నిద్రించుచున్న దాసదాసీజనమును శిక్షించి యిఁకమీఁద జాగ్రతగనుండుఁడని చెప్పె. అనంతరమందు సీతామహాదేవిని నిద్రనుండి లేపి సీతావృత్తాంతమును సర్వమును దెలియఁజెప్పె. ఆవృత్తాంతమునువిని సీతమిగులఁ గోపముకలదై పర్యంకమును(శయ్యను) విడిచి లేచి యిట్లనియె. ఓరఘుకులోత్తమా! ఆవేశ్య యిక్కడనుండఁగ నన్నేల నిద్రనుండి లేపక పోతివి. అది బయలు

వెడలి పోయినపిమ్మట నన్ను లేపుటవలన నివృత్తాంతమంతయును తెలిసినది. నీవు వ్యాసమునివరునిదగ్గర అసత్యమైన ప్రతిజ్ఞనుచేసితివి. నేను ఏకపత్నీవ్రతస్థుఁడ నని యును, అన్యస్త్రీలు కౌసల్యవంటివా రనియును, నీవు మంటిమాటికిని నసత్యముగ మాటలాడుచున్నావు. నీమాటలును నీవ్రతమును నిప్పుడేమయ్యె. ఓరఘుకులోత్తమా ! ఇప్పుడే నాప్రాణమును సరయూనదియందు విడిచిపెట్టెదను. వేశ్యయొక్క పృష్ఠభాగముచేత సక్తమైనశయ్యను నేను స్పృశింపను. వేశ్యాసక్తుఁడ వగు నిన్నుఁ జూచుట నాకిష్టములేదు. నేను మరణమును పొందినపిమ్మట వేశ్యాసంగమఫలమును నీవనుభవించెదవు. వేశ్యాసక్తుఁడైన రాజునకు రాజ్యము చిరకాలముండదని చెప్పి శ్రీరామునకు నమస్కరించి దేహత్యాగముకొఱ కుద్యుక్తురాలయ్యె. అట్లు దేహత్యాగమున కుద్యుక్తురాలై మెఱుపుతీగవలె వస్త్రగేహమునుండి బయలువెడలె. ఆసమయమునందు శ్రీరాముఁడు సీతామహాదేవితోఁ గూడఁ బరుగిడనారంభించె. ఆసమయమునందు శ్రీరాముఁడు ముక్తకచ్ఛుఁడయ్యె. అట్లు శ్రీరాముఁడు వెంటనంటి పరుగిడి భుజములచేత సీతామహాదేవిని గాఢముగఁ బట్టుకొని నిర్మలమయిన యిసుకతిన్నె యందునిలిపి మృదుమధుర వచనముల నిట్లనియె. ఓసీతా ! నీవు కోపమును పొందకుము నావచనమును వినుము. నీవేదివ్యప్రమాణమును చేయుమన్నను జేసెదను. నాప్రమాణములయందు నీకు నమ్మకము లేకపోయిన యెడ నియిష్టానుసారమగు కఠినప్రమాణమును గూడఁ జేసెదను. ఓసీతా ! నీవుకోపమును చెందక నీయభీష్టానుసారమగు ప్రమాణమును చేసెదననిన విని సీతామహాదేవి యిట్లనియె. ఓరఘుకులోత్తమా! నీకు నేనేమి ప్రమాణము సేయగలను. అగ్నిదేవుఁడు నీముఖమునుండిపుట్టె. నీనేత్రములయందు సూర్యచంద్రులు గలిగిరి. సముద్రము నీకునివాసస్థానమయ్యె. నీవుభూమిని ధరించితివి. ఆదిశేషుఁడు నీకుఁబఱుపయ్యె. ఆయాదిశేషుఁడే యిప్పుడు లక్ష్మణుఁడై నీద్వారమునకు వెలుపల నున్నవాఁడు. సకల శాస్త్రములును నీముఖము నుండి పుట్టినవయ్యె. మఱియును, ఈలోకమునందుఁ గనఁబడు వస్తువులన్నియును నీస్వరూపమై యున్నవి. కావున నీకు దుర్ఘటమైన ప్రమాణమేదియును లేదు. ఓ రఘుకులోత్తమా ! దేనిచేత నాకు నమ్మకముకలుగునో అట్టిదేదియునుగానము. అయిన నొక్కటి కలదని నాకుఁ దోచుచున్నది. దానిం జెప్పెదను. సావధానచిత్తుఁడవై వినుము. ఓ రఘుకులోత్తమా ! ఇప్పుడే మన కులగురుఁడగు వసిష్ఠమహామునిని రప్పించి యతనిపాదములయందు శపథమునుచేసిన యెడల నాకు నమ్మకముకలుగును. ఇంతకంటె నధికమగు ప్రమాణమేదియును లేదనినవిని శ్రీరాముఁడునవ్వి దాసినిబంపి లక్ష్మణునిరప్పించి వసిష్ఠమునివరుని బిలిచికొనిరమ్మనియె. అంతట లక్ష్మణుఁడు శిబికారూఢుఁడై బయలువెడలి శ్రీరామునిపనికిగాఁ బోవలయునని చెప్పి ద్వారపాలకునివలన నగరద్వారమును తెఱపించుకొని గురుని గృహముదగ్గరకుఁబోయి తనరా

కకుఁ దగినకారణమును వసిష్ఠమునివరునకు ద్వారపాలికచేతఁ దెలిపె. అప్పుడు వసిష్ఠమహాముని యాయర్ధరాత్రసమయమునందు లక్ష్మణుఁడు వచ్చుటనువిని విహ్వలుఁడై లక్ష్మణునిబిలిపించి యిట్లనియె. ఓలక్ష్మణా! నీవు అర్ధరాత్రమునం దతివేగముగ నిక్కడకువచ్చుటకుఁ గారణమేమనిన విని లక్ష్మణుఁడు వసిష్ఠమునివరునకు నమస్కరించి రాముఁడు మిమ్ముదోడ్తెమ్మనియె. దానికిఁ దగిన కారణమును నేనెఱుఁగను. శీఘ్రముగఁ దాముదయచేయవలయును. ద్వారదేశమునందున నిమిత్తముగ శిబికవచ్చియున్నదనిన విని యా వసిష్ఠమహాముని యరుంధతితోఁగూడ శిబికారూఢుఁడై బయలువెడలె. ఆసమయమునందు లక్ష్మణుఁడుకూడ శిబికారూఢుఁడై వసిష్ఠమహామునియొక్క శిబికను వెనుకభాగమునందుఁ బోవుచుండె. అంతట క్షణములోపల వారందఱును శ్రీరామునిదగ్గరకుఁ బోయిరి. అప్పుడు శ్రీరాముఁడు గురుఁడగు వసిష్ఠమహామునివచ్చిన వృత్తాంతమును విని యెదురుగఁ బోయి కొనివచ్చి తగిన యాసనమునందుఁ గూర్చుండనియమించి సీతామహాదేవితోఁగూడ నమస్కారమునుచేసె. పిమ్మట గురుఁడగు వసిష్ఠమునివరునకు షోడశోపచార పూజలనుచేసి వస్త్రాద్యాభరణములను సమర్పించి జరిగినవృత్తాంతమును సర్వమునుచెప్పె. మఱియును, సీతయొక్క క్రోధవాక్యములనుగూడఁ దెలియఁజేసె. మఱియు నోమునివర్యా! ఈసీత నాప్రమాణమునకును అంగీకరింపక నీపాదముల నంటి ప్రమాణమును చేయుమనియె. ఓగురూత్తమా! ఆవేశ్యనుగాని మఱియొక్కస్త్రీనిగాని నేను మనస్సుచేతఁగూడ ననుభవించినవాఁడనుగాను. ఈ వచనము సత్యమని నీపాదములను స్పృశించి ప్రమాణము చేసెదనని చెప్పి యా వసిష్ఠమునివరుని పాదములనుస్పృశించె. మఱియు నా వసిష్ఠమునివరుని పాదములనుబట్టుకొని నమస్కరించె. అట్లు శ్రీరాముఁడు ప్రమాణమునుచేసినపిమ్మట సీతామహాదేవి శ్రీరాముని పరిశుద్ధునిగాఁ దలిసికొని లజ్జను పొందినదయ్యె. పిమ్మట శ్రీరామునకు నమస్కరించి యో రఘుకులోత్తమా! నా యపరాధమును క్షమించి నాయందు ప్రసన్నుఁడవగుమనియె. అట్లుప్రార్థించి శ్రీరాముని ప్రసన్నునిగాఁ జేసికొనిన పిమ్మట నాసీతామహాదేవి యరుంధతికి మిగుల విచిత్రములగు ననేకభూషణముల నిచ్చె. మఱియును నానావిధములగు వస్త్రములను సమర్పించె. అంతట శ్రీరాముఁ డుకూడ నరుంధతీవసిష్ఠులకు మరల పూజనుచేసె. పిమ్మట వసిష్ఠమునివరుఁడు అరుంధతీదేవితోఁగూడ శిబికయందుఁగూడఁ గూర్చుండి నిజమందిరమునకుఁబోయె. అంతట సీతారాములు సుఖనిద్రం జెందిరి. పిమ్మట మరుదినమునందు తెల్లవారిన పిమ్మట సీతామహాదేవి కాలోచితకృత్యములను దీర్చికొని పింగలయను వేశ్యాస్త్రీని బిలిపించి ఛీఛీ యనుచు చెలికత్తియలచేత తాడనము చేయించి సంకెళులువేయించి యిట్లనియె. ఓ వేశ్యాంగనా! నీవు నాయెడల నపరాధమును చేసితివి కనుక మధురాపట్టణమునందు మూఁడువిధములగు వంకరలు కలదానవును కుత్సితు

రాలవును అగుదు వనిన విని యూపింగళి యనేకవిధముల ప్రార్థింపఁగా సీతామహాదేవి నన్ను శ్రీకృష్ణుఁ డుద్ధరించు ననియె. అట్లు వేశ్యను బాధించిన వృత్తాంతమును విని శ్రీరాముఁడు దానిని విడిపింపఁజేసె. ఈవిధముగ శ్రీరాముఁడు నానావిధములయిన కౌతుకములను జేసె. మఱియును, శ్రీరాముఁడు మిగుల విచిత్రములయిన తనచరిత్రములచేత సీతామహాదేవికి సంతోషమును గలుగఁజేయుచుండె.

ఇట్లని శతకోటిరామాయణాంతర్గత విలాసకాండమునందలి
యెనిమిదవసర్గ ముగిసెను.

✱ కురుక్షేత్ర యాత్రయందు సీతా జయముకలుగుట. ✱

ఓశిష్యోత్తమా! విష్ణుదాసా! అంతట నొకనాఁడు సూర్యగ్రహణము వచ్చుటచేత సీతారాములు బంధుజనులతోఁగూడ కురుక్షేత్రమునకుఁ బోయె. అప్పుడక్కడకు దేవతలు గంధర్వ కిన్నర పన్నగులతోఁగూడ వచ్చిరి. మఱియు ననేకాశ్రమములనుండి యనేకవేలమంది మునులు తమశిష్యులు మొదలగువారితోఁగూడ వచ్చిరి. మఱియు ననేకులగు రాజులు మొదలగువారుకూడ వచ్చిరి. అంతట సూర్యగ్రస్తముకాఁగానే శ్రీరాముఁడు సీతతోఁగూడ స్నానమునుచేసి నానావిధములయిన దానములను చేసె. మఱియును గజోష్ట్రాదులను దానముచేసె. ఆసమయమునందు రాజులందఱును నానావిధములయిన కానుకలు హస్తమునందుఁగలవారై తమతమ భార్యలతోఁగూడ శ్రీరాముని జూచుటకు బయలువెడలి పోయిరి. అప్పుడు సీతామహాదేవి రాజభార్యలనందఱఁ గౌఁగిలించుకొని తగిన యాసనములందుఁ గూర్చుండఁబెట్టె. మఱియు నావిధముగానే వచ్చినమునిభార్యల కందఱకును నమస్కరించి తగిన యాసనములయందుఁ గూర్చుండఁబెట్టె. అట్టిసమయమునందు సీతామహాదేవిచేతఁ బూజింపఁబడి లోపాముద్రియను సంగనామణి సీతామహాదేవిని రంజింపఁజేయుచు నిట్లనియె. పద్మపత్రములవంటి నేత్రములుకల యోయంగనామణీ! నీవు ధన్యురాలవైతివి. చెవులకు సంతోషమును కలుగఁజేయునట్టి శ్రీరాముని చరిత్రమును కొంచెముగ వివరించి చెప్పుమనిన విని సీతామహాదేవి తన వివాహకాలము మొదలుకొని కురుక్షేత్రమునకు వచ్చునఱకును జరిగిన శ్రీరాముని పరాక్రమాది గుణములను వర్ణించి చెప్పె. అప్పుడు లోపాముద్ర యావృత్తాంతమును సర్వమునువిని నవ్వుచు నిట్లనియె. ఓసీతా! మహానుభావుఁడైన శ్రీరాముని చరిత్రము సర్వమును యుక్తముగనే యున్నది. ఒక్కటిమాత్రము వ్యర్థమనియును, నిర్నిమిత్తముగ శ్రమనుపొందుట యనియును తోఁచుచున్నది. దానిం జెప్పెదను. వినుము. శ్రీరాముఁడు మిగుల శ్రమమునుపొంది సేతుబంధము సేయఁజేసె. ఆవిషయమును నాభర్తయగు నగస్త్యమునివరునితోఁ జెప్పకుండుటకుఁ గారణమేమి? నాభర్త కావృత్తాంతమును చెప్పక శ్రీరాముఁడు వ్యర్థముగ వానరులను శ్రమపఱిచె.

ఓసీతా! ఆవృత్తాంతమును నాభర్తతోఁ జెప్పినయెడల నాభర్తయగు నగస్త్యమునివరుఁడు క్షణములోపల సముద్రమును సర్వమును నరచేతిగుంతయుం దిమిడ్చికొని పానముచేయును. అట్లయినయెడల వానరులందఱును సులభముగ సముద్రమును దాటియుందురు కదా యనిన విని సీతామహాదేవి మిగుల గర్వముకలదై యిట్లనియె. పతివ్రతలలో నుత్తమురాలవైన యోలోపాముద్రా! శ్రీరాముఁడు ఆలోచింపక సేతుబంధమును చేసినవాఁడుకాఁడు. చక్కఁగ నాలోచించియే చేసెను. అట్లు చేయుటకుఁ దగినకారణమును చెప్పెదను. సావధానచిత్తముకలదానవై వినుము. మఱియు నిక్కడనున్న వారందఱును విందురుగాక. శ్రీరాముఁడు సముద్రమును బాణముచేత శోషింపఁజేసిన యెడల సముద్రములోని యనేకజంతువులకు హానికలుగునని తలఁచె. మఱియు నాకాశమార్గమున సముద్రమునుదాఁటిన యెడల రావణుఁడు తననుమనుష్యునిగాఁ దలఁపఁడనియెంచె. హనుమంతుని పృష్ఠభాగమునందుఁ గూర్చుండి సముద్రమును దాటినయెడల లంకలోనివారందఱును దన పరాక్రమమును నిందింతురని తలఁచె. బాహువులతో నీది సముద్రమును దాటుదమన్న నాసముద్రోదకము బ్రాహ్మణమూత్రమగుటచేత నీది దాటఁగూడదని యెంచె. సముద్రమును సర్వమును అరచేతిగుంతయుం దిమిడ్చుదమన్న నిది విప్రమూత్రమగుటచేత స్పృశింపఁదగదని యోచించె. మఱియును, స్పృశించుటకే యర్హముకానిది త్రాగుటకుఁ దగదని చెప్ప నక్కఱలేదు గదా? మఱియు నోనారీమణీ! అగస్త్యమునివరుని పానముచేయుమని చెప్పుటకు స్వమూత్రము నెట్లు పానముచేయుమందమని యోచించె. మఱియు నిట్టికార్యమును చేయుమనుటచేత నపకీర్తివచ్చునని తలఁచె. ఇట్లు బహువిధముల నాలోచించి యిందేదియును యుక్తముకాదనియెంచి తన కీర్తి స్థిరముగ నిలుచుటకొఱకు కాలత్రయములయందును నితరులకసాధ్యమగు సేతుబంధమును జేసెననిన విని యాలోపాముద్ర మాఱాడఁజాలక యూరకుండె. మఱియును సిగ్గునుపొందె. అంతట సీతామహాదేవి లోపాముద్రకును ఇతరఋషిభార్యలకును పూజనుచేసి సవినయముగ లోపాముద్రతో నిట్లనియె. ఓతల్లీ! లోపాముద్రా! నేను గర్వోక్తులను పలికిన యెడల నపరాధమును చేసితిని. నన్ను మన్నింపుము. అగస్త్యమునివరుని యాశీర్వచనబలము కలిగియుండుటచేతనే శ్రీరాముఁ డిట్టికార్యమును చేయఁగలిగెనని చెప్పి తగినవిధముల నయ్యమను పూజించి స్వస్థానమునకుఁ బంపె. అంతట నితరఋషిభార్యలుకూడ సీతామహాదేవిచేతఁ బూజితలై తమతమ నివాసములకుఁబోయిరి. పిమ్మట శ్రీరాముని సమీపమునకుఁ బోయె. ఆసమయమునందు సకలరాజులును గజతురంగాదులను సమర్పించి శ్రీరాముని పూజించిరి. అట్లు సకలరాజులచేతను పూజింపఁబడిన పిమ్మట శ్రీరాముఁడు సీతామహాదేవి మొదలగువారితోఁగూడ గరుడవాహనారూఢుఁడై నిజనగరమునకుఁ బోయె. మఱియు నాకురుక్షేత్రమునకు సూర్యగ్రహణ పుణ్యకాలమునందువచ్చిన

రాజులందఱును శ్రీరామదర్శనముచేత నానందభరితులై తమతమ నివాసములకుఁ బోయిరి. అట్లు నిజనగరమునకుఁ బోయిన పిమ్మట సీతారాములు చిరకాలము తమబాంధవాదులతోఁగూడ సుఖంబుగనుండిరి. మఱియును, శ్రీరాముఁడు సీతతోఁ గూడ నానావిధములయిన క్రీడాకౌతుకములను జరుపుచుండె. ఇటులనే లక్ష్మణాదులతోఁగూడ నూర్మిళాదులును సుఖముగ నానావిధక్రీడలచే నానందమును పొందుచుండిరి. మఱియు నీవిధముగానే పురజనులును నానాదేశజనులును తమతమ భార్యాపుత్త్రాదులతోఁ గూడ యథేష్టముగ నానందమును పొందుచుండిరి. పార్వతీపరమేశ్వరులవలె సీతారాములు క్రీడించుచుండిరి. మఱియు నోశిష్యోత్తమా! శ్రీరాముఁడు రాజ్యమును చేయుచున్నప్పుడు భూలోకమునందు పరభార్యలతోఁ గ్రీడించువాఁడును, వేశ్యాసక్తుఁడును, మదమును కలుగజేయునట్టి వస్తువులను భుజించువాఁడును ఎవ్వఁడును లేకయుండె. మఱియును, దరిద్రుఁడు, రోగి, విచారగ్రస్తుఁడు, విహ్వలుఁడు, పాపాత్ముఁడు, జడుఁడు, చోరుఁడు, ఘాతకుఁడు మొదలగువారెక్కడను లేక యుండిరి. ఓశిష్యోత్తమా! ఇప్పుడు నాచేత చెప్పఁబడిన విలాసకాండము మిగులఁ బావనమైనది. దీనిని ప్రాతర్మధ్యాహ్న కాలములయందును రామసన్నిధియందును పఠించువాఁడును వినువాఁడును మానవరూపమును ధరించిన శ్రీరాముఁడనియే యెన్నఁదగినవాఁడు. ఓశిష్యోత్తమా! ధనార్థి యగువాఁ డీవిలాసకాండమును పఠించినయెడల ధనమును పొందును. భోగార్థియగువాఁడు భోగములను పొందును. పుత్త్రార్థియయ్యేనేని పుత్త్రులను పొందును. శిష్యోత్తమా! రామభక్తియందు మిగుల దృఢమైన మనస్సుకలవాఁడై మిగుల మనోహరమును, జనరంజకమును, ఆనందమును కలుగఁజేయు నట్టిదియును, మిగుల విచిత్రమును, శ్రవణేంద్రియమునకు సంతోషమును కలుగఁజేయు నట్టిదియును, అయిన యీవిలాసకాండము నెవ్వఁడు పఠించునో వినునో అట్టివాఁడు సకలకోర్కెలను పొందును. మఱియు నోశిష్యోత్తమా! ఈవిలాసకాండమును పఠించువాఁడు ధనార్థియయ్యేనేని ధనమును, ధర్మార్థియయ్యేనేని ధర్మమును, కామార్థియగువాఁడు కామమును, మోక్షార్థియగు వాఁడు మోక్షమును, పొందును. రాత్రులయందు మంచమునందుండి భార్యతోఁ గూడ ఆరుమాసముల కాలము ఈవిలాసకాండమును పఠించిన యెడల అట్టివానికి పుత్త్రుఁడుకలుగును. మఱియు నిట్లుకాదేని తనమంచకమునకెదుట వేత్రాకమంచకమును స్థాపించి దానియందు వేదవ్యాసుని ప్రవేశపెట్టి భార్యతోఁగూడ నీవిలాసకాండమును వినువాఁడు తొమ్మిదిమాసములకు ప్రతిసంతతిగలవాఁడగును. ఓశిష్యోత్తమా! పుత్త్రార్థియగువాఁడు మాత్రమే మంచకమునందుండి వినవలయును గాని ఇతరమును కోరువాఁడట్లుచేయఁ గూడదు. స్త్రీకాముఁడగువాఁ డీవిలాసకాండమును తొమ్మిదిమాసములకాలము పఠించిన యెడల మిగుల మనోహరురాలగు భార్యను పొందును. మఱియు నోశిష్యోత్తమా! ఈవిలాసకాం

డమును మిగులశ్రద్ధతో వినునట్టి యాడువారు యెన్నటికిని సౌభాగ్యహీనతికలవారు గాక యుందురు. భర్తకు ఆయుష్యాభివృద్ధిని కోరునట్టియాడువారు స్నానమును చేసి భక్తితో నీకాండమును వినవలయును. ఓశిష్యోత్తమా ! ఈవిలాసకాండము మిగుల మనోహరమును పాపహరమును మోక్షదాయకమునునై యున్నది.

ఇట్లని యానందరామాయణాంతర్గత విలాసకాండమునందలి
తొమ్మిదవసర్గ ముగిసెను.

విలాసకాండము సంపూర్ణము.

శ్రీరస్తు.

శ్రీరామచంద్ర పరబ్రహ్మణే నమః.

ఆనందరామాయణము

జన్మకాండము.

✷ సీతాదోహద క్రీడావర్ణనము ✷

అట్లు విలాసకాండమును చెప్పిన పిమ్మట రామదాసు తనశిష్యుఁడగు విష్ణుదాసుతో నిట్లనియె. ఓశిష్యోత్తమా! విష్ణుదాసా! అంతట శ్రీరాముఁడు అయోధ్యాపట్టణమునందు సీతతోడ విహరించుచు చిరకాలము బంధువులకు సంతోషమును గల్పించుచుండె. మఱియును శ్రీరాముఁడు సీతతోఁగూడ నానావిధములగు క్రీడలను సల్పుచుండె. అట్లుండఁగ నొక్కనాడు శ్రీరాముఁడు దాసీముఖము వలన సీతామహాదేవి గర్భవతి యైనదని విని యధికానందము కలవాఁడయ్యె. అనంతర మందు నానావిధములగు దానములను చేసి యనేక కోటిమంది బ్రాహ్మణుల కన్నదానమునుజేసె. పిమ్మట సీతామహాదేవికి నూతనములును అనేక విధములును నగు రత్నములచేత నిర్మింపఁబడిన యాభరణములచేత నలంకారమునుచేయునట్లు చేయించె. మఱియును, సీతామహాదేవికి బంగారపు సరిగచేత ధగధగమెఱయు చున్నవియును ఆకుపచ్చ వర్ణముకలవియును, పీతవర్ణము కలవియును, ఎఱ్ఱనివియును, చిత్రవర్ణములు కలవియును, మిగుల విశాలము లయినవియును, పుష్పములవలె మృదువైనవియును, మిగుల దేలికయైనవియును, అయిన వస్త్రములనిప్పించె. పిమ్మట రెండవమాసమునందు వసిష్ఠుఁడు మొదలగు వారితో నాలోచించి శాస్త్రోక్తప్రకారముగ పుంసవన మనుకర్మమునుచేసె. మఱియును, ఆపుంసవన మహోత్సవమునకు శ్రీరాముఁడు సుమేధాజనకచక్రవర్తులను రప్పించుటకుఁ జారులనుబంపె. ఆవృత్తాంతమును విని సుమేధాజనకులు పరమానందమును పొంది తగువిధముగ నయోధ్యా పట్టణమునకు వచ్చిరి. వచ్చి సీతారాములను పుంసవనమహోత్సవమునందు పూజించిరి. మఱియును, జనకచక్రవర్తి తనపుత్రిక గర్భవతియగుటకుఁ బరమానందమును పొందె. ఇంతయగాక సీతామహాదేవికి వెలలేని వస్త్రాలంకారాదుల నొసంగె. పిమ్మట శ్రీరామునకుఁ గూడ నానావిధములగు చతురంగబలములతోఁ గూడ వివిధము లయిన వస్త్రాలంకారాదుల నొసంగె. ఇవ్విధముగ జనకచక్రవర్తి సీతారాములకు బహుమతులొసంగి మరల మిథిలాపట్టణమునకుఁబోయె.

అనంతరమందు శ్రీరాముఁడు సీతామహాదేవితోఁగూడఁ జిరకాలము క్రీడించుచు సంతుష్టమనస్కుఁడై యుండె. పిమ్మట సీతామహాదేవి గర్భభారమధికమగుటవలన మోయఁజాలక సకలాభరణములను విడిచి పెట్టె. మఱియు నాసమయమునందు సీతామహాదేవి తెల్లఁబారిన ముఖము కలదియును, దీనురాలును కృశించినదియును నయ్యును మిగుల మనోహరముగఁ బ్రకాశించె. అంతట నొక్కనాఁడు సీతామహాదేవి భర్తయగు రామునితోఁ జెప్పుమని పంపుచు తల్లితో నిట్లనియె. ఓతల్లీ! నాకు వనమధ్యమునందు రామునితోఁగూడఁ గ్రీడింపవలయునని తలంపు కలిగియున్నదనియె. మఱియు నయోధ్యాపట్టణమునకు వెలుపట నుద్యానవనములయందు విహరింపవలయు ననియెడు తలంపు కలిగియున్నదనియె. అంతట నాధాత్రివలన (సీతయొక్క పెంపుడుతల్లివలన) శ్రీరాముఁడు ఆవృత్తాంతమును విని లక్ష్మణుని పిలిచి మృదుమధుర వచనముల నవ్వుచు నిట్లనియె. ఓలక్ష్మణా! తమ్ముఁడా! ఇప్పుడు సీతకు ఆరామముల యందు దిరుగవలయు ననియెడు తలంపు కలిగి యున్నది. కావున నీకీవిషయమును తెలిపితి కనుక చేయఁదగిన కార్యములను నెరవేర్పుమనియె. అట్లు శ్రీరాముఁడు చెప్పిన వాక్యములను విని లక్ష్మణుఁడతి శీఘ్రముగఁ బోయిసభయందున్న సేవకులను బిలిచి చిత్రములయిన తలపాగలు కలవారును, వేత్రపాణులును నగువారితో నవ్వుచునిట్లనియె. ఓభటోత్తములారా! రాజవీథియందంతటను జానకీదేవి యారామమునకుఁ బోఁదలఁచియున్నదని చాటింపును చేయింపుఁడు. మఱియును మీరును వర్తకులును రామునితోఁగూడఁ బోదగియున్నదనియె. అంతట నావేత్రపాణులు లక్ష్మణుని వాక్యములనువిని విచిత్రములగు తలగుడ్డలు కలవారును, సువర్ణ వేత్రములను ధరించినవారునునై రాజమార్గమునందు నాలుగు త్రోవలుకలిసిన స్థలమునందును, అంగడి వీథియందును, ఊర్ధ్వహస్తులై యుచ్చైస్స్వరములతో నిట్లనిరి. ఓపౌరులారా! ఓవర్తకులారా! వ్యవసాయకులారా! మఱియు నోసకలజనులారా! మీరందఱును సంతుష్టహృదయులై వినుఁడు. ఈసమయమునందు సీతామహాదేవి యుద్యానవనమునకుఁ బోవుచున్నది. శ్రీరాముఁడు మీలో నిష్టముకల వారందఱును పోవచ్చునని సెలవిచ్చియె ననియెల్లవారికిని దెలిపి యాసేవకులు మరల లక్ష్మణుని దగ్గరకుఁ బోయిరి. అప్పుడు లక్ష్మణుఁడు మరల దూతలను బిలిచి యిట్లనియె. ఓచారులారా! ఆరామమునందంతటను పటమందిరములను విచిత్రముగ నిర్మింప వలయును. మఱియును, జలయంత్రముల నన్నిటిని శోధింపవలయును. మఱియును, నానావిధములయిన మాంగల్య వస్తువులను, మిగుల వెలగల సుగంధ వస్తువులను, మిగులఁ దేలికయగు వస్త్రములను, సిద్ధముచేయవలయును. మఱియు నీవిధముగానే యనేకము లయినశృంగార వస్తువులచేత సర్వస్థలముల యందును అలంకారము చేయవలయును. మఱియు నోచారులారా! దివ్యములగు తోరణాదులను కట్టవలయుననియె. అంతట నాచారులందఱును

మిగుల త్వరకలవారై లక్ష్మణుఁడు చెప్పిన విధముగా సర్వమును సిద్ధపఱచిరి. అంతట లక్ష్మణుఁడు అతిశీఘ్రముగ శ్రీరాముని దగ్గరకుఁ బోయి యిట్లనియె. ఓరఘుకులోత్తమా! నీయాజ్ఞానుసారమును సర్వమును నెరవేర్చితిని. నీకును సీతామహాదేవికిని ఏమియానమును సిద్ధముచేయవలయునో తెలియలేదనిన శ్రీరాముఁ డిట్లనియె. ఓసీతా! నీకేవాహనముకావలయునో చెప్పుమనినవిని సీతామహాదేవిశిబికకావలయుననియె. అప్పుడుశ్రీరామునకుఁగూడశిబికయేయుత్తమవాహనమనితోఁచె. అంతటలక్ష్మణుఁడు వారియభిప్రాయమును తెలిసికొని రత్నభూషితములయినశిబికలనుగొనివచ్చె. ఆశిబికలను రెండును హేమతంతువులవలనఁగలిగినవస్త్రములచేతఁ జుట్టఁబడియుండె. మఱియు నా శిబికలు రత్నములచేత ముత్యములచేతను మెండుగ నలంకరింపఁ బడియె. అంతట శ్రీరాముఁడు పరమ సంతోషముతో నాశిబిక నధిష్ఠించె. అప్పుడు తెల్లని వస్త్రము కలదియును, మితములయిన భూషణములు కలదియును, కృశించిన శరీరము కలదియును, దాసీజనముచేత పట్టుకొనఁబడిన హస్తము కలదియును నై మెల్లగ శిబిక నధిష్ఠించె. ఆసమయమునందు దాసీజనము వింజామరములను వైచుచుండె. అప్పుడు సీతామహాదేవి హేమతంతువులచేత నిర్మింపఁబడిన శిబికాగుచ్ఛమును పట్టుకొనియె. మఱియును, ముక్తామయములయిన గవాక్షములనుండి బాహ్యప్రదేశములను బాహ్యమునందు జరుగుచున్న కౌతుకములను చూచుచుండె. మఱియును, రాజమార్గమునందు వచ్చుచుఁ బోవుచున్న వారలను వేశ్యాస్త్రీల నృత్యమును చూచుచుండె. దాసీజనము ఆసమయమునందు సీతామహాదేవిని జుట్టుకొనియుండె. మఱియు నాసమయమునందు బంధువులును, బాంధు భార్యలును, ఆశిబికను చుట్టుకొనియుండిరి. మఱియు నా శిబికకు నగ్రభాగమునందుభ్రాతలును తల్లులును నివసించియుండిరి. ఈవిధముగ నెల్లవారును వెంటరా శ్రీరాముని చూచుచు సీతామహాదేవి పోవుచుండె. ఆసమయమునందు వారస్త్రీలు నృత్యమును చేయుచుండిరి. నానావిధములయిన వాద్యములు మ్రోగుచుండె. మఱియు నాసమయమునందు వందిమాగధులు స్తోత్రమును చేసిరి. ఇవ్విధముగననేక విధములయిన యుత్సవములు జరుగుచుండఁగా సీతారాములు ఆరామమునకుఁ బోయిరి. అట్లు పోయిన పిమ్మట నెల్లవారును సేవించుచుండఁగ సీతారాములు పటమందిరమునకుఁ బోయిరి. మఱియు నా సమయమునందు సీతారాములతో వచ్చిన పౌరులందఱును వారివారికిని నియమింపఁబడిన పటమందిరములయందుఁ బ్రవేశించిరి. అప్పుడు వారస్త్రీలు మిగుల మనోహరముగ నృత్యములను సల్పిరి. సీతామహాదేవి నివసించిన పటమందిరమునందలి వస్త్రభిత్తులు అయిదు క్రోసుల పరిమితి కలవై యుండె. అట్టి పటమందిరమునందు నివసించి సీతామహాదేవి యారామమును సర్వమును జూచె. ఆయారామము తాలహింతాల తమాలవృక్షములచేత వ్యాప్తమై యుండె. మఱియు నావనము తియ్యమామిడిచెట్లచేత రసము

సకాలమయినదియును, ఖర్జూరవృక్షములచేత ఖర్జూరాకారమైనదియును, శ్రీఫల వృక్షములచేత శ్రీఫలస్వరూపమును, అగురువృక్షములచేత అధికమైన శోభకలదియును, కపిత్థ వృక్షములచేత కపివలెఁ బచ్చనిదియును, కుచకారలకుచవృక్షములచేత మనోహరమైనదియును, అమృతమువంటి ఫలములను కలుగఁ జేయునట్టి యరటి వృక్షములచేత మిగులఁ జక్కఁగఁ బ్రకాశింపఁ జేయఁబడినదియును, సురంగ వృక్షములచేతను నారింగ వృక్షములచేతను రంగమండపమువంటి శోభకలదియును, వానీర వృక్షములచేతను జంబీర వృక్షములచేతను బీజ పూర వృక్షములచేతను వ్యాప్తమైనదియును, నై యుండెను. మఱియు నాయారామమునందలి వృక్షములవలనఁ గలుగునట్టి మందపవనముచేత మార్గస్థులఁ బడలికలు వోవుచుండెను. మఱియును, పున్నాగ వృక్షములయందలి చిగురుటాకులనియెడు వనహస్తము మల్లికా స్తబకములనియెడు స్తనములను స్పృశించుచుండెను. మఱియును బ్రద్దలయిన దాడిమ ఫలములయందలి గర్తముచేత హృదయమునందలి రక్తమును ప్రకటన చేయుచున్నట్లుండెను. బండిగురిగింజ తీగలచేత వృక్షములు స్త్రీలచేత పురుషులు కౌగిలించు కొనఁబడునట్లు కౌగిలించుకొనఁ బడుచున్నవి. మఱియు నీవిధముగానే నానావిధములగు వృక్షములచేత నానావిధకౌతుకములు కనఁబడుచుండెను. మఱియు నయ్యరణ్యమునందు నానావిధములయిన మృగములచేత నానావిధములగు క్రీడలను సలుపుచుండుటను జూచుచు సీతారాములు సంతోషమును పొందిరి.

ఇట్లని యానందరామాయణాంతర్గతమైన జన్మకాండమునందలి
మొదటిసర్గ ముగిసెను.

✱ వివిధక్రీడలను సీమంతోత్సవమును చేయుట. ✱

ఓశిష్యోత్తమా! విష్ణుదాసా! అనంతరమందు సీతామహాదేవి శ్రీరామునితోఁగూడ రమ్యములైన యుద్యానవనభూములయందు దేవతలచేతఁగూడఁ గొనియాడదగినవియును, నానావిధములును, అయిన క్రీడలనుసల్పె. మఱియు నాసీతామహాదేవి శ్రీరామునితోఁగూడ వనాంతమునందలి ప్రాసాదమునందును, వస్త్రగృహములయందును, మామిడిచెట్లనీడలయందును, పుష్పవనములయందును, జలయంత్రములయొక్క సమీపమునందున్న దివ్యాసనములయందును, సరోవరతటమునందును, నదీతీరమునందును, నానావిధములయిన క్రీడలను సల్పుచుండెను. పిమ్మట సరయూనదియందలి యోడనెక్కి శ్రీరామునితోఁగూడ క్రీడించె. ఒకప్పుడు రాత్రికాలమునందును పగటికాలమునందును శ్రీరామునితోఁగూడ జలక్రీడనుచేసె. ఒకానొకప్పుడు తటాకమునందలి పడవయందు విహరించె. మఱియొకప్పుడు అరటిచెట్లతోటయందు విహరించుచుండెను. మఱియును, వృక్షములయొక్క యూర్ధ్వ

భాగములయందు నిర్మింపఁబడిన గృహములయందును, వట్టివేళ్ల చేత నిర్మింపఁబడిన గృహములయందును, సరయూనదీతీరమునందు నిర్మింపఁబడిన గృహములయందును క్రీడించుచుండెను. మఱియు నోశిష్యోత్తమా ! విష్ణుదాసా ! ఆసీతారాములు ఒకానొకప్పుడు కృత్రిమ గృహములయందును, పుష్ప గృహములయందును, చిత్రశాలలయందును, పుష్పకవిమానమునందును, కేతకీఖండమునందును, స్తంభగృహమునందును, సైకతమునందును, ఒంటి స్తంభపు మేడయందును, క్రీడించుచుండిరి. మఱియొకప్పుడు ఆసీతామహాదేవి యాందోలికయందును, పర్యంక చక్రమధ్యమునందును, దాడిమీవనమునందును, నృత్యసంబంధమగు పర్యంకమునందును శ్రీరామునితోఁగూడ క్రీడించుచుండును. ఆసమయమునందు సీతామహాదేవి హరిద్వస్త్రమును ధరించి రక్తకంచుకమును తొడుగుకొనియుండె. అట్లు విహరించుచు నొకప్పుడు తాను చెట్లచాటునకుఁబోయి కనఁబడకుండుటచేత శ్రీరాముఁడు మిగుల వ్యాకులమైన మనస్సుకలవాఁడయ్యె. అంతలోపల నవ్వుచు బయలునకువచ్చి మిగులవేగముగ శ్రీరాముని కౌగిలించుకొనియె. ఈవిధముగ సీతారాముల క్రీడలు మిగుల నద్భుతములై యుండె. ఓశిష్యోత్తమా ! విష్ణుదాసా ! ఈభూలోకమునందు సీతారాముల క్రీడలను సంపూర్ణము నెవ్వఁడు వర్ణింపఁగలఁడు. వాల్మీకి మునివరుని కంటె నితరుఁడెవ్వఁడును సీతారాముల చేష్టలను వర్ణింపఁజాలఁడు. వాల్మీకిముని వరుఁడు శ్రీరామచరిత్రమును నూరుకోట్లగ్రంథముగ రచించె. నేనానూరుకోట్ల గ్రంథమునందలి సారాంశమును మాత్రము చెప్పుచున్నాను. ఓశిష్యోత్తమా! అంతట నొకానొకప్పుడు సీతారాములు వారస్త్రీలయొక్క నృత్యములను జూచుచుండిరి. మఱియొకప్పుడు మిగుల మనోహరములయిన వాద్యములను వినుచుండిరి. ఒకప్పుడు విచిత్రములయిన కథలను వినుచుండిరి. ఇంకొకప్పుడు ఇంద్రజాలములను చూచుచుండిరి. కొన్ని సమయములయందు వేణుగానముల నాలించి యానందమును పొందుచుండిరి. వేఱొక సమయమునందు స్తంభోద్భవములగు వేడుకలను జూచుచుండిరి. మఱియొకప్పుడు సీతామహాదేవి తనచేత నిర్మింపఁబడిన క్రీడా మత్స్యాదులను జూపి శ్రీరామునకు సంతోషమును గలిగించుచుండె. మఱియు నీ విధముగానే సీతామహాదేవి యనేకములయిన విచిత్రవస్తువులను చూపుచుఁ దానును ననేకములయిన విచిత్ర వస్తువులను జూచుచుండె. ఈవిధముగ సీతామహాదేవి ఆరామ మధ్యమమునందొక్కమాసము దినములు క్రీడించె. అనంతరమందు మెల్లగ నృత్యగీతాదులతోఁగూడ నయోధ్యాపట్టణమునకు మరల శ్రీరామునితోఁగూడఁ బోయె. అట్లు సీతారాములు మరల నయోధ్యాపట్టణమునకుఁ బోవునపుడు అయోధ్యాపట్టణమునందలి స్త్రీలందఱును మేడలమీఁద నుండి పుష్పవర్షమును గురిపించిరి. మఱియు నీరాజనముల నిచ్చిరి. దధ్యోదనాది సంస్కారములఁ గావించిరి. మఱియును మాషతైల స్నపనాదులచేత నానావిధము

లయిన బలులను గావించిరి. అనంతరమందు సీతామహాదేవి శ్రీరామునితోఁగూడ నిజమందిరమునందుఁ బ్రవేశించె. ఈవిధముగ నానావిధములయిన కౌతుకములచేతను, నానావిధములయిన దోహదములచేతను శ్రీరాముఁడు సీతామహాదేవికి సంతోషమును గలిగించె. పిమ్మట నాఱవమాసము రాఁగానే సీతామహాదేవికి శ్రీరాముఁడు సీమంతోన్నయనమునుచేయుటకు యత్నించె. అంతట నత్త్రమాలగు సుమేధాజనకులను రప్పించె. మఱియు నాసీమంత మహోత్సవ కాలమునం దనేకములయిన దానములనుగావించె. ఆసమయమునందు జనకచక్రవర్తి స్త్రీబాంధవులతోఁ గూడుకొనిన శ్రీరాముని బూజించె. మఱియు నాజనకచక్రవర్తి కౌసల్యాదులతోఁగూడ నయోధ్యాపట్టణమునందున్న సకల జనులను వస్త్రములచేతఁ బూజించె. ఆకాలమునందు పౌరులు మిత్రులు మొదలగు వారందఱును సీతారాములను తమతమ యిండ్లకుఁ విందు భోజనము కొఱకుఁ బిలిచిరి. మఱియు నాసమయమునందు సీతామహాదేవిని చూచుటకు సకల దేశములవారును సత్యాదరముతో నేగుదెంచిరి. ఇట్లు సీతామహాదేవిని చూచుటకు వచ్చిన రాజపత్నులయొక్క సైన్యముచేత నయోధ్యాపట్టణమంతయును వ్యాప్తమయ్యె. మఱియు నారాజభార్య లందఱును మిగుల శ్రేష్ఠములయిన దోహదములను దీసికొనివచ్చి యిచ్చిరి. మఱియును, దివ్యాన్నాదుల నొసంగిరి. నానావిధములును, విచిత్రములును, మిగుల శ్రేష్ఠములును నగు వస్త్రాలంకారాదుల నొసంగిరి. మఱియును, తమతమ దేశములయందుఁ బుట్టిన శ్రేష్ఠవస్తువులను సమర్పించిరి. ఈవిధముగ నారాజస్త్రీలందఱును సీతామహాదేవిని గౌరవముతోఁ బూజించిరి. అంతట నెలదినముల కాలము సీతామహాదేవి దగ్గర నుండి తమదేశములకుఁ బోయిరి. అంతట నొక్కనాఁడు శ్రీరాముఁడు సీతామహాదేవి కెదుట సుమేధాజనకులతో నిట్లనియె. ఓపూజ్యులారా! సీతయొక్క వియోగమును క్షణము సేపైనను నేను సహింపఁజాలను. కావున నేను సీతను జూడక యుండఁజాలను. ఇప్పుడు నాకు జానకియందు మోహమధికముగఁ గలిగి యున్నది. అయిదు మాసముల గర్భమైన పిమ్మట దంపతులకు సంయోగము యుక్తమైనది కాదని మునివరులు చెప్పుదురు. ప్రసవించిన పిమ్మటఁగూడ నైదుమాసముల కాలము స్త్రీ సంయోగము శ్రేష్ఠమైనది కాదని యార్యులు పలుకుదురు. కావున నీవిషయమునందు నేను జేయఁదగిన పని యేదియో తెలియకున్నది. ఇప్పుడు నేను సీతను మిథిలా నగరమునకుఁ బంపినయెడల సీతయొక్క ముఖదర్శనమైనను లేక యుండును. సీతను జూడక నేను క్షణముసేపుకూడనుండఁ జాలను. కావున నేను గూడ రావలసియుండును. కావున కొంచెముకాలము నాకు సీతావియోగమును కలిగించిచూడుఁడు. కొంచెముకాలము నాకు సీతావియోగమువలన దుఃఖముకలుగకున్నయెడల మీతోఁగూడ మిథిలానగరమునకుఁ బంపెదను. మఱియునో పూజ్యులారా! కొంచెముకాలము సీతావియోగము కలుగుటకు నేను దగిన యుపాయ

మును కనిపట్టితిని. దానిం జెప్పెదను. మీరు దానికనుమతింపుఁడు. శ్రీరాముఁడు కాముకుఁడగుటచేత శత్రుగృహమునందు పదిరెండు మాసములున్న సీతను పరిగ్రహించెనని లోకులందఱును చెప్పుకొనుచున్నారు. ఈపట్టణమునందు విగజకుఁడు కూడ ఈవిషయము నందు నన్ను నిందించెనట. కావున సీతను పరిశుద్ధురాలినిగఁ జేయుట కొఱకు కొంచెము కాలము గంగానదికి దక్షిణ తటమునందలి వాల్మీకాశ్రమమునందు విడిచి యుంచెదను. ఇందులకు మీరంగీకరింపుఁడు. మఱియునో పూజ్యులారా! పిమ్మటనే నీసీతాదేవిని తీసికొనివచ్చెదను. ఈవిషయమునకు అంగీకరింపుఁడు. అనంతరమందు మీ కుమార్తెయగు సీతతోఁగూఁడ చిరకాలము నానావిధభోగముల ననుభవించెదను. కావున నో జనకభూపాలవర్యా! నీవు నీభార్యయగు సుమేధతోఁగూడ బయలువెడలిపోయి యైదుసంవత్సరములకాలము వాల్మీకాశ్రమమునందు నివసింపుమనియె. అట్లు శ్రీరాముఁడు చెప్పినవాక్యములను విని సుమేధాజనకు లంగీకారమును పొందిరి. సీతామహాదేవికూడ భర్తవచనములను విని నవ్వుచు నందుల కంగీకారమును పొందె. అనంతరమందు రామాజ్ఞను పొంది జనకచక్రవర్తి బయలువెడలిపోయి తనరాజ్యమును పాలించుటకుఁ దగిన మంత్రిని మిథిలానగరమునందు స్థాపించి సుమేధతోఁగూడ మిగుల శీఘ్రముగా వాల్మీకాశ్రమమునకుఁ బోయె. ఆసమయమునందు జనకచక్రవర్తి స్వల్పసంఖ్యకల దాసదాసీజనముతోఁ గూడుకొని యుండె. మఱియు నానావిధములగు పదార్థములను శకటాదులచేతఁ గొనిపోయె. అట్లు పోయి వాల్మీకాశ్రమమునందు మిగుల విశాలమగు గృహమును నిర్మించె. మఱియు నాగృహమునందు సర్వసంపదలును గలిగి యుండునట్లుచేసె. మఱియు నానావిధములగు గోమహిష్యాదులనుగూడ రప్పించె. మఱియు నాజనకచక్రవర్తి తనగృహమునందు ధాన్యవస్త్రాభరణాదులు పరిపూర్ణముగ నుండునట్లుచేసె. మఱియు నాజనకచక్రవర్తి వాల్మీకాశ్రమమునందు తననిమిత్తముగ నిర్మింపఁబడిన గృహమునకు చుట్టును అనేకములగు పుష్పవనములను నిర్మింపజేసె. మఱియు నాగృహము నందలి గవాక్షములు చంద్రకాంతమణులచేతఁ జేయఁబడిన కవాటములచేత మిగుల మనోహరముగఁ బ్రకాశించుచుండె. మఱియు నాగృహము కృష్ణాగరుకర్పూరాదులచేతఁ బరిమళింపఁ జేయఁబడియుండె. మఱియు నాగృహము నానావిధములగు ధనములచేతఁ బరిపూర్ణమైయుండె. మఱియును, ముక్తాగుచ్ఛవితానాదులచేత చిత్రముగ నలంకరింపఁ జేయఁబడియుండె. ఈవిధముగ మిగుల రమ్యమైన గృహమును సీతానిమిత్తముగ జనకచక్రవర్తి నిర్మింపఁజేసె. మఱియు నాగృహము మహాలక్ష్మినివసించు గృహమునలె మిగుల మనోహరమైనదై యుండె. ఏమహాలక్ష్మియొక్కకటాక్షములకు పాత్రులై యింద్రాదు లందఱును సంచరించుచున్నారో, అట్టి మహాలక్ష్మియగు సీతామహాదేవి నివసించుగృహమును నేనేమనివర్ణింప

గలను. ఓశిష్యోత్తమా ! విష్ణుదాసా ! ఆవిధముగ మిగుల రమ్యమగు గృహమును నిర్మించినపిమ్మట జనకచక్రవర్తి యావృత్తాంతమును సర్వమునువాల్మీకి మునివరునకుఁదెలిపె. ఆమునివరుఁడా వృత్తాంతమును విని యీవిధముగ జరుగుట నాతపస్సునకు ఫలమనియె.

ఇట్లని ఆనందరామాయణాంతర్గత జన్మకాండమునందలి
రెండవసర్గ ముగిసెను.

---

* చాకలవానిమాటల మూలకముగ సీతను పరిత్యజించుట. *

ఓశిష్యోత్తమా! విష్ణుదాసా ! అంతట నొక్కనాఁడు కౌసల్య శ్రీరామునితో నేకాంతముగ నిట్లనియె. ఓరఘుకులోత్తమా ! సీతకు సీమోల్లంఘనమను సంస్కారమును శీఘ్రముగఁ జేయింపుమనినవిని శ్రీరాముఁడు నీయిష్టమును శీఘ్రముగనే నెరవేర్చెదననిరహస్యముగఁ బలికె. ఆసమయమునందు లక్ష్మణుఁడు శ్రీరాముఁడదివఱకాలోచించిన విధమును సర్వమును దెలిపె. అంతట సీతామహాదేవియొక్కగర్భమున కైదవమాసము రాఁగానే పద్మపత్రములవంటి నేత్రములుగల శ్రీరాముఁడు ఏకాంతమునందుసీతామహాదేవితో నిట్లనియె. ఓసీతా ! రజకుఁడును లోకులును నిందించుచున్నారను నెపముచేత నిన్ను పరిత్యజించెదను.మూఁడు అయిదు ఏడుమాసములకాలము గర్భవతియగు స్త్రీనిపొందఁగూడదని చెప్పినట్టిశాస్త్రోక్తిని నేను రజకునిమాటలనియెడు నెపముచేత నెరవేర్చెదను.నిన్నువిడిచిపెట్టి నేను నివసించుటకు సమర్థుఁడను గాను.చంద్రునివంటి మోముగల నిన్నుఁజూచుచుండినయెడల కామమధికముగ బాధించుచున్నది.ఇట్టికామము నిన్నుఁ బరిత్యజించితినను నిర్బంధమువలనఁగాని వేఱొకదానివలనఁ బోదు. కావున నిన్నుఁ బరిత్యజింపవలయునని నిశ్చయించితిని. అయిదు సంవత్సరములకాలము గడచినపిమ్మట నీవు నాసమీపమునకువచ్చి లోకులకు నమ్మకము కలుగుటకొఱకు శపథమును చేయఁగలవు. మఱియు నీవప్పుడు సింహాసనమందుఁ గూర్చుండి భూవివరమార్గముచేత భూదేవిచేత పూజింపఁబడుచు పాతాళలోకమును పొందుదువు. ఆసమయమునందు నేను భూమిదేవిని స్తోత్రముచేసి నిన్నురప్పించి నాతొడయందుఁ గూర్చుండఁ బెట్టుకొనియెదను. ఓసీతా ! అనంతరమందు నీవు పుత్రులతోఁగూడ భోగములను పొందఁగలవు. నీకు కుశుఁడను జ్యేష్ఠపుత్త్రుఁడునావలనఁ గలుగును. వాల్మీకి మునివరునియొక్క మహిమవలన లవుఁడను నామధేయముగల రెండవకుమారుఁడు కలుగును. వాల్మీకి మునివరునియొక్కయాశ్రమమునం దాయిరువురుపుత్త్రులును జననమును పొందుదురు. ఇంతకుముందుగానే జనకచక్రవర్తి వాల్మీకాశ్రమమునకుఁ బోయి నీవు నివసించుటకుఁదగిన గృహమును నిర్మించియున్నవాఁడు. కావలసిన కార్యములన్నిటిని నెరవేర్చితిని. నా వచనానుసారముగఁ బ్రవర్తింపుము. ఓసీతా ! నిన్ను నిప్పుడే విడిచిపెట్టెదను. నీవు

సత్త్వస్వరూపురాలవై నాతొడయందున్న విధముగానే నీవు మునుపటివలె గాత మీఁతటమునందు నివసింపుము. నీవు వాల్మీకాశ్రమమునందుండి నావియోగమును చూపుము. అయినను అక్కడ కుశోత్పత్తికాలమునందు నీకుఁ గనఁబడెద ననియె. ఆవచనమును విని సీతామహాదేవి యంగీకారమును పొందె. అంతట రజస్తమో రూపురాలగు సీతామహాదేవి రాముని వామాంగమునందు నివసించియుండె. ఆసమయమునం దనఁగా రాత్రికాలమునందే శ్రీరాముఁడు కొలువుకూటమునకుఁ బోయి మంత్రి పురోహితాదులచేత పరివేష్టింపఁబడి సింహాసనమునందు గూర్చుండి యుండె. అట్లు సింహాసనమునందుఁ గూర్చున్న రాముని మిత్రులు మొదలగు వారు సేవించుచుండిరి. మఱియు నాసమయమునందు ఎల్లవారును హాస్యప్రధానములగు కథాదులను వినుచుండిరి. అట్టి కథాదులను వినుచుండు కాలమునందు శ్రీరాముఁడు ప్రస్తావానుసారముగ విజయుఁ డనువానితో నిట్లనియె. ఓ విజయుఁడా! పౌరులును పల్లెటూరివారును చెప్పుకొనునట్టి శుభాశుభములను దెలుపుము. సీతను గుఱించియును, నాతమ్ములను గుఱించియును, నా తల్లులను గుఱించియును, నన్ను గుఱించియును లోకమునం దేమని చెప్పుకొనుచున్నారో నిస్సందేహముగఁ జెప్పుము. అట్లు చెప్పవేని నామీఁద శపథమును చేసిన ట్లగుననిన విని యావిజయుఁ డిట్లనియె. ఓ దేవోత్తమా! విదితాత్ముఁడగు రామునిచేత దుష్కరమైన కర్మము చేయఁబడినది. అయినను శ్రీరాముఁడు రావణుఁ డెత్తికొనిపోయిన సీతను మరలఁదీసికొనివచ్చి సుఖముల ననుభవించుచున్నాఁడు. మఱియును, శ్రీరాముఁడు దశగ్రీవాదులను సంహరించి లోకములకు మేలుచేసి యుత్తముఁడని చెప్పఁబడుచున్నను మరల సీతతో సుఖములననుభవించుటచేత కాముకుఁడనియును నిందితుఁడనియును లోకులు చెప్పికొనుచున్నారు. మఱియు నోరఘుకులోత్తమా! అవమానమును వెనుకఁబెట్టుకొని నీవు సంచరించుచున్నావని లోకములు చెప్పికొనుచున్నారు. మఱియును, రాజేవిధముగ సంచరించునో లోకులుకూడ నదేవిధముగ సంచరించుదురు. కనుక నికమీఁదట భార్యను పరుఁడపహరించుకొనిపోయినను మరలఁ దీసికొనిరావచ్చునని యెల్లవారును చెప్పికొనుచున్నారు. మఱియు నోరాజోత్తమా! ఈ పట్టణమునందు రజకుఁడొక్కఁడు దుర్మార్గురాలగు తనభార్యతో కోపముచేత నోరండా! నేను శ్రీరాముఁడనుగాను. రావణునిచేత స్పృశింపఁబడిన సీతను రాముఁడు తెచ్చుకొన్నట్లు నేను తెచ్చుకొనువాఁడనుగాను. నీ యిష్టానుసారముగఁబొమ్మని చెప్పుచున్నాఁడు. ఆవచనములను నేను మార్గమునవచ్చుచు వింటిని. నేను విన్న విషయమును దెలిపితిని. ఓ రఘుకులోత్తమా! ఈవిషయమునందు నీయిష్టానుసారముగఁ బ్రవర్తింపుమనియె. అట్లు విజయుఁడు చెప్పినవాక్యమునువిని శ్రీరాముఁడు తనవారితో నిట్లనియె. ఓ సభికులారా! ఈవిషయమునందు మీయభిప్రాయమును దెలుపుఁడనిన వారలీ విషయమునిజమేయనిరి. అంతట

శ్రీరాముఁడు మంత్రులు మొదలగువారల గృహమునకుఁబంపి లక్ష్మణునిబిలిచి యిట్లనియె. ఓలక్ష్మణా! సీతానిమిత్తముగ నాకు లోకాపవాదము కలిగియున్నది. కావున నీవు రేపటిప్రాతఃకాలమునందు సీతనుగొనిపోయి వాల్మీకాశ్రమమునందు విడిచిరమ్ము! ఈవిషయమునందు నీవు ప్రవర్తింపకపోయినయెడల నన్నుఁ జంపిన వాఁడవగుదువనియె. మఱియు నోలక్ష్మణా! సీతయొక్కభుజమునుఛేదించి లోకుల కు నమ్మకమును పుట్టించుటకొఱకుఁ దీసికొనివచ్చి నాకిమ్మనియె. ఇట్లు లక్ష్మణుని తోఁజెప్పి పిమ్మట శ్రీరాముఁడు కైకేయిని చూచుటకుఁబోయె. ఇంతలోపల కైకేయి యేకాంతమునందుసీతతో నిట్లనియె.ఓసీతా! రావణునిరూపమునుగోడయందు వ్రాసినాకుఁ జూపుమనినవిని సీతామహాదేవి యిట్లనియె.ఓపూజ్యురాలా! ఆరావణుఁడు నాచేత నెప్పుడునుచూడఁబడలేదు. ఆరావణుఁడు పంచవటీతీరమునందు నన్ను హరించినకాలమునందు మిగుల భయంకరమైనవాని యంగుష్ఠమును మాత్రము చూచితిననిన విని కైకేయి మరల నిట్లనియె. ఓసీతా! ఆయంగుష్ఠమునైనను వ్రాసి చూపుమనినవిని సీతామహాదేవి మిగుల భయంకరమైన రావణాంగుష్ఠమును వ్రాసి కైకేయికిఁజూపుచుండె. అనంతరమందా కైకేయి సంతోషించి పోయివచ్చెదనని చెప్పి యాసీతామహాదేవి నిజనివాసమునకుబోయె.అట్లు సీతపోయినపిమ్మట కైకేయి రావణునియొక్క మిగిలినరూపమును తగినవిధముగ నిర్మించె. అంతలో శ్రీరాముఁడక్కడకువచ్చె. అప్పుడు కైకేయి మిగులఁ ద్వరకలదై యాగోడకు సమీపముగ రామునకాసనమునువైచె. అంతట రాముఁడు తల్లియగు కైకేయికి నమస్కారమునుచేసి యాసనమునందుఁగూర్చుండె. అనంతరమందు గోడయందు వ్రాయఁబడి చిత్రితముగఁ జేయబడిన రావణునిజూచె. ఓతల్లీ! ఈరావణాకృతి యెవ్వనిచేత నిర్మింపఁబడినదనిన సీతామహాదేవిచేత నిర్మింపఁబడినదనియె. ఓపుత్రోత్తమా! స్త్రీలచిత్తము నెవ్వఁడెరుగును. స్త్రీలమనస్సు ఎవనియందు సక్తమైయుండునో వాని రూపరేఖాదులనైనను వ్రాసికొని సంతోషమును పొందుదురు. ఈవిషయమునందు శివాదులుకూడ మోసమును పొందుచున్నారనియె. ఈవిధముగ కైకేయి చెప్పినవచనములను విని సభలోజరిగిన వృత్తాంతమును లక్ష్మణునితోఁ దానుచెప్పిన విషయమును కైకేయికిఁజెప్పి మఱియు నిట్లనియె. ఓతల్లీ! కైకేయీ! సీతాభుజమును వనమునందుఛేదించి తీసికొనివచ్చి పురజనులకును నాకును జూపుమని లక్ష్మణునితోఁజెప్పితిని. మఱియు నోతల్లీ! నామనస్సునందు సీతను జంపవలయుననియే తలంపుకలదు. అయినను స్త్రీహత్య వచ్చుననియెడు తలంపుతో భుజమునుమాత్రము ఛేదించుకొని రమ్మనిచెప్పితిని. మఱియును చేతిని తెగగొట్టి వేసినయెడల పిమ్మట నడవియందలి ఘాతుకమృగములు చంపివేయుసని తలంచితిననియె. ఈవిధముగా సీతామహాదేవి చెప్పిన వాక్యములనువిని కైకేయి మిగుల సంతోషముకలదయ్యె. మఱియును సీత లేకపోవుటచేత రాముఁడు

రాజ్యమును చేయుఁడనియును, రాముని కుపచారమును చేయుచుండు వాఁడగుటచేత లక్ష్మణుఁడుకూడ రాజ్యమును పాలింపఁడనియును, కావున భరతునకు రాజ్యమబ్బుననియును, తలఁచి యా కైకేయి పరమానందమును పొందెను. ఈవిధముగా కైకేయితలఁచి మిగుల సంతోషమును పొందియుండె. అనంతరమందు శ్రీరాముఁడు కైకేయికి నమస్కరించి మఱియొకతల్లియగు సుమిత్రదగ్గరకుఁబోయె. పోయి సభయందు జరిగినవృత్తాంతమును కైకేయిదగ్గర జరిగిన విషయమును దెలిపె. అంతట కౌసల్యా గృహమునకుఁబోయి యామెతోఁగూడ జరిగినవృత్తాంతమును సర్వమును దెలిపె. పిమ్మట నా శ్రీరాముఁడు సీతాగృహమునకుఁబోయె. పోయి సీతామహాదేవిచేత నొసఁగఁబడిన యర్ఘ్యపాద్యాదికమును అంగీకరించి జరిగినవృత్తాంతమును సర్వమును దెలిపిన విని సీతామహాదేవి మరల నిట్లనియె. ఓరఘుకులోత్తమా! కైకేయియొక్క యింటియందలి గోడయందు నాచేతరావణుని యంగుష్ఠముమాత్రము వ్రాయఁబడినదని యక్కడజరిగిన వృత్తాంతమును సర్వమును దెలిపి మరల నిట్లనియె. ఓరఘుకులోత్తమా! ఆయంగుష్ఠము నాధారముగాఁ జేసికొని కైకేయితనదుష్టబుద్ధిచేతఁ దక్కినరూపమును సర్వమును లిఖించినదనిన విని శ్రీరాముఁడు మరల సీతామహాదేవితో నిట్లనియె. ఓప్రియురాలా! కైకేయియొక్క కుటిలబుద్ధిని సర్వమును నేనెఱుంగుదునని చెప్పి శ్రీరాముఁడు సీతనుకౌగిలించుకొని ముఖమును ముద్దుపెట్టి హేమపర్యంకమునందు నానావిధములగు భోగముల ననుభవించు వినోదమును చేయఁదలఁచి యారాత్రియందు సీతతో నిట్లనియె. ఓసీతా! గర్భము నవలంబించియున్న స్త్రీలకుఁ గోర్కెలుమెండుగఁ గలిగియుండునని నేనువిందును. నీకు దేనియందు కోర్కెకలదో చెప్పుమనిన సీతామహాదేవి రాఁబోవు కార్యానుసారముగ నిట్లనియె. ఓరఘుకులోత్తమా! గంగాతీరమునందున్న వృక్షములను మునులను మునిభార్యాదులను జూడవలయునని నాకుఁ గోర్కెకలిగియున్నది. కావున శీఘ్రముగా నక్కడకు బంపుమనినవిని శ్రీరాముఁడు నీయభిప్రాయమును రేపటి ప్రాతఃకాలమునందు లక్ష్మణుఁడు నాయాజ్ఞానుసారముగ నెరవేర్చునని చెప్పి మరల నిట్లనియె. ఓసీతా! నీతో క్రీడలు మొదలగువానిని చిరకాలమునుండి చేయుచుండుటచేత నేను జపధ్యానాదికమును మరచియుంటిని. ఇప్పుడు నిన్ను నరణ్యమునకుఁబంపి మరల జపధ్యానాదికమును చేసికొనుచుందునని చెప్పి హేమపర్యంకమునందు సుఖముగ నిద్రనుచెందె. ఆసమయమునందు సీతామహాదేవి యిట్లని యాలోచించె. నేను రేపటిదినము పోవుచోట నాతల్లిదండ్రులు నివసించియున్నారు. కావున నాకక్కడ కొరతలేమియును కలుగదు. కాఁబట్టి నేను సకలవస్తువులను విడిచి నాచెలికత్తియయగు దాసితోఁగూడ రథమునెక్కి సుఖముగఁ బోయెదనని నిశ్చయించె. అట్లు నిశ్చయించి యారాత్రియంతయును రామునితోఁగూడ సుఖముగ నిద్రించె. అంతట మరుదిన ప్రాతఃకాలమునందు శ్రీరాముఁడు నిద్రనుండి

లేచి స్నానాదులను నెఱవేర్చుకొనున నంతలో సీతామహాదేవికూడ నిద్రనుండి
లేచి స్నానాదులనాచరించి పక్వాన్నాదుల సిద్ధపఱచి సత్పాత్రమునందు రాముని
కొఱకు వడ్డించె. అంతట రాముఁడు పక్వాన్నాదికమును భుజించె. పిమ్మట సీతను
భోజనాది కృత్యములను నెరవేర్చుకొని తాను గంగాతీరమునందలి వృక్షాదులను
జూచుటకుఁబోయి వచ్చెదనని చెప్పి కౌసల్యాదులకు నమస్కరించి వారియనుమత
మును పొంది చెలికత్తియతోఁ గూడ సిద్ధపడియుండె. అంతలో లక్ష్మణుఁడు రథ
ముతోఁ గూడ మిగుల వేగముగవచ్చె.వచ్చి తులసి యనుదాసితోఁగూడ సీతామ
హాదేవిని రథము మీదఁ గూర్చుండఁబెట్టుకొని బయలువెడలె. అంతట లక్ష్మణుఁ
డు వాయువేగము వంటి వేగముతో రథమును దక్షిణమార్గముచేత గంగానదీ తట
మును పొందించె. ఆసమయమునం దింద్రాదిదేవతలు సీతామహాదేవికి మార్గము
నందుఁ జేయఁదగిన సత్కారాదులను జేసిరి. పిమ్మట తమసానదిని గౌతమీనదిని
జాహ్నవిని యమునను మందాకినీనదిని ద్వితీయ తమసానదిని దాటి లక్ష్మణుఁడు
చిత్రకూట సమీపమునందలి వాల్మీకాశ్రమమునందలి రావిచెట్టుక్రింద దాసియగు
తులసితోఁగూడ సీతనుదించి నమస్కరించి కన్నుల నీరుగారు చుండగ నిట్లనియె.
ఓతల్లీ! లోకాపవాద భీతిచేత రాముఁడునిన్ను నరణ్యమునందు పరిత్యజించి రమ్మ
నియె. కావున నే నిట్లు చేయుచున్నాఁడను. ఓతల్లీ! నాయందు దోషమేమి
యును లేదని చెప్పి యాసీతామహాదేవికి ప్రదక్షిణ నమస్కారములనుచేసి యక్క
డనుండి బయలువెడలి పోయె. అంతట నీవృత్తాంతమును సర్వమును విని వాల్మీకి
మునివరుఁడు సుమేధా జనకాదులతోఁ గూడ బయలు వెడలి వచ్చి యాసీతామహా
దేవిని పూజించి శిబికయందెక్కించుకొని నానావిధములగు వాద్యములు మ్రోగు
చుండఁగను చామరాదులచేత విసరుచుండఁగను వేశ్యాంగనలు నృత్యములను చే
యుచుండగను వందిమాగధాదులు స్తోత్రములను చేయుచుండగను నటాదులు గా
నముచేయుచుండగను ఆశ్రమమునకుఁ గొనిపోవుచుండె.అప్పుడు వనదేవతలు సీతా
మహాదేవిపైఁ బుష్పవర్షమును గురిపించిరి. మఱియు నాసమయమునందు సీతామహా
దేవియొక్క శిబికకు ముందర ననేకులు వేత్రపాణులై పరుగిడు చుండిరి. ఇవ్విధము
గ ననేకులు సేవించుచుండఁగ సీతామహాదేవి వాల్మీకాశ్రమము నందుఁ బ్రయో
గించె. అట్లు ఆశ్రమమునందుఁ బ్రవేశించు నపుడు మునిభార్య లందఱును వచ్చి దీ
పములచేత నీరాజముల నిచ్చిరి. అంతట సీతామహాదేవి యాశ్రమము నందుఁబ్రవే
శించి హేమపర్యంకము నందురెండువైపులను దిండ్లను బెట్టుకొని సుఖముగఁ బరుం
డె. మఱియును, వాల్మీకాది మునివరులును మునిభార్యలును సీతామహాదేవిని నా
నావిధములఁ బూజించుచుండిరి. మఱియు నామునివరు లందఱును దివ్యాన్నాదుల
చేతను వనమునందలి పుష్పాదులచేతను సీతామహాదేవికిఁ దృప్తిని కలిగించుచుం
డిరి. మఱియును, మునిభార్యలందఱును దోహదములను పూరించుచుండిరి. మఱి

యును, ఆసీతామహాదేవి అయోధ్యాపట్టణమునం దేవిధములగు సుఖములననుభవిం చెనో అట్టిసుఖములనే వాల్మీకాశ్రమము నందుఁగూడ ననుభవించుచుండె.

ఇట్లని యానందరామాయణాంతర్గత జన్మకాండమునందలి
మూడవసర్గ ముగిసెను.

✷ కుశలవుల జన్మకర్మములను చెప్పుట. ✷

అంతట లక్ష్మణుఁడు గంగాతటమునకుఁ బోయి తన మనస్సునందిట్లని యోచించె. ఆహా శ్రీరాముఁడు పరిశుద్ధురాలగు సీతామహాదేవిని శాస్త్రాజ్ఞనతిక్ర మింపఁగూడదని తలఁచి తనకామనివృత్తికొఱకు పరిత్యజించి రమ్మని నాకాజ్ఞనిచ్చె. అట్లు నాకాజ్ఞ నిచ్చుచు వనమునందు సీతాభుజమును ఖండించితీసికొని రమ్మనియె. అందులకు నేనును అంగీకరించితిని కాని కారణమేమని యడిగిన వాఁడనుగాను. ఇప్పుడునే నేమిచేయుదును. సీతాభుజమును ఖండింపకపోతిని. నేను సీతాభుజమును తీసికొనిపోక పోవుటచేత శ్రీరాముఁ డేమనునో కదా! నేను సీతాభుజము నెట్లు ఛేదింపఁగలను. మఱియు నా సీతామహాదేవిచేత నేను పుత్రునివలెఁ బాలింపఁబడితిని. నే నిప్పుడు సీతాభుజమును దీసికొనిపోక రాముని ముఖమును చూడఁజాలను. కాఁబట్టి,అగ్నియందుఁ బ్రవేశించెదనని యాలోచించె.ఇట్లు నిశ్చయించి యాలక్ష్మణుఁడు చితిని నిర్మించుటకొఱకు యత్నించె.ఇంతలోపల బ్రహ్మవచనానుసారముగ విశ్వకర్మకుఠారము హస్తమునందుఁ గలవాఁడై యరణ్యమునందు సంచరించుచుండె. అట్టి విశ్వకర్మనుజూచి లక్ష్మణుఁ డిట్లనియె. ఓ పురుషోత్తమా! నాకు సాహాయ్యమును చేయవలయును. నీకుఠారముచేత వృక్షములను ఛేదించి చితిని నిర్మించి యిమ్ము? నీవు కోరినంత ధనము నిచ్చెదననిన విని యా విశ్వకర్మ మరల నిట్లనియె. ఓ పురుషోత్తమా! నీవు చితిని సర్పఱచుకొనుటకుఁ దగిన కారణమును చెప్పుమనిన విని లక్ష్మణుఁడు తన పూర్వవృత్తాంతమును సర్వమును దెలియఁజేసె. ఆవృత్తాంతమును సర్వమును విని సవ్వుచు నిట్లనియె. ఓ క్షత్రియోత్తమా! స్వల్పకార్యము కొఱకు నీవు దేహత్యాగమును చేయుచున్నావు. నీ విట్టి కార్యమును మానుకొనుము. నేను సీతాభుజమును చేసి సీకిచ్చెదనని చెప్పి సీతాభుజమును నిర్మించి లక్ష్మణునకిచ్చె. ఆభుజము త్వఙ్మాంసములతోడను కంచుకము మొదలగు వానితోడను గూడుకొనియుండె. అట్టి భుజము నిచ్చి యా విశ్వకర్మ యంతర్ధానమును పొందె. అంతట లక్ష్మణుఁ డది దైవకృతమని తెలిసికొని తన పట్టణమునకాభుజమును దీసికొనిపోయె. అట్లు లక్ష్మణుఁడు అయోధ్యాపట్టణమునకుఁ బోవునపుడా యయోధ్యాపట్టణము శోభారహితమైనదియును, ఉత్సాహరహితమైనదియును, ఆనుది లేని గృహమును బోలినదియును నై యున్నది. అట్టి నగరమును జూచి లక్ష్మణుఁడు మిగుల విచారము కలవాఁడును నధోముఖుఁడు నై

యయోధ్యానగరమునందుఁ బ్రవేశించె. అట్టి పట్టణమునందుఁ బ్రవేశించి రాముని దగ్గరకుఁబోయి నమస్కరించి కంకణాదులచేత నలంకరింపఁబడిన సీతాభుజమును చూపె. ఆభుజమునుజూచి శ్రీరాముఁడు మోమును వంచుకొని లక్ష్మణునితో నిట్లనియె. ఓ లక్ష్మణా! ఈ భుజమును దీసికొనిపోయి కైకేయికిని పౌరజాన పదులకును జూపి రామాజ్ఞవలన సీతాభుజమును ఖండించుకొని వచ్చితి నని చెప్పుమనియె. ఆవచనమును విని లక్ష్మణుఁడు వల్లెయని యాభుజమును నొక పేటికయందుఁ బెట్టుకొనిపోయి ముందుగఁ గైకేయికిఁ జూపె. అంత నా భుజమును చూచి కైకేయి పరమానందమును పొందె. అంతట నాదిదేవుఁడగు శ్రీరాముఁడు సీతా వియోగము కలిగియుండుటచేత సకల భోగములను విడిచిపెట్టి విరక్తుఁడై మునులచేత సేవింపఁబడిన పాదములు కలవాఁడగుచు మునివ్రతము నవలంబించె. అంత నక్కడ సీతామహాదేవియును మునిభార్యలచేత సేవింపఁబడుచు నానావిధ సుఖముల ననుభవించుచుండె. అట్లు రెండుమాసముల కాల మతిక్రమించిన పిమ్మట నొక్కనాటి రాత్రియందు సూర్యుని కాంతివంటి కాంతికల పుత్రరత్నమును గనెను. ఆసమయమును శ్రీరాముఁడు తెలిసి పుష్పకవిమానము దగ్గరకుఁబోయి చిరుగంటలు మొదలగు వానిని పరిత్యజించి పుష్పకమునందుఁ గూర్చుండి యాకాశమార్గముచేత వాల్మీకాశ్రమమునకుఁబోయి వాల్మీకిమునివరునకు నమస్కరించె. అప్పుడు వాల్మీకిమునివరుఁడు మితిముగ బ్రాహ్మణులను రప్పించి శాస్త్రోక్త ప్రకారముగ నాబాలునకు జాతకర్మాది సంస్కారమును గావించె. మఱియు నాసమయమునందు శ్రీరాముఁడు సీతామహాదేవి కెదుట పుత్రుని ముఖమునుచూచె. మఱియు నప్పుడనేకములగు దానములను జేసె. మఱియు నాసమయమునందు శాస్త్రోక్త ప్రకారముగ నాందీశ్రాద్ధమును మిగుల శ్రద్ధతో నాచరించె. అప్పుడు దేవదుందుభులు మ్రోగె. దేవతలు పుష్పవర్షమును గురిపించిరి. దేవవేశ్య లంతరిక్షంబున నృత్యములను జేసిరి. జనకుని వాద్యములన్నియును మ్రోగె. వారస్త్రీలు నాట్యములను సల్పిరి. వందిమాగధాదులు సీతారాములను బొగడిరి. మఱియునాసమయమునందు మునిభార్యలు సీతారాములను శిశువుతోఁగూడ దీపములచేత నలంకరించిరి. మఱియు నామునిభార్యలు వేఱువేఱుగ నీరాజనములనిచ్చి మనోహరముగఁ బాటలనుపాడిరి. అంతట శ్రీరాముఁడు వారలనందఱను వస్త్రాదులచేత నలంకరించె. మఱియు నప్పుడు జనకచక్రవర్తి కూడ సీతారాములను విశేషముగఁ బూజించె. అంతట వాల్మీకిమునివరుఁడు దర్భలచేత నాశిశువునకు శాంతినిగల్పించె. శాంతికొఱకు కుశములచేత నుదకమును బ్రోక్షించుటవలన నాశిశువునకుఁ గుశుఁడను నామధేయముకలిగె. ఈవిధముగా నానావిధములయిన యుత్సాహములచేత నారాత్రిని సర్వమును గడపిరి. అప్పుడు శ్రీరాముడక్కడ నున్న వారలతో నిట్లనియె. ఓమునికులోత్తములారా! నేనిక్కడకు వచ్చిన వృత్తాంతమును ఈయాశ్రమమును వదలి పోకుండునట్లు చేయుఁడు.

ఈ వృత్తాంతమును బయలుపఱచినవాఁడు నాకు శత్రుఁడగును కనుక నాచేత విశేషముగ దండింపఁబడును. అంతట శ్రీరాముఁడు సీతతోఁ బోయి వచ్చెదనని చెప్పి తమ్ముఁడగు లక్ష్మణునితోఁగూడ పుష్పకవిమానముమీఁద నెక్కె. అట్లు విమానము నెక్కి యాకాశమార్గముచేత నయోధ్యాపట్టణమునకుఁ బోయె. పోయి విమానమునందుండి దిగి మునుపటివలె శయ్యయందుఁబరుండి నిద్రనుపొందుచుండె. అంతట మరుదినమునందలి ప్రాతఃకాలమునందు నిద్రనుండి మేల్కాంచి యెప్పటివలె రాజ్యమును పాలించుచు నూరశ్వమేధయాగములను జేయుటకొఱకు నిశ్చయించె. పిమ్మట సువర్ణమయమగు సీతనునిర్మించి యాసీతకు సకలాభరణములచేతను నలంకారమును చేయించె. మఱియును, బ్రాహ్మణులగువారు, పాపాత్మురాలును మలినురాలును దుష్టురాలును భర్తను నిందించుటయుం దాసక్తికలదియును భర్తయందు ద్వేషముకలదియును క్రూరురాలును దొంగతనమును చేయునట్టిదియును భర్తను జంపుటకు యోచించుచున్నదియును సర్వకాలములయందును కలహమును చేయునట్టిదియును, పరులచేత ననుభవింపఁబడినదియును పాపకృత్యములను చేయునట్టిదియును, భర్తృవచనములకు విరుద్ధములగు కార్యములను చేయునట్టిదియును, యథేచ్ఛముగఁ బ్రవర్తించునట్టిదియును, అయిన యాఁడుదానిని వదలి దర్భలచేతఁజేయఁబడిన స్త్రీని గ్రహింపవలయును. అట్టిస్త్రీతో బ్రాహ్మణుఁడగువాఁడు సకలకర్మములను నాచరింపవలయును. క్షత్రియులభార్య దుష్టస్వభావము కలదయ్యేనేని దానినివదలి సువర్ణమయురాలగు భార్యను పరిగ్రహింపవలయును. వైశ్యుఁడు రజతమయురాలగు భార్యను గ్రహింపవలయును. శూద్రులు తామ్రమయమగు భార్యను పరిగ్రహింపవలయును. ఇట్లు కాదేని సర్వవర్ణములవారును సువర్ణమయురాలగు స్త్రీని పరిగ్రహింపవలయును. అని ధర్మశాస్త్రములయందుఁ జెప్పఁబడియుండుటచేత శ్రీరాముఁడు సువర్ణమయమగు సీతను పరిగ్రహించె. అట్లు పరిగ్రహించి సీతను పరిత్యజించినదిమొదలుకొని యట్టి కాంచన సీతయొక్క సహాయముతో నగ్నిహోత్రాదికర్మములను నెరవేర్చుచుండె. రావణుఁడు సీతను అపహరించిన కాలమునందుఁ శ్రీరాముఁడు కుశమయమగు సీతను కాంచన మయురాలగు సీతనుగాభావించి యగ్నిహోత్రాదికర్మములను నెరవేర్చె. మఱియు నితరులగు గృహస్థులు కుశమయమగు భార్యను సహాయముగాఁజేసికొని హవ్యకవ్యాదికర్మములును నెరవేర్పవలయును. అంతట శ్రీరాముఁడు ప్రతిపక్షమునందలి నవమియందును అవబృథస్నానమును జేయుటకు నిశ్చయించె. అట్లు నిశ్చయించి భాగీరథీ నదియొక్క యుత్తరపుతీరమునందు యజ్ఞభూమిని నిర్మించె. ఆయజ్ఞశాల ప్రయాగక్షేత్రము మొదలుకొని ముద్గలమునివరు నాశ్రమమువఱకును నిర్మింపఁబడియుండె. అట్లుసేసి యాభూమిని సర్వమును బంగారపు నాగేళ్ళచేత దున్నింపఁజేసె. అనంతరమందు సువర్ణమయురాలగు సీతతోఁగూడ యజ్ఞకర్మ

ము చేయుటకు నిశ్చయించె. అవివేకుల కందఱకును చూపుటకొఱకు మా త్రిమే కాంచనా సీతను నిర్మింపఁజేసెను గాని నిజసీతను వామభాగమునం దుంచుకొని యుండె. మఱియును, సత్త్వగుణ స్వభావముకల సీతతోఁగూడ శ్రీరాముఁడు ప్రకాశించుచుండె. అంతట శ్రీరాముఁడు యజ్ఞాంతమునందు సువర్ణమయమగు సీతను స్వగురుఁడగు వసిష్ఠమునివరున కొసంగె. ఈవిధముగ నూరశ్వమేధముల యందును నూరుప్రతిమలను దానముచేసె. ఇట్లు నూరుప్రతిమలను దానము చేయుటచేత శ్రీరాముఁడు భవిష్యజ్జన్మమునందు పదునారువేలమంది స్త్రీలకు భర్తయగునట్లయ్యె. మఱియు నాశ్రీరాముఁడు ప్రత్యశ్వమేధ యాగమునందును నల్లని చెవులు కల యశ్వమును విడిచి పెట్టుచుండె. ఆయశ్వము నాలుగు దినములలోపల నాలుగుదిక్కుల యందును దిరిగివచ్చుచుండె. ఈవిధముగ సకలాశ్వమేధముల యందును జరుగుచుండె. ఆయశ్వముతోఁగూడ శత్రుఘ్నుఁడు పుష్పకమునెక్కి పోయి వచ్చుచుండె. ఈవిధముగ సకలలోక ప్రభుఁడగు శ్రీరాముఁడు యజ్ఞశాలయందు ప్రకాశించుచుండె. మఱియు నీవిధముగ శ్రీరామునిచేత తొంభై తొమ్మిది యజ్ఞములుచేయఁ బడియె. అంతట శ్రీరాముఁడు నూరవ యశ్వమేధయాగమును కూడ చేయుటకు ప్రారంభించె. గంగానదియొక్క యుత్తరపు తీరమునందు శ్రీరాముఁడు యజ్ఞములను చేయుచుండె. దక్షిణపు తీరమునందు వాల్మీకి మునివరుఁడు సంధ్యాకాలముల యందును రాత్రులయందును శ్రీరామరక్షచేత బాలకుల కభిషేకమును చేయుచుండె. మఱియును, శ్రీరాము నాజ్ఞానుసారముగ పదునొకండవ దినమునందు కుశునకు సర్వసంస్కారములను నెరవేర్చె. అనంతరమందా బాలుఁడు తల్లియగు సీతామహాదేవిచేత లాలింపఁబడుచు బాలచంద్రుని పగిది దినదిన ప్రవర్ధమానుఁడగుచుండె. అప్పుడు సుమేధాజనకులు నానావిధములగు వస్త్రాభరణాదులచేత దౌహిత్రుఁడగు కుశునకు నలంకారములను చేయించుచుండిరి. ఆబాలుఁడు నానావిధములగు క్రీడలచేత సుమేధాజనకులకు నానందమును గలిగించుచుండె. అంతట నొక్కనాఁడా బాలుఁడు ఉయ్యెలయందుఁ బరుండి నిద్రనుపొందుచుండె. అప్పుడు సీతామహాదేవి కార్యాంతరములయందు ప్రవర్తించుచుండె. అంతట నాసమయమునందు సుమేధాజనకులును తనచెలికత్తియయగుతులసియును కార్యాంతములయందు ఆసక్తి కలిగియుండుటను జూచి సీతమహాదేవి తమసానదియందుస్నానమును చేయదలఁచి వాల్మీకి మునివరుని నాబాలుని కాపాడుటకుప్రార్థించె. అనంతరమందా సీతామహాదేవి తమసానదియందు స్నానమును చేయుటకు బయలువెడలిపోయె. అట్లు బయలువెడ పోవుచు కటిస్కంధమస్తకముల యందైదు బిడ్డలను పెట్టుకొని పోవుచున్న యొక్కవానరస్త్రీని జూచి సీతామహాదేవి తనమనస్సునందు తనబిడ్డను స్మరించి విచారము కలదై యిట్లనియె. ఛీ! నాజన్మమేల? తిర్యగ్జంతువులుకూడ తమబిడ్డలను వదలిపోలేక వెంటఁదీసికొనిపోవుచుం

డఁగా నేను బిడ్డని విడిచిపెట్టి వచ్చితిని. నాయట్టి మూఢ లెందును నుండరని తలఁచుచు అక్కడనుండి మరలి యాశ్రమమునకుఁబోయె. ఇంతలోపల వాల్మీకి మునివరుఁడు లఘుశంకానిమిత్తముగ బయలునకుఁబోయి యుండఁగ నయ్యాశ్రమమునందలి వటువులుకూడ బయలునకుఁ బోయిరి. అప్పుడు సీతామహాదేవి వచ్చి తొట్టిలోని శిశువు నెత్తికొని దాసియగు తులసితోఁగూడ స్నానమునకుఁబోయె. అంతట నమ్మునివరుఁడు వచ్చి బాలకుని గానక మాటిమాటికిని నిట్టూర్పులను విడుచుచు కుశునివృత్తాంతమును దెలియఁజాలక చింతిల్లి సీతామహాదేవి శపించు ననెడు భయముచేత లవలచేత నొక్కబాలుని కుశునకుఁ దుల్యుని నిర్మించి యాయుయ్యెలయందుఁ బరుండఁబెట్టె. మఱియును, తన తపోబలముచేత నాబాలునకుఁ జైతన్యమును గలిగించె. ఇట్లు నిర్మాణశక్తి కల యామునివరుఁ డా సమయమునందుఁ గలిగిన యాతురతచేత జ్ఞానదృష్టిచేత నాలోచింపకపోయె. అంతటఁ గొంతసేపటికి సీతామహాదేవి స్నానముచేసి తులసితోఁగూడ బాలు నెత్తికొని వచ్చి తొట్టెయందు కుశునివంటిబాలుఁడ మఱియొక్కఁ డుండుటను జూచె. ఆసమయమునం దాబాలుని యాభరణాదులకును తనచంకనున్న బిడ్డని యాభరణాదులకును నించుకైనను భేదము లేకయుండె. అందువలన సీతామహాదేవి మిగుల నాశ్చర్యముకలదై యామునివరునితో నిట్లనియె. ఓ మునివర్యా! ఉయ్యెలయందు నిద్రించుచున్న బాలుఁ డెవ్వనిపుత్రుఁడు; నాబాలుఁడు నిద్రించు నుయ్యెలయందుఁ బరుండి నిద్రించుటకు కారణమేమి? చెప్పుమనిన విని యామునివరుఁడు సీతామహాదేవియొక్క కటిప్రదేశమునందుఁ గుశుఁ డుండుటను జూచి మిగుల నాశ్చర్యముకలవాఁడై సీతామహాదేవికి నమస్కరించి జరిగిన వృత్తాంతమును సర్వమును విన్నవించి యాబాలునిఁ దనతొడయందుఁ గూర్చుండఁబెట్టుకొని యిట్లనియె. ఓ వైదేహీ! నాయనుగ్రహమువలన ఈబాలుఁడు నీకు రెండవపుత్త్రుఁడయ్యె. నేనులవలచేత నీబాలుని నిర్మించుటవలన నీతనికి లవుఁడను నామధేయముకలిగె. ఈబాలుని నీపుత్త్రునిగాఁ బరిగ్రహింపుమనిన విని సీతామహాదేవి యాబాలుని గ్రహించె. అంతట నామునివరుఁడు లవునకుఁ గూడ జాతకర్మాది సంస్కారములను నెరవేర్చె. ఆసమయమున భూమ్యంతరిక్షములయందు నానావిధములగు వాద్యములు మ్రోగె. మఱియు నప్పుడు సీతావాల్మీకిబాలురమీఁదఁ బుష్పవర్షముకురిసె. అప్పుడు సుమేధాజనకులుకూడ నాబాలురకు పరమోత్సవములను చేసిరి. అనంతరము దావాల్మీకిమునివరుఁడు ఆబాలుర కిరువురకును సకల విద్యలతోఁగూడ ధనురస్త్ర విద్యలనుగూడ సంపూర్ణముగ నేర్పె. మఱియును దానుచేసిన రామాయణమును సర్వమును నాబాలురచేతఁ బఠింపఁజేసె. మఱియును, అశ్వినిదేవతలవలె మిగుల మనోహరములైనయాకారములుకల యాబాలురిరువురును రామాయణమును సర్వమును వీణయందు స్వరయుతముగ

గానముచేయుచుండిరి. మఱియు నాబాలకు లప్పుడప్పుడు మునిసమాజములయందు గానము చేయుటనుజూచి యందలి మునులందఱును పరమాశ్చర్యానందములను పొందుచుండిరి. మఱియు నామునివరులందఱును గంధర్వకిన్నర కింపురుషలోకములయందును దేవ పాతాళలోకములయందును బ్రహ్మలోకమునందును ఇట్టిబాలురను వీరిగానమునకుఁ దుల్యమగుగానమును చూచియును వినియును నుండలేదని యనేకవిధములఁ బొగడిరి. ఇట్లు సకలమునివరులును పొగడుచుండఁగఁ బ్రతినాసరమునందును ఆబాలురు వాల్మీక్యాశ్రమమునందు గానమును చేయుచుండిరి. మఱియు నాబాలురు రుక్మకంకణనూపురా ద్యాభరణములచేత నలంకరింపఁబడిరి. మఱియు నాబాలురు నిజక్రీడాకౌతుకములచేతను బాలభావములచేతను బాలవాక్యములచేతను సీతాసుమేధాజనకులకును, వాల్మీక్యాది మునివరులకును నానందమును గలిగించుచుండిరి.

ఇట్లని శతకోటిరామాయణాంతర్గత జన్మకాండమునందలి
నాల్గవసర్గ ముగిసెను.

✷ కుశలవుల రామరక్షను నిరూపించుట. ✷

అట్లు కుశలవుల వృత్తాంతమును గురుఁడగు రామదాసు చెప్పఁగ విని విష్ణుదాసు సవినయముగ నిట్లనియె. ఓ గురూత్తమా! శ్రీరామరక్షచేత కుశునకు నభిమంత్రణమును చెప్పితివి. ఆశ్రీరామరక్ష వాల్మీకిమునివరునిచేత నెట్లు చేయఁబడినదో నాకుఁ దెలిపి నన్నుఁ గృతార్థునిగాఁ జేయవేయనిన రామదాసు మరల నిట్లనియె. ఓ శిష్యోత్తమా! నీవు చక్కని ప్రశ్నమునుచేసితివి. రామరక్షను చెప్పెదను. వినుము. తొల్లి కుమారస్వామియొక్క సంరక్షణకొఱకు పార్వతికి పరమశివునిచేత నీరామరక్ష చెప్పఁబడినది. ఎట్లనిన:—"శ్రీశివఉవాచ. దేవ్యద్యస్కందపుత్రాయ రామరక్షాభి మంత్రణా, కురుతారకఘాతాయ సమర్థోయం భవిష్యతి. ఇత్యుక్త్వా కథయామాస రామరక్షాం శివః స్త్రియై, నమస్కృత్య రామచంద్రం శుచిర్భూత్వా జితేంద్రియః. అథధ్యానమ్. వామేకోదండదండం నిజకరకమలేదక్షిణే బాణమేకం, పశ్చాద్భాగేచ నిత్యం దధత మభిమతం సాసి తూణీరభారం, వామే వామేవ సద్భ్యాంసహామిలితతనుం జానకీలక్ష్మణాభ్యాం శ్యామం రామం భజేహం ప్రణతజనమనఃఖేదవిచ్ఛేదదక్షమ్. ఓం అస్య శ్రీరామరక్షాస్తోత్రమంత్రస్య బుధకౌశిక ఋషిః శ్రీరామచంద్రో దేవతా రామ ఇతిబీజం అనుష్టుప్ఛందః శ్రీరామప్రీత్యర్థే జపే వినియోగః. ఓమ్. చరితంరఘునాథస్య శతకోటిప్రవిస్తరం, ఏకైకమక్షరం ప్రోక్తం మహాపాతక నాశనం. ధ్యాత్వానీలోత్పలశ్యామం రామం రాజీవలోచనం, జానకీ లక్ష్మణోపేతం జటామకుటమండితం. సాసితూణ ధనుర్బాణ పాణింనక్తంచరాంతకం, స్వలీలయా జగత్త్రాతు

మావిర్భూత మజంవిభుం. రామరక్షాం పఠేత్ప్రాజ్ఞః పాపఘ్నీం సర్వకామదాం,
శిరోమే రాఘవఃపాతు భాలం దశరథాత్మజః. కౌసల్యేయో దృశౌపాతు విశ్వామిత్ర
ప్రియశ్శ్రుతీ. ఘ్రాణంపాతు మఖత్రాతా ముఖంసౌమిత్రివత్సలః. జిహ్వాంవిద్యా
నిధిఃపాతు కంఠం భరతవందితః. స్కంధౌదివ్యాయుధఃపాతు భుజౌభగ్నేశకార్ముకః.
కరౌసీతాపతిఃపాతు హృదయం జామదగ్న్యజిత్. పార్శ్వేరఘువరఃపాతు కుక్షి
మిక్ష్వాకునందనః. మధ్యంపాతుఖరధ్వంసీ నాభిం జాంబవదాశ్రయః. సుగ్రీవేశః
కటింపాతు సక్థినీ హనుమత్ప్రభుః. ఊరూరఘూత్తమఃపాతు గుహ్యం రక్షఃకులాం
తకృత్. జానునీ సేతుకృత్పాతు జంఘేదశముఖాంతకః, పాదౌవిభీషణశ్రీదః పా
తురామోఖిలంవపుః, ఏతాంరామబలోపేతాం రక్షాంయస్సుకృతీపఠేత్. సచిరా
యుస్సుఖీపుత్రీ విజయీవినయీభవేత్, పాతాల భూతల వ్యోమచారిణశ్ఛద్మ
చారిణః. నద్రష్టుమపిశక్తాస్తే రక్షితం రామనామభిః, రామేతిరామభద్రేతి రామ
చంద్రేతివాస్మరన్. నరోనలిప్యతే పాపైర్భుక్తింముక్తించ విందతి. జగజ్జైత్రైక మం
త్రేణ రామనామ్నాభిరక్షితం. యఃకంఠే ధారయేత్తస్య కరస్థాస్సర్వసిద్ధయః. వజ్రపం
జరనామేదం యోరామకవచం పఠేత్, అవ్యాహతాజ్ఞస్సర్వత్ర లభతే జయమం
గళమ్, ఆదిష్టవాన్యథాస్వప్నే రామరక్షామిమాంహరః, తథాలిఖితవాన్ప్రాతఃప్రబు
ద్ధోబుధకౌశికః. రామోదాశరథిశ్శూరో లక్ష్మణానుచరోబలీ, కాకుత్స్థఃపురుషః
పూర్ణః కౌసల్యానందవర్ధనః. వేదాంతవేద్యో యజ్ఞేశః పురాణపురుషోత్తమః, జాన
కీవల్లభ శ్శ్రీమానప్రమేయపరాక్రమః, ఇత్యేతానిజపేన్నిత్యం మద్భక్తశ్శ్రద్ధ
యాన్వితః, అశ్వమేధాధికంపుణ్యం లభతేనాత్రసంశయః. సన్నద్ధఃకవచీ ఖడ్గీ
చాపబాణధరోయువా. గచ్ఛన్మనోరథోస్మాకం రామఃపాతుసలక్ష్మణః. తరు
ణౌరూపసంపన్నౌ సుకుమారౌమహాబలౌ. పుండరీకవిశాలాక్షౌ చీరకృష్ణాజి
నాంబరౌ. ఫలమూలాశనౌ దాంతౌ తాపసౌ బ్రహ్మచారిణౌ. పుత్రౌదశర
థస్యైతౌ భ్రాతరౌ రామలక్ష్మణౌ. ధన్వినౌబద్ధనిస్త్రింశౌ కాకపక్షధరాశ్రితౌ.
వీరౌమాంపథి రక్షేతాం తావుభౌరామలక్ష్మణౌ. శరణ్యౌ సర్వసత్త్వానాం శ్రే
ష్ఠౌసర్వధనుష్మతామ్. రక్షఃకులనిహంతారౌ త్రాయేతాం నోరఘూత్తమౌ. ఆత్తసజ్జధ
నుషావిషుస్పృశావక్షయాశుగనిషంగసంగినౌ. రక్షణాయమమ రామలక్ష్మణా
వగ్రతః పథిసదైవగచ్ఛతాం. ఆరామః కల్పవృక్షాణాం విరామస్సకలాపదాం,
అభిరామ స్త్రిలోకానాం రామశ్శ్రీమాన్ సనఃప్రభుః. రామాయ రామభద్రా
య రామచంద్రాయవేధసే. రఘునాథాయ నాథాయ సీతాయాః పతయేన
మః. శ్రీరామరామ రఘునందన రామరామ శ్రీరామరామ భరతాగ్రజ
రామరామ. శ్రీరామరామ రణకర్కశ రామరామ శ్రీరామరామశరణం
భవరామరామ. లోకాభిరామం రణరంగధీరం రాజీవనేత్రం రఘువంశనాథం. కారు

ణ్యరూపం కరుణాకరం తం శ్రీరామచంద్రం శరణం ప్రపద్యే. దక్షిణే లక్ష్మణో యస్య వామే చ జనకాత్మజా. పురతో మారుతిర్యస్య తం వందే రఘునందనమ్. గోష్పదీకృత వారాశిం మశకీకృతరాక్షసం, రామాయణ మహామాలా రత్నం వందే నిలాత్మజం. అభాగ్యతిష్ఠదూరేత్వం రోగాస్తిష్ఠంతు దూరతః, వరీవర్తి సదాస్మాకం హృది రామో ధనుర్ధరః. మనోజవం మారుతతుల్యవేగం జితేంద్రియం బుద్ధిమతాం వరిష్ఠం, వాతాత్మజం వానరయూథముఖ్యం శ్రీరామదూతం శరణం ప్రపద్యే. రామరామ తవ పాద పంకజం చింతయామి భవబంధముక్తయే, వందితం సురనరేంద్ర మౌళిభిర్ధ్యాయితం మనసి యోగిభిస్సదా. రామం లక్ష్మణ పూర్వజం రఘువరం సీతాపతిం సుందరం, కాకుత్స్థం కరుణార్ణవం గుణనిధిం విప్రప్రియం ధార్మికం, రాజేంద్రం సత్యసంధం దశరథ తనయం శ్యామలం శాంతమూర్తిం వందే లోకాభిరామం రఘుకులతిలకం రాఘవం రావణారిమ్. ఏతాని రామనామాని ప్రాతరుత్థాయ యః పఠేత్. అపుత్రో లభతే పుత్రం ధనార్థీ లభతే ధనమ్. మాతా రామో మత్పితా రామచంద్ర స్స్వామీ రామో మత్సఖా రామచంద్రః. సర్వస్వం మే రామచంద్రో దయాళుర్నాహం జానే నైవ జానే న జానే. శ్రీరామనామామృత మంత్రబీజ సంజీవనీ చేన్మనసి ప్రవిష్టా, హాలాహలం వా ప్రలయానలం వా మృత్యోర్ముఖం వా విశతాం కుతో భీః. శ్రీశబ్దపూర్వం జయశబ్ద మధ్యం జయద్వయేనాపి పునః ప్రయుక్తం, త్రిస్సప్తకృత్వో రఘునాథనామ జపాన్నిహన్యాద్ద్విజకోటిహత్యాః. ఏవం గిరీంద్రజే ప్రోక్తా రామరక్షా మయా తవ, మయోపదిష్టా యా స్వప్నే విశ్వామిత్రాయ వై పురా." అని పరమశివునిచేత బోధింపఁబడిన శ్రీరామరక్షను పార్వతీదేవి పఠించి కుమారస్వామి కభిమంత్రణమును చేసె. అనంతరమం దాకుమారస్వామి శ్రీరామరక్షచేత తేజోబలములు కలవాఁడై క్షణములోపల తారకాసురుని సంహరించి కృతకృత్యుఁడయ్యెనని చెప్పి యారామదాసు మరల నిట్లనియె. ఓశిష్యోత్తమా! విష్ణుదాసా! ఇప్పుడు నాచేతఁ జెప్పఁబడినదియును మిగుల పావనమైనదియును నగు రామరక్షను వినుటమాత్రముచేతనే సకల భయములును దొలఁగిపోవును. ఓ శిష్యోత్తమా! వాల్మీకిమునివరుఁడు ప్రతిదినమునందును ఈ శ్రీరామరక్షచేత కుశలవులకు సకల భయములును శాంతించుటకు అభిమంత్రణమును చేయుచుండె. కావున బాలురకు గ్రహశాంత్యాదులు శాంతించుటకొఱకు మిగుల శ్రేష్ఠమైనదియును సకల భయనివారకమును అయిన యీ శ్రీరామరక్షను పఠింపవలయును.

ఇట్లని యానందరామాయణాంతర్గత జన్మకాండమునందలి

అయిదవసర్గ ముగిసెను.

* కమల హరణమునందు లవునకు జయము కలుగుట *

అంతట మరల రామదాసు డిట్లనియె. ఓ శిష్యోత్తమా! విష్ణుదాసా! ఒక్క నాడు సీతామహాదేవి వాల్మీకిమునివరునితో నిట్లనియె. ఓ మునికులోత్తమా! ఏవ్రతమును ఆచరించుటచేత రామునితోఁగూడ యోగము కలుగునో యట్టి వ్రతమును దెలుపుమనిన వాల్మీకిమునివరుఁ డిట్లనియె. ఓ సీతా! శుక్లపాడ్యమి మొదలుకొని శుక్లనవమివఱకు నేనుజెప్పునట్టి వ్రతము నాచరింపుము. అట్టి వ్రతాచరణముచేత నీకు మరల భర్తృసంయోగమగును. ఓ సీతా! ప్రతిపత్తిథియందు రామచంద్రుని పాదములను ధాతువుతో నిర్మించి తొమ్మిది కమలములచేతఁ బూజించి పుష్పాంజలి నొసఁగుము. అనంతరమందు నీపుత్రులవలన నీవు శుభకరమైన జన్మకాండమును వినుము. రెండవదినమునందు పదునెనిమిది కమలములచేతఁబూజించి పుష్పాంజలి నొసంగుము. పిమ్మట జన్మకాండమును రెండు పర్యాయములు వినుము. ఈవిధముగ దినదినాభివృద్ధిగ పూజాశ్రవణాదులను జేయుము. అనంతరమందు ఎనుబదొక్కటి సంఖ్యకల పద్మములచేత భర్తృపాదుకలను పూజింపుము. మఱియు నాదినమునందు తొమ్మిదిపర్యాయములు జన్మకాండమును వినుము. అనంతరమందు అనఁగా దశమియందు ఎనుబదొక్కసంఖ్యకల దంపతులను వస్త్రాభరణాదులచేతఁ బూజింపుము. పిమ్మట బ్రాహ్మణులకుఁ దృప్తిగ నన్నదానమును చేయుము. అంతట నాబ్రాహ్మణులకుఁ దాంబూలాదుల నొసంగి ప్రదక్షిణ నమస్కారముల నాచరించి వారల వారిగృహమునకుఁబంపి నీవు భుజింపుము. ఇట్టి వ్రతముచేత శీఘ్రముగ రామునితోఁ గలియుదువు. ఓ సీతా! ఈవ్రతము సంయోగమును కలుఁగజేయునట్టి పుణ్యవ్రతమనఁబడును. ఓ సీతా! ఈవ్రతము నాచరించువారు తమబంధువులతో యోగమును పొందుచున్నారనియె. ఇవ్విధముగ మునివరుఁడు చెప్పిన వాక్యములను విని సీతామహాదేవి మరల నిట్లనియె. ఓ మునికులోత్తమా! కమలములు విశేషముగ నయోధ్యాపట్టణమునందలి మడుగునందుఁ గలవు. ఇక్కడ నున్నవారిలో నెవ్వఁడుపోయి యాపద్మములను దెచ్చుటకు సమర్థుఁడగునో తెలుపుము. రామాజ్ఞచేత రామదూతలు సర్వకాలములయందును ఆపద్మములను కాపాడుచుందురనియె. అట్లు సీతామహాదేవి చెప్పుచున్న సమయమునందు సమీపమునందున్న లవుఁడు తల్లితో నిట్లనియె. ఓ తల్లీ! నీవీవ్రతమును శీఘ్రముగ నాచరింపుము. పూజనుచేయుటకుఁ జాలినన్నిపద్మములనే నొసంగెదననియె. అట్లు అయిదుసంవత్సరముల వయస్సుకలబాలుఁడు చెప్పిన వాక్యములను విని సీతామహాదేవి నవ్వుచుఁ బుత్రుని నాలింగనముచేసికొని యాబాలుని మోమును ముద్దుపెట్టుకొని యిట్లనియె. అన్నా! పుత్రా! పద్మములను నీవెట్లు తీసికొని వచ్చి యీయఁగలవు. అనేకవేలమంది రామదూతలా పద్మములనుగాపాడుచుందురనిన విని యాలవుఁడు మరలఁ దల్లితో నిట్లనియె. ఓ తల్లీ! నీ స్తన్యపానమువలనఁ గలి

గిన బలముచేతను, వాల్మీకిమునివరుఁడు బోధించిన విద్యాబలముచేతను, మునివరుల యాశీర్వచన బలముచేతను నాకు రామభయము లేదు. నాకనుజ్ఞనిచ్చి నా పౌరుషమును జూడుమని చెప్పి తల్లియగు సీతామహాదేవికి సమస్కరించి వాల్మీకి మునివరునకుఁగూడఁ బ్రణమిల్లి యాయిరువురి యాశీర్వచనములను పొంది ధనుర్బాణ తూణీరములను ధరించె. అంతట వస్త్రాలంకారాదులను ధరించి తానొక్కఁడే రథమునధిష్ఠించి శోభారహితమైయున్న యయోధ్యాపట్టణమునకుఁ బోయె. పోయి యాపట్టణమునకు క్రోసెడుదూరమున రథమునునిలిపి పాదచారియై యారామమునకుఁ బోయె. అట్లు లవుఁడుపోయిన సమయము మధ్యాహ్నకాలమగుటచేత వనపాలకులందఱును భోజనముకొఱకుఁ బోయిరి. అప్పుడు లవుఁడు ఆయారామమునందలి పద్మములనన్నింటిని హరించె. అనంతరమందు రథముదగ్గఱకువచ్చి రథమునెక్కి మరల నాశ్రమమునకుఁబోయి తల్లికిని వాల్మీకిమునివరునకును సమస్కరించి యాపద్మములను సమర్పించె. అప్పుడు సీతామహాదేవి మిగుల సంతోషము కలదై వ్రతము నారంభించె. ఇవ్విధముగ లవుఁడు ఏడుదినములు పద్మములను దెచ్చి యిచ్చుచుండె. ఆయేడుదినములవఱకును రామదూతలు పద్మములు పోవువిధమును గుర్తింపఁజాలక పోయిరి. అంతట లవుఁడు ఎనిమిదవ దినమునందుఁగూడ పద్మములను దెచ్చుటకు రథారూఢుండై యయోధ్యాపట్టణమునకుఁ బోయె. పోయి రథమును ఆయారామమునకు వెలుపలనిలిపి పాదచారియై యారామములోనికిఁ బోయి కాసారమునందలి పద్మములను గైకొని రథముదగ్గరకు వచ్చుచుండఁగ రామదూతలు వచ్చిచూచి యాలవునితో నిట్లనిరి. ఓయీ బాలుఁడా! రామానుచరులలో నిన్నెపుడును జూచియుండలేదు. ఏదినముమొదలుకొని నీవు రామసేవను చేయుట కారంభించితివి. నీవు నిర్భయముగఁ బద్మములనుగొనిపోవుటకుఁ గారణమేమనిన లవుఁడు నవ్వుచు నిట్లనియె. ఓ రామదూతలారా! నేను రామానుచరుఁడనుగాను. రామునిజూచియు నుండలేదు. నేను వాల్మీకిమునివరునకనుచరుఁడను. ప్రతిదినమునందును వాల్మీకిమునివరు నాజ్ఞచేతఁ బద్మములనుదీసికొని పోవుచున్నాఁడను. నన్ను మీరింతకుముం దెప్పుడును జూచినవారు గారనినవిని రామదూతలా లవుని పరకీయునిఁగాఁదలఁచి క్రోధోద్దీపితులై యిట్లనిరి. ఓరీ! బాలుఁడా! నీవు శ్రీరాముని జూడకపోతివి. మమ్ములను నడుగనైతివి. రామాజ్ఞనైనను పొందకపోతివి. ఏవిధమైన స్వాతంత్ర్యమును లేక యీకాసారమునందలి పద్మముల నపహరించుటకుఁ గారణమేమి? ఇట్లు చేయఁదగునా? అనిచెప్పుచు నాబాలుని మార్గమునాక్రమింపఁ జూచిరి. ఇంతలోపల నాబాలుఁడు రథముమీఁదికిఁ బోయి పదునలుగురగు నారామదూతలతో నిట్లనియె. ఓరామదూతలారా! మీరుపోయి నావృత్తాంతమును మీరు రామునకుఁ జెప్పుడు. రామునకు పరాక్రమముగలిగియున్న యెడల నతఁడే నాయొద్దకు వచ్చునని యె. అట్లు లవుఁడు చెప్పిన

వాక్యమునువిని యారామదూతలు క్రోధోద్దీపితులై యిట్లనిరి. ఓరీ ! బాలుఁడా ! నీవు మరణమును పొందవలయునని తలఁచి యిట్లు పలుకుచున్నావు. నీనిమిత్తముగ శ్రీరాముఁడు రావలయునా ? నిన్ను బంధించి మేమే శ్రీరామునిదగ్గరకుఁ దీసికొని పోయెదమని చెప్పి యాలవుని పట్టుకొనుటకు రథముదగ్గరకుఁ బోయిరి. అట్లుతన సమీపమునకు వచ్చిన రామదూతలనుజూచి లవుఁడు ధనుర్బాణములను సంధించి యిట్లనియె. ఓరామదూతలారా ! నాయొద్దకు రాకుండుఁడు. మీరు మూర్ఖత నవలంబించితిరేని నాబాణములచేతనే మిమ్ముల రామాంతికమునకుఁ బంపెదననియె. అంతట నారామదూత లధికమైన కోపముకలవారై యాలవుని బట్టుకొనుటకు యత్నించిరి. అట్లు తన్నుఁ బట్టుకొనుటకు యత్నించుచున్న రామదూతలమీఁద బాణములను ప్రయోగించి విలాసమాత్రముగ నారామదూతలను రామునియాగమంటపమునందుఁ బడునట్లుసేసె. అంతట రామదూతలు మూర్ఛితులై రామునకెదుటఁబోయి పడిరి. ఆసమయమునం దాపదునలుగురితోఁ గూడవచ్చిన వారందఱును భయముచేత నలుదిక్కులకును పరుగిడిరి. అంతట లవుఁడు జయముకలవాఁడై మునుపటివలెఁ దనయాశ్రమమునకుఁబోయి యాపద్మముల నన్నింటిని సమర్పించి జరిగిన వృత్తాంతమును సర్వమును సీతావాల్మీకులకుఁ దెలియఁజేసె. అంతట నక్కడఁ గొంతసేపటికి నారామదూతలు మూర్ఛనుండి తేఱి తమవృత్తాంతమును సర్వమును శ్రీరామునకుఁ దెలియఁజేసిరి. ఆవృత్తాంతమును సర్వమునువిని శ్రీరాముఁడుమిగుల నాశ్చర్యముకలవాఁడై యారామమును సంరక్షించుటకొఱకు వేయిమంది దూతలనుబంపె. అంతట లవుఁడు మునుపటివలెనే తొమ్మిదవ దినమునం దయోధ్యాపట్టణమునకువచ్చె. వచ్చి యారామమునందలి పుష్పములను గైకొనఁదలఁచె. అంతలోపల రామదూతలు వేయిమందియును లవునితోఁ యుద్ధమును చేయుటకు యత్నించిరి. ఓరామదూతలారా ! మీప్రభువగు శ్రీరాముఁడెప్పుడు సీతామహాదేవిని నరణ్యమునందుఁ బరిత్యజించెనో అప్పుడే రాముని జయలక్ష్మికూడ బయలువెడలి పోయినది. కావున మీకుజయము కలుగనేరదు. మీరురామునిదగ్గరకుఁబొండు. మీతోఁయుద్ధమును చేయుట యుచితముగాదు. మీరామునకు సీతను త్యజించుటయందుమాత్రము పరాక్రమముకలదే కాని నన్నుజయించుటకు పరాక్రమములేదనియె. ఇవ్విధముగ లవుఁడు ప్రయోగించునట్టి వాగ్బాణములచేత భేదింపఁబడిన మర్మస్థానములు కలవారై యాలవునిమీఁద నానావిధములగు శస్త్రములను ప్రయోగించిరి. అప్పుడు లవుఁడు ధనుస్సునాకర్షించి బాణములను ప్రయోగించి యావేయిమందిదూతలను మునుపటివలె రామాంతికమునందుఁ బడునట్లుచేసె. అంతట మిగిలిన వారందఱును ఆరామమునువదలి నలుదిక్కులకును పరుగిడిరి. అప్పుడు లవుఁడు మునుపటివలె జయమునుపొంది పద్మములనుగైకొని మరలిపోయె. పోయి యావృత్తాంతమును సర్వమును సీతావాల్మీకులకుఁ దెలిపె. ఆసమయ

మునాఁడు పుత్త్రిని పరాశర్త్రిముమునకు సీతామహాదేవి పరమానందమునుపొందె. అంతట నక్కడ రామదూతలు జరిగిన వృత్తాంతమును సర్వమును దెలియఁబఱచిరి. మఱియు నప్పుడు రామదూతలందఱును మూర్ఛనుండి తేఱిరి. అట్లు మూర్ఛనుండి తేఱి శ్రీరామునితో నిట్లనిరి. రఘుకులోత్తముఁడవైన యోరాముఁడా! మాయాపద్వృత్తాంతమును విన్నవించెదము. సావధానుఁడవై చిత్తగింపుము. అయిదు సంవత్సరముల వయస్సుకల బాలునిచేత మేమిప్పుడు పరాజితులమైతిమి. ఆబాలుఁడు వాల్మీకిమునివరునివలన పొందఁబడిన విద్యలుకలవాఁడట. లక్ష్మణాదులచేత జయింప శక్యముకానివాఁడు. కావున నోరఘుకులోత్తమా! ఆబాలుని సంహరించుటయందుఁ దగినయుపాయము నాలోచింపుము. మఱియు నోరఘుకులోత్తమా! సీతాత్యాగాదివచనములచేత ఆబాలకుఁడు నిన్నుఁగూడ నిందించె. మఱియునోరఘుకులోత్తమా! ఆబాలుఁడు నిన్ను నిందించు నపుడు నిర్భయుఁడై యుండెననియె. ఆవృత్తాంతమును సర్వమునువిని మంత్రులను పిలిచి వారితో నాలోచించి యొకదూతను వాల్మీకిమునివరుని దగ్గఱకుఁబంపె. అంతట నారామదూత మిగులవేగముగ బయలువెడలిపోయి వాల్మీకిమునివరునకు నమస్కరించి రామవాక్యమును సవినయముగ నిన్నవించి యిట్లనిరి. ఓమునికులోత్తమా! మహావీరుఁడగు నీశిష్యుఁడొక్కఁడు శ్రీరామున కపకారమును చేసె. కావున శ్రీరాముని దగ్గర నాశిష్యుని నైనఁ బంపుము. అట్లు కాదేని శిష్యునివెంటఁబెట్టుకొని నీవుకూడ రమ్ము? ఇది వఱకెన్నఁడును శ్రీరాముఁడు నిన్నుఁబిలిపించినవాఁడుకాఁడు. అప్పుడీవిధముగఁ బిలుచుటకును మన్నింపుమని శ్రీరాముఁ డానతిచ్చెనని యారామదూత తెలిపె. అట్లు రామదూతలు చెప్పిన రామవాక్యములనువిని వాల్మీకిమునివరుఁ డిట్లనియె. ఓదూతోత్తములారా, నేను నాశిష్యులతోఁగూడ రామునియాగశాలకువచ్చెదను. మీరు పొండనిన విని యాదూతలు బయలువెడలిపోయి యావృత్తాంతమును శ్రీరామునకుఁదెలిపిరి. శిష్యోత్తముఁడవైన యోవిష్ణుదాసా! ఈవృత్తాంతమును జరుగునని పూర్వమే శ్రీరామునకుఁ దెలిసియుండుటచేతనే శ్రీరాముఁడు వాల్మీకిమునివరుని యజ్ఞమునకుఁ బిలిపింపకపోయె. అంతట సీతామహాదేవికూడ తనవ్రతమును సర్వమునునెరవేర్చె ననినవిని విష్ణుదాసిట్లనియె. ఓ గురూత్తమా! ఈసీతామహాదేవి చేసినవిధముగ నీవ్రతమును చేయఁజాలని వారెట్లుచేయవలయునో తెలుపుమనిన విని రామదాసిట్లనియె. ఓ శిష్యోత్తమా! కాంచనముచేతనైనను రజతముచేతనైనను తామ్రముచేతనైనను పద్మములనుచేసి శ్రీరామునిపాదుకలను బూజింపవలయును. ఇట్లును చేయుటకు వీలుగానియెడల పుష్పాంజలులచేతఁ బూజింపవలయును. మఱియు నోశిష్యోత్తమా, ఎనుబదొక్క దంపతులను పూజించుటకు శక్తిలేనివారు తొమ్మిదిమంది దంపతులను పూజింపవలయును. మ

ఱియు నోశిష్యోత్తమా! తన శక్త్యనుసారముగఁ బూజింపవలయునుగాని విత్తశాఠ్యము చేయఁగూడదు.

ఇట్లని యానందరామాయణాంతర్గత జన్మకాండమునందలి
యాఱవసర్గ ముగిసెను.

---

* రామ కుశలవ యుద్ధవర్ణనము. *

ఓశిష్యోత్తమా! విష్ణుదాసా! అనంతరమందు ధర్మాత్ముఁడగు రాముఁడు కడపటిదగు అశ్వమేధయాగము నందలి యశ్వమును విడిచె. ఆయశ్వమును వెంబడించి శత్రుఘ్నుఁడు బయలువెడలె. ఆయశ్వము దక్షిణదిక్కునందును పశ్చిమదిక్కునందును సంచరించి పదివేల చతురంగసైన్యముతోఁ గూడ నుత్తరదిక్కును కూడనతిక్రమించి యజ్ఞస్థానమునకుఁ బోవుటకుద్యమించె. మఱియు నట్లుసంచరించునపుడు శత్రుఘ్నుఁడు సకల రాజులవలనను కప్పమునుగొని యయ్యారాజులతోఁ గూడ నయ్యజ్ఞాశ్వమును వెంటనంటి వచ్చుచుండె. అవ్విధముగ నెల్లవారును యజ్ఞాశ్వముతోఁగూడఁ బోవుచుండిరి. ఆసమయమునందు సకల బ్రహ్మర్షులును రాజర్షులును బ్రహ్మక్షత్రియులు వైశ్యులును వేనవేలుగ నారామునికడపటియశ్వమేధయాగమును చూచుటకు వచ్చుచుండిరి. అప్పుడు వాల్మీకిమునివరుఁడు గానమును చేయుచున్న శిష్యులతోఁగూడ రామునియజ్ఞమును చూచుటకు బయలువెడలిపోయె. మఱియు నప్పుడు సుమేధా జనకులుకూడ సీతామహాదేవిని శిబికయందుఁ బెట్టుకొని బయలువెడలిపోయి యజ్ఞవాటమునకు సమీపమునందు పర్ణశాలను నిర్మించుకొని దానియందు సీతతోఁగూడ నివసించిరి. అట్లు సీతామహాదేవి శిబికారూఢురాలై పోవుటను రాజులు మొదలగు వారెవ్వరును మార్గమునందుఁ దెలిసికొనఁజాలక పోయిరి. అప్పుడు వాల్మీకిమునివరుఁడు పర్ణకుటీరమునందు సీతామహాదేవిని దాచియుంచె. అనంతరమందు జనకచక్రవర్తి సేనానివేశములయందు భార్యయగు సుమేధతోఁగూడ నివసించియుండె. అనంతరమందు శ్రీరామునిచేత నాహ్వానము చేయఁబడి జనకచక్రవర్తి తనసైన్యముతోఁగూడ రామాధ్వరమునకుఁ బోయె. అంతట వాల్మీకిమునివరుఁడు జటావల్కలాజినములను ధరించినవారును, మిగుల బుద్ధిమంతులును సీతాపుత్రులును నగు కుశలవులతో నిట్లనియె. ఓ శిష్యోత్తములారా! మీరు జన్మకాండాది కాండములను మిగుల మనోహరముగ గానముచేయుచు నావెంటనంటి రండు. వచ్చి రామాధ్వరమునందుఁ గూడ గానము చేయుఁడు. ఆసమయమునందు శ్రీరాముఁడు మీకేమయిన నీయవచ్చునేని గైకొనకయుండవలయు ననియె. ఇట్లు మునివరుఁడు చెప్పినమాటల కంగీకారమునుపొంది యావాల్మీకిమునివరునితోఁగూడ గానముచేయుచు యజ్ఞశాలయందుఁ బ్రవేశించిరి. ఆసమయమునందు శ్రీరాముఁడు తనచరిత్రమును దెలుపునట్టివియును మి

గుల మనోహరము లయినవియును నగు పద్యములను విని మిగుల సంతోషమును పొందెను. అంతటఁ గొంతసేపటికి శ్రీరాముఁడు యాజ్ఞికకర్మముల నన్నింటిని నెరవేర్చుకొని మునీశ్వరులనందఱును రప్పించెను. మఱియు నందలి పండితులు మొదలగు వారలనందఱు రప్పించెను. అట్లు రప్పించి పురాణాగమాదులను వినుచుండెను. అట్లు వినుచు వారివారి విద్యాతిశయముల కధికానందమును పొంది వారలనందఱు యథావిధిగఁ బూజించెను. అప్పుడు మునులు రాజులు మొదలగు వారందఱును పరమానందమును పొందిరి. మఱియు నప్పుడు శ్రీరాముఁడు గానమునుచేయుచున్న రాజపుత్రుల నిరువురనుచూచి మిగుల నానందమును పొందుచుండెను. ఆసమయమునఁ దెల్లవారును ఆబాలురనుజూచి యాబాలురు రామునితో సమముగ నుండిరనిచెప్పికొనుచుండిరి. మఱియు నీబాలురు రామునిపోలియుండి జటావల్కలములను ధరించియుండుటకుఁ గారణమేమని యోజించుచు రామునకును ఆబాలునకును కొంచెమైనను భేదమును కనిపట్టఁజాలక పోయిరి. ఇట్లు ఎల్లవారును విస్మయముతోఁ బరస్పరాలాపములను జేయుచున్న సమయమునందు లవునిబాణములచేతఁ బీడింపఁబడిన రామదూతయొక్కఁడువచ్చి యిట్లనియె. ఓ రఘుకులోత్తమా! గానమును చేయుచున్న బాలురలో నొక్కఁడు పద్మవనమునందుఁ బ్రవేశించి మమ్ములనందఱును కొట్టెనని యాగుఱితో నాలవునిజూపె. మఱియు నారామమునందు పద్మములనన్నింటిని హరించెను. మఱియు సీతాత్యాగ నిమిత్తముచేత నిన్ను ననేకవిధముల నిందించెను. మఱియు నోరామచంద్రా! నీవు దండింతువనియెడు భయముచేత మునుపటివేషమును వదలి మారువేషమును వేసికొని వచ్చియున్నాఁడు. వీఁడు మిగుల గర్వముతో నిన్ను నిందించెను కనుక దండింపఁ దగినవాఁడని యాదూత చెప్పుచున్న వచనములను వినియును శ్రీరాముఁడు ప్రేమచేత నమ్రతమును జిలుకుచున్న చూపుతో నాబాలుర నిరువురనుజూచెను. అంతలోపల నాబాలురు సభలోని వృద్ధులకును, శ్రీరామునకును, పినతండ్రులకును, వసిష్ఠ మునివరునకును, నమస్కరించి వీణెలను మ్రోగించుచు గానముచేయుట కారంభించిరి. అంతట మిగుల మనోహరమైన గంధర్వగీతమును గానమునుగా పాడుటకు నారంభించిరి. ఆమధురగీతమును విని శ్రీరాముఁడు పరమానందమును పొందెను. మఱియుఁ దాను సీతతోఁగూడ నాచరించిన చరిత్రలు మొదలుగాఁగల పూర్వ వృత్తమును సర్వమును విని మిగుల నానందమును పొందుచుండెను. అంతలో నపరాహ్ణమగుటచేత శ్రీరాముఁడు ప్రసన్నమైన ముఖపద్మముకలవాఁడై యాబాలురతో నిట్లనియె. ఓబాలకోత్తములారా! రేపటిదినము మరల మాసన్నిధియందు మిగిలిన విషయమును సర్వమును గానము చేయవలయుననియె. అందుకాబాలు రంగీకారమును పొందిరి. అంతట శ్రీరాముఁడు లవునితో నిట్లనియె. ఓబాలుఁడా! పూర్వము నీవు మాకపరాధమును

చేసితివి. అయినను ఇప్పుడు నీగానమును వినుటచేత మేము సంతసించి మన్నించితిమి. నీగానమువలన నిప్పుడు మాచిత్తము మిగుల విశ్రాంతిని పొందినది. నీవిప్పుడు మాభయమును వదలి సుఖముగ నుండుమనిన విని యాలవుఁ డిట్లనియె. ఓ రఘుకులోత్తమా! నిన్నుఁ జూడవలయు ననియెడు తలంపుతో నీకపరాధమును చేసితిని. నీవు నాయపరాధమును విని యిక్కడకు పిలిపించుటచేత వచ్చి చూచుటచేత పౌరుషము బుద్ధికి వచ్చినది. మఱియు నీ ప్రమోలగానమును చేయుటవలన నాకుఁ గీర్తియును నధికముగఁ గలిగినదని చెప్పి యాలవుఁ డంతటితో నూరకుండి వాల్మీకి మొదలగు వారితోఁ బోవ నుద్యుక్తుఁడయ్యె. అట్లు బయలువెడలి పోవుట కుద్యుక్తులయిన కాలమునందు శ్రీరాముఁడు పదివేల వరహాలను దీసికొని పోయి యిచ్చి రమ్మని భరతునితోఁ జెప్పె. అంతట భరతుఁడు ధనమును దీసికొనిరాఁగా వారు గ్రహింపక యిట్లనిరి. ఓ రఘుకులోత్తమా! మేము వన్యములగు పదార్థములను భుజించువారము. మా కీధనమెందుకు మేము మీ కృపాకటాక్షముచేతనే ధన్యుల మైతిమని యాధనము పరిత్యజించిపోయిరి. అంతట శ్రీరాముఁడు మిగుల నాశ్చర్యమును పొందెను. పిమ్మట కుశుఁడు జరిగిన వృత్తాంతమును సర్వమును దెలియఁబఱచె. అనంతరమందా కుశుఁడు గంగయందు స్నానమును చేయుటకు బయలు వెడలి పోయె. లవుఁడు మునిబాలురతోఁ గూడి బాలక్రీడల నాడుచుండె. అట్లు లవుఁ డాడుకొనుచుండఁగ నక్కడకు యజ్ఞాశ్వము వచ్చె. అట్లు వచ్చిన యశ్వమును చూచిన తోడనే బాలక్రీడను విడిచిపెట్టి బిరబిరఁబోయి యాయజ్ఞాశ్వమును పట్టుకొని తన పర్ణశాలకడకుఁబోయి యొక చెట్టునకుఁ గట్టివైచె. అట్లు యజ్ఞాశ్వమును బంధించి మరలివచ్చి పూర్వమువలె బాలక్రీడల నాడుచుండె. ఇంతలోపల నంతరిక్షమునుండి పుష్పకము వచ్చె. అప్పుడు పుష్పకమున నున్న శత్రుఘ్నాదులు యజ్ఞాశ్వము బద్ధమైయుండుటను జూచి బాలకృతమని తలఁచిరి. అనంతరమందు యజ్ఞాశ్వమును విడువవలసినదని దూతలవలనఁ జెప్పి పుచ్చె. అంతట దూతలు బయలుదేరి వచ్చుటను జూచి లవుఁడు వాయవ్యాస్త్రమును ప్రయోగించి యాదూతలనందఱఁ దృణప్రాయులుగఁ జేసె. పిమ్మట వారలఁ బొండని చెప్పి మరల నెప్పటియట్ల బాలక్రీడల నాడుచుండె. మఱియు నప్పుడా వాయవ్యాస్త్రబలముచేతఁ గలిగిన ఝంఝామారుతముచేత చతురంగబలములతోఁ గూడుకొనిన శత్రుఘ్నుని పుష్పకవిమానము అంతరిక్షమునందు భ్రమరమువలెఁ దిరుగుచుండె. ఆవృత్తాంతమును విని శ్రీరాముఁడు, సుగ్రీవుఁడు అంగదుఁడు నీలుఁడు మైందుఁడు జాంబవంతుఁడు నలుఁడు సుమంత్రుఁడు భరతుఁడు వాయుపుత్రుఁడు తార్క్ష్యుఁడు విభీషణుఁడు సుషేణుఁడు మొదలుగాఁగల పెక్కుమంది వీరవరులను బంపె. వారందఱును చతురంగ బలముతోఁగూడ బయలువెడలి పోయిరి. మఱియును, దధివక్త్రుఁడు మొదలుగాఁగల వానరోత్తములుకూడ బయలు వెడలిపోయిరి.

అంతట వారందఱును బయలువెడలిపోయి లవునితో యుద్ధమును చేసిరి. అంతట లవుఁడు తనతో యుద్ధమునకు వచ్చిన వీరవరుల వృత్తాంతమును సర్వమును విని ధనుర్బాణతూణీరములను ధరించి యుద్ధమును చేయుటకుఁ బోయి ధనుష్టంకారమును చేసితనమనస్సునం దిట్లనియోజించె. ఆహా పినతండ్రులు మొదలుగాఁగల వారందఱును ఇప్పుడు నాతో యుద్ధమును చేయుటకు వచ్చియున్నారు. వీరితోఁగూడ నేనేవిధముగ యుద్ధమును జేసెదను. వీరియందు మిగులఁ దీక్ష్ణములగు బాణముల నెట్లుప్రయోగింతును. స్వబంధువులను వధచేయునట్టి నన్నుసీతయును మునియును బంధువులును నెట్లుసహింతురు. ఇప్పుడు నేనేమి చేయుదును. యుద్ధమునకు పరాఙ్ముఖుఁడనై పోతినేని వాల్మీకిమునివరుఁడు చెప్పిన విద్యయంతయును నిష్ఫలమగును. కావున నెవ్వనికిని హాని కలుగకుండునట్లు యుద్ధమును చేసెదనని నిశ్చయించి యుద్ధోన్ముఖులైవచ్చిన వారితో నిట్లనియె. ఓయి యోధవీరులారా! మీరందఱును మిగుల వేగముతో వచ్చి నన్నుఁ గలియుటకుఁ గారణమేమి? విచారింపఁగా మీరందఱును సీతావత్సలుఁడనగు నన్నుఁబీడించుటకొఱకువచ్చినట్లు తోఁచుచున్నది. ఓదుష్టులారా! సీతాదుఃఖమునకు నగ్నివంటివాఁడనగునా పరాక్రమమును మీరు తెలిసికొనుఁడు. సీతాశోకాగ్నిజ్వాలలచేత మీ పరాక్రమమంతయును నశించిపోయినదని వాగ్బాణములచేవారలనందఱను భిన్నహృదయులనుగాఁజేసి యాలవుఁడు సమ్మోహనాస్త్రమును ప్రయోగించి యాయుద్ధవీరుల కందఱకును మోహమును గల్పించె. అంతటలవుఁడు పరమజయము కలవాఁడై సుమంత్ర భరతులను తనకేతుములయందిమిడ్చికొని హస్తములచేత హనుమత్సుగ్రీవులను నొప్పితగుల కుండునట్లు పట్టుకొని వారలను సీతామహాదేవికిఁ జూపుటకొఱకు తీసికొనిపోయె. పోయివారలను సీతామహాదేవికిఁ జూపె. అప్పుడు సీతామహాదేవి మోహనాస్త్రముచేత మోహితులయిన భరతాది వీరవరులను జూచి పుత్రునితో వారల విడువుమనిచెప్పి వారలరక్షించె. అట్లు భరతాదులను లవుఁడుకొనిపోయిన వృత్తాంతమును విని శ్రీరాముఁడు లవునితో నిట్లనియె. ఓతమ్ముఁడా! ఇట్టిపౌరుషమును రావణుఁడుకూడ మనయెడలఁ జేసినవాఁడుకాఁడు. బాలుఁడొక్కఁడిట్టికార్యమునుచేసె. యీవిషయమునందుమనమాచరింపఁదగిన విషయమేదియో తెలుపుమనినవిని లక్ష్మణుఁడిట్లనియె. ఓరఘుకులోత్తమా! నీవు విచారమునుపొందకుము. నేను క్షణమాత్రములో ఆబాలుని బట్టుకొనివచ్చెదను. సింహముమృగశిశువును బట్టుకొని వచ్చువిధముగ నే నాబాలుని పట్టుకొని వచ్చెదననియె. ఇవ్విధముగఁజెప్పి రథారూఢుఁడై యతివేగముగఁ బోయె. పోయిమిగుల మనోహరుఁడగునాబాలకుని జూచి లక్ష్మణుఁడు కృపతో నిట్లనియె. ఓబాలకోత్తమా! నీవిప్పుడు సాహసమునుచేయకుము. నీవు నాయెదుటనిలిచి యుద్ధమును జేయఁజాలవు. కావునఁ దొలఁగిపొమ్ము. అట్లు చేయవేని మరణమునుపొందుదువు. మిగిలిన

రామాయణకథనుగూడ నీవలన శ్రీరాముఁడు విన దలఁచియున్నాఁడు. కావున నిన్నుఁ జంపఁదలఁచి వచ్చినవాఁడనుగాను. నీవు పలుమారు శ్రీరామున కపరాధ మును చేసితివి. అదియంతయును నేనెఱుఁగుదును. అయినను నిన్ను వధింపను. నీవు పట్టుకొనివచ్చి నావీరవరులను సమర్పించి యజ్ఞాశ్వముతోఁగూడ శ్రీరామునిదగ్గరకు రమ్ము. నీకు జీవింపవలయునని యెడు తలంపు గలిగియున్న యెడల నాతోఁగూడ రమ్మనినవిని లవుఁడు భయరహితుఁడై యిట్లనియె. ఓలక్ష్మణా! నిన్నును శ్రీరాముని నేనెఱుఁగుదును. సీతాత్యాగమువలన మీరిరువురును పౌరుషహీనులైతిరి. మఱియు నోలక్ష్మణా! మీపరాక్రమము సీతయందేకాని లవుఁడనగు నాయందుఁ బ్రవేశింపఁజాలదు. సీతామహాదేవియొక్క దుఃఖమును పోఁగొట్టుటకు నేను వాల్మీకిమునివరునిచేత నిర్మింపఁబడితిని. ఇప్పుడు మిమ్ములనిరువురను యుద్ధమునందు జయించి సీతాదుఃఖమును పోఁగొట్టెదను. పతివ్రతయగు సీతను నిష్కారణముగ నరణ్యమునందు విడిచిపెట్టివచ్చితిరి. అట్టియపరాధమునకుఁ దగినప్రాయశ్చిత్తమును చేయుటకు వచ్చితిని. సీతాదుఃఖాగ్నిచేత మీపౌరుషము దగ్ధమైపోయినది. విధవాతుల్యులగువారు నాయెదుటను డఁదగరు. కావున నీవిక్కడనుండి తొలఁగి పొమ్ము. అనిలవుఁడు వాగ్బాణములచేత లక్ష్మణాదుల మర్మస్థలములు భిన్నములగునట్లు చేసె. అంతట లక్ష్మణాదులు కోపోద్దీపితులై లవునిమీఁద శస్త్రాస్త్రముల నువర్షించిరి. అప్పుడు లవుఁడు బాణములను బ్రయోగించి లక్ష్మణాదుల బాణవర్షమును నివారించెను. అనంతరమందు మరల దివ్యాస్త్రములను బ్రయోగించి లక్ష్మణునిఁదప్పఁ దక్కినవారల యజ్ఞమంటపమునందు విసరివైచె. అప్పుడు లక్ష్మణేతరులందరును ఆ లవునిబాణములచేత పీడింపఁబడినవారును స్రవించుచున్న రక్తముకలవారును నై యాగశాలయందుఁబడి గద్గదస్వరముతో శ్రీరామునకిట్లనిరి. ఓరఘుకులోత్తమా! నీవు మమ్ములను మాయవస్త్రను జూచుము. మాయవస్థనుజూచియును నీవు యజ్ఞశాలయం దూరకుంట యుచితమా? లవునివధించుటకుఁ దగినయుపాయము నాలోచింపుము. ఆలవుఁడు యుద్ధమునందు శస్త్రాస్త్రములచేత మరణమును పొందువాఁడుగాఁడు. నీతమ్ముఁడగు లక్ష్మణుఁడు జీవించియుండవలయునని నీకుఁ దలంపుకలిగియున్న యెడలఁ దగినయుపాయము నాలోచింపుమని లవునివాక్యముల నన్నింటిని దెలిపిరి. ఆవచనములనన్నింటిని విని శ్రీరాముఁడు క్షణము నేపూరకుండె. అంతలో నక్కడ లవుఁడు నిజబాణములచేత లక్ష్మణునిగూడ నోడించి యతనిశరీరమునందుఁ బదిబాణములగ్రుచ్చె. అంతట లక్ష్మణుఁడు కోపోద్దీపితుఁడై లవునిమీఁద బాణములను బ్రయోగింపఁగా నవియన్నియును విఫలములయ్యె. అట్లు తన బాణములన్నియును వ్యర్థమగుటను జూచి క్షణమునేపాలోచించి బ్రహ్మాస్త్రమును బ్రయోగించి లవుని బంధించి కొనివచ్చి రామునకు సమర్పించె. ఆసమయమునందు లవుఁడు బ్రహ్మాస్త్రమును గౌరవించుటకు బద్ధుఁడైనట్లు కనఁబడియె,

అట్లు లక్ష్మణునిచేతఁ దీసికొనిరాఁబడిన లవునిజూచి శ్రీరాముఁడు లక్ష్మణునితో నిట్లనియె. ఓతమ్ముఁడా! లక్ష్మణా! నీవు మిగుల గొప్పదగు కార్యమునుజేసితివి. వీఁడు క్షత్రియుఁడుగాని బ్రాహ్మణుఁడు కాఁడు. కావున బ్రహ్మహత్యాభయమును వదలి వీనిని వధింపుమనిన లక్ష్మణుఁడిట్లనియె. ఓ రఘుకులోత్తమా! శస్త్రాస్త్రములచేత మరణమును పొందువాఁడుగాఁడు. నేనును భరతాదులును వీనినెన్ని యస్త్రములచేతఁగొట్టినను వీనిశరీరము కందినదైనను పోలేదు. కావున వీనినివధించుటకు దుర్లభమనిన విని శ్రీరాముఁడాబాలునకు దేనిచేత మృత్యువు కలుగునో నీవు నా యెదుటనే యుండుము. శూరులగువారు తమ మృత్యూపాయమును దాచరు. అసత్యమును బలుకరు. స్వబలముచేతనే జీవింతురనిన విని లక్ష్మణుఁడాలవునితో నిట్లనియె. ఓ బాలుఁడా! నీవు మరణమును దేనివలనఁగలుగునో తెలుపుమనిన విని లవుఁడు తనకు జలసేచనమువలన వృద్ధికలిగినను వార్తను వినియుండుటచేత నాకు జలసేచనమువలన మరణము కలుగుననియె. ఆ వాక్యమును విని లక్ష్మణుఁడు లవుని నొక్కశిలయందుఁబడవైచి యయోధ్యాపట్టణము నందున్న నారీపురుషులచేత నుదకమును దెప్పించి యాబాలునకు సేచనమును చేసె. మఱియు నాపట్టణమునందలి యేనుఁగులు గుఱ్ఱములు ఒంటెలు మొదలగు వానిమీఁదఁగూడ నీళ్లకడవలను దెప్పించి యాబాలునకు సేచనమును చేయించె. అట్లు సేచనము చేసినకొలఁదిని నాబాలుఁడు వృద్ధిపొందుచుండె. అట్లు వృద్ధినిపొందుటనుజూచి లక్ష్మణుఁ డిట్లనియె. ఓ బాలకాలవుఁడా! నీవీయుపాయమును నీయభివృద్ధికిఁజెప్పితివేకాని నీమృత్యువునకుఁ జెప్పినవాఁడవు కావు. వీరులగువారసత్యమును చెప్పవచ్చునా? అనిన విని లవుఁడు మరల నిట్లనియె. ఓ లక్ష్మణా! తైలము నశించిపోయినపిమ్మట దీపము వృద్ధిపొందియేకదా చెడిపోవును. ఆవిధముగానే యాయుష్యకాలమునందు నాకుఁగూడ వృద్ధి కలుగుచున్నదని తెలిసికొనుము. నీవు భయమును పొందకుమనిన విని లక్ష్మణుఁడు మునుపటికంటె నధికముగ గంగోదకమును దెప్పించి యభిషేకమును జేయించుచుండె. మఱియు నాసమయమునందు జనులందఱును కాష్ఠసోపానమార్గముచేత నభిషేకమును చేయుచుండిరి. అంతలో వల నాలవుఁడు బ్రహ్మాస్త్రమునుండి ముక్తుఁడై కదలె. అనంతరమం బాలవుఁడు భుజముల నాస్ఫాలనముచేసె. అట్లు భుజాస్ఫాలనమును చేయుచున్న లవునిచూచి యెల్లవారును భయభీతులై పరుగిడిరి. మఱియు నందలి వారందఱును లవునిచూచినతోడనే మూత్రపురీషములను విడిచిరి. ఇవ్విధముగ నిక్కడజరుగుచున్న సమయమునందు కుశుఁడు గంగాతీరమందు మునిబాలురతోఁగూడ నాడుకొనుచు గంగయందలి యుదకములను దీసికొని పోవుచున్న జనులను జూచియుండి వేగముగ ననేకు లుదకమును దీసికొనిపోవుటకు కారణమేమని యడిగినవారలు జరుగుచున్న వృత్తాంతమును సర్వమును చెప్పిరి. ఆవృత్తాంతమును సర్వమును విని మిగులవేగ

ముగఁ దమయాశ్రమములోనికి వచ్చి ధనుర్బాణ తూణీరములను గ్రహించి బయలు వెడలి లవునివిడిపించుటకు ధనుష్టంకారమును చేయుచు లవుఁడున్నచోటునకువచ్చె. అప్పుడు లవుఁడు అన్నయగు కుశుని ధనుష్టంకారమును విని క్షణముసేపూరకుండె. అట్లు ధనుష్టంకారమును చేయుచువచ్చిన కుశునిచూచి లక్ష్మణుఁడు యుద్ధమును చేయుటకుఁబోయె. అట్లు యుద్ధమునుచేయుటకు వచ్చిన లక్ష్మణునిజూచి కుశుఁడిట్లనియె. ఓరీలక్ష్మణా! నీవు జానకీలవులను వంచనను జేసితివి. నీయన్నయగు రాముఁడును ఈకార్యమున కంగీకరించె. కావున మీయిరువురకును ప్రాయశ్చిత్తమును చేయుటకు నేను వచ్చితిని. లవునివలె నన్నుఁగూడ బాలునిగాఁదలఁపవలదు. మీపౌరుషమును శిశువులయందును స్త్రీలయందును నుపయోగించునేకాని మాయట్టివారియం దుపయోగింపదు. సీతాక్లేశాగ్నిచేత మీబలము దగ్ధమైపోయినది. కావున మీపరాక్రమము నాయెదుట పరిహాసాస్పదమగును. వాల్మీకి మునివరుఁడు నేర్పినవిద్యను నీకును రామునకును చూపెదనని చెప్పి పితృభ్రాతయగులక్ష్మణునితోఁగూడ సంకులయుద్ధమునుచేసె. అప్పుడు లక్ష్మణునిచేతఁ బ్రయోగింపఁబడిన బాణములన్నియును కుశునియందు వ్యర్థములయ్యె. మఱియు నాసమయమునందు కుశుఁడు రామాయణమువలన లక్ష్మణుఁడు శేషావతారమని తెలిసినవాఁడు కనుక లక్ష్మణునిమీఁద గారుడాస్త్రమును బ్రయోగించె. క్షాత్రధర్మము నవలంబించి యుండుటచేత హింసాధర్మము నవలంబింపకపోయె. అట్లు గారుడాస్త్రమును బ్రయోగించినతోడనే లక్ష్మణుని ప్రాణము తగ్గిపోయె. అంతట లక్ష్మణుఁడు నిశ్చేష్టితుఁడై రథమునుండి క్రిందఁబడియె. అంతట లక్ష్మణుఁడు క్రిందఁబడుటనుజూచి రామచంద్రుఁడు దీక్షాయుక్తుఁడయ్యును మిగుల వేగముగఁ బరుగిడివచ్చి ధనుర్బాణములను ధరించి యజ్ఞకుండాగ్రమునందుండి లక్ష్మణుని జీవితమును దాశకలవాఁడై బ్రహ్మాస్త్రమును సంధానముచేసి గారుడాస్త్రముమీఁదఁ బ్రయోగించె. అట్లు బ్రహ్మాస్త్రమును బ్రయోగించుటచేత గారుడాస్త్రము శాంతినిబొందె. అంతట కుశుఁడు రామునిమీఁద నాగాస్త్రమును బ్రయోగింపఁదలఁచి యిట్లనియె. ఓయి రాముఁడా! నేను సీతవలె సులభముగ చలింపఁజేయఁదగిన వాఁడనుగాను. సీతామహాదేవిని నిష్కారణముగ నరణ్యమునందు విడిచిపెట్టిన నీపరాక్రమము నే నెఱుఁగుదును. కావున దానికిఁదగిన ప్రాయశ్చిత్తమును చేసెదను. వాల్మీకిమునివరునివలననే నభ్యసించిన విద్యను నీకుఁ జూపెదను, చూడుము. నీకు నన్ను జయింపసామర్థ్యము లేనియెడల జానకిదగ్గరకువచ్చి శరణమును పొందుమని చెప్పె. ఇట్లు కుశుఁడు ప్రయోగించిన వాగ్బాణములచేత శ్రీరాముఁడు భిన్నాంగుఁడై సర్పాస్త్రమును జూచి మిగుల భయంకరమైన యోత్వాస్త్రమును బ్రయోగించి సర్పాస్త్రమును శాంతిని బొందించె. అంతట నూరకుండక యాకుశుఁడు సారమేయాస్త్రమును బ్రయోగించె. అప్పుడు శ్రీరాముఁడు పాసలాస్త్రమును బ్రయోగించి యాసారమేయాస్త్రమును

నివారించె. అంతట కుశుఁ డాగ్నేయాస్త్రమును ప్రయోగించె. శ్రీరాముఁడు మేఘాస్త్రమును ప్రయోగించి యాయాగ్నేయాస్త్రమును నివారించె. అనంతరమందు కుశుఁడు వాయవ్యాస్త్రమును ప్రయోగించె. శ్రీరాముఁడు పర్వతాస్త్రమును ప్రయోగించి వాయవ్యాస్త్రమును వారించె. పిమ్మట కుశుఁడు వజ్రాస్త్రమును ప్రయోగించె. అప్పుడు శ్రీరాముఁడు యామ్యాస్త్రమును ప్రయోగించి వజ్రాస్త్రమును నివారించె. అంతట నాకుశుఁడు కోపోద్దీపితుఁడై బ్రహ్మాస్త్రమును ప్రయోగించె. అప్పుడు యజ్ఞశాలయందలి వారందఱును హాహాకారములను సల్పిరి. అంతలో శ్రీరాముఁడు వైష్ణవాస్త్రమును ప్రయోగించి యాబ్రహ్మాస్త్రమును నివారించె. అప్పటికిని నూరకుండక కుశుఁడు రాముని శరీరమునందు మిగులఁ దీక్ష్ణములగు నూరుబాణములను ప్రయోగించె. అప్పుడు శ్రీరాముఁడుకూడ నూరుబాణములను ప్రయోగించె. ఈవిధముగ కుశరాములు మిగుల భయంకరమైన యుద్ధమును చేసిరి. మఱియు నాయుద్ధమునందు శ్రీరాముఁడు ప్రయోగించు బాణములన్నియును కుశుని శరీరము మీఁదుగఁ గ్రిందఁబడుచుండె. కుశుఁడు వేయుబాణము లన్నియును శ్రీరాముని పాదముల మ్రోలఁబడుచుండె. అట్లు సకలబాణములును తనపాదముల మ్రోలఁబడుటనుజూచి శ్రీరాముఁడు మిగుల నాశ్చర్యము గలవాఁడయ్యె. అంతట శ్రీరాముఁడు తన మంత్రిని వాల్మీకిమునివరునిదగ్గరకుఁ బంపఁదలఁచి యిట్లనియె. ఓమంత్రిపుంగవా! నీవు వాల్మీకిమునిదగ్గరకుఁబోయి నమస్కరించి నీశిష్యులు రామునితో యుద్ధమును చేయుచున్నారనియును, వారిని నివారింపనియెడల శ్రీరాముఁడు చంపనుద్యుక్తుఁడై యున్నాఁడనియును, తెలియఁజేయుమనియె. అంతట నామంత్రి రథారూఢుఁడై మిగుల వేగముగ వాల్మీకిమునివరునిదగ్గరకుఁ బోయి శ్రీరాముఁడు చెప్పినవాక్యములను చెప్పఁగా విని వాల్మీకిమునివరుఁ డిట్లనియె. ఓ మంత్రివర్యా! రేపటిదినమునందలి సభయందు బాలకుల వృత్తాంతముసర్వమును దెలియఁగలదని చెప్పుమనియె. అనంతరమందుఁ దనశిష్యులనుబంపి కుశలవులను రప్పించి యారాత్రి యంతయును విచిత్రములగు కథలనుజెప్పుచుఁ గాలముగడపె.

ఇట్లని యానందరామాయణాంతర్గత జన్మకాండమునందలి
యేడవసర్గముగిసెను.

యజ్ఞశాలయందు సీతామహాదేవి ప్రమాణమును చేయుటయును
రామునకు సీతలభించుట అనువానిని వర్ణించుట.

అంతట మరుదినము ప్రాతఃకాలమునందు శ్రీరాముఁడాబాలుర నిరువురను బిలిపించె. అప్పు డాబాలురిరువురును వాల్మీకి మునివరునకును తల్లియగు సీతామహాదేవికిని నమస్కారమును చేసి సభకుఁబోయిరి. అనంతరమందు వాల్మీకిమునివరు

నియాజ్ఞచేత జటా కృష్ణాజినాంబరములను ధరించినవారై యాయిరువురును తండ్రియగు శ్రీరామునకెదుట జన్మకాండమును సర్వమును గానముచేసిరి. అప్పుడు శ్రీరాముఁడు తన చరిత్రమును సర్వమునువిని మిగుల నాశ్చర్యముకలవాఁడయ్యె. మఱియు నాసభయందలి జనులందఱును మిగుల నాశ్చర్యమునుపొందిరి. మఱియు నెల్లవారును ఆబాలురను సీతా కుమారులనుగాఁదెలిసికొని మిగుల సంతోషమును పొందిరి. ఇంతలోపల లవుని వాక్యాస్త్రములచేతఁ బీడింపఁబడిన శత్రుఘ్నాదులు వానరాదులతోఁగూడ శ్రీరామునిదగ్గరకువచ్చిరి. మఱియు నప్పుడు లక్ష్మణుఁడు కూడ నచ్చోటునకువచ్చె. అంతట నెల్లవారును శ్రీరామునకు నమస్కరించిరి. అప్పుడు శ్రీరాముఁ డాబాలకుల నిరువురనుబంపి విభీషణశత్రుఘ్న మకరధ్వజ అంగద సుషేణ జాంబవదాదులతో నిట్లనియె. ఓమంత్రివర్యులారా! మీరందఱును బోయి దేవతుల్యుఁడగు వాల్మీకి మునివరుని సీతతోఁగూడఁ దోడ్కొనిరండు. గంగానది దక్షిణతీరమునందు సభను చేయింపుఁడు. ఆసభయందు నేను జూచుచుండఁగ సీతదివ్య ప్రమాణమును చేయునట్లు చేసెదను. మునివరులందఱును ఆప్రమాణమును చూతురు. అంతట వాల్మీకిమునివరుఁడు నాకునుశుద్ధిని కలిగించుననియె. ఇట్లు శ్రీరాముఁడు చెప్పిన వాక్యములను విని లక్ష్మణాదులు వాల్మీకిమునివరుని దగ్గరకుఁబోయిరి. పోయివాల్మీకి మునివరునకు నమస్కరించి రాముఁడు చెప్పిన వాక్యములను విన్నవించిరి. అప్పుడు వాల్మీకిమునివరుఁడు శ్రీరాముని హృద్గతాభిప్రాయమును దెలిసికొని వారలనందఱఁ బూజించి లవుఁడుపట్టితెచ్చిన సుమంత్రాదులను లక్ష్మణునకు సమర్పించి యిట్లనియె. ఓలక్ష్మణా! సీతామహాదేవి రేపటి దినము ఎల్లవారును చూచుచుండఁగ దివ్యప్రమాణమును చేయునని తెలియఁజేయుననియును, స్త్రీలకు భర్తకంటె వేరొండు దైవములేదనియును, శ్రీరామునితో నావాక్యములుగఁ జెప్పుఁడనియె. అంతట లక్ష్మణాదులు మిగుల సంతోషముతో బయలువెడలిపోయి వాల్మీకిమునివరుని వాక్యములను జెప్పిరి. అప్పుడు శ్రీరాముఁడు పరమానందమును పొందిసుమంత్రభరతాదులను కౌగిలించుకొనియె. అంతట నెల్లవారును సీతాపుత్రుఁడగు లవునిచేత తాముఅపజయమును పొందిన వృత్తాంతమును సర్వమును దెలిపిరి. అంతట మరుదినమునందు శ్రీరాముఁడు మిగుల మనోహరమును శ్రేష్ఠమును అయిన సభనుచేయించె. అనంతరమం దెల్లవారిని రప్పించి శ్రీరామునితో డిట్లనియె. ఓ మునులారా! క్షత్రియులారా! మీరందఱును సావధానులరై వినుఁడు. సీతచేయునట్టి శపథమునెల్లవారును దెలిసికొనుఁడని చెప్పె. ఇట్లు రాముఁడు చెప్పినపిమ్మట నెల్లవారును సీతచేయునట్టి దివ్యప్రమాణమును జేయుటకు నేగుదెంచిరి. అంతట వాల్మీకి మునివరుఁడు సీతతోఁగూడ సభలోనికి నేగుదెంచె. అప్పుడు సీతామహాదేవి వాల్మీకి మహామునికివెనుక తలవంచుకొనియుండె. మఱియు నాసీత కృతాం

జలిన్తై యాసభయందుఁ బ్రవేశించె. అట్లు మహాలక్ష్మివలె వాల్మీకి మునివరునితోఁగూడ వచ్చుచున్న సీతామహాదేవిని జూచి యెల్లవారును సాధువాదములను జేసిరి. అప్పుడు వాల్మీకిమునివరుఁడు సీతతోఁగూడ సభయందుఁబ్రవేశించి యిట్లనియె. ఓ రఘుకులోత్తమా! శ్రీరామా! ఈ సీతామహాదేవి సద్వృత్తికలదియును, ధర్మచారురాలునునై యున్నది. ఈ మహనీయురాలిని నీవు నాయాశ్రమము దగ్గర విడిచిపెట్టితివి. నీవు లోకాపవాద భయముచేత నా యాశ్రమమునకు సమీపముననుండు యమునా తటమునందు సీతను విడిచిపెట్టుటను నేనెఱుఁగుదును. ఇప్పుడీ సీతామహాదేవి యెల్లవారికిని నమ్మకమును పుట్టించునట్టి ప్రమాణమును చేయుటకు నాజ్ఞనిమ్ము. ఈ బాలు రిరువురును సీతామహాదేవియొక్క పుత్రులు యిరువురిలో కుశుఁడు నీవలన జన్మించినవాఁడు. రెండవవానిని నేను లవలచేతసృజించి లవుఁడను నామమునుగల్పించి సీతామహాదేవికి సమర్పించితినని తొలుతటివృత్తాంతమును సర్వమునుజెప్పి యిట్లనియె. ఓ రఘుకులోత్తమా! ఈ బాలురిరువురును పరులచేతఁ జయింపఁబడరు. నేను ప్రచేతసుని వంశమునందు పదియవవాఁడను. నేను అసత్యమును పలుకువాఁడనుగాను. నేననేక సంవత్సరములనుండి తపస్సును జేయుచున్నవాఁడను, నేను ఫలములనుగూడ భుజించువాఁడనుగాను సీతామహాదేవికి విషయము సర్వమును దెలియునని చెప్పి శ్రీరాముని కుడితొడయందు కుశుని నెడమతొడయందు లవునికూర్చుండ నియమించె. అనంతరమం దామునివరుఁ డేమియును బలుకక యూరకుండె. పిమ్మట శ్రీరాముఁ డాబాలురనిరువురను గౌగిలించుకొని శిరస్సును మూర్కొనియె. అనంతరమందు జగదీశ్వరుఁడగు శ్రీరాముఁడు లవునిశిరస్సునందు హస్తమునుబెట్టి మిగులఁ బొట్టివాఁడై యున్న యాబాలుని మునుపటివలెఁ బొడుగువానిగఁ జేసె. పిమ్మట రెండుబాహువులునుకల సీతనుజూచి యెఱుఁగనివానివలె లక్ష్మణునితో నిట్లనియె. ఓ లక్ష్మణా! నాకుఁజూపుటకు నీవు సీతాభుజమును తీసుకొనివచ్చితివి కదా? ఆభుజము నింతవఱకును గాపాడుచుండినయెడలఁ దీసికొని రమ్మనినవిని లక్ష్మణుఁడు వల్లెయని పేటికయందుంచఁబడిన యాభుజమునుదీసి సీతకెదుట శ్రీరామునకుఁజూపె. అట్లు అయిదుసంవత్సరముల కాలమువఱకు మాంసాదులతోఁగూడుకొని యున్నదియును సీతాభుజముతో సమానమైనదియును నగు భుజమునుచూచి యెల్లవారును మిగుల నాశ్చర్యమును పొందిరి. అట్లెల్లవారును చూచుచుండఁగ విశ్వకర్మయొక్క ప్రభావముకలిగిన యాభుజ మంతర్ధానమునుపొందెను. ఆయద్భుతమునుజూచి యెల్లవారును మునుపటికంటె నధికముగ నానందమును పొందిరి. ఆసమయమునందు శ్రీరాముఁడుకూడ మిగుల నాశ్చర్యముకలవాఁడై వాల్మీకిమునివరునకు నమస్కరించి యిట్లనియె. ఓమునికులోత్తమా! మహానుభావుఁడవైన నీవాక్యములచేతనే నాకునమ్మకము కలిగినది. మఱియును లంకాపట్టణమునందుఁగూడ నేను సీతచేసిన ప్రమా

ణమును నేనుజూచి యుంటిని. ఆప్రమాణమును చేయునపుడు దేవతలందఱును
జూచిరి. కావుననే నేను సీతను నాగృహమునందుఁ బ్రవేశపెట్టితిని. పాపరహితు
రాలగు సీతను లోకాపవాద భయముచేతఁ బరిత్యజించితిని. కావుననన్ను క్షమిం
పుము. కుశుఁడు నావలనఁ బుట్టినవాఁడనియును, లవుని సీతాశాపభయముచేత నీవు
లవలేశో నిర్మించుటయును నేనెఱుఁగుదును. సీతపరిశుద్ధురాలే యయినను సకల
జనులకును నమ్మకము కలుగుటకొఱకిక్కడఁగూడఁ బ్రమాణమును చేయవలయు
ను. కావున నీయెదుట నీసభలో నెల్లవారును జూచుచుండఁగ ప్రమాణమును చే
యునట్లుచేయుము. అట్లయినయెడల నెల్లవారును జూచుచుండఁగ నేనీసీతనంగీకరిం
చెదననియె. ఆసమయమునం దెల్లవారును సీతామహాదేవిచేయు శపథమును చూ
చుటకు మిగుల నుత్సాహము కలవారై యుండిరి. అప్పుడుసీతామహాదేవి కౌశేయ
మునుధరించినదై సభలోనికివచ్చి యుత్తరాభిముఖురాలును ప్రాంజలియునునై యిట్ల
నియె. రామునికంటె నితరునినేను మనస్సుచేతఁగూడ స్మరింపకుండుట వాస్తవమైన
యెడల భూమిదేవినాకు వివరము నిచ్చుఁగాతమని పలుకుచుండఁగా మిగుల నత్య
ద్భుతమైన సింహాసనము భూతలమునుండి యెగుదెంచె. అట్లుభూవివర మార్గము
నుండి వచ్చినదియును మిగుల మనోహరమైనదియును, దివ్యదేహములుకల నాగేం
ద్రులచేత ధరింపఁ బడుచున్నదియును నగుసింహాసనమును జూచి యెల్లవారును
మిగుల నాశ్చర్యమును చెందిరి. ఆసమయమునందు భూదేవి తన పుత్రికయగుసీతా
మహాదేవిని హస్తములచేత ధరించి స్వాగతమునుబలికి తానుదెచ్చిన సింహాసనము
నందుఁ గూర్చుండఁబెట్టె. పిమ్మట వస్త్రాలంకార స్రగ్గంధ సుగంధ ద్రవ్యములచేత
సీతామహాదేవిని పూజించి కౌగిలించుకొని కొంచెముసేపు వింజామరములచేత
విసరె. అనంతరమందు మెల్లమెల్లగ సింహాసనము భూమిలోనికిఁబోవుచుండె. అట్లు
సింహాసనముతోఁ గూడ సీతామహాదేవి భూమిలోనికిఁ బోవుటను జూచి యంతరి
క్షమునందలి దేవతాస్త్రీలందఱును మిగుల సంభ్రమముకలవారై పుష్పవర్షమును
గురిపించిరి. మఱియు నత్యధికముగ సాధువాదములను సలిపిరి. ఆసమయమునందు
భూమ్యంతరిక్షముల యందున్నట్టి స్థావరజంగమాత్మకములగు జంతువులన్నియును
నిశ్చేష్టితములయ్యె. వానరులును నరులును సీతాప్రమాణమును జూచి నానావిధ
ముగ మాటలాడుచుండిరి. మఱియు నాసమయమునందు క్షణముసేపు లోకమంత
యును నిశ్చేష్టితమైయుండె. మఱియు నట్లు భూమిలోనికిఁ బోవుచున్న సీతనుజూచి
యెల్లవారును మోహముచెందిరి. కొందఱు విచారపరులై శ్రీరాముని జూచుచుం
డిరి. ఇంతలోపల భూమిలోనికిఁ బోవుచున్న సీతామహాదేవిని జూచి శ్రీరాముఁడు
ఎడమచేతఁ బట్టుకొని భూమిదేవి నిట్లనియె. ఓదేవీ! నీవు సకల లోకములకును నా
ధారురాలవు. మఱియు నోభూదేవి! నీవెల్లభూతములకును దల్లివి. నీవుసకల ధన
ముల నిచ్చుదానవును పుణ్యరూపురాలునునై యున్నావు. సకల లోకములకును

తృప్తిని కలిగించునట్టి నీవు నీకుమార్తెకుహానిని గల్పించుట యుక్తముకాదు. నీవే దుర్గవు. నీవేమహాలక్ష్మివి. విష్ణుదేవుఁడనగు నాకుఁబ్రియురాలవు. నీవేయిప్పుడు నాకు సామర్థ్యమును గలుగఁజేసితివి. నీగర్భమునుండి ధాతువుల నితరులకిచ్చుచున్నావు. మఱియు నోదేవీ! నీవోర్పుకల దానవును సకల వేదస్తుత్యురాలవును నైతివి. ఈ సీత నీకుపుత్రిక. నేనల్లుడను. కన్యాదానమును చేయుము. నీవుపూర్వమునందునాకుకన్యాదానమును చేసినదానవుగావు. ఇప్పుడు నాయభీష్టమును దీర్పనియెడల నీయందు గోపము కలుగునని శ్రీరాముఁడు చెప్పెనని చెప్పి రామదాసు మరల నిట్లనియె. ఓశిష్యోత్తమా! విష్ణుదాసా! ఈవిధముగ మహానుభావుఁడైన శ్రీరామునిచేత బ్రార్థింపఁబడినభూమిదేవి స్త్రీస్వభావము కలదిగనుక కఠినబుద్ధినవలంబించి శ్రీరామవాక్యముననంగీకరింపక సీతామహాదేవిని మెల్ల మెల్లగ లోనికిఁదీసికొని పోవుచుండె. అట్లు సీతామహాదేవిని తీసికొని పోవుచున్న భూదేవినిజూచి శ్రీరాముఁడు క్రోధతామ్రాక్షుఁడై లక్ష్మణునితో నిట్లనియె. ఓ లక్ష్మణా! ధనుస్సును దీసికొనిరమ్ము? ఈభూదేవిని శిక్షించెదను. మంగళకత్తులవంటి నాబాణములు తగిలినయెడల నీభూమిదేవి సీతను నాకీయఁగలదనియె. అంతట లక్ష్మణునిచేతఁ దీసికొనిరాఁబడిన కోదండమునుధరించి వారిని సంధానముచేసి శరసంధానమును జేసె. అప్పుడు మిగుల భయంకరముగ వాయువువీచె. లవణసముద్రము క్షోభమునుపొందె. నక్షత్రములన్నియును క్రిందరాలె. భూమియంతయును గడగడ వణకుచు రక్షింపురక్షింపుమని చెప్పుచు హస్తములచేత సీతామహాదేవిని బట్టుకొనివచ్చి రామునితొడమీఁదఁ గూర్చుండఁబెట్టె. పిమ్మట నాభూమిదేవి శ్రీరాముని పాదములయందుఁబడి నమస్కారముచేసె. ఆసమయమున నంతరిక్షమునందు దేవవాద్యములు మ్రోగె. మఱియు నప్పుడు దేవాంగనలు పుష్పవర్షమును గురిపించిరి. అంతట శ్రీరాముఁడు తన పాదములయందుఁబడి నమస్కరించుచున్న కోపమును విడిచిపెట్టి ధనుర్బాణములను వదలి యాభూదేవి తన హస్తములతో నెత్తి నిలిపె. అనంతరమందాభూదేవి శ్రీరామునకు నమస్కరించి యనేకవిధముల స్తోత్రముచేసి యాసింహాసనమును సీతామహాదేవికి సమర్పించె. పిమ్మట సీతామహాదేవిని పొగడి సీతచేతఁ బూజితురాలై రాముని వలన సెలవునుపొంది యాభూమిదేవి యంతర్ధానమును పొందె. ఆసమయమునందు జనులందఱును సీతామహాదేవిని పునర్జన్మమును పొందినదానినిగాఁ దలఁచిరి. మఱియు నెల్లవారును జయశబ్దములను బలికిరి. సీతామహాదేవిని వేఱువేఱుగఁ బూజించిరి. ఆసమయమునందు శ్రీరాముఁడు మిగుల సంతోషముకలవాఁడై యనేకములగు దానములనుజేసె. అప్పుడెల్లయెడలను నూతనములగు వాద్యములు మ్రోగె. వారస్త్రీలు నృత్యములను సల్పిరి. వందిమాగధులు నృత్యములను చేసిరి. సీతామహాదేవి ప్రమాణము చేసినచోటగు గంగానదీ దక్షిణతటమునందు సీతాకుండమను క్షేత్రము ప్రసిద్ధి కలదయ్యె. అనంతరమందు శ్రీరాముఁడాయజ్ఞమును

సమాప్తిని పొందించె. శిష్యోత్తముఁడవైన యోవిష్ణుదాసా! ఈవిధముగ శ్రీరాముఁడు నూరుయజ్ఞములను సమాప్తిని పొందించినపిమ్మట లవునకు శాస్త్రోక్తప్రకారముగ జాతకర్మాది సంస్కారములను చేసి దేవతలను భక్తితోఁబూజించి నానావిధములగు దానములనుచేసె. అనంతరమందు మునివరుల నందఱనుబూజించి రాజులనుఁగూడఁ బూజించె. పిమ్మట సుమేధాజనకులను బూజించి మునివరుల నందఱ వారివారినివాసస్థానముల కనిపె. అనంతరమందు ఋత్విజుల నందఱను ధనాదులచేత సంతోషపఱచె. పిమ్మట ఋత్విజులు మొదలగు వారినందఱను వారివారి నివాసములకుఁబంపి సీతను కుమారులను వెంటఁబెట్టుకొని బంధువులతోఁగూడ నయోధ్యా పట్టణమునకుఁబోయె. అట్లు శ్రీరాముఁడు సీతాపుత్రులతోఁగూడ నేనుఁగునెక్కి పోవునపుడు పురస్త్రీలందఱును నీరాజనముల నిచ్చిరి. ఆసమయమునం దయోధ్యాపట్టణమున నత్యధికమైన యుత్సవమయ్యె. చిరకాలమునకు సీతాదర్శనము సంభవించుటచేత నెల్లవారును పరమానందమును పొందిరి. అనంతరమందు శ్రీరాముఁడు తనయజ్ఞమునకు వచ్చిన రాజులందఱను పూజించి వారివారి నివాసములకుఁ బంపె. పిమ్మట సుమేధాజనకులు శ్రీరామానుమతమునుపొంది తమనగరమునకుఁ బోయిరి. అనంతరమందు శ్రీరాముఁడు పుత్రులతోడను బంధువులతోడను కూడుకొనినవాఁడై మునుపటివలెఁ జిరకాలము సుఖమునుపొందె. ఈవిధముగ శ్రీరాముఁడు సీతతోఁగూడ పదిమూఁడువేల సంవత్సరములు రాజ్యమునుపాలించె. మఱియొక కల్పకాలమునందు శ్రీరాముఁడు పదునొకండువేల సంవత్సరములు రాజ్యమునుపాలించె. మఱియొక కల్పమునందు పదునొకండువేల పదునొకండుదినములు రాజ్యమునుపాలించె.

ఇట్లని యానందరామాయణాంతర్గత జన్మకాండమునందలి
యెనిమిదవసర్గ ముగిసెను.

---

* బాలురకు జన్మోపనయనాదికమును వర్ణించుట *

అంతట నోశిష్యోత్తమా! విష్ణుదాసా! కొన్నిదినము లయినపిమ్మట నూర్మిళామాండవీ శ్రుతకీర్తులుకూడ గర్భవతులైరి. అప్పుడు సీతామహాదేవి తనతోడికోడండ్రకు నానావిధములయిన కౌతుకముల నెరవేర్చె. రఘూత్తముఁడగు శ్రీరాముఁడు వారికందఱకును పుంసవనాదికార్యములను నెరవేర్చె. పురస్త్రీలందఱును వారికి నానావిధములగు దోహదములను జేసిరి. శ్రీరాముఁడు తన మఱఁదండ్రకు నానావిధములగు వస్త్రాలంకారాదుల నొసంగె. అంతటఁ గొన్నిదినములకు నూర్మిళ సర్వోత్తముఁడగు పుత్రునిగనియె. ఊర్మిళ ప్రసవించిన మఱుదినమునందు మాండవియును నాఁమె ప్రసవించె. పిమ్మటి దినమునందు శ్రుతకీర్తికవల వారలఁగనియె. అంతటఁ గొంతకాలమైన పిమ్మట నూర్మిళకు రెండవకుమారుఁడు గలిగె. అటులనే

మాండవికిఁగూడ రెండవకుమారుఁడు కలిగె. వారికందఱకు శ్రీరాముఁడు వేఱు వేఱుగ జాతకర్మాది సంస్కారములను జేయించె. మఱియు నాజాతకర్మాది సంస్కారముల నన్నిటిని గురువుఁడగు వసిష్ఠ మునివరునివలనను విప్రవరులవలనను మహోత్సాహ పురస్సరముగఁ జేయించె. మఱియును, లక్ష్మణుని పుత్రులను నంగద చిత్రకేతువులనియును, మాండవీపుత్రులకు, పుష్కర తక్షులనియును, శ్రుతకీర్తియొక్క పుత్రులకు సుబాహు యూపకేతువులనియును, నామములను గల్పించె. ఇట్లు శాస్త్రోక్తప్రకారముగ నామకరణములను చేయించె. వారందఱ యొక్కయును నామకరణాది సంస్కారములను చేయునపుడు సకలదేవతలును ప్రియముతో నేగుదెంచి దేవదుందుభులను మ్రోగింపఁజేసి పుష్పవర్షములను గురిపించిరి. మఱియు నన్న్యకాలములయందు మాతాపితలు తమతమ బిడ్డలతోఁగూడ నానావిధోత్సవములను జూచుచుండిరి. మఱియు నన్న్య యుత్సవకాలములయందు నూతన వాద్యములను మ్రోగుచుండె. అప్సరస్త్రీలు నృత్యములను సలిపిరి. మంగళవాద్యములు మ్రోగుచుండె. వందిమాగధులు స్తోత్రములనుజేసిరి. పతాక ధ్వజతోరణాదులచేత పట్టణమంతయును నలంకరింపఁ జేయఁబడియె. స్నేహితులగు రాజులందఱును రామాదులకుఁ బూజనుజేసిరి. మఱియు నారామాదులకు వేఱువేఱుగ వస్త్రాలంకారాముల నొసంగిరి. మఱియు నన్యులు రామాదు లనేకములగు దానములనుజేసిరి. ఈవిధముగ రామాదుల పుత్రులెనిమిమందియును బాలచంద్రుల మాడ్కి వృద్ధినిపొందుచుండిరి. మఱియును వారందఱును మిగుల మనోహరులును సుందరాకారులును చంద్రముఖులును నై యుండిరి. బంగారపు గొలుసుచేతనూపఁబడుచున్న యుయ్యాలయందు బాలురూగుచుండిరి. మఱియు నాబాలురు నానావిధములయిన యాభరణములచేత నలంకరింపఁబడిరి. అట్లు నానావిధములగు భూషణములచేత నలంకరింపఁబడిన యాబాలురు ముంగిళ్ళయందు నానావిధములగు నాటలనాడుచుండిరి. మఱియు నాబాలురు తల్లిదండ్రులకు నానావిధములగు నాటపాటలచేత సంతోషమును గల్పించె. అనంతరమందా బాలురు నానావిధములగు వస్త్రములచేత నలంకరింపఁబడి సభలోనికిఁబోయి శ్రీరామునకు నమస్కరించి సింహాసనమునకుపరిభాగమునందుఁ గూర్చుండిరి. ఇట్లుండఁగా నొక్కనాఁడు శ్రీరాముఁడు సభయందలి వసిష్ఠమునివరునితో నిట్లనియె. ఓమునికులోత్తమా ! ఈబాలుర యొక్క చిహ్నములను చూడుమనియె. అట్లు శ్రీరాముఁడు చెప్పినవాక్యమును విని వసిష్ఠమహాముని విప్రులతోఁగూడుకొని ముందుగ కుశునిబిలిపించి యిట్లనియె. ఓరఘుకులోత్తమా ! ఈబాలునకు అయిదవయవములు సూక్ష్మములును అయిదవయవములు దీర్ఘములును ఏడవయవములు ఎఱ్ఱనివియును, ఆరవయవము లున్నతములును, మూఁడవయవములు పృథులములును మూఁడవయవములు లఘువులును, మూఁడవయవములు గంభీరములును నై యున్నవి. ఓరఘుకులో

త్తమా! విశేషముగఁ జెప్పనేల? ఈకుశునియందుఁ ముప్పదిరెండు లక్షణములును యోగ్యములై యున్నవి. మఱియునో రఘుకులోత్తమా! అయిదవయవములు దీర్ఘములును, ప్రశస్తములునునై యున్నవి. కావున నీబాలుఁడు దీర్ఘాయుష్మంతుఁడగును. ఓరఘుకులోత్తమా! నీపుత్రునియొక్క నేత్రములు హనువుజానువులుగ్రీవాజంఘామేహనములు మొదలగు నవయవములు సులక్షణములు కలవై యున్నవి. మఱియునో రఘుకులోత్తమా! నీకుమారుని భుజములు నేత్రములు హనువులు జానువులు నాసికయును పొడవై యున్నవి. గ్రీవాజంఘమేహనములు కురుచవై యున్నవి. స్వరముచేతను సత్త్వనాభులచేతను గంభీరతకలవాఁడై యున్నాఁడు. చర్మము వెంట్రుకలు అంగుళులు దంతములు అంగుళిపర్వములు అనునవి సర్వోత్తమ మగుసంపదను జూపుచున్నవి. హస్తములయొక్కయును పాదములయొక్కయును నేత్రములయొక్కయును, తాలుజిహ్వాధరోష్ఠములయొక్కయును, అంతమునందు మిగుల నెఱుపు కలిగియున్నది. మఱియునో రఘుకులోత్తమా! వక్షస్స్థలము కుక్షిఅలికము స్కంధములు చేతులు వదనము అనునాఱును నున్నతములై యున్నవి. మఱియు నీబాలుఁడు లలాటకటివక్షస్సు అనుమూఁడును విస్తీర్ణములై యున్నవి. ఈలక్షణములనన్నిటిని పర్యాలోచింపఁగ నీబాలుఁడు సర్వోత్తమమైన యైశ్వర్యము కలవాఁడగునని నిశ్చయముగఁదోఁచుచున్నది. మఱియు నీతనితర్జని మొదలుకొని యొకరేఖయచ్ఛిన్నమై యున్నది. ఆరేఖకనిష్ఠికయొక్క పృష్ఠభాగము మొదలుకొని బయలువెడలినది. కావున నితఁడు దీర్ఘాయుష్మంతుఁడగునని నిశ్చయముగఁదోఁచుచున్నది. మఱియునీ బాలునిహస్తముల మీఁదిభాగములు తాబేటిపృష్ఠభాగముల వలెనున్నవి. మఱి యునీతని పాదములు మాంసలములును రక్తవర్ణములు కలవియును సమములయినయంగుళులు కలవియునునై యున్నవి. మఱియు నీబాలుని పాదములును రాజ్యకారణ లక్షణములు కలవియై యున్నవి. మఱియు నోరఘుకులోత్తమా! స్వల్పములును రక్తవర్ణము కలవియును అయిన హస్తరేఖల చేత నీబాలుఁడు సుఖముకలవాఁడగును. కృశమును హ్రస్వమును అయిన లింగముచేత నీబాలుఁడు రాజరాజగును. మఱియు నోరఘుకులోత్తమా! మాంసలములును స్నిగ్ధములును అయిన యీభుజములచేత నీబాలుఁడు సుఖమునకుఁ దగినవాఁడని తోఁచుచున్నది. మఱియు నోరామచంద్రా! శ్రీవత్సధ్వజచక్రాబ్జమత్స్య కోదండాదిరేఖలు ఈబాలుని హస్తమునందు మెండుగ నుండుటచేత నధికసుఖమును కలుగును. ఈబాలునకు ముప్పదిరెండు దంతములు కలిగియుండుటచేత నధిక విద్వాంసుఁడును రాజాధిరాజును నగును. మఱియును, క్రౌంచదుందుభి హంసాభ్రముల యొక్క ధ్వనివంటి కంఠధ్వని కలిగియున్నది. నేత్రములు మధుపింగల వర్ణములు కలిగియున్నవి. లలాటమునందైదు రేఖలున్నవి. ఉదరము సింహోదర

ముతో సమానముగనున్నవి. పాదములయం దూర్ధ్వరేఖలు కలిగియున్నవి. నిశ్వాసవాయువు వచ్చునపుడు పద్మగంధమువంటి గంధము కలిగి యున్నదనియె. ఈవిధముగ మొదట కుశుని లక్షణముల నన్నిటిని చెప్పి యనంతరమందు లవాదుల చిహ్నములనుగూడఁ బరిశీలించి శ్రీరామునకుఁ దెలియఁజెప్పె. ఇట్లు వసిష్ఠ మహాముని చెప్పిన వాక్యములను విని శ్రీరాముఁడు మిగుల సంతోషముకలవాఁడై గురుఁడగు వసిష్ఠ మహామునిని పూజించి వస్త్రాద్యాభరణముల నొసంగె. అంతట వసిష్ఠ మహాముని సంతోషించి నిజనివాసమునకుఁ బోయె. ఇంతలోపల సీతామహాదేవి భూమిదేవిచేత నీయఁబడిన సింహాసనమునందుఁ గూర్చుండి చెలికత్తియలచేత వింజామరములు మొదలగు నుపకరణముల వలన సేవింపఁబడుచుండె. అట్లు సేవింపఁబడుచు నద్దమునందు చంద్రునివంటి తన మోమును జూచుకొనుచు రాముని యాగమన వృత్తాంతమును విని సింహాసనమునుండి క్రిందదిగె. అనంతరమందు బాలకులచేతఁ జుట్టఁబడిన శ్రీరాముని జూచె. ఆసమయమునందు శ్రీరాముఁడు కుశలవులను ముందునిడుకొని యూపకేతువను వాని చంకనెత్తికొని యంగదుఁడు మొదలగువారిని చేతఁబట్టుకొని వచ్చుచుండె. ఆశ్రీరామునకు వెనుక భాగమునందు లక్ష్మణ భరతశత్రుఘ్నులొక్కొక బిడ్డనెత్తికొని మఱియొక్కొక బిడ్డను చేతఁబట్టుకొని వచ్చుచుండిరి. అట్లెల్లవారును వచ్చుచుండుటను జూచి సీతామహాదేవి పరమానందమును బొందె. ఇట్లు వచ్చుచున్న రామాదులనుజూచి సీతామహాదేవి శ్రీరామున కెదురుగఁబోయె. పోయి యందఱికంటె ముందుగ వచ్చుచున్న లవుని యెత్తి ముద్దుపెట్టుకొని కుశునిచేతఁ దీసికొనియె. అంతట శ్రీరామునితోఁగూడ మాటలాడుచు మెల్లమెల్లగ స్వస్థలమునకుఁ బోయె. అనంతరమందు సీతామహాదేవి చెలికత్తియలతోఁగూడ శ్రీరాముని సంతోషపఱచె. పిమ్మట శ్రీరాముఁడు సీతయొక్క సింహాసనమునందుఁ గూర్చుండి తొడలమీదఁ గూర్చున్న బాలకులను సీతకుఁజూపుచుఁ బ్రేమచేత లాలనమును చేయుచుండె. అనంతరమందు సభలో గురుఁడగు వసిష్ఠ మునివరుఁడు చెప్పినవృత్తాంతమును సర్వమును చెప్పె. ఆవృత్తాంతమును సర్వమును విని సీతామహాదేవి యధికానందమును బొందె. అంతట శ్రీరాముఁడు సీతను బిలిచి యంగదచిత్రకేతువులను దీసికొనిపోయి లక్ష్మణుని తొడలమీదఁ గూర్చుండఁ బెట్టుమనియె. అప్పుడు లక్ష్మణుఁడు సిగ్గుచేతఁ దొలఁగిపోవుటకు యత్నింపఁగా శ్రీరామునిచే సంజ్ఞ చేయఁబడినవారై మాండవీశ్రుతకీర్తులు లక్ష్మణుని నడ్డుపఱచిరి. అంతట లక్ష్మణుఁ డేవైపునకును పోవుటకు వీలులేక కూర్చుండె. అంతలోపల సీతామహాదేవి యాబాలురను లక్ష్మణునితొడలయందుఁ గూర్చుండఁబెట్టె. అనంతరమందు అటులనే తక్షపుష్కరులను భరతుని తొడయందుఁ గూర్చుండఁబెట్టె. పిమ్మట సుబాహు యూపకేతువులను శత్రుఘ్నుని తొడలయందుఁ గూర్చుండఁబెట్టె. అంతట శ్రీరాముఁడు నవ్వుచు సీతతోనిట్లనియె.

ఓసీతా ! యూర్మిళాదులు తమతమ భర్తలకు వింజామరములను వేయునట్లుచేయుమనియె. అట్లుశ్రీరాముఁడు చెప్పుచుండఁగ నూర్మిళాదులు సిగ్గుచేతఁ బరుగిడుటకుఁ బ్రయత్నింపఁగాఁ జెలికత్తియలు వారలనడ్డగించిరి. అంతనయ్యూర్మిళాదులు వింజామరములచేతఁ దమతమభర్తలకు విసరిరి. ఈవిధముగ శ్రీరాముఁడు సీతామహాదేవిచేత నానావిధములగు కౌతుకములను జేయించె. అంతట నొక్కనాఁడు వసిష్ఠమహామునితో శ్రీరాముఁడిట్లనియె. ఓమునికులోత్తమా ! కుశలవుల కుపనయనకాలము సమీపించినది కనుక వ్రతబంధము చేయఁదగియున్నది. కావునఁదగిన సుముహూర్తమును నిర్ణయింపు మనియె. అంతట నొక్కనాఁడు వసిష్ఠమహాముని జ్యోతిష్కులనురప్పించి వారితోఁగూడ శ్రీరామునిసభయం దాలోచించె. అప్పుడెల్లవారును పంచాంగపట్టములను జూచి శ్రీరామునితో నిట్లనిరి. ఓరఘుకులోత్తమా ! బ్రాహ్మణున కెనిమిదవ సంవత్సరమునందును క్షత్త్రియునకుఁ బదిరెండవ సంవత్సరమునందును వైశ్యునకుఁ బదునాఱవసంవత్సరమునందును వ్రతబంధమును జేయవలయునని విధింపఁబడియున్నది. మఱియు నిట్లుకాదేని జననకాలాది నాఱవసంవత్సరమునం దైనఁగా గర్భాదిగ నేడవసంవత్సరమునందు క్షత్త్రియునకు వ్రతబంధమును చేయవచ్చును. బ్రహ్మవర్చసకాముఁడగు బ్రాహ్మణునకు నైదవ వర్షమునం దుపనయనమును చేయవలయును. కావున నోరఘుకులోత్తమా ! నీపుత్రులకు నేఁడాఱవ సంవత్సరమునందే యుపనయనమును చేయుము. సుముహూర్తమును విచారించి చెప్పెదము. వినుము. ఈదినమునకు పదునైదవ దినమునందు సుతుల కుపనయనమును చేయుటకుఁ దగినముహూర్తము కుదిరియున్నదనిరి. ఆవిషయమును శ్రీరాముఁడువిని ధనవస్త్రాద్యాభరణములచేత లక్ష్మణుఁడు పూజించునట్లుచేసె. అనంతరమందు లక్ష్మణుని పిలిచి శ్రీరాముఁడిట్లనియె. తమ్ముఁడా ! లక్ష్మణా ? రాజులు మిత్రులు మునీశ్వరులు మొదలగు వారినందఱ రప్పింపుము. మఱియు నెల్లవారిని దమతమ యంతఃపుర స్త్రీలతోడను బంధుమిత్ర పౌరజనాదులతోడను రప్పింపుము. మఱియు నయోధ్యాపట్టణమునం దంతటను నానావిధములగు నలంకారములను జేయింపుము. మఱియు నిటులనే శుభకార్యముల నన్నిటిని చేయింపవలయును. మఱియునోలక్ష్మణా ! మేడలయందంతటను చిత్రములను చేయింపవలయును. దేవాలయములయందంతటను సున్నముచేత నలంకారమును చేయింపవలయును. మఱియు నన్యస్థలములయందు నానావిధములగు చిత్రములను జేయింపవలయును. పతాకముల నంతటనుకట్టి ధ్వజములను పాతిపెట్టవలయును. మఱియునెల్లయెడలను తోరణములను బంధింపవలయును. సువర్ణముచేత వేదికలను వేయింపవలయును. ఏనుఁగులను శిబికలను నలంకరింపవలయును. మఱియు నిటులనే యేయేకార్యములు ముఖ్యముగఁ జేయింపఁదగియున్నవో యయ్యైకార్యములను జేయింపవలయుననియె. అట్లుశ్రీరాముఁడు చెప్పినవాక్యములను లక్ష్మ

ఇంతువిని సర్వకార్యములను నెరవేర్చె. అంతట సుముహూర్తదినమునందు శ్రీరాముఁడు పుత్రులు భార్య బంధువులు మిత్రులు మొదలగు వారితోఁగూడ నభ్యంగస్నానమునుచేసి నానావిధములగు నలంకారవస్త్రాదులనుధరించె. అనంతరము గురుఁడగు వసిష్ఠమహామునిని మునీశ్వరులనుబూజించి పుణ్యాహవాచనమును చేసె. పిమ్మట నాందీశ్రాద్ధాదికమును చేసి దేవతాప్రతిష్ఠను జేసె. అప్పుడు నానావిధములగు మంగళవాద్యములు మ్రోగె. అప్పుడు పెక్కువేలమంది రాజులును పెక్కువేలమంది ఋషులును వచ్చిరి. మఱియు నాసమయమునందు సప్తద్వీపవాసులందఱును నేగుదెంచిరి. అట్లు వచ్చినవారిచేత నయోధ్యాపట్టణమంతయును వ్యాప్తమై మిగుల మనోహరముగఁ బ్రకాశించె. అంతట నాముహూర్తదినమునందు వసిష్ఠమహాముని బ్రాహ్మణోత్తములతోఁగూడ రామకుశులయొక్క మధ్యయందు శ్రేష్ఠమగు పటమునుబెట్టి మిగుల మనోహరములయిన వేదస్వరములతో మంగళవాక్యములను పఠించె. పిమ్మట శ్రీగణనాయకుని ధ్యానముచేసి బ్రహ్మసరస్వతులను పార్వతీపరమేశ్వరులను లక్ష్మీనారాయణులను శచీపురందరులను బ్రార్థించి "శ్లో॥ తదేవలగ్నం సుదినం తదేవ తారాబలం చంద్రబలంతదేవ। విద్యాబలం దైవబలంతదేవ సీతాపతేర్యచ్చరణం విధేయమ్" అనుశ్లోకమును పఠించె. మఱియు నిటులనే నానావిధములగు మంగళశ్లోకములను పఠించి రామకుశుల మధ్యయందుండు పటమునుదీసివైచె. అనంతరమందు కుశుని శ్రీరాముని తొడయందుఁ గూర్చుండఁబెట్టి కౌపీన కమండలములను ధరింపఁజేసి పిమ్మట సువర్ణమౌంజీబంధమునుచేసి యుత్తరీయ చర్మమునుగూడ ధరింపఁజేసె. అనంతరమందు గురుఁడగు వసిష్ఠమహాముని యాకుశునకు గాయత్రీమంత్రము నుపదేశించె. పిమ్మట బ్రహ్మచర్యవ్రతాదుల నన్నిటిని బోధించె. మఱియును, శౌచాచమన దంతధావన జిహ్వావిశోధనముల విమోచనాది విధులను శాస్త్రోక్తప్రకారముగ బోధించె. పిమ్మట నాపోహిష్ఠామాది మంత్రములచేత స్నానమును చేయించి ప్రాణాయామముగూడఁ జేయించె. అనంతరమందు రెండు సంధ్యలయందును సూర్యోపస్థానమును చేయించె. అనంతరము నగ్నికార్యమును చేయించి బ్రాహ్మణనమస్కారమును చేయించె. మఱియు నమస్కారమును చేయునపుడు ఈ గోత్రము ఈనామధేయము కలవాఁడనగు నేను నమస్కరించుచున్నానని చెప్పవలయు ననియె. ఇట్లు సర్వమునుబోధించి యాకుశునిచేఁ జేయించి మరల నిట్లనియె. ఓ బాలకోత్తమా! శిష్యా! నింద్యములుగాని బ్రాహ్మణ గృహముల యందు భిక్షాన్నముకొఱకు ప్రవర్తించి యా యన్నముచేతనే బ్రహ్మచారియగు వాఁడు జీవింపవలయు ననియె. ఆపత్కాలములయందు శ్రాద్ధాన్నమును భుజించుటవలన దోషములేదనియె. మఱియును పగటియందు రెండుపర్యాయములు భుజింపఁగూడ దనియును, సాయంప్రాతఃకాలములయందు బ్రాహ్మణుఁ డగువాఁడు

అగ్న్యారాధనమును చేయవలసిన దనియును బోధించె. మఱియు నెల్లప్పుడును మధుమాంసములను వర్జింపవలయును. మఱియును, హింసాకృత్యములను జలమునందు సూర్యావలోకనమును చేయఁగూడదు. స్త్రీసాంగత్యమును విడువవలయును. పర్యుషితోచ్ఛిష్ట పరివాదములను విడిచిపెట్టవలయును. గమనాగమనములను చేయునప్పుడు చెవులను మూసికొనవలయును. తల్లి చెల్లెలు మొదలగు వారితోఁగూడ నేకాంతసంభాషణమును చేయఁగూడదు. ఇంద్రియములు మిగుల బలముకల వగుటచేత మోహమునుగలుగఁజేయును గనుక మాతృతాదులతోఁగూడ సంభాషింపఁగూడదని యెఱుఁగ వలయునని యె. మఱియు నీవిధముగ ననేకములగు బ్రహ్మచారి వ్రతములను దెలిపె. ఇట్లుపదేశించి యనేకములగు దానములను జేయించి తల్లితోఁగూడ భోజనమును జేయించె. మఱియు నాసమయమునందు నానావిధములగునుత్సవములను జేయించె. మఱియు నప్పుడందలి బ్రాహ్మణులందఱును ధనవస్త్రములచేతఁ దృప్తిని పొందిరి. అనంతరమందు శ్రీరాముఁడు రాజులచేతను జనకచక్రవర్తిచేతను పూజింపఁబడియె. మఱియు నాకాలమునందు శ్రీరాముఁడు చండాలజాతివఱకును కల సకల జాతులకును సంతోష తృప్తులను కలిగించె. ఈవిధముగ నానావిధములగు నుత్సవములతో నెలదినములను గడపి పిమ్మట బంధుమిత్రాదిసామంతరాజుల నందఱను తమతమ నివాసములకుఁబంపె. ఈవిధముగ శ్రీరాముఁడు కుశునకు ఉపనయనమును చేసిన యొక సంవత్సరకాలమైన పిమ్మట మరల రాజులనందఱ రప్పించి మిగిలిన బాలుర కందఱకును మునుపటివలె నుపనయనములను జేయించె. ఇట్లు శ్రీరాముఁడు పుత్రుల కందఱకును వ్రతబంధములను జేయించిన పిమ్మట నాబాలురందఱును బ్రహ్మచర్య వ్రతములను శాస్త్రోక్తప్రకారముగ నెఱవేర్చుచుండిరి. సీతారాము లిరువురును నాబాలకులచేతఁ జుట్టఁబడినవారై ప్రమథాదిగణములచేతఁ జుట్టఁబడిన పార్వతీ పరమేశ్వరులవలెఁ బ్రకాశించుచుండిరి. అనంతరమం దాబాలురందఱును మిగుల శ్రేష్ఠమగు నధ్యయనమునుచేసి గుర్వాజ్ఞనుపొంది గురుమంత్రులను వెంటఁబెట్టుకొని చతురంగబలముతోఁగూడ భూలోకమునందలి భరత ఖండమునందుఁగల తీర్థముల నన్నింటిని సేవించిరి. అట్లు సకల తీర్థములను సేవించి మైదుమాసములకు మరల నయోధ్యాపట్టణమునకు వచ్చిరి. అట్లు నిజనందనులు వచ్చిన వృత్తాంతమునువిని శ్రీరాముఁడు అయోధ్యాపట్టణమును సర్వమును నలంకరింపఁజేసె. అనంతరమందు లక్ష్మణుఁడు పట్టాభిషేక వేనుఁగును ముందు నిడుకొని పోయె. అంతట నాబాలురు లక్ష్మణునిజూచి పరమానందముతో సమీపమునకు వచ్చి నమస్కరించిరి. అప్పుడు లక్ష్మణుఁ డాబాలుర నందఱఁ గౌఁగిలించుకొని నానావిధములయిన యుత్సవములతో నాబాలుర పట్టణములోనికిఁ దీసికొనివచ్చిరి. అట్లు బాలకులు వచ్చునప్పుడు ప్రతిమార్గమునందును పురస్త్రీ లెదురుగవచ్చి నీరాజనముల నిచ్చిరి. అంతట నాబాలకులందఱును సభలోనికిఁబోయి శ్రీరామునకు

నమస్కరించిరి. అనంతరమందు సీతాగృహమునకుఁ బోయిరి. అట్లు బాలకులకు సీతాగృహమునకు వచ్చునంతలోపల సీతోర్మిళా మాండవీ శ్రుతకీర్తులు మిగుల వేగముగ ద్వారములోనికివచ్చి యాబాలకులకు నీరాజనమును చేసిరి. అనంతరమందు దధ్యోదనములు పక్వాన్నములు తైలపాకములు మొదలగు వానిచేత నాబాలురకు సంతోషమును గలిగించిరి. అనంతరమం దాబాలురు తల్లుల కాందఱకును నమస్కారములను జేసిరి. అట్లు తల్లులకు నమస్కరించుటకు ముందు పితామహుల కాందఱకును నమస్కరించిరి. అనంతరమం దాబాలు రనేకములగు దానములను జేసిరి. పిమ్మట బ్రాహ్మణులకుఁ దృప్తిగ నన్నదానమును జేసిరి. ఈవిధముగ శ్రీరాముని గృహమునందు నానావిధములగు నుత్సవములు జరుగుచుండెను. అనంతరమం దాబాలురు దివ్య స్యందనములనెక్కి యాపట్టణ వీథులయందంతటను విలాసముగఁ దిరుగుచుండిరి. మఱియును నగర సమీపమునందలి యారామములయందుఁ దిరుగుచుండిరి. వారు గమనాగమనములను చేయునపుడు చతురంగ బలములతోడను మంత్రిబాలకులతోడను చేయుచుండిరి. ఈవిధముగ నయోధ్యాపట్టణమునందు శ్రీరాముఁడు సీతామహాదేవి బాలకులు మంత్రులు మొదలగువారితోఁగూడ చిరకాలము క్రీడించుచుండెను. ఓ శిష్యోత్తమా! ఈవిధములుగ జన్మకాండమును సర్వమును నీకుఁజెప్పితిని. మఱియు నీ జన్మకాండమునందు కుశాదుల జన్మవృత్తాంతాదికమును సర్వమును దెలియఁజేసితిని. ఓశిష్యోత్తమా! ఈజన్మకాండము మిగుల రహస్యమును, పవిత్రమును, ఆనందదాయకమును, మనోహరమును, పుత్రపౌత్రదాయకమును నై యున్నది. మఱియు నోశిష్యోత్తమా! ఏమానవులు మిగులఁ బుణ్యకరమైన యీ జన్మకాండమును వినుదురో అట్టివారి కెన్నటికిని స్త్రీవియోగము కలుగనేరదు. ఈజన్మకాండమును వినునట్టిస్త్రీలు భర్తృవియోగదుఃఖము నెన్నటికిని ననుభవింపరు. దూరదేశమునకుఁ బోయినవారిని శీఘ్రముగవచ్చునట్లు కోరువారీ జన్మకాండమును శ్రద్ధాభక్తులతోఁ బఠింపవలయును. భావికార్యములనుకూలము కావలయునని యపేక్షించువారుకూడ నీ జన్మకాండమును భక్తితోఁ బఠింపవలయును. పూర్వదినమునం దొక్కపర్యాయమును పరదినమునందు రెండుపర్యాయములును పఠింపవలయును. మఱియు నీవిధముగఁ దొమ్మిదిదినములు పఠించిన యెడల సకలకార్యములును సిద్ధించును. ఒక్క సంవత్సరకాల మీ జన్మకాండమును భక్తితోఁ బఠించిన యెడల సంతానరహితులును సంతానవంతులగుదురు. మఱియు నోశిష్యోత్తమా! భక్తిశ్రద్ధలతో నీ జన్మకాండమును పఠించువారును వినువారును తమతమ యభీష్టములనన్నిటిని పొందుదురు. మఱియు నోశిష్యోత్తమా! ఆనందరామాయణ మధ్యగతమైన యీ జన్మకాండమును పఠించుటవలనఁ బుత్రాదిలాభములనుపొందుదురు. ఇట్లని యానందరామాయణాంతర్గత జన్మకాండమునందలి తొమ్మిదవసర్గ ముగిసెను. జన్మకాండము సంపూర్ణము.

శ్రీరస్తు.

శ్రీరామచంద్ర పరబ్రహ్మణే నమః.

ఆనందరామాయణము.

వివాహకాండము.

✷ శ్రీరాముఁడు పుత్రాదులతోఁగూడ స్వయంవరమునకుఁ బోవుట. ✷

అంతట నొక్కనాఁడు శ్రీరాముఁడు శ్రేష్ఠములయిన ఛత్రచామరాదులచేత నలంకరింపఁబడినవాఁడై మంత్రులు మొదలగు వారితోఁగూడ సభామధ్యమందుఁ గూర్చుండెను. అట్లు శ్రీరాముఁడు కొలువు దీరియుండఁగా శ్రీరాముని సమీపమున కొక్కదూత వచ్చెను. వచ్చి శ్రీరామునకు నమస్కరించి తనప్రభువుయొక్క వృత్తాంతమును సర్వమును దెలియఁజేయఁదలఁచి యిట్లనియె. ఓరఘుకులోత్తమా! పూర్వదేశాధిపతియును, భూరికీర్తియను నామధేయముకల రాజుచేత నీపాదపద్మములను జూచుటకుఁ బంపఁబడితిని. మఱియు నోరఘుకులోత్తమా! మారాజేంద్రుఁడు పత్రము నొక్కదానిని తమయొద్దకుఁ బంపియున్నాఁడు. కావున నీపత్రమునుజూచి చేయఁదగిన కార్యమును చేయుమని యాపత్రికను శ్రీరాముని చేతికిచ్చెను. ఆసమయమునందు లక్ష్మణుని ముందరనున్న రామదూత యాపత్రికను గైకొని శ్రీరామునకందిచ్చెను. అప్పుడు లక్ష్మణుఁడు ఆపత్రికను బయలునకుఁదీసి మధురస్వరముతో శ్రీరాముని ముందరఁ బఠించెను. ఆపత్రికయొక్క మొదటియందు హేమపుష్పములచేతను కుంకుమాదులచేతను నలంకరింపఁబడియుండుటచేతను శుభవర్తమానము పంపఁబడినదని తోఁచుచుండెను. అనంతరమందా లక్ష్మణుఁడు మెల్లమెల్లగఁ జదువుట కారంభించెను. శ్రీమంతుఁడగు శ్రీరాముఁడు దశకంఠుని శిరస్సును ఛేదించుటకొఱకు భూలోకమునం దవతరించెను. అట్టి శ్రీరాముని పాదపద్మములయందలి గంధము నాఘ్రాణించుటకు భూరికీర్తియను నేను అభిలషించుచున్నాఁడను. మఱియు నో రామచంద్రా! చంపిక సుమతియను నిరువురు మనుమరాండ్రు నాకుఁ గలిగియున్నారు. ఆయిరువురయొక్కయును స్వయంవరము కొఱకు ననేకులగు రాజులు వచ్చుచున్నారు. కావున నీవుకూడ బంధుమిత్ర మంత్రి పుత్రాదులతోఁగూడి స్వయంవరమునకు దయచేయుము. నాయందు దయనుంచుము. ఓ రఘుకులోత్తమా! నాప్రార్థనను వ్యర్థముగఁ జేయకుమని యాపత్రికలోనున్న విషయమును లక్ష్మణుఁడు చదువఁగావిని శ్రీరాముఁడు స్వస్థచిత్తుఁడయ్యె. అనంతరమందు గురుఁడగు వసిష్ఠమహామునితో నాలోచించి స్వయంవరమునకుఁ

బోవయత్నించె. పిమ్మట లక్ష్మణునితో సైన్యమును ప్రేరణ చేయుమని చెప్పి మఱియు నిట్లనియె. ఓ తమ్ముఁడా! లక్ష్మణా! రేపటిదినము మనము మంత్రిపుత్రమిత్రాదులతోఁగూడ బయలు వెడలి పోదము. భరతాదులతోఁగూడ నీవు స్త్రీ బాలవృద్ధాదులను వెంటఁబెట్టుకొని బయలుదేరుము. విజయుఁడు మనము వచ్చునంతవఱకును రాజ్యమును పాలించునట్లు చేసితిని. ఓ లక్ష్మణా! ఇప్పుడే పటమందిరములను బయలునకుఁ దీయింపుము, నానావిధులగు దూతలు బయలువెడలిపోయి మార్గమును చక్కఁజేయునట్లు నియమింపుము. స్త్రీలందఱును పుష్పక విమానము నెక్కి యంతరిక్షమార్గమునఁ బోవునట్లు చేయుమనియె. ఇవ్విధముగ శ్రీరాముఁడు చెప్పిన వాక్యములను విని లక్ష్మణుఁ డంగీకారమును పొంది శ్రీరామ వచనానుసారముగ సర్వమును నెరవేర్చె. అంతట మరుదినము ప్రాతఃకాలమునందు శ్రీరాముఁడు స్నానమునుచేసి నిత్యకృత్యములను నెరవేర్చి యగ్నులను పుష్పకవిమానమునందుఁ బెట్టె. అనంతరమందు మిత్రాదులతోఁగూడ భోజనమునుచేసి సీతామహాదేవిని బిలిచి ప్రయాణమునకు శీఘ్రముగ సిద్ధముగ నుండుమనియె. అంతట సీతామహాదేవి చెలికత్తియలు మొదలగు వారితోఁగూడ నానావిధాభరణములచేత నలంకరింపఁబడినదై దివ్య వస్త్రములను ధరించి పుష్పకవిమానము నధిష్ఠించె. అనంతరమందు శ్రీరాముఁడు శ్రేష్ఠమయిన ఛత్రముచేత నలంకరింపఁబడినవాఁడై యేనుఁగు నెక్కె. అట్లు గజారూఢుఁడై చామరాదులచేత సేవఁబడుచు సకలజనులకును ముదముగ బయలువెడలె. ఆరాముని యగ్రభాగమునందు వసిష్ఠమహాముని గజారూఢుఁడై బయలువెడలె. రామునకు పృష్ఠభాగమునందు లక్ష్మణుఁడు గజారూఢుఁడై బయలువెడలె. అనంతరమందు కుశాదిబాలురందఱును బయలు వెడలిపోయిరి. వారివెనుక భరతశత్రుఘ్నులు గజారూఢులై బయలు వెడలిపోయిరి. వారివెనుక మంత్రులు పురజనులు జానపదులు మొదలగువారు నానావిధ వాహనముల నధిష్ఠించి పయనమైరి. ఆసమయమునందు నాలుగుదంతములు కలదియును, నానావిధములయిన యాభరణములు గలదియును నగు గజశ్రేష్ఠమునందు శ్రీరాముఁడు మిగుల మనోహరుఁడై ప్రకాశించుచుండె. ఈవిధముగఁ బోవుచు శ్రీరాముఁడు మార్గమధ్యమునందు వందిమాగధాదులచేత స్తుతింపఁబడుచుండె. అట్లు శ్రీరాముఁడు పట్టణమునుండి బయలువెడలి పోవునపుడు పురస్త్రీలు శ్రీరాముఁడు మొదలగు వారిమీఁద పుష్పవర్షమును గురిపించిరి. మఱియు నాసమయమునందు నానావిధములగు నూతనవాద్యములు మ్రోగె. వారస్త్రీలు నృత్యములను సల్పిరి. నటాదులు మిగుల రమ్యములగు గీతాదులను పాడిరి. ఈవిధముగ శ్రీరాముఁడు మెల్లమెల్లగ నయోధ్యా పట్టణమునువదలి దశయోజనదూరమువఱకును ప్రథమదివసమునందు ప్రయాణమును చేసె. అట్లు పోవునపుడు మార్గమునందలి సేనానివేశములను జూచి శ్రీరాముఁ డానందమునుపొందె. అంతట శ్రీరాముఁడు గజమునుండి

దిగి పటమందిరమునందుఁ బ్రవేశించె. ఈవిధముగఁ శ్రీరాముఁడు మెల్లమెల్లగ ననేకదేశములను జూచుచుఁ బోవుచుండె. పిమ్మట శ్రీరాముఁడు గంగానదినిదాఁటి భూరికీర్తియను రాజోత్తముని దేశమునకుఁబోయె. అంతట భూరికీర్తి యొక్కదూత మిగులవేగముగ బయలు వెడలిపోయి శ్రీరాముఁడు బంధు మిత్రాదులతోఁగూడ స్వయంవరమునకు వచ్చియున్నాఁడని భూరికీర్తితోఁ దెలిపె. అప్పుడు భూరికీర్తియను రాజోత్తముఁడు శ్రీరాముఁడు బంధు మిత్రాదులతోఁగూడ వచ్చి యున్నాఁడని విని సంతసించి మిగుల వేగముతో శ్రీరామున కెదురుగవచ్చె. మఱియు నాసమయమునందా భూరికీర్తి తనపట్టణమును సర్వమును నానావిధములుగ నలంకరించె. మఱియును పట్టణమునందంతటను పతాకాధ్వజతోరణముల నెత్తించె. మఱియు నప్పుడు భూరికీర్తి గజేంద్రమును ముందుపెట్టుకొని యనేక రాజులతోఁ గూడ వచ్చె. మఱియు నదివఱకే స్వయంవరమునకు వచ్చిన రాజులందఱును విషణ్ణాస్యులును వ్యాకులచిత్తులును నైరి. కావున నారాజు లందఱును తమమనస్సునం దిట్లని యాలోచించిరి. శ్రీరాముని బాలకులను మాత్రము విడిచిపెట్టి మనల నీకన్యక వరింపదని యాలోచించి చేయఁదగిన కార్యమేదియును లేకపోవుటచేత సంతోషముకలవారివలె శ్రీరామున కెదురుగఁ బోయిరి. అట్లు బయలువెడలిపోయి దూరమునుండి వచ్చుచున్న శ్రీరాముని సైన్యముతోఁ గూడఁ జూచిరి. పిమ్మట వారందఱును శ్రీరామునకు నమస్కరించి యనేక విధములగు కానుకలను సమర్పించిరి. అనంతరము వారందఱును శ్రీరామునిచేత నాలింగనము చేసికొనఁబడి యాతని సమీపమునందు నిలిచిరి. పిమ్మట భూరికీర్తియను రాజోత్తముఁడు తనపుత్రులతోఁగూడ శ్రీరామునకు నమస్కరించి వస్త్రాభరణ వాహనాదులచేత రామాదులను బూజించె. అట్లుపూజించి యారామాదులను నగరములోనికిఁ దోడ్కొనిపోయె. అట్లు శ్రీరామాదులు నగరమునందుఁ బ్రవేశించునప్పుడు వారస్త్రీలు నృత్యములను చేయుచుండిరి. నానావిధములయిన వాద్యములు మ్రోగుచుండె. వందిమాగధాదులు స్తోత్రమును చేయుచుండిరి. ఆసమయమునందు శ్రీరాముఁడు వచ్చుచుండుటనువిని పురస్త్రీలందఱును తమతమ కార్యములను వదలి శ్రీరాముని చూచుటకు మేడల పైభాగములకుఁ బోయిరి. అట్లు మిగుల వేగముతో శ్రీరాముని చూచుటకు వచ్చునప్పుడు ఒకానొకతె రోదనమును చేయుచున్న బాలకుని మంచమునందు విడిచిపెట్టియే వచ్చె. మఱియొకతె భర్తకుఁ దాంబూలమునిచ్చుచు నా తాంబూలపేటికతోఁ గూడ నేఁగుదెంచె. మఱియొక్కతె భోజనమును విడిచి యేపరుగిడివచ్చె. ఇంకొక్కతె పాకమును చేయుచు విడిచిపెట్టి యేఁగుదెంచె. వేఱొకతె తెక్కొప్పును బెట్టుకొనుచు నేఁగుదెంచె. మఱియొక్కతె భర్తచేత నాలింగనము చేసికొనఁబడి యుండియును విడిపించుకొని పరుగిడివచ్చె. మఱియొకతె పాదములను కడిగికొనుచు నొక్కపాదమును గడిగికొనకయే పరుగిడిపోయె. మఱియొకతె భర్తచేత చుంబన

ముచేయుచుండుచు భర్తయొక్క ముఖము నావలికిబెట్టి పరుగిడివచ్చె. మఱియొక్క తె కాటుకను బెట్టికొనుచు నేగుదెంచె. మఱియొక తె యభ్యంగనమును చేసికొనుచునే బయలు వెడలివచ్చె. ఇంకొక్క తె యొకచేతికిమాత్రము కంచుకమును దొడిగికొని వేగముగ నేగుదెంచె. మఱియొక్క తె యొక్క పాదమునకు మాత్రమే నూపురమును బెట్టికొని పరుగిడిపోయె. మఱియొక తె తనభర్తతో శుభవార్తను జెప్పుచు రాముఁడు వచ్చుచున్నాఁడని విని యతివేగముగఁ బరుగిడిపోయె. మఱియొక తె తనభర్తకన్నమును వడ్డించుచునే బయలుదేరిపోయె. మఱియొక తె స్నానమునుచేసి దివ్యవస్త్రమును ధరించుచునేపోయె. మఱియొక్క తె కూపమునుండి నీళ్ళనుబయలునకుఁదీయుచు నాఘటము నక్కడనే విడిచిపెట్టి బయలువెడలిపోయె. మఱియొక తె రహస్యస్థలమునందుఁ గూర్చుండి బాలునకుఁ బాలిచ్చుచుండి యాబాలునితోఁ గూడ బయలువెడలిపోయె. మఱియొక తె వస్త్రమును ధరించుచు కచ్ఛముచేతఁ బట్టుకొని బయలువెడలిపోయె. ఈవిధముగ పురస్త్రీలందఱును నానావిధములగు కార్యములను జేయుచుఁ దమతమ కార్యములను ముగింపకయే పరుగిడిపోయిరి. పోయి యేనుఁగుమీఁదనున్న శ్రీరాముని జూచి యాతనిపై పుష్పవర్షములను గురిపించిరి. మఱియు నా స్త్రీలందఱును దమలోఁ దాము ఈరామునికనుటచేత కౌసల్య ధన్యురాలయ్యెననిరి. మఱికొందఱుస్త్రీలు శ్రీరాముని భర్తనుగాఁ గైకొనుటచేత సీతామహాదేవి ధన్యురాలయ్యెననిరి. మఱికొందఱు సీతామహాదేవి దుష్కరమైన తపస్సునుజేయుటచేత తనయుదరమును రామునకు పానయోగ్యమైన దానినిగాఁజేసికొనెననిరి. మఱికొందఱు మనమీభూలోకమునందు మందభాగ్యము కలవారమైతిమనిరి. ఆహా! మనము సీతామహాదేవికి దాసులమయినను గాకపోతిమనియును, అట్లయినయెడల సీతారాములకుఁ బరిచర్యను చేయువారమగుదుము కదాయనియును, కొందఱుస్త్రీలు తలఁచిరి. ఇట్లు నానావిధములుగ మాటలాడుచుండఁగ శ్రీరాముఁడా మాటలను వినుచు రాజమార్గముచేత భూకీర్తి కల్పించిన మందిరమునకుఁబోయె. అట్లుపోయి యేనుఁగునుడిగి మిగుల శ్రేష్ఠమగు మందిరమునందుఁ బ్రవేశించె. అట్లుప్రవేశించి బాలకులు సీతామహాదేవిమొదలగువారితోఁగూడ సుఖముగనుండె.

ఇట్లని యానందరామాయణమునందలి వివాహకాండమునందు
మొదటిసర్గ ముగిసెను.

✱ చాపికాస్వయంవర వర్ణనము. ✱

అంతట గురుఁడగు రామదాసు మరల నిట్లనియె. శిష్యోత్తముఁడవైన ఓ విష్ణుదాసా! అంతట మరుదినమునందు భూకీర్తియను రాజోత్తముఁడు శ్రీరాముని దగ్గఱకువచ్చి నమస్కరించి సభలోనికిరమ్మని ప్రార్థింపఁగా శ్రీరాముఁ

డుదుల కంగీకారమునుపొందె. అనంతరమందు సువర్ణభూషణములచేత భూషితులును, సరిగచే నేయఁబడిన కవచోష్ణీషములను ధరించినవారును, కటిప్రదేశములయందుఁ గట్టఁబడిన యుత్తరీయములు కలవారును, ఖడ్గధారులును నగు బాలకులతోఁగూడ శ్రీరాముఁడు శిబికారూఢుఁడై సభలోనికిఁబోయె. అప్పుడు శ్రీరాముఁడు వచ్చుచున్నాఁడను వృత్తాంతమును సభలోనివారందఱును విని దిగ్గనలేచి శ్రీరామున కెదురుగఁబోయి నమస్కరించిరి. మఱియు నారాజులందఱును తమతమ నామధేయములను శ్రీరామునకుఁ దెలిపిరి. ఆసమయమునందు చిత్రములగు శిరోవస్త్రములను ధరించియున్న రామదూతలు ఆసభలోని రాజుల నామధేయములను వేఱువేఱుగఁ జెప్పఁదలఁచి యిట్లనిరి. ఓరఘుకులోత్తమా! కర్ణాట దేశాధిపతియును, రాజరాజను బిరుదనామము కలవాఁడును, అయిన విజయుఁడను భూపాలుఁడు నీకు నమస్కారమును చేయుచున్నాఁడు చూడుము. ఓరామచంద్రా! శ్రీమంతుఁడును, ద్రవిడదేశాధిపతియును, అగుకంబుకంఠుఁడను రాజోత్తముఁడు నమస్కరించుచున్నాఁడు చూడుము. మఱియునో రఘుకులోత్తమా! విదర్భదేశాధిపతియగు దీననాథుఁడును, అంగనాథుఁడును, నమస్కరించుచున్నారు చూడుము. ఓరామచంద్రా! మగధదేశాధిపతియగు పరంతపుఁడు నమస్కరించుచున్నాఁడు. మఱియు నోరఘురామా! ప్రతాపవంతుఁడును, అవంతిదేశాధిపతియును, అగుసీతాకాంతమహారాజు నమస్కరించుచున్నాఁడు చూడుము. మఱియు నోరామా! ఉగ్రబాహుఁడను రాజోత్తముని నమస్కారమును గైకొనుము. ఓరఘువీరా! హైహయపట్టణాధిపతియగు ప్రతాపుఁడను రాజేన్ద్రుఁడు నమస్కారమును చేయుటనుజూడుము. మఱియు నోరామా! శూరసేన సుషేణులచేతఁ జేయఁబడు నమస్కారములను గైకొనుము. ఓరఘుకులోత్తమా! హరిద్వారమునందున్న కోసలేంద్రుఁడు నమస్కారములను చేయుచున్నాఁడు చూడుము. ఓరామచంద్రా! నీపాస్వయోద్భవుఁడగు యజ్ఞకీర్తియను రాజోత్తముఁడు నమస్కారమును చేయుచున్నాఁడు చూడుము. ఓరామరాజా! కలింగ దేశాధిపతి చేయునమస్కారములను గైకొనుము. ఓరామచంద్రా! సముద్రతటమునందలి హేమాంగద భూపాలుఁడునమస్కారములను చేయుచున్నాఁడు చూడుము. ఓరఘుకులోత్తమా! నాగపట్టణ నివాసియును, మతిమంతుఁడును నగుపాండ్యమహారాజు నీకు నమస్కారమును చేయుచున్నాఁడు చూడుమని సకల రాజుల నామధేయములను రామదూతలు వేఱుగఁదెల్పి వారి నమస్కారములను గూడఁదెలిపిరి. అంతట శ్రీరాముఁడు వీక్షణాదులచేత వారివారినమస్కారములను గైకొని బంధుమిత్ర పుత్రామాత్యాదులతోఁగూడ సభయందుఁ బ్రవేశించి యారాముఁడు ఛత్రచామరాది చిహ్నితుఁడై సభలోని పశ్చిమ భాగమునందున్న సింహాసనము మీఁద ప్రాఙ్ముఖముగఁ గూర్చుండె. అట్లుకూర్చున్న శ్రీరామునకు సవ్యభాగమునందు లక్ష్మణ భరతశత్రుఘ్నులు కూ

ర్చుండిరి. మఱియు నప్పుడు శ్రీరామునకు వామభాగమునందు కుశాదులును మంత్రిబాలకులును గూర్చుండిరి. శత్రుఘ్నునకు సవ్యభాగమునందు సుమంత్రాది మంత్రివరులు గూర్చుండిరి. సభయందలి యుత్తరభాగమునందును యామ్యభాగమునందును సకల రాజులును గూర్చుండిరి. ఇవ్విధముగ నెల్లవారును బంతులు దీర్చి కూర్చుండిరి. ఆసమయమునందు వారస్త్రీలు పశ్చిమాభిముఖముగ నిలిచి నృత్యగానాభినయనములను సలిపిరి. బ్రాహ్మణాదులా సమయమునం దట్టాలకములయందు నిలిచి యామహోత్సవమును చూచుచుండిరి. అనంతరమందు వాద్యములు మ్రోగుచుండగను, వారస్త్రీలు నృత్యములను చేయుచుండగను, మాగధాదులు గానము చేయుచుండగను, వందులు స్తోత్రము చేయుచుండగను, దివ్యవస్త్రములను ధరించిన వారును, దివ్యాలంకార భూషితులును, నవరత్నములచేతఁ గూర్పఁబడిన మాలికలను ధరించినవారును, అగు నారాజకన్యక లేగుదెంచిరి. ఆసమయమునం దాకన్యల నేత్రకటాక్షములచేత సభలోని రాజులందఱును భిన్నమైన మర్మస్థలములు కలవారైరి. మఱియు నాసమయమునందు రాజులందఱును మన్మథబాణములచేతఁ బీడింపఁబడిరి. మఱియు నారాజులందఱు నాసమయమునందుఁ గొంచెమైనను సుఖము లేనివారైరి. అప్పుడు చంపికయను కన్యకారత్న మాగ్నేయదిక్కునుండి సభయందుఁ బ్రవేశించె. సుమతియనునది యీశాన్య దిగ్భాగమునుండి సభయందుఁ బ్రవేశించె. అనంతరమున సుపమాత యష్టికను (పూలమాలికలను) వేత్రమును చేతఁబట్టుకొని సభయందుఁ బ్రవేశించి చంపికయను కన్యారత్నమునకు దక్షిణభాగము మొదలుకొని యున్నరాజుల నామధేయములను వేఱువేఱుగఁ జెప్పుచుండె. సునందయను నుపమాత సుమతియను కన్యకకు సభయందలి యుత్తరపువైపుననున్న రాజుల వర్ణరూప పరాక్రమాదులను వెలియఁజేసె. అట్లు చెప్పుచు నాయుపమాత చంపికయను కన్యకారత్నముతో నిట్లనియె. ఓచంపికా! నావచనమును వినుము. మన్మథునితో సమానుఁడైన యీరాజును వర్ణించెదను, వినుము. ఈరాజేంద్రుఁడు పాండ్యుఁడను నామధేయము కలవాఁడు. మిగుల బుద్ధిమంతుఁడు. నాగపత్తనమునందు నివసించుచున్నాఁడు. అధికశూరుఁడు, రాజులలో నుత్తముఁడు, రాజులను పాలించుటయందు మిగుల నాసక్తికలవాఁడు. కావున నిమనసున కిష్టమైనయెడల నీ రాజోత్తముని వరింపుము. నీవు వరించి యీరాజునకు పట్టపుదేవివై నాగపట్టణమునందు నివసించి మిగుల శ్రేష్ఠములగు మేడలయందు నితనితోఁ గూడ విహరింపుమనిన విని యాచంపికయను కన్యకారత్నము నందచెప్పిన వాక్యములయందు లక్ష్యమునుంచక యానందను ముందు పదమనియె. అంతట నానందయనునది యాచంపికను మఱియొక రాజుదగ్గరకుఁ దోడ్కొనిపోయి యిట్లనియె. ఓబాలికా! ఈరాజు కలింగదేశాధిపతి. హేమాంగదుఁడనునామధేయముకలమహానుభావుఁడు. ఈ రాజేన్ద్రుఁడు పెక్కువేల గజ

ములు కలవాఁడు. ఆగజములన్నియును నానావిధములగు ముక్తామాలికలచేత నలంకరింపఁబడినవి. నీ వీరాజోత్తమునకు పట్టపుదేవివై గవాక్షములనుండి సముద్రమును చూచుచుఁ గ్రీడనాదికమును చేయుము. ఈతనివరించి యితని స్త్రీలనను ముఖ్యురాలవగు మనియె. ఇవ్విధముగ నంద చెప్పినవాక్యములను విని యాహేమాంగదుని వరింపక మఱియొకనియొద్దకుఁ బొమ్మనియె. ఆసమయమునందు ఆనంద తనవాక్యములనుండు పలువురు స్త్రీలు కలవారనుటచేత చంపికయను కన్యకారత్నము సవతులు కలచోట నుండఁగూడదను తలంపుకలదై మఱియొక రాజుదగ్గరకుఁ బొమ్మనియె. అందువలన నందయనునది మఱియొక రాజుదగ్గరకుఁ బోయి యిట్లనియె. ఓ ముద్దురాలా! హరిద్వారమునందు నివసించునట్టి యీ రాజును జూడుము. ఈరాజేంద్రుఁడు సముద్రమునందు చంద్రుఁడు పుట్టిన విధముగ నీపాన్వయమునందుఁ బుట్టినవాఁడు. ఈరాజేంద్రుఁ డనేకములయిన యజ్ఞములను జేయుటచేత యజ్ఞకీర్తియను నామధేయము కలవాఁడయ్యె. ఓకన్యకామణీ! నానావిధములగు సువర్ణభూషణములచేత నలంకరింపఁబడియున్నవాఁడు. కావున నీతని వరింపుము. ఇతనికి పట్టపుదేవివై గంగానదియందలి యలల సముదాయమునందు సంచరించునట్టి యోడలయందుఁ దిరుగుచు నానావిధములగు సుఖముల ననుభవింపుము. నీ వితనిభార్యలలో నొకతె వగుమనియె. ఈవిధముగ నందయనునది చెప్పిన మాటలను విని తానుభార్యలలో నొకతె మాత్రమగుదునేకాని శ్రేష్ఠురాలుకాదు కనుక నాతని పరిగ్రహించుటయందిష్టము లేనిదై మఱియొక రాజుదగ్గరకుఁ బొమ్మనియె. అంతట నానందయనునది చంపికను మఱియొకరాజుదగ్గరకుపోయి యిట్లనియె. ఓబాలికా! ఈరాజేంద్రుని నామము ఇతఁడు శూరసేనదేశమును పరిపాలించునట్టి సుషేణుఁడను రాజశ్రేష్ఠుఁడు. ఈరాజేంద్రుని కనేకములగు గుణములు కలవు. ఈతనికి మిగులఁ జక్కని వారగు వారస్త్రీలనేకులు గలరు. ఇతనిముంగిటియం దనేకులగు రాజులు కలరు. ఈతనినామము సోమమును పోలియున్నది. కావున నీవితనికి పట్టపుదేవివై జన్మమును సఫలముగా దానినిగాఁ జేసికొనుమనియె. అట్లునందయనునది చెప్పినవాక్యములలో సుషేణుఁడు వేశ్యాస్త్రీలంపటుఁ డని చెప్పఁబడియుండుటచేత నతనినివరింపక మఱియొక రాజుదగ్గరకుఁ బొమ్మనియె. అంతట నానందయనునది శిబికయందున్న యాచంపికను మఱియొక్కరాజు నొద్దకుఁదీసికొనిపోయి యిట్లనియె. ఓకన్యారత్నమా! హైహయపట్టణాధిపతియును, కార్తవీర్యార్జునుని వంశమునందుఁ బుట్టినవాఁడును, పద్మములవంటి నేత్రములు కలవాఁడును, ప్రభుఁడను నామధేయము కలవాఁడును, అగునీ రాజేంద్రుని జూడుము. ఇతఁడు మిగుల శూరుఁడు. మహారథుఁడు. సువర్ణచ్ఛాయ కలనీవు రేవానదియందీతనితోఁ గూడ నానావిధములగు జలక్రీడలను జేయుమనియె. ఈవిధముగ నందయనునది చెప్పిన వాక్యములను విని నందావచనములయందు మహారథుఁడు కాఁడని తోఁచుచుండుట

చేత నాతని వరింపక మఱియొక రాజునొద్దకుఁ బొమ్మనియె. ఈవిధముగ ననేక
లగు రాజుల వృత్తాంతములను విని యావృత్తాంతము లన్నియును నిషేధవాక్యము
లగుటచేత శ్రీరాముని మంత్రులగు సుమంత్రాదుల నందఱ నతిక్రమించి భరతా
నుజుని దగ్గరకుఁ బోయె. అప్పుడు ఆనందయనునది యిట్లనియె. ఓబాలికా ! కోసలేం
ద్రుఁడగు రామునకు బంధువును, ఏకోదరోపముఁడును, అయోధ్యాపట్టణ నివాసి
యును, శ్రీరాముని వాక్యాను సారముగఁ బ్రవర్తించు వాఁడును అగు నీరాజేంద్రుని
వరించి శ్రుతకీర్తియగు సంగనామణికిఁ జెలియలివగుమనియె. అట్లు చెప్పిన వాక్య
ములను విని యాచంపిక శత్రుఘ్నునియం దిష్టము లేనిదై ముందు పదమనిన నానం
ద భరతునిదగ్గరకుఁ దీసికొనిపోయి యిట్లనియె. ఓచంపికా ! శత్రుఘ్నున కగ్రజుఁ
డును, కైకేయికిఁ బుత్రుఁడును, శ్రీరాముని సేవించుటయందు మిగుల నాసక్తికల
వాఁడును, శాంతుఁడును, వయోవంతుఁడును, దయితాప్రియుఁడును, అగు నీ
భరతుని భర్తనుగాఁ గైకొని మాండవియును నాగనామణితోఁ గూడ సరయూన
దియందు నానావిధములగు జలక్రీడలను సలుపుచు సుఖింపుమనియె. అంతట నతని
యందుఁగూడ నాకన్యక కభిరుచి లేకపోవుటచేత నందయనునది లక్ష్మణుని దగ్గర
కుఁదీసికొనిపోయి లక్ష్మణుని సుగుణాదులను జెప్పఁదలఁచి యిట్లనియె. ఓచంపికా !
సుమిత్రాగర్భోద్భవుఁడును, అయోధ్యాపట్టణ నివాసియును, రాముని సేవించు వాఁ
డును, మిగుల మనోహరుఁడును, ఇంద్రజిత్తను వానిని సంహరించిన వాఁడును, శే
షాంశసంభవుఁడును, మహావీరుఁడును, అయిన యీలక్ష్మణునివరించి యూర్మిళ
యను నాగనామణితోఁ గూడ నోడయందుఁ గూర్చుండి యనేక విధములగు క్రీడ
లను సలుపుమనియె. అప్పుడు నందావచనములయందు శత్రుఘ్నాదులు భార్యాస
హితులని చెప్పఁబడి యుండుటచేత నక్కన్నియవారల వరింపక ముందుపద మనియె.
అంతట నానందయనునది శ్రీరాముని దగ్గరకుఁ గొనిపోయి యిట్లనియె. ఓచం
పికా ! ఈరాజేంద్రుఁడు దేవోత్తముఁడు, ఈమహానుభావుని స్తోత్రము సేయునంతటి
భాగ్యము కలుగుటచేత నేను ధన్యురాలనైతిని, మందబుద్ధి కలదానను, ఆఁడుదా
నను, అయిన నేను శ్రీరామునిగుణములనేమని వర్ణింపఁ గలను, శ్రీరామునిగుణ
ములను చెప్పుటకు వాల్మీకిమునివరుఁడుకూడ సమర్థుఁడు కాకపోయె. వాల్మీకిముని
వరుఁ డీరామునిచరిత్రమును నూఱుకోట్ల గ్రంథమును గా రచించె. కౌసల్యా తనయుఁ
డగు నీరామప్రభువు సాక్షాన్నారాయణుఁడు. మఱియు నీరాముఁడు విశ్వామిత్ర
యాగ సంరక్షణమును చేయుటకుఁ దాటక యనుదానిని వధించిన వీరోత్తముఁడు.
అహల్యాశాపమును బోఁగొట్టి శివకోదండమును విరిచి సీతామహాదేవిని గైకొనిన
పురుషోత్తముఁడు, సకలక్షత్రియసంహారకుఁడగు పరశురాముని జయించిన శూ
రోత్తముఁడు. పితృవాక్యమును పరిపాలించుటకొఱకు సీతాలక్ష్మణులతోఁగూడ
నరణ్యమునకుఁబోయిన పుణ్యపురుషుఁడు. మఱియు నీరాముఁడు విరాధుని మర్దిం

చెను. ఖరదూషణాదులను వధించెను. మఱియును, త్రిశిరుఁడు, కబంధుఁడు వాలి, మొదలగువారిని సంహరించెను. సముద్రమును బంధించి రాక్షసకులనాశమును జేసె. మఱియు నీరాముఁడు రావణుని సంహరించె. పిమ్మట ననేకములగు తీర్థయాత్రలను సేవించి సీతతోఁగూడ నానావిధములగు క్రీడలను సలిపె. మఱియు నీ రాముఁడు లోకారాధనముకొఱకు సీతామహాదేవిని త్యజించి యనంతరమందు లోకానుమతముచేత పరిగ్రహించె. యజ్ఞాశ్వముకొఱకు పుత్రులగు కుశలవుల తో ఘోరమైన యుద్ధమును చేసినవాఁడు. మఱియు నీరాముఁడు ఏకపత్నీవ్రతము నవలంబించినవాఁడు. ఇంతియగాక సత్యమునుదప్పక మాటలాడువాఁడు. ఎట్టికార్యమునం దైనను రెండవపర్యాయము బాణమును ప్రయోగించువాఁడుగాఁడు. హనుమంతుఁడే ధ్వజముగాఁ గలవాఁడు. మఱియు నీరాముఁడు కోవిదార ధ్వజుఁడనియును, బాణధ్వజుఁడనియును, వజ్రధ్వజుఁడనియును, గరుడధ్వజుఁడనియును, పుష్పకారూఢుఁడనియును, సకలరాజచూడామణి యనియును, వరసింహాసనారూఢుఁడనియును, ఛత్రచామరభూషితుఁడనియును, చెప్పఁబడును. కావున నీరాముని వరించి సీతతోఁగూడ సేవింపుము. ఓకన్యకా! ఈరాముఁడు నవవర్షేశ్వరుఁడు. సప్తద్వీపములకును నధిపతి కావున నీరామునికంఠమునందు నవరత్నమాలిక నుంచుమనియె.

ఇట్లు చెప్పిన సంభావచనములను వినియును చంపిక యనునది స్వల్ప పుణ్యము కలదియగుటచేత రాముని వరించుటయం దిష్టములేనిదయ్యె. మఱియు నప్పుడు శ్రీరాము డేకపత్నీవ్రతస్థుఁడనుటచేత వరించుట తగదను తలంపు కలదయ్యె. అంతట మఱియొకనిరియుద్ధసుఁ బొమ్మనియె. పిమ్మట నానంద కుశుని దగ్గఱకుఁబోయి యాతనిగుణాదులను వర్ణింపఁదలఁచి యిట్లనియె. ఓచంపికా! అల్పవయస్సు కలవాఁడును, శ్రీరామునకు పుత్రుఁడును, అయిన యీ బాలుని చూడుము. ఈతఁడు జానకీగర్భమునందుఁ బుట్టినవాఁడు, ఈ బాలుఁడు భార్యను గోరుచున్నవాఁడు, ఇతఁడు లవాగ్రజుఁడు, ధనుర్వేదనిపుణుఁడు, మిగుల వినయముగలవాఁడును, తండ్రితోఁగూడ యుద్ధమునకు కర్త, వాల్మీకిమునివరునిచేతఁ జక్కఁగ శిక్షింపఁబడినవాఁడు, దేవ మానవులచేతఁ గొనియాడఁబడునట్టి యీబాలునివరియించి యీ నవరత్నమాల నితని కంఠమునందుంచు మనినవిని యాచంపిక చిరునగవు కలదగుచుఁ దనహస్తములచేత నానవరత్నమాలికను కుశునికంఠమునందు వైచె. ఆసమయమునందు నానావిధములగు వాద్యములు మ్రోగె. వందిమాగధులు స్తోత్రముచేసిరి. అప్పుడు కుశుఁడు లజ్జచేత తలవంచుకొనియె. మఱియు నాసమయమునందు భూరికీర్తి యధికముగ సంతోషమునుపొంది నిజపుత్రికయగు చంపికను కుశునితొడయందుఁ గూర్చుండఁబెట్టె. అప్పుడు సీతామహాదేవి మేదయుం

ముండి గవాక్షములనుండి చూచి యధికానందమును పొందె. శ్రీరాముఁడుగూడ మహానందమును బొందె.

ఇట్లని శతకోటిరామాయణాంతర్గత వివాహకాండమునందలి చంపికా స్వయంవరవర్ణనమనియెడు రెండవసర్గ ముగిసెను.

✷ సుమతీస్వయంవర వర్ణనము ✷

అంతట రామదాసు తనశిష్యుఁడగు విష్ణుదాసుతో నిట్లనియె. ఓవిష్ణుదాసా! శిష్యోత్తమా! అట నుత్తరభాగమునుండి సభయందుఁ బ్రవేశించిన సుమతియను కన్యకారత్నము సునందయను నుపమాతతోఁ గూడ సభయందు నుత్తరభాగమున నున్నరాజులను చూచుచు వారివారి పరాక్రమాది గుణములనువినియె. ఆవిధమును గూడ సర్వమును వివరించి చెప్పెదను. వినుము. అంతట సునందయను కన్యకారత్నముతో నిట్లనియె. ఓబాలా! నావాక్యమును విని యీరాజేన్ద్రుని జూడుము. ఈరాజేన్ద్రుఁడు అవంతిదేశాధిపతి, ఉగ్రబాహు నామధేయము గలవాఁడు. ఈరాజేన్ద్రునితో సమానుఁడు భూలోకమునం దెవ్వఁడును లేడు. కావున వీనిని వరింపుము. వీని నతిక్రమింపకుము. ఇతనికి పట్టపుదేవివై యితనితోఁ గూడ పటకుటీరముల యందుండి నానావిధములగు క్రీడలను సలుపుమనియె. అట్లు చెప్పిన వాక్యములను వినియును నతనిని వరింపక మఱియొక్కని గుణాదులను దెలుపుమనియె. అంతట నాసునంద వేఱొకరాజు దగ్గరకుఁ దీసికొనిపోయి యిట్లనియె. ఓసుమతీ! ఈరాజేన్ద్రుని చూడుము. ఇతఁడు విదర్భ దేశాధిపతి, అంగనాథుఁడను నామధేయము కలవాఁడు. సర్వోత్తముఁడు, కావున వీనిని వరింపుము, సుశ్రీసోముఁడు, స్వల్పమైన వయస్సుకలవాఁడు, కేయూరాది భూషణములచేత నలంకరింపఁ బడినవాఁడు, ఇతనికి భార్యవై పయోష్ణియనునదియందుఁ గ్రీడించుచుండుము. వీని నతిక్రమించుట యుచితముకాదనినవిని యాసుమతి సమ్మతింపక మఱియొకని దగ్గరకుఁబొమ్మనియె. అంతట నాసునందయనునది మరల నిట్లనియె. ఓసుమతీ! ఈరాజేన్ద్రుని చూడుము. ఈరాజోత్తముఁడు మగధదేశాధిపతి యైయున్నవాఁడు, ఇతఁడు పరంతపుఁడను నామధేయముకలవాఁడు. అధికముగ శ్రీమంతుఁడని ప్రసిద్ధినొందినవాఁడు. నీవితనికి పట్టపుదేవివై తత్పుష్కరముచేత నిండిన బ్రహ్మతీర్థమునందు జలక్రీడల నాచరింపుమనియె. అట్లు సునందచెప్పిన వాక్యములను వినియును నతనిని వరింపక మఱియొకని దగ్గరకుఁ బొమ్మనినవిని సునంద మరియొక్కని దగ్గరకుఁబోయి యిట్లనియె. ఓసునందా! ద్రవిడదేశమును పరిపాలించునట్టి యీరాజేన్ద్రుని చూడుము. ఇతఁడు కంబుకంఠుఁడను నామధేయముకలవాఁడు, కాంతియను పట్టణమునందుని వసించువాఁడు, ఈరాజేన్ద్రునకు పట్టపుదేవివై కాంతిపట్టణము నందలి మనోహరమగు సర్వతీర్థమునందు జలక్రీడాదులను చేయుము. మఱియు నాపట్టణము నందలి

వరదరాజేశ్వరుని ఏకాంబరేశ్వరుని సేవించుచుండుము. మఱియు నీకంబుగ్రీవుని తోఁగూడ వరదరాజేశ్వరైకాంబరేశ్వరులను భజింపుమనియె. ఆవచనములను విని యును నాసుమతి యంగీకారమును పొందక మఱియొక్కని దగ్గరకుఁ బొమ్మనియె. అంతట నాసునంద మఱియొకనివద్దకుఁ బోయి యిట్లనియె. ఓకన్యకామణీ! కర్ణాట దేశాధిపతియును విజయుఁడను నామధేయము కలవాఁడునునగు రాజోత్తముని చూడుము. మఱియునీరాజేంద్రుఁడు పద్మమువంటి మోముకలవాఁడు. ఇతనికి పట్టపుదేవివై కృష్ణానదీ జలమునందు సుఖముగ విహరింపుము. నావాక్యము నంగీకరింపు మనినవిని యాసుమతి యంగీకారము లేనిదై మఱియొక్కని దగ్గరకుఁ బొమ్మనియె. మఱి యు నీవిధముగ నాసుమతిచేతఁ జెప్పఁబడిన స్తుతిరూప నిషేధవాక్యములనువిని రాజులనందఱ నతిక్రమించె. ఈవిధముగ సకలరాజులను నతిక్రమించె. ఈవి ధముగ సకల రాజులను నతిక్రమించిన పిమ్మట యూపకేతువను రాజపుత్రు ని సమీపమునకుఁ బోగానే యాసునంద యిట్లనియె. ఓకన్యకామణీ! ఈరా జపుత్రుఁడు శత్రుఘ్నునకు కుమారుఁడు. మిగుల మనోహరుఁడు, రామపుత్రుఁడగు కుశుఁడు చెప్పెడు విధముగ బ్రవర్తించువాఁడు, ఈరాజోత్తముని పరిగ్రహింపు మనియె. ఆవచనములను వినియును సుమతి యిష్టము లేనిదై ముందు పదమనియె. అనంతరమందు క్రమముగ సుబాహుపుష్కర చిత్రకేత్వంగదుల నతిక్రమించి లవుఁ డనువాని యొద్దకుఁ బోయె. పోయినతోడనే యాసుమతికి లవునియం దిష్టముకలదని తెలి సికొని యాసునంద యిట్లనియె. ఓబాలికా! ఈరాజపుత్రునిజూడుము. ఇతఁడు శ్రీరాము నకుఁ బుత్రుఁడు. భార్యకావలయునని కోరుచున్నవాఁడు. స్వల్పమైన వయస్సుకలవాఁ డు, సీతామహాదేవిచేతలాలింపఁబడినవాఁడు. వాల్మీకిమునివరుని కృపచేతఁబొందఁబడి నవిద్యలుకలవాఁడు, మిగుల మనోహరుఁడు, కుశునకుఁ దమ్ముఁడు, ఈరాజపుత్రుని వరియించి యీతని కంఠమునందు నవరత్న మాలికనుంచి కుశుని సమీపమునందు చంపిక గూర్చున్నవిధముగ నీవును గూర్చుండుమనియె. ఈవిధముగ సునంద చెప్పి న వాక్యములను విని యాసుమతి చిరునగవు కలదగుచు నాలవుని కంఠమునం దుఁ దనబాహువులచేత రత్నమాలికను సమర్పించి లజ్జచేత నధోముఖము కలదై యుండెను. ఆసమయమునందు నానావిధములగు వాద్యములు మ్రోగెను. గాయకులు గానమునుసల్పిరి. వారస్త్రీలు నృత్యములను సల్పిరి. వందిమాగధులు స్తోత్రమును చేసిరి. భూరికీర్తియను రాజోత్తముఁడు పరమసంతోషము కలవాఁడై లవునితోడ యందు సుమతిని గూర్చుండఁబెట్టి తాను ధన్యుఁడనైతినని తలఁచె. శ్రీరాముఁ డానందమును పొందె. సీతామహాదేవి మేడయందుండి గవాక్షమార్గమున నుండి భార్యా యుక్తుఁడగు లవునిచూచి యధికానందమును పొందె. అనంతరమందు భూ రికీర్తియను రాజోత్తముఁడు సకలరాజులను పూజించి వారికెదుటనిలిచి మృదుమ ధుర వచనములతో సవినయముగ నిట్లనియె. ఓరాజోత్తములారా! మీరందఱును

వివాహకౌతుకమును చూచి మీమీ పురములకుఁ బోవలయునని ప్రార్థించినవిని యారాజులందఱును నంగీకారమును పొంది తమతమ నివాసస్థలములకు బయలు వెడలిపోయిరి. మఱియు నారాజులందఱును కోపము కలవారైనను శ్రీరాముని యెదుట యుద్ధమును చేయఁజాలని వారగుటచేత వాడిన మోములుగలవారును ఉత్సాహ రహితులును నైరి. మఱియు నెల్లవారును మన్మథ బాణములచేతఁ బీడింపఁబడిరి. ఆసమయమునందు శ్రీరాముఁడుకూడ తనవారితోఁగూడ వాసస్థలమునకుఁ బోయెను. అంతట నొక్కనాఁడవఁగా మరుదినమునందు భూరికీర్తియను రాజోత్తముఁడు శ్రీరాముని దగ్గఱకువచ్చి పురోహితుఁడగు వసిష్ఠ మునివరునితోఁగూడఁ గూర్చున్న రామునకు నమస్కరించి యిట్లనియె. ఓరఘుకులోత్తమా! లగ్నదివసమును విచారించి సుముహూర్తమును నిర్ణయింపవలయును. మఱియు నో రామచంద్రా! నామనవి నంగీకరించి యేయేకార్యము నేవిధముగఁ జేయవలయునో యాజ్ఞాపింపుమనిన విని శ్రీరాముఁ డంగీకరించి యావృత్తాంతమును వసిష్ఠ మహామునికిఁ దెలిపె. అంతట వసిష్ఠమునివరుఁడు జ్యోతిశ్శాస్త్ర పండితులను రప్పించి విచారించి నేఁటికైదవదినమునందు సుముహూర్తము కలదనియె. అంతట నాభూరికీర్తియను రాజోత్తముఁడు సంతోషముకలవాఁడై గణేశ లగ్నపత్రికలను పూజించి గణకులు పండితులు వైదికులు మొదలగువారిని పూజించె. మఱియును, బంధుపుత్రాది సమేతముగ శ్రీరాముని పూజించె. అనంతరమందు శ్రీరామునకు నమస్కరించి నిజ గృహమునకుఁబోయి మండపాదికమును నిర్మించె. అంతనిక్కడ రామానుమతమును పొంది లక్ష్మణుఁడుకూడ మంటపాదికమును నిర్మించె. ఆసమయమునందు భూరికీర్తిచేతఁ బాలింపఁబడుచున్న వటపురి నానావిధములగు తోరణ ధ్వజాదులచేత మిగుల మనోహరముగ నలంకరింపఁబడియె. మఱియును సముద్రతీరమునం దాపురుషోత్తమ రాజధాని మిగుల మనోహరముగఁ బ్రకాశించుచుండె. అంతట ముహూర్తదినమునకు ముందటిదిసపురాత్రిని సర్వమునుగడపి కొంచెము మిగిలియుండఁగనే లేచి సీతామహాదేవి మొదలగు తల్లులు నాలుగుదిక్కులయందును జలపూర్ణములును దీపసహితములును నగు నాలుగుకలశములను స్థాపించిరి. అనంతరమందు వాద్యఘోషములు మ్రోగుచుండఁగ బాలకులకు మంగళార్థముగఁ దైలాభ్యంగమునుచేసి స్నానములను చేయించిరి. మఱియు నస్పు డాసీతాదులుకూడఁ దైలాభ్యంగ స్నానమునుచేసి నానావిధములగు నలంకారములచేత బాలకులతోఁ గూడ నలంకృతులైరి. అంతట వసిష్ఠమహాముని సీతారాములను బిలిచి కుశలవులతోఁ గూడ ముత్యములచేత నిర్మింపఁబడిన స్వస్తిక మీఁదఁ గూర్చుండఁబెట్టె. పిమ్మట విఘ్నేశ్వరపూజా పుణ్యాహవాచనములను జరిపించి యిష్టదేవతారాధనమును చేయించె. పిమ్మట శాస్త్రోక్తప్రకారముగ దేవప్రతిష్ఠను జేయించె. ఆసమయమునందు సీతామహాదేవియొక్క పాదపద్మములు

కుంకుమాద్యంకితములై మిగుల మనోహరముగఁ బ్రకాశించె. మఱియు నాసమయమునందు సీతాదిస్త్రీలందఱును నానావిధములును మనోహరములును నగు సరిగచీరెలను ధరించి యత్యధికముగఁ బ్రకాశించుచుండిరి. మఱియును, స్వయంవర కాలమునందు రాని బంధుమిత్రాదులందఱును నాకుశలవుల వివాహమహోత్సవమునకు నేగుదెంచిరి. మఱియు ననేకులగు మునివరులు మొదలగువారుకూడ నేగుదెంచిరి. అప్పుడు శ్రీరాముఁడు వారలకందఱకును వస్త్రాద్యాభరణముల నొసంగి సంతుష్టులనుగాఁజేసె. అంతట భూరికీర్తియను రాజోత్తముఁడు బంధుమిత్రామాత్యాది సకల రాజసముతోఁగూడ నానావిధములగు మహావాద్యములు మ్రోగుచుండఁగ కుశలవులను నిజగృహమునకుఁ దోడ్కొనిపోవుటకువచ్చె. వచ్చి మండపమునందుఁ గూర్చుండఁబెట్టి కుశలవులకు వరపూజనుచేసె. మఱియు నాసమయమునందు హేమతంతువులచేత నేయఁబడిన దివ్యవస్త్రములనొసంగె. ఆసమయమునందు కుశలవాది బాలురందఱును మిగుల మనోహరులై ప్రకాశించుచుండిరి. అంతట నాబాలు రిరువురును దివ్య గజారూఢులై ఛత్రచామరాదులచేత నలంకరింపఁబడి నానావిధములగు వారస్త్రీల నృత్యములను చూచుచును, వాద్యఘోషములను వినుచును, వందిమాగధాదుల స్తోత్రముల కానందమును పొందుచును బోవుచుండిరి. మఱియు నప్పుడు సీతాదులుకూడ స్త్రీగజముల నధిష్ఠించి వారివెంట నంటి పోవుచుండిరి. అప్పుడు పురస్త్రీలు పుష్పవర్షమును గురిపించిరి. మఱియు నా పురస్త్రీలందఱును లాజవర్ష హేమపుష్ప వర్షములనుగూడ గురిపించిరి. ఈవిధముగ నాకుశలవులు నానావిధములగు కౌతుకములను జూచుచుఁ బోవుచుండిరి. మఱియును మార్గమధ్యమునందు పుష్పవృక్షములచేత నిర్మింపఁబడిన వాటికలను జూచి యధికానందమును పొందిరి. మఱియు నావిధముగానే కృత్రిమ వృక్షములను పతాకములను ధ్వజములనుజూచి పరమ సంతోషమునుపొందిరి. మఱియు నటులనే యోషధిభవములయిన వృక్షములను, అగ్నిస్పర్శ మాత్రముచేత నధికముగఁ బ్రజ్వలించు వృక్షములను చూచిరి. మఱియును, రాజమార్గములయందు నిలుపఁబడిన కృత్రిమ జనులనుచూచిరి. మఱియు నోషధులచేత నిండింపఁజేయఁబడిన వ్యాఘ్రసింహాదులనుజూచి సంతోషమునుపొందిరి. మఱియు నాకాశమునందు మెఱుపు తీఁగలవలెఁ బ్రకాశించుచున్నవియును ఓషధీభవములును, అగురీతులను చూచిరి. మఱియును, కృత్రిమములయిన చంద్రజ్యోత్స్నములను చూచిరి. ఈవిధముగ నాబాలకులు నానావిధములగు కౌతుకములను జూచుచు భూరికీర్తియను రాజోత్తముని మందిరమునకుఁ బోయిరి. అట్లు పోయిన పిమ్మట ఛత్రచామరాది చిహ్నితులగు నాబాలురు గజములనుండి మండపాంగణమునందు దిగిరి. ఆసమయమునందు గురువు లాబాలకులకు క్రమముగ మధుపర్కవిధానములను విష్టరాదులను చేసిరి. అంతట సుముహూర్తకాలము సమీపించిన వెంటనే కుశచంపికలను లవసుమతు

లను వేరువేరుగ వివాహవేదికలయందుఁ గూర్చుండఁబెట్టిరి. అనంతరమం దాదంప
తుల కడ్డముగ పటమును పట్టిరి. ఆయంతరవస్త్రములు మిగుల విచిత్రముగ హేమ
తంతువులతో నేయఁబడియుండె. ఆసమయమునందు నానావిధములగు మంగళ
వాద్యములు మ్రోగె. మునివరులందఱును మంగళశ్లోకములను పాడిరి.

ఇట్లని యానందరామాయణాంతర్గత వివాహకాండమునందలి
మూఁడవసర్గ ముగిసెను.

✷ కుశ లవుల వివాహవర్ణనము. ✷

అంతట మరల రామదాసి ట్లనియె. ఓశిష్యోత్తమా ! విష్ణుదాసా ! వివా
హకాలమునందు మునివరులు చెప్పిన మంగళశ్లోకములను జెప్పెదను. వినుము.

“శ్లో. శ్రీసీతారఘునాయకశ్చగిరిజా శంభుర్గణేశ స్తథా
నందీ షణ్ముఖలక్ష్మికౌచ భరతః కంజోద్భవశ్చాత్రుహా,
సర్వేతే మునయస్సురాశ్చ దితిజా స్తీర్థాని నద్యోనదా
దిక్పాలాశ్శశిభాస్కరౌచ హనుమాన్కుర్వంతువాం మంగళమ్.
తదేవలగ్నంసుదినంతదేవ తారాబలం చంద్రబలంతదేవ,
విద్యాబలందైవబలంతదేవ సీతాపతేర్యత్స్మరణం విధేయమ్.

అనునట్టి మంగళశ్లోకాదులను పఠించిరి. ఇట్లు నానావిధములగు మంగళవా
ద్యములతోఁ గూడ మంగళవాదములను సలిపి “ఓంపుణ్యాహమ్” అనిస్మరించుచు
నాయంతరపటమును తొలగించిరి. అంతటనావసిష్ఠాది మునివరులు ఆదంపతులకు
శాస్త్రోక్తప్రకారముగ పాణిగ్రహణ మహోత్సవము లాజహోమము మొదల
గువానిని మంగళవాద్య పురస్సరముగఁ జేసిరి. ఆసమయమునందు నానావిధము
లగు మంగళవాద్యములు మ్రోగె. వారస్త్రీలు నృత్యములను చేసిరి. వందిమాగ
ధాదులు స్తోత్రమును సల్పిరి. మంగళగీతములను పాడిరి. మఱియు నాసమయము
నందాదంపతులు నానావిధములయిన దానములనుచేసిరి. అప్పుడు భూరికీర్తియును,
శ్రీరాముఁడును, మహానందమును పొందిరి. అనంతరమందు సీతామహాదేవి మొద
లగువారు ఆదంపతులను పట్టుకొని భోజనశాలకుఁ దీసికొనిపోయిరి. అట్లు తీసికొ
నిపోయి పార్వతీ పరమేశ్వరులను పూజింపఁజేసి చంపికతోఁగూడ కుశుని సుమతితోఁ
గూడ లవుని, ఏకపాత్రమునందు భోజనమును చేయించిరి. ఉపనయన కాలమునం
దు తల్లితోడను, వివాహకాలమునందు భార్యతోడను భోజనమును చేయవలయు
ననియును, ఇతరులతోఁగూడ భోజనమును మఱియెప్పుడైనను వివాహోపన
యన కాలములయందైనను చేసినయెడల పతితుఁడగుననియును, శాస్త్రములయం
దుఁజెప్పఁబడియె. అంతట శ్రీరాముఁడుకూడ బంధుమిత్రామాత్యాదుల తోడను
సకల రాజసముదాయము తోడను కూడుకొనినవాఁడై భూరికీర్తియొక్క మందిర

మునందు భోజనమునుచేసె. ఈవిధముగానే సీతామహాదేవికూడ స్త్రీలతోఁగూడఁ గూర్చుండి భోజనమునుచేసె. అనంతరమందా భూరికీర్తియను రాజోత్తముఁడు నానావిధములయిన యుత్సవములనుజేసె. అనంతరమందు మిగుల మనోహరులగు బాలురు స్త్రీవాక్యములచేత తల్లియొక్క సమీపమునందు నిలిచియుండిరి. మఱియు నాసమయమునందు చంపికాసుమతులు తమభర్తలతోఁగూడ నిలిచియుండిరి. అనంతరమందు కుశలవులు తమభార్యలతోఁగూడ శిరస్సులచేతఁ దల్లి పాదములయందుఁ బడినమస్కరించిరి. అనంతరమందు నానావిధములగు నుత్సవములను సల్పిరి. ఈవిధముగ మూఁడుదినములు గడచినపిమ్మట చతుర్థదిన రాత్రియందు వంశపాత్రమునందుఁ బ్రకాశించుచున్న దీపములచేత నాబాలురు నీరాజనముచేయఁబడిరి. అంతట నాబాలకులు తమభార్యల వెనుకకును, ఆభార్యలు భర్తలవెనుకకునుపోయి నృత్యమును చేసిరి. అంతట భూరికీర్తియను రాజోత్తముఁడు కుశలవులకు నానావిధములగు బహుమానముల నొసంగె. మఱియు నాసమయమునందు భూరికీర్తియను రాజోత్తముఁడు రామునితో సంబంధమును చేయుటవలన మిగుల సంతోషముకలవాఁడై పదివేలగజములను పదివేలశిబికలను కుశలవులకునొసంగె. మఱియు నేబదివేలగుఱ్ఱములను, ఏబదివేలరథములనుగూడ సమర్పించె. మఱియు నపరివిధములగు ధనవస్త్రరాసులనొసంగె. ఈవిధముగ భూరికీర్తి చేసిన సన్మానమును గైకొని శ్రీరాముఁడు పరమానందము కలవాఁడై భార్యాసమేతులగు పుత్రులను బంధుమిత్రామాత్యాదులను వెంటఁబెట్టుకొని మునుపటివలెనే నానావిధములయిన యుత్సవములతోఁగూడ తనమండపమునకుఁ బోయె. అంతట శ్రీరాముఁడా వటపురియందు మాసము దినములు నివసించె. మఱియునారాముఁడు సీతామహాదేవితోఁగూడ నోడనెక్కి సముద్ర విహారమును సలిపె. అనంతరమందు శ్రీరాముఁడు కోడండ్రతోఁగూడ నయోధ్యాపట్టణమునకుఁ బోయె. అట్లు శ్రీరాముఁడు వచ్చుచుండుటను అదివఱకు నయోధ్యాపట్టణమును పాలించుచున్న విజయుఁడువిని యయోధ్యాపట్టణమును సర్వమును నలంకరింపఁజేసె. అంతట నావిజయుఁడు గజేంద్రమును ముందిడుకొని నానావిధములగు మంగళ వాద్యములతోఁగూడ శ్రీరామునకెదురుగవచ్చె. అంతట శ్రీరాముఁడు నానావిధములగు వాద్యములు మ్రోగుచుండఁగా, బాలురు, మిత్రులు, కోడండ్రు, సీత మొదలగువారితోఁగూడ నయోధ్యాపట్టణమునందుఁ బ్రవేశించె. మఱియు నట్లు ప్రవేశించునపుడు మార్గమధ్యమునందు వారాంగనలు నానావిధములగు నృత్యములను జూచుచుండిరి. వందిమాగధులు స్తోత్రమును చేయుచుండిరి. ఆసమయమునందు కుశలవులు తమ భార్యలతోఁగూడ శ్రేష్ఠములయిన గజములనెక్కియుండిరి. అప్పుడు పురస్త్రీలందఱును నా దంపతుల మీఁదఁ బుష్పవర్షమును గురిపించిరి. ఈవిధముగ శ్రీరాముఁడు బాలురతోఁగూడ నిజమందిరమునకుఁబోయి లక్ష్మీపూజను చేయించి యనేకములగు దానములను

చేసె. అప్పుడు శ్రీరాముఁడు మంత్రిమిత్ర పౌరజాన పదాదుల నందఱి నలంకార వస్త్రాదులచేతఁ బూజించి యాచండాలాంత జనమునకుఁగూడ పరమసంతోషము కలుగునటుల నన్నదానాదికమును చేయించె. పిమ్మట విద్యుత్కుండగు భూరికీర్తి యొక్క మంత్రులు మొదలగువారిని బూజించి వారిదేశములకుఁబంపె. అనంతరమందు సకల జానపదులను వారివారి గ్రామముల కనిపి మిత్రులు, వానరులు, విభీషణుఁడు మొదలగువారి నందఱను దమతమదేశములకుఁ బోవునట్లుచేసె. అప్పుడెల్ల వారును నానావిధములగు వస్త్రాభరణాదులచేత శ్రీరాముని బూజించి తమతమదేశములకుఁ బోయిరి. అట్లు బంధుమిత్రాదులందఱును దమదేశములకుఁబోయిన పిమ్మట శ్రీరాముఁడు కొడుకులునుకోడండ్రును సుఖమును పొందుచుండఁగ ధర్మము నతిక్రమింపక రాజ్యమును చేయుచుండె. అనంతరమందు శ్రావణకృష్ణపక్షామావాస్య మొదలుకొని యాసంవత్సరము మొదలుకొని వచ్చునట్టి పండుగలకు భూరికీర్తియను రాజోత్తముఁడు శ్రీరాముని నంతఃపురస్త్రీసమేతముగఁ దోడ్కొనిపోయె. అట్లు దోడ్కొనిపోయి వస్త్రాలంకారాదులచేత వారినందఱిని శాస్త్రోక్తప్రకారముగఁ బూజించె. పిమ్మటఁ గొన్నిదినములకు రామాదుల నయోధ్యాపట్టణమునకుఁ బంపెననిచెప్పి యారామదాసు మరల నిట్లనియె. శిష్యోత్తమా! ఓవిష్ణుదాసా! సంవత్సరమునందు వచ్చునట్టి యుత్సవదినములను జెప్పెదను. వినుము. శ్రావణమాసమునందలి యమావాస్య భాద్రపదశుద్ధచతుర్థి, విజయదశమి, దీపావళ్యమావాస్య, మార్గశీర్షశుద్ధపంచమి, సీతాషష్ఠి, మకరసంక్రమణము, రథసప్తమి, చైత్రశుక్ల ప్రతిపత్తు, అక్షయతృతీయ, జ్యేష్ఠపూర్ణిమ, శ్రావణశుక్లపంచమి, అను పదునారుదినములును మిగులఁ బుణ్యకరములయిన వని చెప్పఁబడినవి. ఈశుభదినముల నాటికి భూరికీర్తి శ్రీరాముని దీసికొనిపోయి పూజించెను. ఓశిష్యోత్తమా! ఈవిధముగ కుశలవుల వివాహవృత్తాంతమును దెలిపితిని. ఓశిష్యోత్తమా! శ్రీరాముఁడు వైకుంఠారోహణమును జేయుకాలమునందు కుశుఁడు చంపికతోఁగూడ సరయూనదీజలమునందు జలక్రీడను జేయుచుండును. మఱియు నాసమయమునందు కుశుని కుడిహస్తమునందు ధరింపఁబడినదియును, బంగారముచేత నిర్మింపఁబడినదియును, మిగుల నధికముగఁ బ్రకాశించుచున్నదియును, అగు కంకణము సరయూనదీజలమునందు పడిపోవును. ఆకంకణమును కుముదుఁడను పన్నగుని చెలియలు కుముద్వతియనునది సంగ్రహించుకొని పోవును. ఆసమయమునందు సరయూనదియందలి యుదకమును శోషింపఁజేయఁదలఁచి బాణమును సంధానముచేయును. అంతట నాసరయూనదిపోయి కుముదుఁడను పన్నగుని ప్రార్థించును. అంతట నాకుముదుఁడు కుశునకు కోపము వచ్చినదను సంగతిని దెలిసికొని తనచెలియలగు కుముద్వతితోఁగూడవచ్చి యాకుశునకు నమస్కరించి తనచెలియలగు కుముద్వతిని కుశునకు సమర్పించును. అనంతరమందనేకములగు రత్నములతోఁగూడ నతనికంకణమునిచ్చి యతనితోఁగూడ

సఖ్యమును చేయును. ఈవిధముగ కుశునకిఁకమీఁద కుముద్వతియనునది భార్యకాఁగలదు. చంపికకు పుత్రికలు మాత్రముకలుగుదురు. కాని పుత్రులు కలుగరు. కుముద్వతియందు కుశునకు నతిథియను పుత్రుఁడు కలుగును. ఆయతిథివలన సూర్యవంశ ముత్తరోత్తరాభివృద్ధినిపొందును. ఓశిష్యోత్తమా! ఈవిధముగ కుశుని భార్యల నిరువుర వర్ణించితిని. అంతట నాకుశలవులు తమ భార్యలతోఁగూడ నిజగృహములయందు నానావిధములగు క్రీడలనుసల్పిరి.

ఇట్లని వివాహకాండమునందలి
నాల్గవసర్గ ముగిసెను.

ఓశిష్యోత్తమా! విష్ణుదాసా! అంతట శ్రీరాముఁడొకనాఁడు బాలబంధుమంత్రిష్టజనములతోఁగూడ పుష్పకారూఢుఁడై వనమునకుఁబోయె. పోయినానావిధములయిన కౌతుకములను జూచుచు సీతామహాదేవిని సంతోషపఱచుచుండె. అంతట మెల్లగ దండకారణ్యమునందలి యగస్త్యాశ్రమమునకుఁబోయె. అప్పుడు అగస్త్యమహాముని శ్రీరాముఁడువచ్చుటనువిని శ్రీరామున కెదురుగవచ్చి తనయాశ్రమములోనికిఁదీసికొనిపోయె. అంతట నామునివరుఁడు స్నానమునుచేసి యేకాంతస్థలమునకుఁబోయి తనమనస్సునం దన్నపూర్ణామహాలక్ష్మిలను ప్రార్థించె. అంతటనతని తపస్సునకు సంతోషించి యాసురేశ్వరి యావిర్భవించె. పిమ్మట నొకపాత్రయందు నానావిధములయిన యన్నాదులు సిద్ధములయ్యె. అంతట నామునివరుఁడు రామాదుల కందఱకును నాదివ్యాన్నములను వడ్డించె. అంతట రామాదులందఱును సమృద్ధిగ భుజించి యధికానందమును పొందిరి. అప్పుడా యగస్త్యమహాముని రత్నములచేత నిర్మింపఁబడినకంకణములను దివ్యకుండలములనుసీతామహాదేవికి సమర్పించె. ఈవిధముగా నామునివరునిచేతఁ బూజింపఁబడి శ్రీరాముఁడు పరమానందముకలవాఁడై యగస్త్యమహామునితోఁగూడ పుష్పకారూఢుఁడై దండకారణ్యమునందు నానావిధములగు కౌతుకములను జూచుచు సంచరించుచుండె. మఱియు నానావిధములయిన వృక్షములు పర్వతములు నదులుమొదలగు వానిని సీతామహాదేవికిఁ జూపించుచుండె. అట్లు దండకారణ్యమునందుఁ దిరుగుచు పంచాప్సర సరమనుపేరుగలసరస్సునుజూచె. చూచి శ్రీరాముఁడా సరస్తటమునం దొకరాత్రియంతయును నివసించె. అంతట నారాత్రియందు శ్రీరాముఁడు సీతతోఁగూడమంచకము మీఁదఁబరుండి యప్సరస్త్రీలయొక్క నృత్యగానములను వినుచుండె. మఱియు నారామునితోఁగూడవచ్చుటకు వచ్చినవారు గూడవినిరి. అప్పుడు శ్రీరాముఁడు అగస్త్యమునివరునితో నిట్లనియె. ఓయగస్త్యమునివర్యా! ఈయరణ్యమునందు గీతనృత్యములు వినఁబడుచున్నవి. ఇవియెక్కడనుండి వచ్చినవని యగస్త్యమునివరుఁ డిట్లనియె. పద్మపత్రములవంటి నేత్రములుకల యోరామచంద్రా! నీకుఁదెలియనిదేమి కలదు.

నీవునాముఖమువలన సర్వమును వినవలయుననియెడుతలంపుతో నడుగుచున్నావు. అయినను నాకుఁ దెలిసినంతవఱకు జెప్పెదను. పూర్వమునందు గంధర్వరాజునకు మిగుల సుందరవతులగు నైదుగురు పుత్రికలుగలరు. ఆయైదుగురును అరజస్కలై యీసరోవరమునందుఁ గ్రీడించుటకు వచ్చిరి. ఆసమయమునందే బయల్పడని యీవనముకల నాగకన్నియ లేఁగురు జలక్రీడా నిమిత్తముగ నక్కడకు వచ్చిరి. అంతట నయ్యుభయ తెగవారును నిట్లనియాలోచించుకొని ప్రతిదినమును ఇక్కడకు వచ్చుచుఁబోవుచు నుండునట్లు నియమమును జేసికొనిరి. అంతట నావిధముగానే యీరెండు తెగలవారును బోవుచువచ్చుచుండిరి. అప్పుడందలి మునివరుఁడు వారినిక్కడకు వచ్చుట యుచితము కాదనినివారించిరి. అట్లు నివారించినను ఆరెండుతెగల వారును బాలభావము కలవారగుటచేత నామునివరుని వాక్యములను లక్ష్యముచేయక పోయిరి. అంతట నింద్రుఁడు చెప్పినను వారువినక పోయిరి. అప్పుడామునివరుఁడు తనతపస్సునకు హానికలుగు ననియెడుతలంపుతో వారిని శపింపకయే దండింపఁదలఁచి జలదేవతలను ప్రేరణచేసె. అంతట నాజలదేవతలు మధ్యాహ్న కాలమునందు బలాత్కారముగ నక్కన్నియలను తమనివాసములకుఁ దోడ్కొనిపోయిరి. అప్పుడు గంధర్వులును పన్నగులును తమకన్నియలున్న చోటునకుఁ బోఁజాలరైరి. పిమ్మటఁ గొన్ని దినములకుఁ దపస్సును ముగించి యామునివరుఁడు స్వర్గమునకుఁబోయె. ఆకన్నియలుమాత్ర మక్కడనే యింతవఱకును నివసించి యున్నవారు. ఆకన్నియలు జలదేవతల గృహమునందు నివసించియుండి నృత్యగానములను జేయుచున్నారు. ఆనృత్యగానములు మనచేత వినఁబడుచున్నవి. ఓరఘుకులోత్తమా! నీవడిగిన విషయమును నాకుఁ దెలిసి నంతవఱకుఁ జెప్పితిని. నీకిష్టమైన యెడల గంధర్వకన్నియలకును నాగకన్నియలకును మోక్షమును గల్పింపుమనిన శ్రీరాముఁడు లక్ష్మణునిబిలిచి యిట్లనియె. ఓలక్ష్మణా! నాధనుస్సునుగైకొనిరమ్ము? నేను బాణమును ప్రయోగించి జలదేవతలను దగ్ధముచేసి గంధర్వకన్నియలను నాగకన్నియలను చెరనుండి విడిపించెదననియె. ఆవాక్యమును లక్ష్మణుఁడు విని మిగుల నాదరముతో ధనుర్బాణములను గైకొనివచ్చి శ్రీరామునకు సమర్పించె. అంతట శ్రీరాముఁడు ధనుస్సును పట్టుకొని టంకారమునుచేసి యంబుల పొదినుండి బాణమును స్వీకరించె. ఆసమయమునందు భూమియంతయును గడగడ వణకె. సప్తసముద్రములును నల్లకల్లోలములయ్యె. మిగుల భయంకరముగ గాలి వీచె. దశదిక్కులయందును పరాగమువ్యాపించె. నక్షత్రములు క్రిందఁబడియె. వనచారులు పరుగిడిరి. పర్వతములన్నియును కంపమునుపొందె. మేఘములు రక్తమును వర్షించె. అప్పుడు జలదేవతలాధనుష్టంకారమును విని భయభీతులై యాకన్నియలతోఁగూడఁ బరుగిడివచ్చి శ్రీరామునకు నమస్కరించిరి. మఱియు నాకన్నియలను శ్రీరామునకు సమర్పించిరి. అప్పుడా కన్నియలు నానావిధములగు నాభరణముల

చేత నలంకరితులై యుండిరి. అంతట నాజలదేవతలు శ్రీరామునితో నిట్లని విన్నవించిరి. ఓరఘుకులోత్తమా! మాయపరాధమును మన్నింపుము. మాయందు బాణమును ప్రయోగింపకుము. సూర్యవంశమునందుఁ బుట్టినవాఁడెవ్వఁడును స్త్రీలయందు బాణమును ప్రయోగించువాఁడుకాఁడు. నీవుకూడ పూర్వమునందు గంగాతీరమున నాఁడుదియను తలంపుతో భూదేవిని రక్షించితివి. తాటకాదుల సంహరించితి ననియెదవేని యది లోకోపకారము కొఱకుఁ జేసితివికాని వేరొండుకాదు. మామన వినిగైకొని మమ్ముల మన్నింపుమనినవిని శ్రీరాముఁడు నవ్వుచుఁ దనబాణమును మరల నంబులపొదియందుంచె. అంతట శ్రీరాముఁ డాజలదేవతలచేతఁ బూజింపఁబడి సంతోషమునుపొందె. పిమ్మట జలదేవతలకు స్వస్థలమునకుఁ బొండని యాజ్ఞ నిచ్చె. ఇంతలోపల నచ్చోటునకు గంధర్వులును పన్నగులును వచ్చిరి. మఱియు నారాముఁడు చేసినకార్యమును సర్వమును దెలిసికొని సీతారాములకును, అగస్త్య మునివరునకును నమస్కరించిరి. అనంతరమందు శ్రీరామున కనేకములగుకానుకలను సమర్పించి చేతులను ముకుళించుకొని మృదుమధుర వచనములతో నిట్లనిరి.

ఇట్లని యానందరామాయణాంతర్గత వివాహకాండమునందలి
ఐదవసర్గ ముగిసెను.

✳ గంధర్వనాగకన్నియల వివాహనిశ్చయము. ✳

శిష్యోత్తముఁడవైన యోవిష్ణుదాసా! పిమ్మటి వృత్తాంతమును చెప్పెదను. వినుము. అంతట గంధర్వులును పన్నగులును నిట్లనిరి. పద్మమువంటి మోముకల యోరామచంద్రా! మాబాలికలను నీవు విడిచిపెట్టితివి. రజోవతులుగాని యీబాలికలను నీపుత్రులు వివాహము చేసికొనునట్లు చేయవలయును. అట్లయినయెడల మేము ధన్యులమగుదుము. మావంశము పవిత్రమయిన దగును. అధికమైన భుజబలముకల యోరాముఁడా! నీవలన మేము తరింపఁజేయఁబడిన వారమైతిమి. మఱియు నోరఘుకులోత్తమా! ఏఁడుజన్మములనుండి జేసినపుణ్యవశమున మాకు మీతో సంబంధమును జేయునంతటి భాగ్యము కలిగెననిరి. అంతట శ్రీరాముఁడు వారివాక్యముల కంగీకారమును పొంది యగస్త్యమునివరునిజూచె. అంతట నగస్త్యమునివరుఁ డిట్లనియె. ఓరఘుకులోత్తమా! కొంతకాలమైన పిమ్మట కుముదుని చెలియలగు కుముద్వతియను నాగకన్నియ కుశునకు భార్య కాఁగలదు. ఆసమయము నీవు వైకుంఠమునకుఁ బోవుసమయమై యుండును. చంపికయందు కుశునకు పుత్రులు కలుగరు. కుశునకు కుముద్వతియం దతిథియను పుత్రుఁడు కలుగును. ఆయతిథియే రాజ్యకర్తయును వంశకర్తయును కాఁగలఁడు కావున నోరఘుకులోత్తమా! కుశునకుఁ దప్పఁ దక్కిన యేఁగురుపుత్రులకును ఏఁగురుకన్నియలనిచ్చి వివాహమును చేయుము. మఱియునో రామచంద్రా! గంధర్వక

న్నియల నైదుగురిని యూపకేతులవులు దప్పఁ దక్కిన పుత్రులకైదుగురికిమ్ము. ఇఁకమీఁదట కొంతకాలమునకు యూపకేతువు మఱియొక కన్నియను రాక్షసవివాహమును జేసికొనఁగలఁడు. ఓరామచంద్రా! ఈవిధముగఁ జేసినయెడల నీపుత్రులందఱును తమతమ భార్యలతోఁగూడ నానావిధములగు సుఖముల ననుభవింపఁగలరు. ఓరఘుకులోత్తమా! నీవుసీతాసమేతముగ ప్రపౌత్రులయొక్క ప్రపౌత్రులను జూచిన పిమ్మట పట్టణమునందున్న బంధువులతోఁగూడ వైకుంఠమునకుఁ బొమ్మనియె. ఈవిధముగ నగస్త్యమునివరుఁడు చెప్పిన వాక్యమునువిని శ్రీరాముఁడా కన్నియలయొక్క నామధేయముల నడిగె. అంతట నాగంధర్వులు వారినామధేయములను దెలిపిరి. ఆకన్నియలు చంద్రిక, చంద్రవదన, చంచల, చపల, చల, అనునామధేయములచే విలసిల్లుచున్నారనిరి. ఈవిధముగ నాశ్రీరాముఁడైదుగురి నామములనువిని సంతోషించి నాగకన్నియల నామధేయములను దెలియఁగోరి పన్నగులను జూచె. అంతనాపన్నగులు తమకన్నియల నామధేయములను జెప్పఁదలచియిట్లనిరి. ఓరఘుకులోత్తమా! మాపుత్రికలు, కంజనయన, కంజనేత్ర, కంజపిన్ని, కళావతి, కలిక, కమల, మాలతీ, అనునామధేయము కలవారైయున్నారనిరి. ఈవిధముగ శ్రీరాముఁడా నాగకన్నియల నామధేయములనువిని సంతోషముకలవాఁడై వారి నందఱను పుష్పకవిమానమునం దుంచుకొని యారాత్రిని సర్వమును గడపె. అంతట మరుదినప్రాతఃకాలమునకు ముందుగ మేల్కొని శ్రీరాముఁడు స్నానమును చేసి శాస్త్రోక్తప్రకారముగ హోమమునుచేసి గంధర్వపన్నగులతో నిట్లనియె. ఓపన్నగగంధర్వులారా! ఈజనులతోఁగూడ నేను పుత్రుల వివాహము నిమిత్తము స్వర్గలోకమునకుఁగాని రసాతలలోకమునకుఁగాని వచ్చుట యుచితముకాదు. మానవలోకమునందు నివసించువా రితరలోకములకు పోఁదగదు. కావున నావాక్యమును విని మీరు మీలోకములకుఁబోయి మీబంధుమిత్రాది జనముతోఁగూడ నయోధ్యాపట్టణమునకు వివాహముకొఱకు రావలయును. నే నిప్పుడే యయోధ్యాపట్టణమునకుఁబోయెద ననియె. అట్లు శ్రీరాముఁడు చెప్పినవాక్యమును విని వారందఱును వల్లెయని తమతమలోకములకుఁ బోయిరి. అంతట శ్రీరాముఁడుకూడ తన బంధుమిత్రామాత్య పుత్రాదులతోఁగూడ నాకాశమార్గమున నయోధ్యాపట్టణమునకుఁబోయె. అప్పుడు పురస్త్రీలచేత నీరాజనముచేయఁబడి శ్రీరాముఁడు నిజమందిరమునందుఁ బ్రవేశించె.అంతట వసిష్ఠ మునివరుని గృహమునం దాకన్నియలనునిచె. అనంతరమందు శ్రీరాముఁడు సభయందుఁ గూర్చుండి లక్ష్మణునితో నిట్లనియె. ఓతమ్ముఁడా! లక్ష్మణా! రాజులు, మిత్రులు, మునీశ్వరులు మొదలగువారిని వారివారి బంధుమిత్రాదులతోఁగూడ రప్పింపుము. ఈయయోధ్యాపట్టణమును సర్వమును నలంకరింపుము. పరిఖలనేడింటిని జక్కపఱుపుము. మేడలయందంతటను సున్నమును కొట్టింపవలయును. మఱియును, మేడలయందు చిత్రము

లగు లేఖ్యముల నుంచవలయును. దేవాలయములయందు సున్నమును గొట్టింపవలయును. చిత్రములను వ్రాయింపవలయును. బలులను పెట్టింపవలయును. పతాకధ్వజముల నెక్కింపవలయును. మఱియు నోలక్ష్మణా! బంగారముతో వేదికలను నిర్మించి మండపములను గట్టింపవలయును. గంధర్వులును పన్నగులును నివసించుటకుఁ దగిన గృహములను నిర్మింపవలయును. మఱియు నోలక్ష్మణా! హస్త్యశ్వశిబికల నపరిమితముగ నలంకరింపవలయును. మఱియును పన్నగగంధర్వులు నివసించు గృహములయందు అన్నవస్త్రాదులు సమృద్ధిగనుండునట్లు చేయుము. మఱియు నోలక్ష్మణా! ఏయేకార్యములు కాఁదగియున్నవో వాని నన్నిటిని చక్కఁగ నాలోచించి చేయుమనియె. ఆవచనములను విని లక్ష్మణుఁ డంగీకారమును పొంది శ్రీరాముఁడు చెప్పినవిధముగ సర్వమునుచేసె. అంతట గంధర్వులును పన్నగులును తమతమ బంధుమిత్రామాత్యాదులతోఁగూడ నయోధ్యా పట్టణము నందలి యుద్యానవనమునందుఁ బ్రవేశించిరి. ఆగంధర్వులును పన్నగులును మానవరూపముతోవచ్చి ప్రవేశించిరి. అట్లు గంధర్వులును పన్నగులును వచ్చుటను విని శ్రీరాముఁడు సపరివారముగా నెదురుగాఁబోయి యనేక విధములయిన వాద్య ఘోషములతోఁ గూడ నయోధ్యాపట్టణములోనికిఁ దీసికొని వచ్చి విశాలములయిన గృహములయందు నివసింపఁజేసిరి. అంతట నొకప్పుడు శ్రీరాముఁడు వారితోఁగూడ సభయందుఁ గూర్చుండి జ్యోతిశ్శాస్త్రజ్ఞులను వసిష్ఠమునివరుని రప్పించి వివాహముహూర్తములను నిర్ణయింపుమనియె. అప్పుడు వారందఱును విచారించి ముహూర్తములను నిశ్చయించి పక్షాంతరముచేత వైశాఖమాసమునందె రెండు ముహూర్తములను, అటులనే జ్యేష్ఠమాసమునందు రెండుముహూర్తములను మార్గశీర్షమాసమునందు రెండుముహూర్తములను మాఘమాసమునందు రెండు ముహూర్తములను ఫాల్గునమాసమునందు రెండుముహూర్తములను నిర్ణయించిరి. ఈ విధముగ పదిరెండు వివాహములకుఁదగిన సుముహూర్తములను నిర్ణయించిరి. అనంతరమందు వైశాఖమాసమునందు లవాంగదులవివాహములనునిర్ణయించిరి. జ్యేష్ఠమాసమునందు చిత్రకేతు పుష్కరుల వివాహమును నిర్ణయించిరి. మార్గశీర్షమాసమునందు తక్షసుబాహువులకు వివాహమును నిర్ణయించిరి. మాఘమాసమునందు యూపకేత్వంగదులకు వివాహమును నిశ్చయించిరి. పుష్కరతక్ష సుబాహులకు ఫాల్గున మాసమునందు వివాహమునుచేయ నిశ్చయించిరి. ఈవిధముగఁ పదిరెండు వివాహములను నిశ్చయించిన పిమ్మట గణకులను శ్రీరాముఁడు శాస్త్రోక్తప్రకారముగఁ బూజించె.

ఇట్లని వివాహకాండమునందలి

యేడవసర్గ ముగిసెను.

* ద్వాదశవివాహ వర్ణనము. *

అంతట నాగణకులతోఁగూడ వసిష్ఠమహాముని, ఏయేకన్యకకు నేయేబాలుఁడు తగియున్నదియును విచారించి నిర్ణయించెను. అది యెట్లనిన, కంజాననులవునకును, కంజాక్షిని నంగదునకును, కంజాంఘ్రిని చిత్రకేతువునకును, కలావతిని పుష్కరున కును, కలికను తక్షునకును, కమలను సుబాహువునకును, మాలతిని యూపకేతువు కొఱకును, నిర్ణయించిరి. ఈవిధముగ నాగకన్నియలను నిర్ణయించిన పిమ్మట గంధర్వకన్నియలలో చంద్రికను అంగదునకును, చంద్రాస్యను చిత్రకేతువునకును, చంచలాఖ్యను పుష్కరునకును, చపలను తక్షునకును, అచలను సుబాహువునకు ను, వివాహమునుజేయ నిశ్చయించిరి. ఈవిధముగ నిశ్చయించిన పిమ్మట శ్రీరాముఁడు అంతఃపురములోనికిఁ బోయి యావృత్తాంతమును సర్వమును సీతామహాదేవికిఁదెలిపె. అంతట నలుదిక్కులనుండి యనేకమంది రాజులుబంధువులు పౌరులు జానపదులు మొదలగువారు తమతమబంధు మిత్రామాత్యజనముతోఁగూడ నయోధ్యాపట్టణమునకు వివాహకౌతుకమును జూడవచ్చిరి. అట్లు వచ్చినరాజాను లచేత నాపట్టణమంతయును వ్యాప్తమయ్యె. మఱియునాసమయమునందు విభీషణుఁడు సుగ్రీవుఁడు మొదలగువారు కూడవచ్చిరి. మఱియునప్పుడు భూరికీర్తియను రాజోత్తముఁడు తనపుత్రమిత్రామాత్యాదులతో నతిశీఘ్రముగవచ్చె. మఱియు నావివాహములకు జనకయుధాజిత్తులుకూడ నేఁగుదెంచిరి. మఱియు నాసమయ మునందు కౌసల్యా సుమిత్రాదుల బంధువులుగూడ నేఁగుదెంచిరి. అవ్విధముగ నెల్లవారును వచ్చిన పిమ్మట వైశాఖ శుక్లపక్షముహూర్తదినమునందు శ్రీరాముఁడు వసిష్ఠాదిపురోహితులయాజ్ఞానుసారముగలవునకు మంగళాభ్యంగమును చేయుటకుస్త్రీలనుప్రేరేపించె. అంతట సీతామహాదేవి మొదలగుస్త్రీలందఱును లవునకు మంగళాభ్యంగమును చేయించి తాము అభ్యంగస్నానమును చేసిరి. అనంతరమందు శ్రీరాముఁడు దేవప్రతిష్ఠనుచేసి బ్రాహ్మణబృందముతోఁ గూడుకొనిన వాఁడై విఘ్నేశ్వరపూజను చేయించె. అనంతరమందు పుణ్యాహవాచనమును చేయించె. పిమ్మట శాస్త్రోక్తప్రకారముగ మునులను సత్కరించె. అనంతరమందు వివాహముహూర్తకాలమునకు నాగులు నివసించియున్న గృహమునకు బంధుమిత్రాదులతోఁగూడ లవుని దోడ్కొనిపోయి కంజానన నిప్పించి శాస్త్రోక్త ప్రకారముగా వివాహమును జేసిరి. అంతటనావివాహమునందలి నాల్గవదిన మునందు వంశపాత్రలయందుంచఁబడిన రత్నదీపములచేత నీరాజనము చేయఁబడినవాఁడై లవుఁడు మండపమునందు స్త్రీతోఁగూడఁ బ్రకాశించుచుండె. పిమ్మట శ్రీరాముఁడు మునుపటివలెనే నానావిధములయిన యుత్సవములతోఁ గూడ నాదంపతులను దోడ్కొనిపోయి నిజమందిరమునందుఁ బ్రవేశపెట్టి లవునిచేత లక్ష్మీపూజను చేయించె. అనంతరమునందు శ్రీరాముఁడనేకములయిన దా

నములనుజేసె. ఆసమయమునందు రాజులు, పన్నగులు, మిత్రులు, గంధర్వులు, పౌరులు, జానపదులు మొదలగు వారందఱును వస్త్రాభరణాదులచేత శ్రీరాముని బూజించిరి. పిమ్మట లక్ష్మణాదులను కుశాదిబాలకులను పూజించిరి. అనంతరమందు నాగపత్నులును గంధర్వపత్నులును సీతామహాదేవి మొదలగుస్త్రీలనందఱిని పూజించిరి. అప్పుడు సీతామహాదేవి పియ్యపురాండ్రతోఁగూడ వివాహమునకు వచ్చిన సకలరాజస్త్రీలను వస్త్రాభరణాదులచేతఁ బూజించె. అంతట శ్రీరాముఁడు కూడస్నేహితులు పౌరులు గంధర్వులు పన్నగులు మొదలగువారిని నానావిధములయిన వస్త్రాలంకారాదులచేతఁ బూజించె. ఈవిధముగ శ్రీరాముఁడు వైశాఖశుక్లపక్షమునందు లవునకు వివాహమునుచేసి యామాసమునందే కృష్ణపక్షమునందు అంగదునకు మునుపటివలెనే శాస్త్రోక్తప్రకారముగ వివాహమునుచేసె. మఱియును, జ్యేష్ఠమాసమునందలి శుక్లకృష్ణపక్షములయందుఁ గ్రమముగ చిత్రకేతుపుష్కరులకు వివాహమునుచేసె. అనంతరమందు సకల రాజాదులను తమతమపట్టణాదులకుఁ బంపి మరల మార్గశీర్షమాసమునం దెల్లవారినిరప్పించి తక్షసుబాహువులకుఁగూడ వివాహమును చేయించె. అనంతరమందు సకలరాజాదులకును మునుపటివలె నాజ్ఞనిచ్చిపంపి మరలమాఘమాసమునందుఁ బిలిపించె. అంతనామాఘమాసమునందు యూపకేత్వంగద చిత్రకేతువులకు వివాహమునుజేసె. మఱియును, ఫాల్గునమాసమునందు పుష్కరతక్ష సుబాహువులకుఁ బరిణయమునుజేసె. ఈవిధముగ శ్రీరాముఁడు పదిరెండు వివాహములను జేసి రాజులుమొదలగువారిచేతఁ బూజింపఁబడియె. పిమ్మట శ్రీరాముఁడు రాజులు మునీశ్వరులు మొదలగు వారినందఱను బూజించి వారివారినివాసములకుఁబంపె. అంతట గంధర్వులును పన్నగులును శ్రీరాముని విడిచి తమతమ లోకములకుఁ బోఁజాలకపోయిరి. మఱియు నాగంధర్వులును పన్నగులును తమతమ రాజ్యములయందు మంత్రులను స్థాపించిరి. అంతట శ్రీరాముఁడు బంధుమిత్రామాత్యాదులతోఁగూడ నుత్సవదినములయందు భోజనాదులనుజేసి యానందమును పొందుచుండె. మఱియు నయోధ్యాపట్టణమున సర్వకాలములయందును నుత్సవములే జరుగుచుండె. అంతట శ్రీరాముఁడు తనపుత్రుల కెనమండ్రకును వేరువేరుగ గృహములను నిర్మించి యాగృహములయందు కుశాదులు తమతమ భార్యలతోఁగూడ నివసించునట్లుచేసె. మఱియును, లక్ష్మణాదులు వేరువేరు గృహములయందు నివసించి క్రీడించుచుండిరి. కైకేయి భరతునిగృహమునందొక మాసమును శత్రుఘ్ననిగృహమునందు మఱియొక మాసమును నివసించుచుండె. సుమిత్ర లక్ష్మణుని గృహమునందు నివసించె. కౌసల్య సీతామహాదేవిచేతఁ బూజింపఁబడుచు శ్రీరామునిగృహమునందు నివసించియుండె. మఱియు నాగామాదుల బంధుఫలందఱును దమతమ గృహములయం దష్టైశ్వర్యములతో సుఖముగ నివసించు

చుండిరి. మఱియు నట్లునివసించి లక్ష్మణాదులును కుశాదులును దినదినమందును ప్రాతఃకాలమునకు ముందుగమేల్కాంచి కాలోచిత కృత్యములను దీర్చుకొని శివ పూజాదికమును జేసికొనుచుండిరి. మఱియును, వారందఱును గోబ్రాహ్మణ పూజ నుజేసి శ్రీరామదర్శనమునకుఁ బోవుచుండిరి. మఱియు నీవిధముగానే లక్ష్మణాదుల భార్యలుకూడ దుర్గాపూజాదికమును చేసికొని సీతామహాదేవిని దర్శించుచుండిరి. అనంతరమందు లక్ష్మణాదులును కుశాదులును తమగురునిముఖమువలన పౌరాణిక కథలను విని తమతమ గృహములకుఁబోదురు. అట్లుపోవుటకు ముందు శ్రీరాముని గృహమునందే యుపహారములను మధ్యాహ్నభోజనములను జేయుదురు. ఈవిధముగానే యూర్మిళాదులు సీతామహాదేవిచేతఁబిలువఁబడి సీతాగృహమునందే యుపహార భోజనాదులను గావింతురు. ఈవిధముగ శ్రీరాముఁడు సర్వకాలములయందును సంతోషముగఁ గాలమును గడపుచుండె.

ఇట్లని యానందరామాయణాంతర్గత వివాహకాండమునందలి
యేడవసర్గ ముగిసెను.

✱ యూపకేతుపరాక్రమ వర్ణనము. ✱

ఓశిష్యోత్తమా! విష్ణుదాసా! పిమ్మట నొక్కనాఁడు శివకాంతీపురమునందు నివసించియున్నవాఁడును మహారిపుఁడును, కంబుకంఠుఁడను నామధేయము కలవాఁడును నగు రాజు తనదు పుత్రికకు స్వయంవరమును జేయఁదలఁచినవాఁడై సకల రాజులను పిలిపింపఁదలఁచి సకల రాజులకును వేరువేరుగ పత్రికలను బంపె. అంతట సకల రాజులును తొల్లి భూరికీర్తియను రాజోత్తముని గృహమునందు పొందిన యవమానమును మనస్సునందుఁ బెట్టుకొని యుప్పుడు పోయినను మరల నవమానమును పొందుదు మనియెడు తలంపుతో కంబుకంఠుఁడు పంపిన పత్రికలను గైకొనకపోవుటయేకాక రాముని బాలకులను రప్పింపనియెడల మేము వచ్చెదము కాని లేనియెడల రామని చెప్పిపుచ్చిరి. అంతట నాకంబుకంఠుఁడు సకల రాజుల యభిప్రాయమును దెలిసికొని శ్రీరామునియందుఁ దనకుఁగూడ వైరము కలిగియుండుటచేత శ్రీరామునకు పత్రికను పంపనని సకల రాజులకును దెలిపె. అంతట సకల రాజులును రాముఁడు రాఁడని వినుటచేత కాంతిపట్టణమునకు స్వయంవరముకొఱకు వచ్చిరి. అప్పుడా కంబుకంఠుని పుత్రిక సౌధోపరిభాగమునందు విహరించుచుండఁగ నారదమునివరుఁ డక్కడకుఁబోయె. అంత నాకంబుకంఠుని పుత్రికయగు మదనసుందరియను నామె నారదమునివరుని బూజించి వినయముతో నిట్లనియె. ఓమునికులోత్తమా! నీవిప్పుడెక్కడనుండి వచ్చుచున్నావు. ఎక్కడకుఁ బోఁదలఁచితివి. అనిన విని నారదమునివరుఁడు చిరునగవును జూపుచు నిట్లనియె. ఓబాలికామణీ! నేను స్వర్గలోకమునుండి వచ్చుచున్నాను. అయో

ధ్యా పట్టణమునందు రాముని పుత్రులకు వేఱువేఱుగ వివాహములు జరుగుచున్నవని విని యారాముని గృహమునందు భోజనమును చేయుట కాకాశమార్గముచేత వచ్చుచున్నాఁడను. ఇట్లు వచ్చుచు నీకాంతీపట్టణమునకు బయట నానావిధములయిన సైన్యములు నివసించియుండుటను జూచి యివి యెవరిసైన్యములని విచారించితిని. అట్లు విచారించి పథికులవలన నిక్కడ నీస్వయంవర మహోత్సవము జరుగుచున్నదను వార్తను విని శ్రీరాముఁడుకూడ నిక్కడకే వచ్చియుండునని నిశ్చయించితిని. కావున శ్రీరాముని బాలకులతోఁగూడ నిక్కడనే చూడఁగలనని నిశ్చయించితిని. మఱియు నిక్కడ విచారింపకపోయినయెడల నా యాగమనము వ్యర్థమగునని తలఁచితిని. అట్లు నిశ్చయించి యిక్కడకు వచ్చిన రాజులతో రాముఁడు వచ్చినాఁడా! అని విచారింపఁగా శ్రీరాముఁడు రాలేదని వింటిని. అంతట శ్రీరాముఁడు రాకుండుటకుఁ దగిన యభిప్రాయమును దెలిసికొంటిని. ఆహా! సప్తద్వీపాధిపతియగు శ్రీరాముని బిలువక నీతండ్రి నీస్వయంవరమునకు నితర రాజులను పిలుచుట వెఱ్ఱితనమని తలఁచితిని. ఇప్పుడు నేనయోధ్యాపట్టణమునకుఁ బోవ నిశ్చయించితిని. ఓకన్యకామణీ! నీవు శ్రీరామునకు కోడలవు కాకపోవుటచేత మందభాగ్యురాలవైతివని తలఁచితిని. దైవయోగమున కెవరేమి చేయవచ్చునని చెప్పి యానారదమునివరుఁ డక్కడనుండి బయలువెడలి పోవుట కుద్యుక్తుఁడయ్యె. అప్పుడు మదనసుందరియను నాబాలిక నారదమహామునిని ప్రార్థించుచు ఖిన్నమైన చిత్తముకలదియును, కన్నీళ్లచేత వ్యాప్తమైన నేత్రములు కలదియును, వెలవెల పోవుచున్న మోముకలదియును, వణఁకుచున్న పెదవికలదియును రోమాంచముచేత వ్యాప్తమైన దేహముకలదియును, నగుచు నారదమునివరునితో నిట్లనియె. ఓ మునికులోత్తమా! నేను శ్రీరామునకు కోడలినగునట్లు చేయుము. నిన్ను శరణమును పొందితిని. నాప్రార్థన నంగీకరింపుమని యామునివరుని పాదములయందు శిరస్సును బెట్టి నమస్కరించె. అంతటనామునివరుఁడు మిగుల దయకలవాఁడై యిట్లనియె. ఓకన్యకా రత్నమా! నీవు విచారమును పొందకుము. నీవు శ్రీరామునకు కోడలవగునట్లు ప్రయత్నమును చేసెదనని చెప్పి యామునివరుఁడు తనయిచ్ఛానుసారిముగ బయలువెడలిపోయె. ఇంతలోపల యూపకేతువను రఘుకులోత్తముఁడు అయోధ్యాపట్టణమునుండి బయలువెడలి వనమునుచూచుచు తమసాతీరమునకుఁబోయె. కొంచెముగా సైన్యముతోఁ గూడుకొనియుండె. అట్లు సైన్యసమేతముగ వచ్చి తమసానదియందు మునిఁగి యనఁగా స్నానమును చెసి సంధ్యావందనాదికమును చేయుటకొఱకుఁగూర్చుండె. ఆసమయమునం దానారదమహాముని యవ్వోటునకు రాఁగాఁజూచి నమస్కరించి పూజించె. అట్లుపూజించి యోమునివర్యా! ఎక్కడకుఁ బోవుచున్నావనిన విని నారదమహాముని జరిగినవృత్తాంతమును సర్వమును దెలి

యుఁజెప్పె. ఆవృత్తాంతమును సర్వమును విని యాయూపకేతువు కోపోద్దీపితుఁడును మిగులఁ దర్పకలవాఁడును నైయిట్లనియె. ఓమునికులోత్తమా! సకలరాజుల కును శ్రీరామునియందుఁ బుట్టిన వైరబుద్ధి యుచితమైనది కాకపోవుటయేకాక సక లానర్థములను గలిగించునది యైయున్నది. నేను యుద్ధమునకు బయలువెడలిపో యి యుద్ధమునందు కంబుకంఠాది రాజులయొక్క బలమును జూచెదను. ఓముని కులోత్తమా! మీ యనుగ్రహముచేత సకలరాజులను జయించెదనని చెప్పి సేనతోఁ గూడనై దవదినమునందు కాంతిపట్టణమునకుఁ బోయె. అంతట నారదమునివరుఁడు సంతోషము కలవాఁడై శ్రీరామునిచూచుటకు బయలు వెడలిపోయె. పోయిరా మునిచేతఁ బూజింపఁబడి భోజనార్థముగఁ నిమంత్రితుఁడయ్యె. అంతట భోజనకా లమునందు యూపకేతువు కనఁబడకపోవుటచేత శ్రీరాముఁడు లక్ష్మణునితో నిట్ల నియె. ఓతమ్ముఁడా ! లక్ష్మణా ! మనయూపకేతువు కనఁబడలేదు. వాఁడెక్కడను న్నాఁడో పిలువుమనిన లక్ష్మణుఁడు మిగుల వేగముగ బయలువెడలిపోయి యూ పకేతు విక్కడకువచ్చెనుగదా? ఎక్కడకుఁబోయెనని యడిగి యాతమసానదివలన స్వల్ప సైన్యముతోఁగూడ కాంతిపట్టణమునకుఁ బోయెనని విని యతివేగముగ వచ్చి యావృత్తాంతమును సర్వమును శ్రీరామునితోఁజెప్పె. ఆవృత్తాంతమును సర్వమునువిని శ్రీరాముఁడు భోజనాదులను జేసిన పిమ్మట సభలోనికిఁ బోయి నా రద మహామునితో నిట్లనియె. ఓమునికులోత్తమా! అయిదాఱుదినములవఱకును నీ విక్కడనే నివసించియుండవలయుననియె. నారదమహామునియందుల కంగీకార మునుపొందె. అంతట రాత్రిభోజనసమయమునందుఁగూడ యూపకేతువు కనఁబడ క పోవుటచేత శ్రీరాముఁడు యూపకేతువును పిలువుమని లక్ష్మణునితోఁ జెప్పె. అంతట లక్ష్మణుఁడు బయలువెడలిపోయి మరల తమసానది సమగఁగా నింతవరకె క్కడకు రాలేదనియె. ఆవృత్తాంతమును విని బయలువెడలి వచ్చి యా విషయము శ్రీరామునకుఁదెలిపె. అట్లు యూపకేతువు రాకపోవుటకు శ్రీరాముఁ డు మిగులవ్యసనము కలవాఁడయ్యె. ఆవృత్తాంతమునువిని సీతామహాదేవికూడ మిగులవ్యసనము కలదయ్యె. అంతట నాసీతామహాదేవి మిగుల వేగముతోవచ్చి శ్రీరాముఁడు మొదలగువారితో నిట్లనియె. ఓరఘుకులోత్తములారా! మీరందఱు ను యూపకేతువును విడిచి యుపహారములనుభుజించుట యెట్లుసంభవించుచు న్నది. ఇట్లు చేయుటతగదు. యూపకేతువును వెదకుటకుఁ బ్రయత్నింపుఁడ నియె. అంతట నెల్లవారును మిగుల విహ్వలులైరి. అట్లెల్లవారును మిగుల వ్యసనము కలవారై యుండుటనుజూచి నారదమునివరుఁడు యూపకేతువు కాంతిపురమునకుఁ బోయెనని జరిగిన వృత్తాంతమును సర్వమునుదెలిపె. ఆవృత్తాంతమును సర్వమును విని శ్రీరాముఁడు సంతుష్టమనస్కుఁడై లక్ష్మణు నితో నిట్లనియె. ఓలక్ష్మణా ! మనశత్రుఘ్నుఁడు చతురంగబలముతోఁగూడ నిప్పు

డే బయలువెడలిపోవునట్లు చేయుమనియె. అంతలకు లక్ష్మణుఁడు సమ్మతించి చతురంగబలమును బాలకులను సహాయముచేసి యారాత్రియందే శత్రుఘ్నునిబంపెను. అప్పుడు శత్రుఘ్నుఁడు శ్రీరామునకు నమస్కరించి రథారూఢుఁడై యారవ దినమునాటికి కాంతిపురి సమీపమునకుఁబోయె. ఇంతలోపల సకల రాజులును కాంతిపట్టణమునందలి సభయందు సంతోషముకలవారై కూర్చుండిరి. ఆసమయమునందు మదనసుందరియను కన్యారత్నము శిబికారూఢురాలై బయలువెడలె. మఱియు నాసమయమునందా కన్యకారత్నము కొంచెముగ వాడిన మోము కలదియగుచు నారదునిచేతఁ జెప్పఁబడిన విషయమును స్మరించె. అప్పుడు వృద్ధోపమాత సభలోనిరాజుల నందఱినుజూపించె. ఆసమయమునందు యూపకేతువు మిగులవేగముగవచ్చి సభయందుఁ బ్రవేశించి మోహనాస్త్రమును బ్రయోగించి యాసభను సర్వమును మోహపెట్టె. మఱియు నాసమయమునం దెల్లవారను మోహమును పొందుటచేత వాహకులుగూడ మోహమును చెంది యాశిబికను క్రిందదింపిరి. అంతట యూపకేతువు తననామధేయమును వినిపించె. అప్పుడు మదనసుందరి యూపకేతువును వరించి నవరత్నమాలికను ఆయూపకేతువు యొక్క కంఠమునందు వైచె. అంతట నాయూపకేతువు మదనసుందరిని రథముపై నెక్కించుకొని కాంతి పట్టణముయొక్క బయలునకుఁబోయె. అట్లుపోయినపిమ్మట యూపకేతువు మదనసుందరితో నిట్లనియె. ఓతరుణీ! నీవు భయమును పొందకుము. ఇప్పుడునేనుసకల రాజులను జయించినాతోఁగూడ నయోధ్యాపట్టణమునకుఁ దీసికొనిపోయెద ననిన విని యామదనసుందరి యిట్లనియె. ఓరాజోత్తమా! ఇక్కడననేకులగు రాజులుగలరు. నీవొక్కఁడవు. మఱియు నసంఖ్యాతములగు సైన్యములు గలవు. నీవిందఱితో నేవిధముగ యుద్ధమును జేయఁగలవు. చేయఁజాలవని తోఁచుచున్నది. కావుననీవు యుద్ధమును చేయకుము. ఇప్పుడు సకలరాజులును సన్నద్ధులై వచ్చునంతలోపల నీవునన్ను నయోధ్యాపట్టణమునకుఁ దీసికొనిపొమ్ము. అనంతరమందు శ్రీరాముని సహాయముతో యుద్ధమును జేయుము. ఓరఘుకులోత్తమా! నీవుసాహసమును చేయకుమనియె. అట్లుమదనసుందరి చెప్పిన వాక్యములను విని యామదనసుందరి నూరార్చి మోహనాస్త్రము నుపసంహారమునుజేసె. అప్పుడు సకలరాజులును మదనసుందరిని బలాత్కారముగ యూపకేతువు తీసికొనిపోయిన వృత్తాంతమును విని యసంఖ్యాతములయిన తమతమ సైన్యములతోఁగూడ యుద్ధమును చేయుటకు బయలువెడలి పోయిరి. మఱియు నారాజులందఱును చంపికాసుమతుల స్వయంవర కాలమునందలి వైరముచేత మిగుల దర్పముకలవారైరి. అట్లు యుద్ధసన్నద్ధులై బయలువెడలి మదనసుందరితోఁగూడ రథారూఢుఁడై యున్న వాఁడును, మాలికచేత ప్రకాశించుచున్న హృదయముకలవాఁడును నగుయూపకేతువును జూచిరి. అనంతరమందా యూపకేతువుమీఁద నానావిధములయిన శస్త్రములను బ్రయోగించిరి.

అప్పుడు యూపకేతువు మిగుల వేగముగలవాఁడై ధనుష్టంకారమును జేయుచు వాయువ్యాస్త్రమును బ్రయోగించి యారాజులనందఱను దశదిక్కులకును బాఱఁదోలె. ఆసమయమునందు కంబుకంఠుఁడుకూడ పూర్వవైరమును స్మరించుచు నిప్పుడు తన కన్నియను బలాత్కారముగఁ గైకొనిపోవుటకు నధికమైన కోపముకలవాఁడయ్యె. అట్లు మిగుల కోపముకలవాఁడై తనసైన్యముతోఁగూడ దుందుభిఘోషములను బ్రమోగించుచు యుద్ధమును చేయుటకు బయలువెడలె. అప్పుడుయూపకేతువుకూడ దుందుభులయొక్క యధికమైనధ్వనినివినిరథారూఢుఁడై కాంతిపురముయొక్క బాహ్యప్రదేశమునందు నిలిచియుండె. అట్లు నిలిచియుండి ధనుష్టంకారమునుచేసి శస్త్రము నుసంధానముచేసె. అంతట తనమీఁదికి యుద్ధమునకు వచ్చిన వీరవరులమీఁద నానావిధములయిన బాణములను బ్రయోగించి యమపట్టణమునకుఁబంపె. అప్పుడు యూపకేతువుయొక్క పరాక్రమమును జూచి మిగిలినసైన్యముతోఁగూడుకొని యాకంబుకంఠుఁడిట్లనియె. ఓయూపకేతూ! నీవు నాతోఁ గూడ యుద్ధమును జేయుము. ఓ యూపకేతూ! దోమలవంటి యీ మానవులను జంపి పౌరుషము కలవాఁడ నైతినని తలఁచుచున్నావని చెప్పి యాయూపకేతువుమీఁద నేడు బాణములను బ్రయోగించె. అట్లు తనమీఁదఁ బ్రయోగించిన బాణములనుజూచి యూపకేతువు కోపోద్దీపితుఁడై యాబాణముల నేడింటిని తుత్తునియలుచేసె. అనంతరమందు తొమ్మిదిబాణములను బ్రయోగించి యాకంబుకంఠుని చాపధ్వజసారథులను నాశముచేసె. పిమ్మట కవచతురగములను ఖండించె. అంతట కంబుకంఠుఁడు గదను చేఁబూని యూపకేతువును మార్కొనియె. అప్పుడు యూపకేతువు తనబాణములచేత నాగదను వేయితునుకలుగఁజేసె. అంతట కంబుకంఠుఁడు దృఢమగు పిడికిలిపోటుచేత పొడువఁదలఁచి మిగుల వేగముతోవచ్చి యూపకేతువుయొక్క ఱొమ్మునఁ బొడిచె. అట్లు తన్ను పొడుచుటకువచ్చిన కంబుకంఠుని ధ్వజమందు బంధించి ఖడ్గమును గైకొని యాకంబుకంఠుని శిరస్సును భేదించుటకు ద్యుక్తుఁడయ్యె. ఆసమయమునందు మదనసుందరి మిగులఁ ద్వరకలదై ఖడ్గముతోఁ గూడిన యూపకేతుని హస్తమును పట్టుకొని యిట్లనియె. ఓరఘుకులోత్తమా! నా తండ్రియగుకంబుకంఠుని సంహరించుట యుచితమా? అన్నములో నీఁగపడినవిధముగ నీవుసభలో దుమికిబాధించితివి. ఆబాధయేచాలును. ఇప్పుడు నావచనమును విని నాతండ్రియగుకంబుకంఠుని సంహరింపక విడిచిపెట్టుమనియె. ఈవిధముగ మదనసుందరి చెప్పినవాక్యములనువిని నవ్వుచుఁదనచేతనున్న ఖడ్గమును విడిచిపెట్టి తనసూతునితో నిట్లనియె. ఓసారథీ! మనరథమును శీఘ్రముగ నయోధ్యాపట్టణమునకుఁ బోనిమ్మనినవిని యాసూతుఁడునిజసైన్యముతోఁ గూడ నయోధ్యాపట్టణమునకుఁబోవుట కారంభించె. ఆవిధముగ యూపకేతువు అయోధ్యాపట్టణమునకుఁ బోవుచు మార్గమధ్యమునందు తననిమిత్తముగ వచ్చుచున్న శత్రుఘ్నాది

బంధువులయొక్క కలకలధ్వనిని విని శత్రువులెవ్వరో వచ్చుచున్నా రనియెడుతలంపుతో ధనుష్టంకారమును చేసె. అట్లు ధనుష్టంకారమునుచేయుచు నీసేనాకలకల మెవ్వనిదై యుండునని యాలోచించె. అవ్విధముగ నాలోచించి తననామధేయముచేత చిహ్నితమైన బాణము నొక్క దానిని బ్రయోగించె. ఆబాణము యోజనాంతరదూరముననున్న శత్రుఘ్నునిసన్నిధియందుఁ బడెను. అట్లు తన పాదముల యొక్కయగ్రభాగమునందుఁ బడినబాణమును జూచి తొలుత మిగుల భయము గలవాఁడయ్యె. అనంతరమందా బాణము యొక్క మొదటి భాగమునందు యూప కేతువుయొక్కనామాక్షరము లుండుటను జూచి యూపకేతువు తనకెదురుగనుండు మార్గమున నున్నాఁడని తలఁచె. అట్లు నిశ్చయించి యాశత్రుఘ్నుఁడు స్వనామాంకిత బాణమును బ్రయోగించె. ఆబాణమతివేగముగఁబోయి యూపకేతువు యొక్క శిరస్సుమీఁదుగ వెనుకటిభాగమునందుఁ బడెను. అప్పుడాతఁడు తండ్రియొక్క బాణమని తెలిసికొని మిగుల సంతోషముకలవాఁడయ్యె. అనంతరమందు మిగుల వేగముగఁ బరుగిడిపోయి శత్రుఘ్నుని చూచి రథమునుండి దిగి తండ్రికి నమస్కరించె. అట్లు నమస్కరించి యనంతరమందు తాను కట్టి తెచ్చిన కంబుకంఠునిజూపె. అప్పుడు శత్రుఘ్నుఁడు తనకు మిత్రుఁడగు కంబుకంఠుని విడిపించె. పిమ్మట కంబుకంఠునివలన జరిగిన వృత్తాంతమును సర్వమును దెలిసికొనియె. అనంతరమందు శత్రుఘ్నుఁడు కంబుకంఠునిచేత ప్రార్థింపఁబడినవాఁడై కాంతిపట్టణమునకుఁ బోయె. అట్లు పోయినపిమ్మట కాంతిపట్టణమునకు బయలునుండి కంబుకంఠునియనుమతమును పొంది సుముహూర్తకాలమునకు వచ్చునట్లు శ్రీరామునకు దూతలమూలకముగ పత్రికను బంపె. అంతట కంబుకంఠుని యొక్కయును శత్రుఘ్నునియొక్కయును కొనివచ్చుదూతలు శ్రీరాముని పిలుచుట కతివేగముగఁ బోయిరి.

ఇట్లని యానందరామాయణాంతర్గత వివాహకాండమునందలి
యెనిమిదవసర్గ ముగిసెను.

✱ మదనసుందరీ వివాహవర్ణనము ✱

ఓశిష్యోత్తమా! విష్ణుదాసా! అంతట నాదూతలు అయోధ్యాపట్టణమునకుఁ బోయి యావృత్తాంతమును సర్వమును శ్రీరామునకుఁ దెలిపిరి. శ్రీరాముఁ డావృత్తాంతమును విని సీతామహాదేవికిఁగూడఁ దెలిపె. అంతట శ్రీరాముఁడు మిత్రబంధుపురోహితాదులతోఁగూడ నారదమునివరుని వెంటఁబెట్టుకొని కాంతిపట్టణ

మునకు బయలువెడలిపోయె. అప్పుడు కంబుకంఠుఁడు శ్రీరాముఁడు వచ్చుటను విని బంధుమిత్రామాత్యాదులతోఁగూడ నెదురుగఁబోయి శ్రీరామునకు నమస్కరించి గజారూఢుఁడై యున్నయూపకేతువును తనపట్టణములోనికిఁ దీసికొని పోయె. అప్పుడు వారస్త్రీలు నృత్యములను జేసిరి. తూర్యధ్వనులు మ్రోఁగుచుండె. ఆసమయమునందు కాంతిపట్టణమునందున్న స్త్రీలందఱును మేడలయందు నిలిచియున్నవారై రామయూపకేతువులమీఁద పుష్పవర్షములను గురిపించిరి. అంతట కంబుకంఠుఁడు శ్రీరామునకు నివసించుటకుఁ దగినగృహమును జూపె. అనంతరమందు శ్రీరాముఁడా గృహమునందునివసించి పురోహితాదులను రప్పించి సుముహూర్తమును విచారించె. పిమ్మట నానావిధము లయిన యుత్సవములచేత యూపకేతువునకు వివాహమునుచేసె. అనంతరమందు కంబుకంఠునిచేతఁ బూజింపఁబడి నానావిధములగు సరణములను గైకొని యూపకేతుమదనసుందరులను వెంటఁబెట్టుకొని శ్రీరాముఁ డయోధ్యాపట్టణమునకుఁ బోయె. అట్లు బయలువెడలిపోయి నానావిధములయిన మంగళవాద్యములతోఁగూడ నయోధ్యాపట్టణమునందుఁ బ్రవేశించె. అట్లు శ్రీరాముఁ డయోధ్యాపట్టణమునందుఁ బ్రవేశించునపుడు వారస్త్రీలు నృత్యములను చేసిరి. వందిమాగధులు స్తోత్రములను చేసిరి. పురస్త్రీ లందఱును మేడలయందు నిలిచి పుష్పవర్షములను గురిపించిరి. మఱియును, మార్గమునందు వృద్ధస్త్రీలెదురుగవచ్చి నీరాజనములనిచ్చిరి. ఇవ్విధములయిన యుత్సవములతోఁగూడ శ్రీరాముఁడు నిజగృహమునందు ప్రవేశించిన పిమ్మట శ్రీరాముఁడు లక్ష్మీపూజను నానావిధములయినదానములను చేసె. అనంతరమందు శ్రీరాముఁడు వస్త్రాదులచేత స్నేహితులు మొదలగువారిని బూజించె. పిమ్మట నెల్లవారిని వారివారిస్వస్థానములకుఁ బంపె. అంతట లవాదికుమారు లేవ్వురును తమతమ గృహములయందు తమతమ స్త్రీలతోఁగూడ నానావిధములయిన క్రీడలను సలుపుచుండిరి. కుశుఁడుకూడ చంపికతో విహరించుచుండె. అంతఁ గొంత కాలమునకు చంపికయందు కుశునివలనఁ దొమ్మిదిమందిబిడ్డలు పుట్టిరి. కుశునివలన నీకమీఁదట కుముద్వతియం దెనిమిదిమందిపుత్రులు పుట్టుదురు. మఱియును, చంపకమాలిని యనుపుత్రికయొక్కతె పుట్టును. ఆకుశునిపుత్రులలో జ్యేష్ఠుఁడగువాఁడు రాజ్యమును చేయగలఁడు. అట్లు కుశునకు తొమ్మిదిమందిపుత్రులు పుట్టినపిమ్మట క్రమముగ సుమతి మొదలుగాఁగల పదునలుగురుస్త్రీలును నెనిమిదేసిమందిపుత్రులును ఒక్కొక్కకన్యయును పుట్టిరి. ఇవ్విధముగ పదిరెండునూరులమంది పుత్రులను పౌత్రులను శ్రీరాముఁడు సీతతోఁగూడ లాలనమును చేయుచుండెను. మఱియును వారందఱును స్వయంవరములయందు మిగుల సౌందర్యముకల స్త్రీలనువివాహము చేసికొనిరి. ఆపుత్రపౌత్రాదులలో కొందఱు గాంధర్వవివాహములను చేసికొనిరి. మఱియును పుత్రపౌత్రాదులచేత వివాహముచేసికొనఁబడిన స్త్రీలసంఖ్య మితిలేని

దై యుండెను. అట్లు యూపకేతువుయొక్క వివాహమైనపిమ్మట నారదమునివరుఁడు సహస్రనామములచేత శ్రీరాముని స్తోత్రముచేసి యాకాశమార్గమున బయలువెడలి పోయెనని చెప్పి రామదాసుమరల నిట్లనియె. ఓశిష్యోత్తమా! విష్ణుదాసా! ఈవిధముగ శ్రీరాముఁడు చిరకాలము నానావిధములయిన భోగముల ననుభవించె. ఆవిషయముల నన్నిటిని వర్ణింప నెవ్వరికిని నలవికాదు. ఒకవేళ సర్వమును వర్ణించుటకు సామర్థ్యము కలిగి యుండెనేని వాల్మీకి కొక్కనికిమాత్రము కలిగి యుండును. కావుననే పరమశుభమును కలుగఁజేయునట్టి శ్రీరామచరితము నూఱుకోట్ల గ్రంథముచేత వాల్మీకిమునివరుఁడు వర్ణించె. ఓశిష్యోత్తమా! విష్ణుదాసా! ఈవిధముగ శ్రీరాముఁడు పుత్రపౌత్రాదులతోఁ గూడ సీతామహాదేవికి సంతోషమును గలిగించుచుండె. ఓశిష్యోత్తమా! విష్ణుదాసా! తొమ్మిది సర్గములు కలదియును, వినుటమాత్రముచేతనే మంగళములను కలుగఁ జేయునట్టిదియును, అయిన యీ వివాహకాండమును నీకుఁ దెలిపితిని. లోకములో నేమానవు లీవివాహకాండమును శ్రద్ధతో వినుచున్నారో యట్టివా రెన్నటికిని పుత్రపౌత్రాదులతోఁగూడ వియోగమును పొందరు. ధర్మమును కోరి శ్రవణపఠనములను జేయువాఁడు ధర్మమును పొందును. ధనార్థియగువాఁడు ధనమును పొందును. కామార్థియగువాఁడు కామములను పొందును. క్షేమమును కోరువాఁడు క్షేమమును పొందును. భార్యను కోరునట్టివారు పరమభక్తితో దీనిని పఠించువారు సద్భార్యనుపొందుదురు. భర్తనుగోరునట్టి స్త్రీలు పఠించినను విన్నను భర్తనుపొందుదురు. సుఖార్థులగువారు దీనిని పఠించినయెడల నీలోకమునందు స్త్రీసుఖాదులను పొందుటయేకాక పరలోకమునందుఁగూడ సుఖాదులను పొందుదురు. భర్తృమతియగునాఁతుది విన్నను పఠించినను భర్తృవియోగమును పొందదు. స్త్రీకాముకులగువారు పదునేడుదినములు భక్తిశ్రద్ధలతో శ్రవణమననములను చేసినయెడల స్త్రీసుఖమును పొందుదురు. మూర్ఖుఁడుకూడ సంవత్సరకాలము శ్రవణ మననాదులను చేసెనేని స్త్రీలను పొందును. అనుష్ఠానక్రమ మెద్దియనిన ప్రథమసర్గమును పఠించి తొమ్మిదవదినమునం దీవివాహకాండమును ముగింపవలయును. పదియవదినమునం దెనిమిదిసర్గములను పఠింపవలయును. ఇట్లు పదునేడు దినములవఱకును ననుష్ఠానమును చేయవలయును. మఱియును, ఇట్లు కాదేని ప్రథమదివసమునందే వివాహకాండమును సర్వమును పఠింపవలయును. పరదినమునందు తొమ్మిది సర్గములను రెండు పర్యాయములు శ్రవణ మననములను చేయవలయును. ఈవిధముగఁ దొమ్మిది దినములు శ్రవణమును జేసి పదియవదినమునందు ఈ వివాహకాండమునం దెనిమిది పర్యాయములు శ్రవణపఠనములను జేయవలయును. మఱియు నీ విధముగ పదిరెండుమాసముల కాల మనుష్ఠింపవలయును. ఇట్లనుష్ఠించినయెడల నవ్వుమోము కలదియును, సుందరమైన నాసిక కలదియును, దివ్యమైన రూ

షముకలదియును, మనోహరురాలును, అయిన భార్యను పొందును. మఱియు నో శిష్యోత్తమా! విష్ణుదాసా! ఆనందరామాయణ మధ్యగతమైన యీ వివాహకాండము సకలాభీష్టములను నెఱవేర్చునని తెలిసికొనుము.

ఇట్లని శతకోటి రామచరిత్రములోనిదియును, వాల్మీకిమునివరునిచేత రచింపఁబడినదియును, అయిన శ్రీమదానంద రామాయణమునందలి వివాహకాండమునందుఁ రామదాస విష్ణుదాస సంవాదమును తెలుపునట్టి తొమ్మిదవసర్గ ముగిసెను.

ఆనందరామాయణము, వివాహకాండము

సంపూర్ణము.

మహాద్యుతిః, వ్యాసో వాచస్పతిస్సర్వదః పితా సురమర్దనః । జానకీవల్లభశ్శ్రీ
మాన్ప్రకటః ప్రీతివర్ధనః । సంభవోఽతీంద్రియో వేద్యో నిర్దేశో జాంబవత్ప్రభుః ।
మదనో మన్మథో వ్యాపీ విశ్వరూపో నిరంజనః । నారాయణోఽగ్రణీస్సాధు ర్జటా
యుఃప్రీతివర్ధనః । నైకరూపో జగన్నాథ స్సురకార్యహితః ప్రభుః । జితక్రోధో జితా
రాతిః ప్లవగాధిపరాజ్యదః । వసుదస్సుభుజో నైకమాయో భవ్యః ప్రమో
దనః । చండాంశుస్సిద్ధిదః కల్పశ్శరణాగతవత్సలః । అంగదో రోగహర్తా చ మంత్రి
జ్ఞో మంత్రభావనః । సౌమిత్రిర్వత్సలో ధుర్యో వ్యక్తావ్యక్తస్వరూపధృక్ । వసిష్ఠో
గ్రామణీశ్శ్రీమా ననుకూలః ప్రియంవదః । అతులస్సాత్త్వికో ధీర శ్శరాసనవిశారదః ।
జ్యేష్ఠస్సర్వగుణోపేత శ్శక్తిమాంస్తాటకాంతకః । వైకుంఠః ప్రాణినాం ప్రాణః కమ
ఠః కమలాధిపః । గోవర్ధనధరో మత్స్యరూపః కారుణ్యసాగరః । కుంభకర్ణప్రభేత్తా చ
గోపీగోపాలసంవృతః । మాయావీ వ్యాపకో వ్యాపీ రేణుకేయబలాపహః । పినాకమ
థనో వంద్య స్సమర్థో గరుడధ్వజః । లోకత్రయాశ్రయో లోక భరితో భరతాగ్రజః । శ్రీ
ధరస్సంగతి ర్లోకసాక్షీ నారాయణో విభుః । మనోరూపీ మనోవేగీ పూర్ణః పురుషపుంగవః ।
యదుశ్రేష్ఠో యతిప్రాప్య స్సర్వాపన్నివారకః । తేజోరాశిర్ధరాధారో నానాజీవస్స్వ
రూపధృక్ ॥ సంసారమథనో వంద్య శ్శాంతో భరతవందితః । శబ్దాతిగో గభీరాత్మా కోమ
లాంగః ప్రజాగరః । లోకోర్ధ్వగ శ్శేషశాయీ క్షీరాబ్ధినిలయోఽమలః । ఆత్మజ్యోతిరదీనా
త్మా సహస్రార్చిస్సహస్రపాత్ । అమృతాంశుర్మహీభర్తా నివృత్తవిషయస్పృహః ।
త్రికాలజ్ఞో మునిస్సాక్షీ విహాయసగతిః కృతీ । పర్జన్యః కుముదో భూతావాసః కమలలో
చనః । శ్రీవత్సవక్షా శ్శ్రీవాసో వీరహా లక్ష్మణాగ్రజః । లోకాభిరామో లోకారిమర్దనస్సే
వకప్రియః । సనాతనతమో మేఘ శ్యామలో రాక్షసాంతకః । దివ్యాయుధధర శ్శ్రీమాన
ప్రమేయో జితేంద్రియః । భూదేవవంద్యో జనకప్రియకృత్ప్రపితామహః । ఉత్తమస్సా
త్త్వికస్సత్య స్సత్యసంధస్త్రివిక్రమః । సువృత్తస్సుగమస్సూక్ష్మస్సుఘోషస్సుఖద
స్సుహృత్. దామోదరోఽచ్యుత శ్శార్ఙ్గీ వామనో మధురాధిపః । దేవకీనందన శ్శౌరి
శ్శూరః కైటభమర్దనః । సప్తతాలప్రభేత్తా చ మిత్రవంశప్రవర్ధనః । కాలస్వరూపీ
కాలాత్మా కాలః కల్యాణదః కవిః । సంవత్సరో ఋతుః పక్షో హ్యయనో దివసో యు
గః । స్తవ్యో వివిక్తో నిర్లేపస్సర్వవ్యాపీ నిరాకులః । అనాదినిధన స్సర్వలోకపూ
జ్యో నిరామయః । రసో రసజ్ఞ స్సారజ్ఞో లోకసారో రసాత్మకః । సర్వదుఃఖాతిగో
విద్యారాశిః పరమగోచరః । శేషో విశేషో విగతకల్మషో రఘుపుంగవః । వర్ణశ్రే
ష్ఠో వర్ణభావ్యో వర్ణో వర్ణగుణోజ్జ్వలః । కర్మసాక్షీ గుణశ్రేష్ఠో దేవాసురవరప్ర
దః । దేవాధిదేవో దేవర్షి ర్దేవాసురవరప్రదః । సర్వదేవమయశ్చక్రీ శార్ఙ్గపా
ణీ రఘూత్తమః । మనో బుద్ధిరహంకారః ప్రకృతిః పురుషోఽవ్యయః । న్యాయ్యో
న్యాయీ నయీ శ్రీమా న్నయో నగధరో ధ్రువః । లక్ష్మీవిశ్వంభరాభర్తా దే

మేంద్రో వాలిమర్దనః । బాణారిమర్దనో యజ్వా నృత్తమో మునిసేవితః। దేవాగ్రణీ
శ్శివధ్యానతత్పరః పరమః పరః । సామగేయః ప్రియః శూరః పూర్ణకీర్తిస్సులోచనః॥
౨౦॥ అవ్యక్తలక్షణోఽవ్యక్తో దశాస్యద్విపకేసరీ । కలానిధిః కలానాథః కమలానంద
వర్ధనః। పుణ్యః పుణ్యాధికః పూర్ణః పూర్వః పూరయితా రవిః। జటిలః కల్మషధ్వాంత ప్ర
భంజన విభావసుః । జయీ జితారిస్సర్వాది శ్శమనో భవభంజనః। అలంకరిష్ణురచలో
రోచిష్ణుర్విక్రమోత్తమః। ఆశుశ్శబ్దపతిశ్శబ్దా గోచరో రంజనో లఘుః । నిశ్శబ్దః పురుషో
మాయీ స్థూలస్సూక్ష్మో విలక్షణః। ఆత్మయోనిరయోనిశ్చ సప్తజిహ్వస్సహస్రపా
త్। సనాతనతమస్స్రగ్వీ పేశలో జవినాంవరః । శక్తిమాన్ శంఖభృన్నాథో గదాధర
రథాంగభృత్। నిరీహో నిర్వికల్పశ్చ చిద్రూపో వీతసాధ్వసః । శతాననస్సహస్రాక్ష
శ్శతమూర్తిర్ఘనప్రభః । హృత్పుండరీకశయనః కఠినో ద్రవ ఏవచ । సూర్యో గ్రహ
పతిశ్శ్రీమాన్ సమర్థోఽనర్థనాశనః। అధర్మశత్రూ రక్షోఘ్నః పురుహూతః పురుష్టుతః।
బ్రహ్మగర్భో బృహద్గర్భో ధర్మధేనుర్ధనాగమః। హిరణ్యగర్భో జ్యోతిష్మాన్ సులలాట
స్సువిక్రమః। శివపూజారతశ్శ్రీమాన్ భవానీప్రియకృద్వశీ। నరో నారాయణశ్శ్యామః
కపర్దీ నీలలోహితః। రుద్రః పశుపతి స్థాణు ర్విశ్వామిత్రో ద్విజేశ్వరః। మాతామహో
మాతరిశ్వా విరించిర్విష్టరశ్రవాః।అక్షోభ్యస్సర్వభూతానాం చండస్సత్యపరాక్రమః।
వాలఖిల్యో మహాకల్పః కల్పవృక్షః కలాధరః। నిదాఘస్తపనో మేఘ శ్శుక్రః పరబలా
పహృత్ । వసుశ్రవాః కవ్యవాహః ప్రతప్తో విశ్వభోజనః। రామో నీలోత్పలశ్యా
మో జ్ఞానస్కంధో మహాద్యుతిః । కబంధమథనో దివ్యః కంబుగ్రీవశ్శివప్రియః । సు
ఖో నీలస్సునిష్పన్నస్సులభశ్శిశిరాత్మకః। అసంసృష్టోఽతిథిశ్శూరః ప్రమాథీ పాపనాశ
కృత్। పవిత్రపాదః పాపారి ర్మణిపూరో నభోగతిః।ఉత్తారణో దుష్కృతిహా దుర్ధర్షో దు
స్సహోబలః। అమృతేశోఽమృతవపు ర్ధర్మీ ధర్మః కృపాకరః। భర్గో వివస్వానాదిత్యో యో
గాచార్యో దివస్పతిః। ఉదారకీర్తి రుద్యోగీ వాఙ్మయస్సదసన్మయః । భక్తకల్పద్రుమః
శ్రీమాన్ సర్వధిష్ఠానః షడాననః । చతుర్వర్గఫలం వర్ణ శ్శక్తిత్రయఫలం విధిః। నిధాన
గర్భో నిర్వ్యాజో నిరీశో వ్యాలమర్దనః।శ్రీవల్లభశ్శివారంభః శాంతో భద్రస్సమంజసః ।
భూశాయీ భూతికృద్భూతి ర్భూషణో భూతవాహనః।అకాయో భక్తకాయస్థః కాలజ్ఞా
నీ మహాపటుః। పరార్ధవృత్తిరచలో వివిక్తశ్శ్రుతిసాగరః। స్వభావభద్రో మధ్యస్థస్సంసార
భయనాశనః। వేద్యో వైద్యో వియద్గోప్తా సర్వామరమునీశ్వరః। సురేంద్రః కారణం
కర్మ కరః కర్మీ హ్యధోక్షజః। ధైర్యోగ్రధుర్యో ధాత్రీశస్సంకల్పశ్శర్వరీపతిః। పరమార్థగు
రుర్దృష్టిస్సుచిరాశ్రితవత్సలః । విష్ణుర్జిష్ణుర్విభుర్యజ్ఞో యజ్ఞేశో యజ్ఞపావకః । ప్ర
భుర్విష్ణుర్గ్రసిష్ణుశ్చ లోకాత్మా లోకపావకః । కేశవః కేశిహా కావ్యః కవిః కారణ
కారణం । కాలకర్తా కాలశేషో వాసుదేవః పురుష్టుతః। ఆదికర్తా వరాహశ్చ వా
మనో మధుసూదనః। నారాయణో నరో హంసో విష్వక్సేనో జనార్దనః। విశ్వకర్తా మ
హాయజ్ఞో జ్యోతిష్మాన్ పురుషోత్తమః। వైకుంఠః పుండరీకాక్షః కృష్ణస్సూర్యస్సు

ర్చితః। నారసింహోమహాభీమో వజ్రదంష్ట్రోనఖాయుధః॥ ఆదిదేవోజగత్కర్తా యోగీశోగరుడధ్వజః। గోవిందోగోపతిర్గోప్తా భూపతిర్భువనేశ్వరః। పద్మనాభో హృషీకేశో ధాతాదామోదరఃప్రభుః। త్రివిక్రమస్త్రిలోకేశో బ్రహ్మేశః ప్రీతివర్ధనః। సన్న్యాసీశాస్త్రతత్త్వజ్ఞో మందరేగిరికేతనః। వామనోదుష్టదమనోగోవిందోగోపవల్లభః। భక్తప్రియోచ్యుత స్సత్యస్సత్యకీర్తిర్ధృతిస్స్మృతిః। కారుణ్యః కరుణోవ్యాసో పాపహాశాంతివర్ధనః। బదరీనిలయశ్శాంత స్తపస్వీ వైద్యుతః ప్రభుః। భూతావాసోమహావాస శ్శ్రీనివాసశ్శ్రియఃపతిః। తపోవాసోముదావాస స్సత్యవాసస్సనాతనః। పురుషః పుణ్యవాన్పుణ్యః పుష్కరాక్షో మహేశ్వరః। పూర్ణమూర్తిః పురాణజ్ఞః పుణ్యదఃప్రీతివర్ధనః। పూర్ణరూపః కాలచక్రప్రవర్తన స్సమాహితః। నారాయణఃపరంజ్యోతిః పరమాత్మాసదాశివః। శంఖీచక్రీగదీశార్ఙ్గీ లాంగలీముసలీహలీ। కిరీటీకుండలీహారీ మేఖలీకవచీధ్వజీ। యోధాజేతామహావీర్య శ్శత్రుఘ్నశ్శత్రుతాపనః। శాస్తాశాస్త్రకరశ్శాస్త్రం శంకరశ్శంకరస్తుతః। సారథి ర్సాత్త్వికస్స్వామీ సామవేదప్రియ స్తథా। పవనస్సంహతశ్శక్త స్సంపూర్ణాంగస్సమృద్ధిమాన్। స్వర్గదఃకామదశ్శ్రీదః కీర్తిదఃకీర్తిదాయకః। మోక్షదఃపుండరీకాక్షః క్షీరాబ్ధికృతకేతనః। సర్వాత్మాసర్వలోకేశః ప్రేరకఃపాపనాశనః। వైకుంఠఃపుండరీకాక్ష స్సర్వదేవనమస్కృతః। సర్వవ్యాపీజగన్నాథ స్సర్వలోకమహేశ్వరః। సర్గస్థిత్యంతకృద్దేవ స్సర్వలోకసుఖావహః। అక్షయశ్శాశ్వతోనంతః క్షయవృద్ధివివర్జితః। నిర్లేపోనిర్గుణస్సూక్ష్మో నిర్వికారోనిరంజనః॥ సర్వోపాధివినిర్ముక్త స్సత్తామాత్రవ్యవస్థితః। అవికారీవిభుర్నిత్యః పరమాత్మాసనాతనః। అచలోనిశ్చలోవ్యాపీ నిత్యతృప్తోనిరాశ్రయః। శ్యామాయువాలోహితాక్షో దీప్తాస్యోమితభాషణః। ఆజానుబాహుస్సుముఖస్సింహస్కంధోమహాభుజః। సత్యవాన్గుణసంపన్న స్స్వయమాసస్వతేజసా। కాలాత్మా భగవాన్కాలః కాలచక్రప్రవర్తకః। నారాయణఃపరంజ్యోతిః పరమాత్మాసనాతనః। విశ్వకృద్విశ్వభోక్తాచ విశ్వగోప్తాచశాశ్వతః।విశ్వంభరోవిశ్వమూర్తి ర్విశ్వాత్మా విశ్వభావనః। సర్వభూతసుహృచ్ఛాంత స్సర్వభూతానుకంపనః। సర్వేశ్వరస్సర్వశర్వస్సర్వదాశ్రితవత్సలః। సర్వగస్సర్వభూతేశ స్సర్వభూతాశయస్థితః। అభ్యంతరస్థ స్తమసశ్ఛేత్తానారాయణఃపరః। అనాదినిధనస్స్రష్టా ప్రజాపతిపతిర్హరిః। నరసింహోహృషీకేశ స్సర్వాత్మాసర్వదృగ్వశీ। జగతస్తస్థుషశ్చైవ ప్రభుర్నేతాసనాతనః। కర్తాధాతావిధాతాచ సర్వేషాంపతిరీశ్వరః। సహస్రమూర్ధావిశ్వాత్మా విష్ణుర్విశ్వభుగవ్యయః। పురాణపురుషశ్శ్రేష్ఠ స్సహస్రాక్షస్సహస్రపాత్। తత్త్వంనారాయణోవిష్ణు ర్వాసుదేవస్సనాతనః। పరమాత్మాపరంబ్రహ్మ సచ్చిదానందవిగ్రహః। పరంజ్యోతిఃపరంధామ పరాకాశఃపరాత్పరః। అచ్యుతః పురుషః కృష్ణశ్శాశ్వతశ్శివఈశ్వరః। నిత్యస్సర్వగతస్థాణూ రుద్రస్సాక్షీప్రజాపతిః। హిరణ్యగర్భస్సవితా లోకకృల్లోకభుగ్విభుః।

ఓంకారవాచ్యో భగవాన్ శ్రీభూనీలాపతిః ప్రభుః॥ సర్వలోకేశ్వరశ్శ్రీమాన్ సర్వజ్ఞస్సర్వతోముఖః। స్వామీ సుశీలస్సులభ స్సర్వగస్సర్వశక్తిమాన్। నిత్యస్సంపూర్ణకామశ్చ నైసర్గికసుహృత్సుఖీ॥ కృపాపీయూషజలధిశ్శరణ్య స్సర్వదేహినామ్। శ్రీమాన్నారాయణస్స్వామీ జగతాం ప్రభురీశ్వరః। మత్స్యః కూర్మో వరాహశ్చ నారసింహోఽథ వామనః॥ రామో రామశ్చ కృష్ణశ్చ బౌద్ధః కల్కిః పరాత్పరః। అయోధ్యేశో నృపశ్రేష్ఠః కుశబాలః పరంతపః। లవబాలః కంజనేత్రః కంజాంఘ్రిః పంకజాననః। సీతాకాంత స్సౌమ్యరూప శ్శిశుజీవనతత్పరః। సేతుకృచ్చిత్రకూటస్థ శ్శబరీసంస్తుతః ప్రభుః। యోగిధ్యేయశ్శివధ్యేయ శ్శాస్తా రావణదర్పహా॥ శ్రీశ శ్శరణ్యో భూతానాం సంశ్రితాభీష్టదాయకః। అనంతశ్శ్రీపతిర్రామో గుణభృన్నిర్గుణో మహాన్। ఏవమాదీని నామాని హ్యసంఖ్యాన్యపరాణి చ" అను సహస్రనామములలో నొక్కొక్క నామమును సకలపాపములను నశింపఁజేయునట్టిదై యున్నది. ఓ పార్వతీ! సహస్రనామముల ఫలము సకలైశ్వర్యములును కలుగుటయే యని యెఱుఁగవలయును. మఱియు నో పార్వతీ! ఈసహస్రనామస్తోత్రము సర్వసిద్ధులను కలుగఁజేయునదియును, మిగుల పావనమైనదియును, భుక్తిముక్తిఫలముల నిచ్చునట్టిదియనియును, తెలియవలయును. ఓ పార్వతీ, సపుత్రుఁడగు వినాయకుని చేత ఈసహస్రనామస్తోత్రము గానము చేయఁబడినది. పూర్వమునందు వినాయకుఁడు సనత్కుమారునకుఁ జెప్పిన సహస్రనామములను నేనిప్పుడు నీకు బోధించితిని. ఈసహస్రనామములను భక్తితోఁ బఠించువాఁడు బ్రహ్మపదమును పొందును. ఈరామనామసహస్ర మను సింహనాదమును విన్నమాత్రముచేతనే పాపములనియెడు గజములు నశించిపోవును. ఓ పార్వతీ! బ్రహ్మహత్య, సురాపానము, గురుతల్పగమనము, శరణాగతవధ, మిత్రవిశ్వాసఘాతము, మాతృహత్య, పితృఘాతము, భ్రూణహత్య, వీరహత్య, ఆనుపాతకము లనేకకోట్లు చేసినను అవియన్నియును రామనామసహస్రపఠనముచేత నశించును. మఱియు నో పార్వతీ! అనేకములయిన యుపపాతకములు కూడ నశించును. ఒక్కసంవత్సరము పరిమితికల కాలము ఈరామనామసహస్రమును పఠించువాఁడు నానావిధములయిన సుఖముల ననుభవించి మోక్షమును పొందుననియె నని చెప్పి సూతుఁడు శౌనకాదిమునివరులతో నిట్లనియె. ఓ శౌనకమునివర్యా! ఈ విధముగ రామనామసహస్రమును పరమశివుఁడు పార్వతి కుపదేశించె. ఆవిషయమును సర్వమును నీకుఁ దెలిపితినని చెప్పి రామదాసు మరల నిట్లనియె. ఓ శిష్యోత్తమా! రామనామసహస్రమును నీవడిగిన విధముగఁ దెలిపితిని. ఈరామనామసహస్రముచేత నారదుఁడు సభయందు శ్రీరాముని స్తోత్రముచేసె. ఈరామనామసహస్రము భుక్తిముక్తులను గలుగఁ జేయునట్టిది. మఱియును, సకలపాపనాశకమును, సకలసౌఖ్యములను గలిగించునదియును నై యున్నది. మఱియు నీరామసహస్రనామము జన్మమును పోఁగొట్టునట్టిదియును, ము

ఖ్యముగ భక్తజనులను పాలించునట్టిదియును, స్త్రీపుత్రమిత్రాదులనిచ్చునట్టిదియు నునై యున్నది.

ఇట్లు రాజ్యకాండములోని మొదటిసర్గ ముగిసెను.

---

* శ్రీరాముడు దేవవృక్షములను దెచ్చుట. *

అట్లు రామదాసువలన రామసహస్రనామములను విన్నపిమ్మట విష్ణుదాసిట్లనియె. ఓగురూత్తమా! నీవు రామనామసహస్రమును చెప్పినపుడు నాకొక సందేహము కలిగినది. అదియెద్దియనియెదవేని చెప్పెదనువినుము. శ్రీరాముని కల్పతరువుక్రింద నున్న సువర్ణపీఠమునందున్నవానినిగా ధ్యానమును చేసితివి కదా? స్వర్గలోకమునందున్న కల్పవృక్షము అయోధ్యాపట్టణములోని శ్రీరామునిగృహమునకెట్లువచ్చెను. ఈసంశయమును పోగొట్టి నన్ను గృతార్థునిగాజేయుమనినవిని శ్రీరామదాసిట్లనియె. ఓశిష్యోత్తమా! విష్ణుదాసా! నీవుచక్కగ ప్రశ్నమునుచేసితివి. సావధానమనస్కుడవై వినుము. తొల్లియొకనాడు శ్రీరామునిజూచుటకు దుర్వాసోమునివరుడువచ్చెను. ఆమునివరుడువచ్చునపుడు తన శిష్యులతోగూడవచ్చెనని యోజించె. ఓహో శ్రీమహావిష్ణువు రామరూపముతో నవతరించెననుటను నేను గుర్తెఱుగుదును. అయినను శ్రీరాముని పరాక్రమమును సకలలోకములవారికిని కనబరచెదనని నిశ్చయించి శిష్యులతోగూడ నయోధ్యాపట్టణమునందు ప్రవేశించె. అట్లుప్రవేశించి యెనిమిదికోటికట్లను దాటి సీతామహాదేవినివసించు గృహమునకుబోయె. అట్లు వచ్చి వాకిట శిష్యులతోగూడ నిలిచియున్న మునివరుని దుర్వాసోమునివరునిగా దెలిసికొని కావలివారు మిగుల వేగముగబోయి దాసీముఖమునలన రహస్యస్థలమునందున్న రామునకు దెలిపిరి. అంతట శ్రీరాముడామునివరున కెదురుగనేగుదెంచె. వచ్చియామునివరునితోడుకొని పోయి సీతామహాదేవితోగలసి నాసనాదికమిప్పించె. అప్పుడు శ్రీరామునితో నామునివరుడిట్లనియె. ఓరఘుకులోత్తమా! నేనిప్పుడు వేయిసంవత్సరములాచరింపదగిన యుపవాసవ్రతమును చేసిముగించితి. కావున నోరఘుకులోత్తమా! మఱిధేన్వనలములనువదలి భోజనమును కోరుచున్నాను. సిద్ధాన్నమును శిష్యసహితుడనగు నాకు సమర్పింపుము. మఱియు నోరఘుకులోత్తమా! నాకిష్టమయినదియును, నానావిధ పక్వాన్నములతోగూడుకొనినదియును నగు నన్నమునుసిద్ధముచేసి యీశ్వరపుష్పములను నన్ను బూజించుటకు దీసికొనిరమ్ము. గృహస్థధర్మమును నెరవేర్చుకొనదలచితివేని నన్నుబూజింపుము. నన్నుబూజించుటకు దగినశక్తి లేనియెడల నన్నువిడిచిపెట్టుము. మఱియొకచోటునకు బోయెదననినవిని శ్రీరాముడునవ్వి మిగులవినయముతో నీయిష్టానుసారముగ సర్వమును నంగీకరించితిననియె. అట్లు శ్రీరాముడుచెప్పిన వాక్యమునువిని దుర్వాసోమునివరుడు సంతోషమునుపొంది యిట్లనియె. ఓరఘుకులోత్తమా! నేనుబోయి నర

యూనదియందు స్నానమునుచేసి శీఘ్రముగ వచ్చెదను. నేనువచ్చునంతలోపల సర్వమును సిద్ధముగఁ జేయుమని చెప్పి స్నానముకొఱకు బయలువెడలిపోయె. ఆసమయమందు లక్ష్మణాదులును సీతాదులును కుశాదిబాలకులును బంధువులు మొదలగువారును మిగుల భయమునుచెంది శ్రీరామునితో నిట్లనిరి. ఓరఘుకులోత్తమా! దుర్వాసోమునివరునిచేత నేవిషయము కోరఁబడినది ? గోవహ్నిముఖులను వదలి యీమునివరుని కన్నము నెట్లుపెట్టఁగలవనిరి. అంతట శ్రీరాముఁడు లక్ష్మణునిచేత నొకపత్రమును దెప్పించి దానియందుఁ దనయభిలషితమును వ్రాసి దానినొకబాణమునకుఁ గట్టి యాబాణమును విడిచిపెట్టె. అంతట నాబాణము వాయువేగముతో నమరావతీపట్టణమునకుఁ బోయె. పోయి సుధర్మయందున్న దేవేంద్రుని ముంగలఁబడె. అప్పుడు దేవేంద్రుఁ డాబాణమునుచూచి భయవిహ్వలుఁడై యీబాణ మెవ్వనిదోయని యోచించి కొంతసేపటికి రామునిబాణమని యాపత్రికద్వారా తెలిసికొని యాపత్రమునకు నమస్కరించి దేవతలందఱును వినునట్లుచదివె. అంతలోపల నాబాణము బయలువెడలిపోయి మరల శ్రీరాముని యంబులపొదియందుఁ బ్రవేశించె. అంతట నక్కడ దేవేంద్రుఁడు భయవిస్మయములతోఁ గూడుకొనినవాఁడై యాపత్రికలోని విషయమును దేవతలకు వినిపించె. ఆవిషయము లెవ్వియనియెదవేని వివరించి చెప్పెదను. "ఓ ఇంద్రుఁడా! నీవు సుఖముగ స్వర్గలోకమునందుండుము. సర్వకాలములయందును నిన్ను స్మరించుచున్నాను. నానియోగమును వినుము. నేనిప్పు డొక్కవిషయమును యాచించెదను. దుర్వాసోమునివరుఁడు నేయి సంవత్సరములకాల ముపవాసవ్రతము నవలంబించుటచేత మిగుల క్షుధితుఁడై యఱువదివేలమంది శిష్యులతోఁగూడ వచ్చి గోవహ్నిముఖులకుం దనితరములయిన వానివలనఁ గలిగిన యన్నమును పెట్టి మమ్ముల తృప్తిపొందింపుమని యడిగె. అందులకు నేనంగీకరించితిని. మఱియు నమ్మునివరుఁడు మానవులచేతఁ జూడఁబడని పుష్పములచేతఁ బూజింపుమని యడుగఁగా దానికిని నంగీకారమును పొందితిని. ఇప్పుడామునివరుఁడు శిష్యులతోఁగూడ స్నానమునకు పోయియున్నాఁడు. కావున నిప్పుడు సముద్రమువలనఁ గలిగిన కల్పవృక్ష పారిజాతవృక్షములను పంపుము. ఆలస్యమునుచేయకుము. రావణునిశిరస్సునందుఁ బడినబాణమును కోరకుము" అనునట్టివిషయములను వినిపించి దేవతలతోడ నాలోచించి పారిజాతకల్పవృక్షములు గైకొని దేవతలతోఁగూడ నాదేవేంద్రుఁ డయోధ్యాపట్టణమునకువచ్చె. అట్లు దేవేంద్రుఁడు వచ్చుటనువిని లక్ష్మణుఁ డెదురుగఁబోయి యాయింద్రుని దోడ్కొనిపోయి సభయందున్న శ్రీరామునిజూపె. అప్పుడు దేవేంద్రుఁడు పారిజాతకల్పవృక్షములను సమర్పించి శ్రీరామునకు నమస్కరించి తగినయాసనమునందుఁ గూర్చుండె. ఇంతలోపల దుర్వాసోమునివరుఁడొక శిష్యునిపిలిచి శ్రీరాముఁ డేమి చేయుచున్నాఁడో చూచిరమ్మనియె. మఱియును, మననిమిత్తము సిద్ధముచేసిన

యన్నాదికము మనకు చాలునో లేదో చూచిరమ్మనియె. మఱియును, ఒకవేళ శ్రీరాముఁడు ప్రయత్నమును చేయకయే యూరకున్నాఁడో తెలిసికొనుము. ఈవిషయములను జక్కఁగఁ దెలిసికొని రమ్మనియె. అంతట నాశిష్యుఁడు నట్లేయని శ్రీరామునిగృహమునకుఁ బోయెను. అట్లుపోయి కల్పవృక్షపారిజాతదేవేంద్ర సీతలతోఁ గూడుకొనిన శ్రీరామునిఁ జూచి సంతోషించి మరల దుర్వాసోమునివరునిదగ్గరకుఁ బోయె. పోయి జరిగినవృత్తాంతమును సర్వమును దెలియఁజెప్పె. ఆవృత్తాంతమును విని యామునివరుఁడు మిగుల నాశ్చర్యము కలవాఁడై శిష్యులతోఁ గూడ శ్రీరామునిగృహమునకుఁ బోయె. అట్లువచ్చుచున్న మునివరునిఁజూచి శ్రీరాముఁడు దేవతలతోఁ గూడ నెదురుగఁబోయి నమస్కారమునుచేసి లోపలికిఁ గొనివచ్చి తగినయాసనమును సమర్పించె. పిమ్మట నమ్మునివరునకును శిష్యులకును పారిజాతపుష్పములచేత పూజనుచేసె. మఱియు నాదుర్వాసోమునివరుఁడు చేయునట్టి శివపూజకు పారిజాతపుష్పములనొసంగె. అంతట నమ్మునివరుఁ డాపుష్పములచేత నీశ్వరార్చనమునుచేసె. అప్పుడు మునివరుఁడు మొదలగువారి కన్నాదికమును నర్పించుటకొఱకు శ్రీరాముఁడు సీతామహాదేవిని నియమించె. అంతట సీతామహాదేవి మిగులవేగముగ సర్వాలంకారములచేతను నలంకరింపఁబడినదై కల్పవృక్షపారిజాతములను పూజించి యాకల్పవృక్షముక్రింద ననేకములగు స్వర్ణపాత్రముల నుఱిచి యావృక్షశ్రేష్ఠమును ప్రార్థింపఁదలఁచియిట్లనియె. క్షీరసముద్రమునందుఁ బుట్టినదానవును, దేవతలకోర్కెలఁ దీర్చుదానవును నైనయోకల్పవృక్షమా! శిష్యసమేతుఁడగు దుర్వాసోమునివరున కన్నాదికముచేతఁ దృప్తినికలిగింపుమనియె. అట్లు సీతామహాదేవి ప్రార్థింపఁగానే యాకల్పవృక్షము క్షణములోపల నాపాత్రములను చిత్రాన్నాదులచేతనిండించె. అంతట నాహేమపాత్రములను గొనివచ్చి సీతామహాదేవి యామ్మెళాములసహాయముతో వడ్డనజేసె. పిమ్మట నమ్మునివరుఁడు శిష్యులు మొదలగువారితోఁ గూడ సమృద్ధిగ భోజనమునుచేసి కరశుద్ధిమొదలగు కార్యములను నెరవేర్చుకొని శ్రీరామునివలన తాంబూల దక్షిణాదులను గ్రహించె. అప్పుడమ్మునివరుఁడు దేవతలుమొదలగువారు వినుచుండఁగ శ్రీరాముని ననేకవిధముల స్తోత్రమునుచేసి యిట్లనియె. పద్మపత్రములవంటి నేత్రములుకలయోరాముఁడా! నీవు సాక్షాజ్జగదీశ్వరుఁడవు. ఈలోకమునందు రావణునిసంహరించుట కవతరించితివని నేనెఱుఁగుదును. నీవు సాక్షాదీశ్వరుఁడ వని యెఱిఁగినవాఁడనగుచు నే నీపౌరుషమును తెలియఁగోరి నేనీవిధముగ యాచించితిని. ఓరఘుకులోత్తమా! నీవుకనుబొమలను ముడివేసినమాత్రముచేతనే లోకములన్నియును లయమగును. ఇట్టినీ కసాధ్యములగుకార్యము లెవ్వియును లేవు. తొల్లినీవు సముద్రమునందుమునుఁగుచున్న మందరపర్వతమును ధరించుటకు కూర్మరూపమును ధరించితివి. ఆ సమయమునందు దేవతలచే పదునాలుగురత్నములను బయలుపఱిచితివి. ఆపదు

నాళ్గింటిని వివరించెదను వినుము. లక్ష్మి, సోముఁడు, కామధేనువు, కౌస్తుభము, సుధ, విషము, ఐరావతము, అప్సరస్త్రీలు, కల్పవృక్షము, వైద్యుఁడు, ఉచ్చైశ్శ్రవస్సు, పారిజాతము, సుర, జ్యేష్ఠ, అనునట్టిపదునాలుగు రత్నములు నీచేతవిభజింపఁబడినవి. నీయనుగ్రహముచేత దేవతలు వానిభుజించుచున్నారు. శంకరాదిదేవతలందఱును నీయాజ్ఞను పాలించుచున్నారు. ఓరఘుకులోత్తమా! ఇప్పుడు నీచేతచూపఁబడిన విషయమునిదివఱకెవ్వఁడును చూపినవాఁడుగాఁడు. ఓరామచంద్రా! నీవుసకలలోకములకును పాలకుఁడవు. ఓరాముఁడా! నీవు మాకు గతిని గల్పించువాఁడవు నీకంటెనితరుఁడగు దేవుఁడెవ్వఁడును లేఁడనియనేకవిధముల స్తోత్రమునుచేసి రామాజ్ఞనుపొంది శిష్యులతోఁగూడ తనయాశ్రమమునకుఁ బోయె. అనంతరమందు పద్మపత్రములనంటి నేత్రములుకల రాముఁడు దేవేంద్రుఁడు మొదలగు వారితో నిట్లనియె. ఓదేవోత్తములారా! కల్పవృక్షపారిజాతములను గైకొని స్వర్గలోకమునకుఁ బొండనియె. అట్లు శ్రీరాముఁడు చెప్పినవాక్యములను వినిన పిమ్మట దేవమంత్రియగు బృహస్పతి యాశ్రీరామునితో నిట్లనియె. ఓరఘుకులోత్తమా! నీవీభూలోకమునందెంతకాలముందువో యంతవఱకును నీకల్ప వృక్షపారిజాతములను నీయొద్దనేయుంచుకొనుము. నీవు వైకుంఠమునకుఁ బోవునపుడీవృక్షములుకూడ స్వర్గమునకు వచ్చునట్లు చేయుమనియె. అవ్విధముగ బృహస్పతి చెప్పినవాక్యములను విని శ్రీరాముఁడంగీకారమునుపొంది కల్పవృక్షపారిజాతములను పుష్పకవిమానమునందు స్థాపించె. అంతట నాయింద్రాదిదేవతలందఱును శ్రీరామునకు నమస్కరించి స్వర్గలోకమునకుఁబోయిరి. ఓశిష్యోత్తమా; ఈవిధముగ కల్పవృక్షపారిజాతములు భూలోకమునకువచ్చె. అదిమొదలుకొని కల్పవృక్షపారిజాతములు పుష్పకమునందున్నవై ప్రకాశించె. మఱియు నదిమొదలుకొని సీతారాములు అయోధ్యాపట్టణములోని కల్పవృక్షమునకుఁ గ్రిందనున్న పర్యంకమునందు శయనించిరి. మఱియును, శ్రీరాముఁడు భూలోకమునందు నానావిధములగు సుఖముల ననుభవించె. ఓశిష్యోత్తమా! సహస్రనామస్తోత్రమునకు ముందుగ శ్రీరాముఁడు కల్పవృక్షముక్రింద నివసించియున్నవిధముగ ధ్యానముచేసితిని. ఓశిష్యోత్తమా! పిమ్మట నాకల్పవృక్షపారిజాతములు నానావిధములుగ పరిణమించె. అశ్వత్థాదివృక్షములు కల్పవృక్షాదుల యంశములనియే తెలిసికొనుము. పుణ్యము విశేషముగ నుండుటచేత మూఁడుయుగములవఱకును భూలోకమునందు నివసించియుండె. పాపమధికముగనుండుటచేత కలియుగమునందావృక్షములు లేకపోయె.

ఇట్లని రాజ్యకాండమునందలి రెండవయధ్యాయము ముగిసెను.

---

* రామకృష్ణోపాసకుల సల్లాపము. *

ఓగురూత్తమా! రామదాసా! రామకృష్ణావతారములు మిగుల శ్రేష్ఠము

లగుచునని నేను వినియుంటిని. ఆరెంటిలో నేది మిగుల శ్రేష్ఠమైనదో చెప్పుమనిన విని శ్రీరామదాసిట్లనియె. ఓవిష్ణుదాసా! నీవు చక్కని ప్రశ్నము చేసితివి. సావధానమనస్కుఁడవై వినుము. ఈరెంటిలోపల రామావతారము మిగుల శ్రేష్ఠమైనదని మానవులు చెప్పుదురు. ఈవిషయమును తెలుపునట్టిదియును, మిగుల మనోహరమును, అయిన యితిహాస మొక్కటికలదు. దానిం జెప్పెదను, సావధానముగ వినుము. తొల్లి యయోధ్యాదేశమునందు రాముఁడను బ్రాహ్మణుఁ డొకఁడు కలఁడు. ద్వారకయందు కృష్ణుఁడను బ్రాహ్మణుఁడు మఱియొకఁడు కలఁడు. ఆయిరువురును సర్వకాలములయందును రామకృష్ణులకు సేవను చేయుచుండిరి. ఆయిరువురును నొకప్పుడు వచ్చిన మాఘమాసమున ప్రయాగక్షేత్రమునందుఁ గలిసిరి. అంతట నిరువురును త్రివేణియందు స్నానమునుచేసి మాధవునిపూజించి పౌరాణికుని వలన పుణ్యకథనువినుచుఁ గూర్చుండిరి. పిమ్మట సంతోషముకలవారై పౌరాణికునిపూజ ఆసమయమునందు రామభక్తుఁడగు రాముఁడనుబ్రాహ్మణుఁడు రాఘవసత్కథనువిని పరమానందముకలవాఁడై యాపౌరాణికునిపూజించె. అప్పుడు కృష్ణుఁడనుబ్రాహ్మణుఁడు కోపోద్దీపితుఁడై యిట్లనియె. ఓబ్రాహ్మణుఁడా! దుఃఖవంతుఁడగు రామునికథనువిని సంతోషించుటకు కారణమేమి? ఇంతేయగాక వ్యర్థముగ వ్యాసునిపూజించితివి. శ్రీరామునిచరిత్రములలో నేదియును మనస్సునకు సంతోషమును గలుగఁజేయునట్టిది లేదు. కావున రామకథలనువిడిచి మిగుల రమ్యమును, నానావిధక్రీడలను దెలుపునట్టిదియును నగుకృష్ణచరిత్రమును వినుమనియె. అంతట రాముఁడనుబ్రాహ్మణుఁడు కోపసంరక్తలోచనుఁడై యిట్లనియె. ఓరీబ్రాహ్మణాధమా! రాముఁడు దుఃఖియనియును, కృష్ణుఁడు సుఖియనియును, నీ వెట్లు చెప్పితివి. కృష్ణునిచరిత్రము పాపమును పోఁగొట్టునట్టిదియనియును, రామునిచరిత్రము రమ్యముకాదనియును, చెప్పుటకు కారణమేమి? ఈవిషయమును సర్వమును సవిస్తరముగ జెప్పుము, విందము. అనినవిని యాకృష్ణుఁడను బ్రాహ్మణుఁడిట్లనియె. ఓరాముఁడా! నీవు చక్కగనడిగితివి. సావధానమనస్కుఁడవై వినుము. రామకృష్ణులచరిత్రమును చెప్పెదనువినుము. ఈరెంటిలో నేదిదుఃఖమును కలుగఁజేయునో ఏది సంతోషమును కలుగఁజేయునో యీ సభికులందఱును చెప్పుదురు. వినుమని యిట్లనియె. రాముని తండ్రియగుదశరథునకు రాముడు పుట్టుటకంటె ముందుగ శాపముకలిగె. దశరథుని వివాహకాలమునందు రావణుఁడు కౌసల్యా దశరథులను లంకాపట్టణమునకుఁ గొనిపోయి నానావిధములగు కష్టముల పాలుచేసె. ఈవిధముగ శ్రీరాముఁడు పుట్టకమునుపె తల్లిదండ్రులు అధికదుఃఖము ననుభవించిరి. నాకృష్ణుఁడు పుట్టకమునుపు అతనితల్లిదండ్రులగు దేవకీవసుదేవులను సౌఖ్యదాయకములయిన మంగళకృత్యములచేతి కంసాదులు పూజించిరి. కావున శ్రీకృష్ణునికంటె రాముఁడు దుఃఖియని చెప్పుటకు సందేహము లేదనినవిని రామోపాసకుఁడగు

రాముఁడను బ్రాహ్మణుఁ డిట్లనియె. దుష్టబుద్ధికల యో బ్రాహ్మణాధమా! దశరథునకుఁ గలిగిన శాపము నా మైఁ బరిణమించినది. రాముఁడు పుట్టునేమో యను భయముచేత దశరథుఁడు రావణుఁడు కౌసల్యాదశరథులను గొనిపోయి యేమగునో యను భయముచేత నేమియును జేయఁజాలక విడిచిపెట్టెరి. శ్రీకృష్ణుఁడు పుట్టకమునుపు అతని తల్లిదండ్రులు కారాగృహమునందుఁ బెట్టఁబడిరి. మఱియు నో బ్రాహ్మణాధమా! శ్రీకృష్ణుఁడు పుట్టకమును పె యదుకులము రాజాధికారము లేనిదై పోవునట్లు శపింపఁబడియె. మఱియును శ్రీకృష్ణుఁడు కారాగృహమునందుఁ బుట్టె. ఇంతియగాక పుట్టినవెంటనే తల్లిదండ్రులను వదలి పరదేశమునందు సంచరించె. సహోదరులందఱును మేనమామలచేతఁ జంపఁబడిరి. గొల్లవాని కొమరుఁడని లోకులుచేత పిలువఁబడియె. బలభద్రునికంటె కనిష్ఠుఁడై పరులచేతఁ బోషింపఁబడియె. మఱియు నీవిధముగ నానావిధములైన కష్టములను బొందెనని విని కృష్ణోపాసకుఁడగు కృష్ణుఁడను బ్రాహ్మణుఁడు మగల నిట్లనియె. శ్రీరాముఁడు తననిమిత్తముగ తాటకయను నాఁడుదానిని వధించె. తనవియోగముచేత తల్లిదండ్రులను దుఃఖముల పాలు చేసె ననిన విని యా రాముఁడను బ్రాహ్మణుఁడు మరల నిట్లనియె. శ్రీరాముఁడు విశ్వామిత్రు యాగసంరక్షణముకొఱకు తండ్రియగు దశరథునాజ్ఞచేతఁ బోయి బ్రాహ్మణులను వధించుచున్న తాటకను వధించె. శ్రీకృష్ణుఁడు తన ప్రాణమును కాపాడుకొనుటకొఱకు పూతనయను నాఁడుదానిని వధించె. మఱియు నిట్లనే తన ప్రాణములను గాపాడుకొనుటకొఱకు ననేకప్రాణులను హింసించె. గొల్లవారితో సాంగత్యమును చేయుచు పసులకాపరి యయ్యె. మఱియును గోవులను పశువులను గుఱ్ఱములను వధించె. ఇంతయగాక రాక్షసవృషభములను వధించె. దొంగతనమును చేసె. అడవులయందుఁ దిరిగె. వానకును చలికిని తాళఁజాలక కంబళములను ధరించె. క్షుత్తృష్ణలచేతఁ బీడింపఁబడి గోపాలకులు భుజింపఁగా మిగిలినదానిని భుజించుచువచ్చె. అరణ్యమునం దనేకపర్యాయములు తననిమిత్తముగ నన్నమును యాచించె. ఇంద్రయాగమును వృద్ధాచారమును నిషేధించె. పరస్త్రీగమనమును చేసె. తనకంటె పెద్దలగు స్త్రీలతో రతికేళుల నుసలిపె. వస్త్రవిహీనలుగనున్న స్త్రీలను దర్శించె. అగ్నిని బుట్టించె. వృక్షములను పెల్లగించె. నవనీతముకొఱకు రోదనమును చేసె. అనేకపర్యాయములు తల్లిచేత దండింపఁబడియె. గోపికాస్త్రీలతో స్నేహము చేసె. తొల్లిటినివాసస్థానమును విడిపించె. చాకలిని జంపె. క్షత్రియునివలె యుద్ధమును చేసె. గజహత్యను చేసె. మల్లుఁడగు మేనమామను జంపె. బంధువును గఠినముగ మాటలాడెను. కురూపిణియను దానితోఁగూడ విహరించె. సముద్రతీరమునందు నివసించె. బలాత్కారముగ స్త్రీలను బట్టె. యుద్ధములయందు పరాజయమును పొంది శత్రువులకుఁ దన వీపు జూపె. పర్వతమునం దున్నప్పుడు పరులచేతఁ దగులఁబెట్టఁబడియె. తనదు స్వస్థలమును విడిచి పెట్టె. నరకాసురుని ద్రవ్యమును హరించె. తన కులము వారిని సంహరింపఁజేసె. జనుల

చేత దొంగయని నిందింపఁబడియె. దొంగతనమును చేయకయే దొంగయనియెడు నపవాదమునుపొందె. పారిజాతముకొఱకు దేవతలతో యుద్ధమును చేసెనని విని కృష్ణోపాసకుఁడగు బ్రాహ్మణుఁడిట్లనియె. ఓరీ బ్రాహ్మణాధమా! కాముకుఁడైన నీరాముఁడు ఎవ్వనికుమార్తెను వివాహము చేసికొనెను. జామదగ్నికి మానభంగమును చేసె. ముద్గలమునివరు ననుమతమునుపొందకయే యామునివరుని తీగనుద్రెంచె. సర్వకాలములయందును అరణ్యమునందు సంచరించుచు పశుహింసను చేయుటయందు మిగుల నాసక్తికలవాఁడయ్యె. వానప్రస్థాశ్రమము నవలంబించిన వాఁడును కందమూలఫలాదులచేత జీవించువాఁడును నయ్యె. మఱియు నా రాముఁడు మాంసమును భుజించువాఁడును, ధనుర్ధారియును, వేటాడువాఁడును, శీతవాతాతపాదులచేతఁ బీడింపఁబడినవాఁడును, పాదచారియును, చర్మమేవస్త్రముగాఁ గలవాఁడును, జటావల్కలములు కలవాఁడును, గోళ్లను పెంచుకొనినవాఁడును, మీసములనుధరించినవాఁడును, తరుచ్ఛాయ నాశ్రయించినవాఁడును, పాత్రరహితుఁడును, రాక్షసునిచేతనపహరింపఁబడిన భార్యకలవాఁడును, భార్యానిమిత్తముగ దుఃఖమును పొందినవాఁడును అయ్యె ననవిని రామోపాసకుఁడగు బ్రాహ్మణుఁ డిట్లనియె. ఓరీ! బ్రాహ్మణాధమా! సీతామహాదేవి ఛాయారూపముతో నున్న సమయమునందు శ్రీరావణుఁ డపహరించె. ఆనిమిత్తముగ రావణుని సంహరించి సీతామహాదేవిని విడిపించె. శబరియనుదానిని మోక్షమును పొందించె. శ్రీకృష్ణునిభార్య లిప్పటికిని శత్రువులచేత ననుభవింపఁబడుచున్నవారు. మఱియు నర్జునుని జయించి కృష్ణునిభార్యలను కిరాతులపహరించిరి. మఱియు శ్రీకృష్ణుఁడు స్త్రీజితుఁడును స్త్రీదత్తుఁడును నారదునిచేతఁ గ్రయముచేత స్వీకరింపఁబడినవాఁడును నయ్యె. సర్వస్త్రీలకును కామపూర్తి చేయుటకు రాత్రులయందు నిద్రలేనివాఁడయ్యె. తల్లితో సమానురాలును తనకంటె పెద్దదియునగు గోపికతో సురతక్రీడలను సలిపె. కావున కృష్ణునికంటె రాముఁడే యధికుఁడనినవిని యాకృష్ణోపాసకుఁడు మరల నిట్లనియె. ఓరీ బ్రాహ్మణాధమా! శ్రీకృష్ణుని కృత్యము లుచితములయినవి కావని చెప్పుచున్నావు. అట్లు చెప్పుట తగదు. రామునికృత్యములే యుచితములు కానివై యున్నవి. వివరించి చెప్పెదను, వినుము. రాముఁడు పశుభయముచేత నిద్రను పొందినవాఁడుగాఁడు. అన్నయగు వాలియొక్క భార్యను తమ్ముఁడగు సుగ్రీవున కర్పించె. వానరులతోఁగూడ స్నేహమునుచేసె. దుందుభియొక్క శవమును స్పృశించె. నిరర్థముగ వానిని వధించె. వానరుల సాహాయ్యమునుపొందె. వానరునిమీఁద నెక్కె. వ్యర్థముగ తాటిచెట్లను నరికె. సముద్రమును బంధించె. లంకాపట్టణమును కాల్చె. ఇట్టి యకార్యములను శ్రీరాముఁ డెన్నియో చేసెననిన విని రామోపాసకుఁడగు బ్రాహ్మణుఁ డిట్లనియె. ఓరీ! మూర్ఖుఁడా! నీకేమియును తెలివి లేదు. వానరులు వేదాంశరూపులగుటచేత శ్రీరాముఁడు వారితో స్నేహమునుచేసె. శ్రీకృష్ణుఁడు కపటవృత్తిలోఁబోయి జరాసంధుని వధించె,

సర్వకాలములయందును సాహాయ్యమును చేసిన గొల్లవానిమీఁదనెక్కె. కాశీపట్ట ణమును తగులఁబెట్టె. రుక్మియనువానిని నిరూపినిగాఁజేసె. శివభక్తుఁడగు బాణునితో యుద్ధమునుచేసె. పరమశివునితోఁగూడ సంగరమునుసలిపె. శిశుపాలునిచేత పలుమారులు నిందింపఁబడియె. కృష్ణుని మనుమఁడు శత్రువులచేత జయింపఁబడియె. పారిజాతాదులచేత భార్యల కెచ్చుతగ్గుగ ప్రియమును చూపెననిన విని కృష్ణోపాసకుఁడు మరల నిట్లనియె. సీరామునిపుత్రునిచేత రాముని బంధువు బాధింపఁబడియె. శివభక్తుఁడగు రావణునితో రాముఁడును యుద్ధమునుచేసె. బ్రహ్మహత్యనుచేసి మునిచేత నిందింపఁబడియె. మఱియును రాముని మిత్రుఁడగు విభీషణుఁడు రాముని బంధుపుత్రునిచేత బంధింపఁబడియె. పరులగృహమునందున్న భార్యను స్వీకరించె. భార్యయందు మిగులఁ బరుషోక్తులను బలికె. స్త్రీలకానుమునుదీర్చక విచారమును పొందునట్లుచేసె. యూనారూఢుఁడై తీర్థయాత్రలను సేవించె. ఏకాంతమునందువేశ్యచేత స్పృశింపఁబడియె. పతివ్రతయగు సీతామహాదేవియందు దోషారోపమునుచేసె. పుత్రునిజఁపుట కాజ్ఞనిచ్చె. శూద్రసింహములను వధించె. భార్య చెప్పినయాజ్ఞను పరరాజులు పాలించునట్లుచేసె ననినవిని రామోపాసకుఁడు మరలనిట్లనియె. ఓరీ! బ్రాహ్మణాధమా! శ్రీకృష్ణుని మరణకాలమునందు వంశమంతయును నశించునట్లు శాపముకలిగె. సముద్రముచేత లోపమును పొందింపఁబడియె. పట్టణమంతయును ద్వారకి గ్నిచేయఁబడియె. తనకులమును సర్వమును తానేవధించె. శ్రీకృష్ణునికులము మద్యపానమును చేయునట్టిదయ్యె. తనమరణకాలమునందు మిత్రుఁడగు నర్జునునకు దర్శనమీయకపోయె. ఒంటిరిగ స్వస్థానమునకుఁబోయె. తాను మిగులసమర్థుఁడని ప్రసిద్ధినొంది తుదకు కిరాతునిచేతఁ జంపఁబడియెననినవిని కృష్ణోపాసకుఁడగు బ్రాహ్మణుఁడిట్లనియె. ఓరీ! బ్రాహ్మణాధమా! సీరాముఁడు పుత్రునితో మిగుల గొప్పదగుయుద్ధమునుచేసె. సీతను విడిచిపెట్టితినని చెప్పి దొంగలీనముగ సీతాసంబంధము నవలంబించె. మఱియును రహస్యముగ వాల్మీకి మునివరునియాశ్రమమునకు రహస్యముగఁబోయి భార్యాపుత్రులనుజూచివచ్చె. పిణ్యాకము ఇంగుది మొదలగువానితో పిండప్రదానమునుచేసె. దండకారణ్యమునందు దిరుగునట్లు తండ్రిచేత నాజ్ఞాపింపఁబడియె. రావణునిచేత ననుభవింపఁబడిన మంచమునందుఁబరుండె. అశ్వత్థమును ఛేదించుటకొఱకు మాటిమాటికిని యజ్ఞమునుచేసె. మఱియు ననేకములగు దుష్కార్యములను చేసె. నాకృష్ణుఁడు బాల్యమునందు విలాసముగ పూతనయను దానినివధించె. మఱియును బాల్యమునందే తృణాసురాదులను సంహరించె. బొటనవ్రేలితో పర్వతమునుధరించె ననినవిని రామోపాసకుఁడగు రాముఁడిట్లనియె. ఓరీ బ్రాహ్మణాధమా! మారాముఁడుకూడ బాల్యమునందే తాటకను విలాసముగ సంహరించె. మఱియు ననేకులగు మారీచాదులను మరణమునుపొందించె. ఇంతియగాక సముద్రమునం దనేకములగు పర్వతములను మునుఁగకుండునట్లు నిలిపెననినవిని కృష్ణోపాసకుఁడగు

బ్రాహ్మణుఁడిట్లనియె. కృష్ణునిరూపమునుజూచి గోపికలు మోహించిరి. మన్మథునకు మోహమును కలుగఁజేయునట్టి రాధకూడ శ్రీకృష్ణుఁ జూచి మోహమును చెందెనని రామోపాసకుఁడు మరలనిట్లనియె. ఓరీ! బ్రాహ్మణాధమా! దేవతాస్త్రీలందఱును శ్రీరాముని సౌందర్యమునుజూచిమోహించి రహస్యస్థలమునందు వచ్చిప్రార్థింపఁగా వారినందఱిని తల్లులనుగాఁదలఁచె. మఱియు నాదేవతాస్త్రీలందఱును గోపిక లగునటుల వరమిచ్చె. శ్రీరాముని తాంబూలోచ్ఛిష్టరసమును మిగులభక్తితోననుభవించి యొకదాసి గొల్లపల్లెయందు రాధయైపుట్టె. మఱియు నో బ్రాహ్మణాధమా! మాకృష్ణుఁడు పదునాఱువేల పదునాఱుగురుస్త్రీలను వివాహముచేసికొనియె. మఱియును మఱియొకచోట నూటయెనిమిదిమంది స్త్రీలను శాస్త్రోక్తప్రకారముగ వివాహమునుచేసికొనియె ననిసవిని రామోపాసకుఁడు మరలనిట్లనియె. మారాముఁడు సకల స్త్రీలను తల్లులనుగాఁదలఁచె. మాకృష్ణుఁడు గోపికాస్త్రీలను రత్యర్థముగ మోహింపఁజేసె ననికృష్ణోపాసకుఁడిట్లనియె. మాకృష్ణుఁడు గజేన్ద్రునివిలాసముచేత వధించెననిన రామోపాసకుఁడిట్లనియె. మారాముఁడు నాగేంద్రశత్రువగు నష్టాపదుఁడు చంపఁబడియె ననిన కృష్ణోపాసకుఁడిట్లనియె మాకృష్ణునిప్రభావముచేత యమున ఖండింపఁబడియె ననిన రామోపాసకుఁడిట్లనియె. మారాముని ప్రతాపముచేత జాహ్నవి ఖండింపఁబడియెననఁగా కృష్ణోపాసకుఁడు మాకృష్ణుఁడు స్వర్గలోకమునుండిదేవవృక్షములను దెచ్చెననియె. అంతట రామోపాసకుఁడు మారాముఁడుకూడ కల్పవృక్షపారిజాతములను స్వర్గలోకమునుండిరప్పించెననిన కృష్ణోపాసకుఁడిట్లనియె. మాకృష్ణుఁడు మృతినొందిన గురుపుత్రునిఅన్నలను మరలజీవింపఁజేసెననిన రామోపాసకుఁ డిట్లనియె. మారాముఁడు అయోధ్యాపట్టణమునందు మరణమునుపొందిన యేనుగుని మరలబ్రదికించెననిన కృష్ణోపాసకుఁడిట్లనియె. మాకృష్ణుఁడు బ్రాహ్మణుని పుత్రులను బ్రదికించెననిన రామోపాసకుఁ డిట్లనియె. మారామునిచేత మంత్రియగు సుమంత్రుఁడు జీవింపఁజేయఁబడెననిన కృష్ణోపాసకుఁడు మాకృష్ణుఁడు ద్రౌపదిచేత క్రిందఁబడినఫలమును మరలచెట్టునందుఁ బ్రవేశించునట్లు చేసెననిన రామోపాసకుఁ డిట్లనియె. మా శ్రీరాముఁడు తులసీదళమును సీతామహాదేవిచేత మరలచెట్టునందుంచునట్లు చేసెననిన కృష్ణోపాసకుఁడు మాకృష్ణునిప్రతాపము జనములనఁజూపఁబడినదనియును, దుర్వాసో మునివరుఁడు కోరినకోర్కెను దీర్చెననియును చెప్పఁగావిని రామోపాసకుఁ డిట్లనియె. మా శ్రీరాముఁడుగూడ దుర్వాసోమునివరుఁడు కోరినవిధముగ నన్నదానమునుచేసెననిన కృష్ణోపాసకుఁ డిట్లనియె. మాకృష్ణుఁడు ఈలోకమునం దనేకములయిన రూపములనుజూపెననిన రామోపాసకుఁడిట్లనియె. మా శ్రీరాముఁడుకూడ నానావిధములయిన రూపములనుజూపెననిన కృష్ణోపాసకుఁ డిట్లనియె. మాకృష్ణుఁడు మిత్రునకు సువర్ణమయమగు పట్టణమునొసంగెననిన రామోపాసకుఁ డిట్లనియె. మారాముఁడుకూడ మిత్రునకు సువర్ణమయమగు పట్టణమునొసంగెననిన కృష్ణోపాసకుఁడిట్ల

నియె. మీకృష్ణుఁడు సూర్యగ్రహణకాలమునందు కురుక్షేత్రమున స్నానముచేసె ననిన రామోపాసనుఁ డిట్లనియె. మా రాముఁడుకూడ సూర్యగ్రహణకాలమునందు కురుక్షేత్రమున స్నానమునుచేసె. మఱియు నో బ్రాహ్మణాధమా! మా రాముఁడు చెప్పినమాటను దప్పనివాఁడు. మీకృష్ణుఁడట్లుగాక యనేకములయిన మాటలను పలుకుచుండును. మఱియును మా రాముఁడు శత్రుసంహారమునందు రెండవపర్యాయము బాణము నెక్కుపెట్టువాఁడుగాఁడు. మీకృష్ణుఁడు అనేకములయిన బాణములను ప్రయోగించును. మా రాముఁడేకపత్నీవ్రతస్థుఁడు, మీకృష్ణుఁ డనేకమందిస్త్రీలను పొందువాఁడు. మా రాముఁడు భార్యనుదలి శయ్యయందుఁ బరుండువాఁడు గాఁడు. మీకృష్ణుఁ డనేక శయ్యలయందుఁ బరుండువాఁడు. శ్రీరాముఁడు మధ్యదేశమునందలి యయోధ్యాపట్టణమునందు సరయూనది యొడ్డుననివసించె. మీకృష్ణుఁడు సముద్రముయొక్క తీరమునందు పశ్చిమదిక్కునందు నివసించె. మా రామునకు మువ్వురుతమ్ములుగలరు. కృష్ణున కగ్రజుఁడొక్కఁడే కలఁడు. మా రామునకు గోవు మణిపుష్పకము కల్పవృక్ష పారిజాతములు మునివరునిచేత నర్పింపఁబడిన కటకములు అనునవికలవు. మఱియును మా రామునకు ఐరావతకులమునందుఁ బుట్టినదియును నాలుగుదంతములు కలదియును అయినగజముకలదు. ఇవ్విధముగ మా రామునకు తొమ్మిదిరత్నములుకలవు. మీకృష్ణునకు మూఁడురత్నములేకలవు. ఇట్లు సకలవిధములచేతను తక్కువవాఁడగు కృష్ణుని నీవు వ్యర్థముగ నేలఁబొగడుచున్నావు. మఱియు నో బ్రాహ్మణాధమా! మా రాముఁడు సప్తద్వీపములకును నధిపతియైయున్నవాఁడు. సకలరాజులచేతను నమస్కరింపఁబడినవాఁడు. విచారింపఁగ నీశత్వజగదీశత్వము లిరువురికిని సమములయినప్పటికిని రామకృష్ణులు సమానులని తలఁపకుము. శ్రీరాముని ధనుర్బాణ కోదండములు నాశములేనివి. ఇంతియగాక శ్రీరామునకు బ్రాహ్మణుల యిష్టమునుదీర్చుటయే నిత్యవ్రతమైయున్నది. మఱియును, శ్రీరామునకు ఛత్రచామరాది చిహ్నములుకలవు. శ్రీరామునకు పుష్పకవిమానము కలదు. తనతో సమానులగు పుత్రులుకలరు. శ్రీరాముఁడు బ్రాహ్మణున కిచ్చిన దానము ఇప్పటికిని నెరవేరుచున్నదనుటకు దృష్టాంతముగ రామనాథపురమునకు బ్రాహ్మణాధిపత్యము కలిగియున్నది. నీకృష్ణుఁ డట్టిదాన మేదియును చేసినవాఁడు కాఁడు. పరమశివుఁడు రాత్రింబగళ్లయందుఁ దప్పక రామనామమును స్మరించుచుండును. మఱియును, కాశీపట్టణమునందలి వారందఱును రామనామమును తారకమంత్రమునుగా గ్రహించుచున్నారు. కావుననే యెల్లవారును మరణకాలమునందు రామనామము చేయుమని శిక్షింపఁబడుచున్నారు. మఱియు నెల్లవారును ప్రాణవిమోహముకొఱకు శవవాహనకాలమునందు రామనామ రామయని రామనామము నుచ్చరించుచుందురు. కావున రామనామమునకుఁ దుల్యమైనవి యేదియును లేదు. ఈ కారణముచేతనే వాల్మీకిమునికూడ శ్రీరాముని చరిత్రమును శ్లోకరూపముగ రచించె.

మఱియును, రాముని చరిత్రము శతకోటి పరిమితికలదై యుండె. కృష్ణాదుల చరిత్ర మీవిధముగ నూరుకోట్ల పరిమితికలదై లేదుకదా? అనియెనని చెప్పి రామదాసు మరలనిట్లనియె. ఓశిష్యోత్తమా! విష్ణుదాసా! ఈవిధమున వివాదమును పొందుచున్న యాయిరువురికిని వివాదమును తీర్చుటకొఱకు నాకాశమునుండి యశరీరవాణియిట్లనియె. రామునిముందర నితరులను స్తోత్రముచేయుట తగదనియె. ఆవాక్యము నక్కడనున్న వారందఱును వినిరి. ఆవాక్యమును వినినపిమ్మట నెల్లవారును జయజయధ్వనులనుసల్పిరి. మఱియు నాసమయమునందు రామోపాసకునిమీఁద దేవతలందఱును పుష్పవర్షముఁ గురిపించిరి. ఆసమయమునందు కృష్ణోపాసకుఁడు లజ్జచేత శిరస్సును వంచుకొనియె. అనంతరమందు రామోపాసకునకు నమస్కరించి యతని ననేకవిధములఁ బ్రార్థించె. అంతట రామోపాసకుఁడుకూడ కృష్ణోపాసకునకు నమస్కారమునుచేసి దృఢముగఁ గౌఁగిలించుకొని యిట్లనియె. కృష్ణోపాసకుఁడవైన యోబ్రాహ్మణోత్తమా! శ్రీకృష్ణునికంటె రాముఁడు భిన్నుఁడుకాఁడు. రామునికంటె కృష్ణుఁడును భిన్నుఁడుకాఁడు. అయినప్పటికిని నాబుద్ధి రామునిపొగడుటయందు దిట్టముకలదై యున్నది. కావున నేను రామునిపొగడి కృష్ణుని నిందించితిని. ఆయిరువురును సమానులని నేనెఱుఁగుదును. రాముఁడే కృష్ణుఁడును కృష్ణుడే రాముఁడును నయ్యె. ఆయిరువురికిని భేదము లేకపోయినప్పటికిని కౌతుకముచేత నేను భేదమును కల్పించితిని. రామకృష్ణులకు భేదమున్నదని తలఁచువాఁడు నరకమును పొందును. నిగర్వమును పోగొట్టుటకొఱకు నేనిట్లు చెప్పితినని చెప్పి యాకృష్ణోపాసకు నూరార్చి యారామోపాసకుఁడు సభయందేమియును పలుకక యూరకుండె. అనంతరము వారిరువురును మాఘమాసాంతమందు సభాసదులచేతఁ బూజింపఁబడి తమతమ దేశములకుఁ బోయిరి. కావున శిష్యోత్తముఁడవైన యోవిష్ణుదాసా! సకలావతారములలోపల రామావతారము మిగుల శ్రేష్ఠమైనది కాఁబట్టి నీవు రామునిచరిత్రమునే వినుచు పరమభక్తితో రాముని సేవింపుము. మఱియు ననేకవిషయములను చెప్పెదననియె.

ఇట్లని యానందరామాయణాంతర్గత రాజ్యకాండమునందలి మూఁడవసర్గము ముగిసెను.

✱ పురస్త్రీలు నూర్గురు శ్రీరాముని జూచి మోహించుట. ✱

ఓశిష్యోత్తమా! విష్ణుదాసా! శ్రీరాముఁ డొకనాఁడు సభయందుఁ గూర్చుండి సకలజనులతోఁగూడ మాటలాడుచు ద్రాక్షతీగలయొక్క మండపమునందు మిగుల శ్రేష్ఠమైన కాకమును జూచె. మఱియును రెండు నేత్రములయందును ఏకనేత్రమూర్తి సమన్వితమును, మిగులదీనమైనదియును, కృశించినదియును, వ్యగ్రమైన చూపుకలదియును, దీర్ఘమైన స్వరముకలదియును, చపలమైనదియును, ధ్వనినిచేయుచు మాటిమాటికిని తనను జూచుచున్నదియును, అయిన కాకమునుచూచి కోపావిష్టుఁడై మనుకులేశ్వరుఁడు మనస్సునందుఁ దలఁచుకొనియె. అట్లు కోపముకలవాఁడైనను

శాంతతనువహించి యిట్లనియె. ఓకాకమా! నీవు భయమునువదలి శీఘ్రముగ నా యొద్దకురమ్మనియె. అట్లు శ్రీరాముఁడు చెప్పినవాక్యమునువిని యాకాకము భయమునువదలి శీఘ్రముగవచ్చి రామునిదగ్గర సభయందునిలిచె. ఆసమయమునందు శ్రీరాముఁడు దయకలవాఁడై యోకాకమా! నేత్రముకంటె నన్యముగువరమును దేనినైననుగోరు మనినవిని యాకాకము శ్రీరామునితో నిట్లనియె. ఓ రఘుకులోత్తమా! నీవు సర్వకాలములయందును నన్నుఁ దయతోఁజూచుటకంటె నాకన్యముగు వరమక్కఱలేదనినవిని శ్రీరాముఁడు మరల నాకాకముతో నిట్లనియె. ఓ కాకమా! ద్వీపాంతరములయందుఁగూడ జరుగునట్టి భూతభవిష్యద్వర్తమానవిషయములు నీనేత్రమునందు విషయములై యుండును. భూలోకమునందు కార్యసిద్ధికొఱకు సకలజనులును నిన్నుఁజూచెదరు. ఓకాకమా! భావికార్యములనన్నింటిని నీవెఱుఁగుదువు. మఱియు నోకాకమా! సకలజనులును నీగతిచేత శకునములను జూతురు. నీవు స్థిరమైయున్నపుడు సకలకార్యములును స్థిరములై యుండును. గ్రామమునందుఁగాని గృహమునందుఁగాని ప్రవేశించునపుడు నీవు వామభాగమునందు విడిచితివేని సకలకార్యములును సిద్ధించును. ప్రయాణకాలమునందు దక్షిణభాగముగ నీవుపోతివేని మిగుల మంగళదాయకమైన శకునమని యెఱుఁగవలయును. ప్రేతపిండములను నీవు స్పృశింపనియెడల పితృదేవతలకు గతి కలుగనేరదు. మరణకాలమునందు సకలకోర్కెలునుతీరవు కనుక అట్టికోర్కెలు తీరలేదనువిషయమును కాకములు పిండమును స్పృశింపకపోవుటవలనఁ దెలిసికొందురు. అట్లు తెలిసికొని ప్రేతయొక్క బాంధవులు మృతునికోర్కెలను నెరవేర్చెదమని చెప్పినతోడనే కాకములాపిండములను స్పృశించును. మఱియు నోకాకమా! నేనొకవరమునిచ్చెదను. గ్రంథములను వ్రాయునపుడు వదలివేసినవిషయములను వ్రాయునపుడు నీపాదచిహ్నమును పెట్టినట్లువ్రాయునట్లు వరమునిచ్చితిని. నీపాదమునుపుస్తకమునందు చూచినతోడనే యిక్కడవిషయము మరవఁబడినదని జనులు తెలిసికొందురు. అనంతరమందు పార్శ్వభాగములయందు వ్రాసినవిషయములను గ్రహింతురనియె. ఈవిధముగ శ్రీరాముఁడు కాకమునకు వరములనిచ్చి యూరకుండె. అంతట నాకాకము సంతోషించినదై శ్రీరామునకు నమస్కరించి యక్కడనుండియెగిరిపోయె. శిష్యోత్తముఁడవైన యోవిష్ణుదాసా! ఈవిధముగ శ్రీరాముఁడు నానావిధములయిన కార్యములను చేయుచుండె. అంతట నొక్కనాటిరాత్రియందు శ్రీరాముఁడు పారిజాతవృక్షముక్రిందనున్న హేమపర్యంకమునందుఁ బరుండి సుఖముగ నిద్రనుచెందె. ఆసమయమునందు జానకీస్పర్శమును వదలియుండె. ఇంతలోపల నారాత్రియందు రాముని రక్షించునట్టి ద్వారపాలకులును దాసదాసీజనమును ఎక్కడకో కీర్తనమును వినుటకు బయలు వెడలిపోయిరి. అప్పుడే దేనసమయముకదా యని తెలిసికొని కామబాణపీడితలగు పురస్త్రీలందఱును నానావిధములయిన యలంకారములచేత నలంకరింపఁ

బడినవారై బయలువెడలిరి. మఱియు నాస్త్రీలందఱును వయోమదముచేత సంభ్రాంతులును, సువర్ణకలశములవంటి స్తనములుకలవారును, చంద్రబింబమువంటి మోములుకలవారును, చిలుకముక్కువంటి ముక్కుకలవారును, పద్మములవంటి పాదములుకలవారును, లేడి నేత్రములవంటి నేత్రములుకలవారును, పచ్చని పట్టువస్త్రములను ధరించినవారును, బంగారపు గజ్జలందియలయొక్క ధ్వనులుకలవారును నై యుండిరి. ఇవ్విధముగ మిగులఁ జక్కఁదనముకల యాస్త్రీలందరునువచ్చి ప్రథమవయస్సునందున్న శ్రీరామునిజూచి మోహితులైరి. అంతట యాస్త్రీలలో నొక్కతె శ్రీరామునకు వింజామరమును వైచె. మఱియొక్కతె శ్రీరామునకు పుష్పమాలికను ధరించియుండె. ఇంకొకతె తాంబూలపాత్రమును ధరించియుండె. వేఱొకతె జలకుంభమును ధరించియుండె. ఇంకొకతె నిష్ఠీవన పాత్రమునుధరించె. మఱియొకతె చందనమును ధరించియుండె. ఇంకొక్కతె దివ్యాన్నమునుధరించె. మఱియొక్కతె దివ్యాన్నమును నివేదించుటకు సిద్ధముగనుండె. వేఱొకతె యరటిపండ్లు మొదలగువానిని ధరించియుండె. మఱియొక్కతె మెల్లఁగ శ్రీరామునిపాదములను పిసుకుటకుయత్నించె. అట్లుపిసుకుటకు పాదములను స్పృశించినతోడనే శ్రీరాముఁడు మేల్కాంచి నాపాదములను స్పృశించినవారెవరని దిగ్గన లేచికూర్చుండె. అట్లుకూర్చుండి తనచుట్టును నానావిధోపచారములను చేయుటకు సిద్ధముగనున్న పురస్త్రీలనుజూచె. అప్పుడాపురస్త్రీలందఱును శ్రీరామునకు నమస్కరించిరి. మఱియును తమశిరస్సులను శ్రీరామునిపాదములయందుంచి యనేకవిధముల స్తోత్రములనుచేసిరి. అంతట శ్రీరాముఁడాస్త్రీలతో నిట్లనియె. ఓ మగువలారా! మీరందఱు నీయర్ధరాత్రకాలమునం దిక్కడకువచ్చుటకుఁ దగినకారణమును నిజముగఁ జెప్పుఁడనినవిని యాస్త్రీలందఱును మిగుల లజ్జకలవారును నధోముఖముకలవారును నై యూరకుండిరి. అంత నాస్త్రీలలో నొక్కతెమాత్రము సిగ్గులేనిదై యిట్లనియె. ఓరఘుకులోత్తమా! మేమేమినిమిత్తముగ వచ్చితిమియును నీవెఱుఁగుదువు. కావున నీవు మమ్మునుపేక్షించుట యుచితముకాదని చెప్పినతోడనే శ్రీరాముఁడు వారియభిప్రాయమును దెలిసికొని మృదుమధురవచనములతో నిట్లనియె. ఓ నారీరత్నములారా! నాయభిప్రాయమును దెలిపెదనువినుఁడు. నేను ఏకపత్నీవ్రతము నవలంబించినవాఁడను. నాకు పరస్త్రీలందఱును మాతృసమానలు. కావున మీరు మీగృహములకుఁబొండు. నాయందధర్మము ప్రవేశింపకుండునట్లుచేయుఁడు. నేను రాజ్యమును పాలించుచున్నవాఁడను. కావున నధర్మమునాచరింపఁదగినవాఁడనుగానని యె. అప్పుడు కామబాణపీడితలగు నాస్త్రీలందఱును శ్రీరాముని వాగ్బాణములచేత నధికముగఁ బీడింపఁబడినవారై మూర్ఛనొంది క్రిందఁబడిరి. అట్లుమూర్ఛనొంది క్రిందఁబడిన యాస్త్రీలనందఱనుజూచి శ్రీరాముఁడు మిగులవిహ్వలుఁడై మరల నిట్లనియె. ఓ నారీమణులారా ! మీరు నాతో నొక్కపర్యాయము రమించుటచేత మీకుఁ

ద్భ్రాప్తికలుగ నేరదు. ఇంతియుగాక నాకు వ్రతభంగముకూడ నగును. కావున నేనొక్క విషయమును చెప్పెదను వినుఁడు. తొల్లి యాగకాలమునందు నేను బంగారముచేత నిర్మింపఁబడిన సీతారూపములను నూటెని గురువునకు సమర్పించితిని. అట్టిదానఫలముచేత ద్వాపరయుగమునందు నూర్గురు స్త్రీలతోఁగూడ రమింతును. కావున మీరిప్పుడు నానావిధరాజులకు పుత్రికలగుఁడు. అప్పుడు కృష్ణరూపముతో మిమ్ములనందఱ వివాహము చేసికొనియెదను. మఱియు నప్పుడు బాలికలుగానుండఁగా మిమ్ముల నరకాసురుఁ డపహరించును. అంతట నేనా నరకాసురునిసంహరించి మిము విడిపించి ద్వారకాపురమునందు మిమ్ముఁ బెండ్లిచేసికొనియెదను. మఱియును పదహాఱువేలస్త్రీలను పెండ్లిచేసికొనియెదననియె. ఈవిధముగ శ్రీరాముఁడు చెప్పినవాక్యములనువిని యాస్త్రీలందఱును సంతోషించినవారై శ్రీరామునకు నమస్కరించి తమతమగృహములకుఁబోయిరి. అట్లు సకలరాజస్త్రీలను పంపినపిమ్మట నా శ్రీరాముఁడు దాసీస్త్రీలనుపిలిచె. అప్పుడొక్కతెయును పలుకకపోవుటచేత దాసులగు పురుషులనుబిలువఁగా వారిలో నొక్కఁడును కనఁబడకపోయె. అంతట ద్వారపాలకులనుబిలువఁగా వారును కనఁబడకపోయిరి. పిమ్మట రక్షకులనుపిలువఁగా వారును కనఁబడకపోయిరి. అప్పుడు శ్రీరాముఁడు మిగులనాశ్చర్యయుక్తుఁడై విమానాట్టాలకముమీఁదికిఁబోయి లక్ష్మణునిఁబిలిచె. ఆసమయమునందూర్మిళ రామవాక్యమునువిని భర్తయగు లక్ష్మణునకుఁ దెలుపఁగా లక్ష్మణుఁడు ప్రబుద్ధుఁడై రాముని వాక్యమునువిని యారతిశాలలోనుండి బయటకువచ్చి యిదిగో వచ్చుచున్నానని చెప్పుచు శ్రీరామునిదగ్గరకువచ్చె. ఇంతలోపల పట్టణమునకు వెలుపట స్త్రీలరోదనధ్వనినివిని మిగుల నాశ్చర్యయుక్తుఁడై యిదియేమని యాలోచించె. అంతట శ్రీరాముఁడు జరిగినవృత్తాంతమును సర్వమును లక్ష్మణునకుఁ దెలిపె. అప్పుడు లక్ష్మణుఁడు నిజదూతలనుబంపి కీర్తనను వినుచున్న రామదూతాదులను పిలువనంపె. ఆసమయమునందు రామదూతలు లక్ష్మణునిదూతలతో మేము రామకీర్తనమును వినుచున్నామనియును, ఇది ముగియకమునుపు వచ్చుట కిష్టము లేదనియును, ఈ సమయమునందు రామాజ్ఞ నతిక్రమించుటచేత దోషము లేదనియును చెప్పిరి. అంతట లక్ష్మణునిదూతలు బయలువెడలివచ్చి యావృత్తాంతమును శ్రీరామునకుఁ దెలిపిరి. అప్పుడు శ్రీరాముఁడు కొంచెముగఁ గోపముకలవాఁడై లక్ష్మణునితో నిట్లనియె. తమ్ముడా! నాకీర్తనమునం దాసక్తులయినవారలనే దండించుటతగదు. అయినను స్వల్పముగ దండింపకపోతినేని భయముకలుగనేరదని చెప్పుచుండఁగా మరల రోదనధ్వని వినఁబడియె. ఆరోదనధ్వనినివిని శ్రీరాముఁడు తానధిష్ఠించియున్న విమానమును పట్టణబహిఃప్రదేశమునకుఁ బదమనియె. అంతట నావిమానరాజము పట్టణమునొక్కబయలునకుఁ బోయె. అట్లుపోయి సరయూతటమునందు రోదనముచేయుచున్నదియును, అంజనాపర్వతముతో సమానమైనదియును నయిన యొకస్త్రీని జూచి

శ్రీరాముఁ డిట్లనియె. ఓనారీ! నీవెవతెవు. నీవిట్టివిధముగ దుఃఖమును బొందుటకు కారణమేమి? అనినవిని యానారీమణి శ్రీరామునితో నిట్లనియె. ఓరఘుకులోత్తమా! నేనీవిధముగ చిరకాలమునుండి రోదనమును చేయుచున్నాను. నాపుణ్యవిశేషము చేత నారోదనమును నీవువింటివి. తల్లి నేనుదైవముచేత నిద్రయను నామధేయముకలదాననైతిని. కొంతకాలముదనుక నేను కుంభకర్ణుని ముఖమునందు నివసించి యుంటిని. కుంభకర్ణుఁడు మరణమునుపొందినపిమ్మట నేను నివసించుటకుఁ దగినస్థలములేనిదాననై బ్రహ్మదేవునిదగ్గరకుఁ బోయి యతనియాజ్ఞచేత నీపట్టణమునందుఁ బ్రవేశించితిని. అయినను నీయాచారభయమువలన నేనీపట్టణమునందుఁ బ్రవేశింపఁ జాలక యిక్కడనే నివసించియుంటిని. మఱియు నిక్కడనుండియే రోదనమును చేయుచున్నాను. ఓరఘుకులోత్తమా! నాకుఁ దగినచోటును నియమింపుము. నేనుబోయి సుఖముగనుండెద ననినవిని తన దూతలకృత్యమును స్మరించి కోపావిష్టుఁడై శ్రీరాముఁడిట్లనియె. ఓనిద్రా! నీవునివసించుటకుఁ దగినస్థలమును జూపెదను వినుము. పురాణశ్రవణమును వేదపాఠమును పూజాజపధ్యానాదులను చేయుచున్న పాపాత్ములయందుఁ బ్రవేశింపుము. మఱియును, జనులయందును, బాలురయందును, గర్భిణీస్త్రీలయందును, ఉపవాసవ్రతమును చేసి మరుదినము భోజనమును చేసిన వానియందును, విద్యార్థులయందును, శాంతునియందును, వాంతినిచేసికొనిన వానియందును, జాగరకామునియందును ప్రవేశించి నీవు వారలను మోహింపఁజేయుమనియె. అట్లు శ్రీరాముఁడు చెప్పిన వాక్యమునువిని నిద్రయనునది పరమానందము కలదై శ్రీరామునకు నమస్కరించి రామాజ్ఞనుసారముగఁ బోయెను. అంతట రాముఁడును దననివాసస్థానమునకుఁ బోయి సుఖముగనిద్రించె. అదిమొదలుకొని యానిద్రయనునది పూర్వోక్తస్థానములయందుఁ బ్రవేశించె. కావున నేటివఱకును పాపాత్ములను పుణ్యకర్ములయందు నిద్రబాధించుచున్నదని చెప్పి రామదాసు మరలనిట్లనియె. ఓశిష్యోత్తమా! విష్ణుదాసా! సీతామహాదేవికి కీర్తినికలుగఁజేయునట్టి మఱియొకకథను చెప్పెదను వినుము. కుంభకర్ణునిపుత్త్రుఁడగు నికుంభుని భార్య గర్భవతియై ప్రసూతియగుటకుఁ దండ్రియొక్క గృహమునకుఁ బోయి యక్కడనాలుగుమాసములు నివసించె. అంతటఁ గొన్నిదినములకు రావణాదులందఱును మరణమునుపొందిరి. వారందఱును మరణమును పొందినపిమ్మట పౌండ్రకుఁడనువాఁడుపుట్టె. వాఁడు మాయాపట్టణమునందుద్భవించి నూరుశిరస్సులు కలవాఁడును, రెండునూరుల హస్తములుకలవాఁడును నై యుండి రావణునియొక్క సాహాయ్యమునుపొంది లంకాపట్టణమునకుఁ బోయి విభీషణుని పారఁదోలి లంకాపట్టణము నాక్రమించె. అప్పుడు విభీషణుఁడు మిగుల ఖిన్నుఁడై యయోధ్యాపట్టణమునకుఁ బోయి యావృత్తాంతమును సర్వమును దెలియఁజేసె. అంతట శ్రీరాముఁడు సీతావిభీషణులతోఁ గూడ బయలువెడలి లంకాపట్టణమునకుఁబోయిరి. అప్పుడు సీతామహాదేవి యాపౌండ్రకునకు సహాయుఁడై వచ్చిన

శతకంఠ రావణుని సంహరించెను. పిమ్మట శ్రీరాముఁడు పౌండ్రకుని సంహరించి లంకారా జ్యమును విభీషణునకిచ్చి సీతామహాదేవితోఁ గూడ నయోధ్యా పట్టణమునకుఁబో యెను. అంతట కొన్ని దినములకు విభీషణుఁడు మంత్రులను భార్యాపుత్రులను వెంటఁ బెట్టుకొనివచ్చి విషణ్ణవదనముతో శ్రీరామునకు నమస్కరించి యిట్లనియె. పద్మ పత్రములవంటి నేత్రములుకలవాఁడవును రఘుకులోత్తముఁడవును అయినయోరామ చంద్రా! శరణాగతుఁడనైన నన్నుఁగాపాడుము. తొల్లి కుంభకర్ణునకు మూలనక్ష మునందొక్క పుత్రుఁడు పుట్టె. వాఁడు దూతలచేత వృక్షమూలమునందు విడిచిపెట్టఁ బడియె. అట్లు విడువఁబడినను మరణమును పొందక తేనెతుట్టెలయందలి తేనె నోట యందుఁ బడుచుండుటచేత క్రమక్రమముగ వృద్ధినిపొందె. వాఁడిప్పుడు వయోవం తుఁడై నిమూలకముగఁ దనవంశమంతయును నశించినదను వృత్తాంతమును విని బ్ర హ్మదేవుని గుఱించి తపస్సునుచేసి బ్రహ్మవరముచేత మదించినవాఁడయ్యె. అంతట పాతాళలోకమునందున్న రాక్షసులను వెంటఁబెట్టుకొని లంకాపట్టణమునకువచ్చె. వచ్చి నన్ను జయించి లంకాపట్టణము నాక్రమించెను. అంతట నేను మంత్రులను భార్యా పుత్రులను వెంటఁబెట్టుకొని రహస్యముగ నీచోటునకు వచ్చితిని. వాఁడు మూలనక్ష మునందుఁ బుట్టి తేనెమూలమునందు వృద్ధినిపొందుటచేత మూలకాసురుఁడను నామ ధేయముకలవాఁడయ్యె. మఱియు నారాక్షసుఁడిప్పుడు మిగుల ప్రఖ్యాతిని పొంది యున్నవాఁడు. మఱియు నతఁడు తనవారలఁ జంపిన నిన్ను పుత్రమిత్రాదులతోఁ గూడ వధింతునని ప్రతిజ్ఞచేసియున్నవాఁడు కావున నేఁడో రేపో వాఁడిక్కడకును వచ్చును. కాఁబట్టి యిప్పుడు ముఖ్యముగఁ జేయఁదగినది యేదియో దానిఁజేయుము యనియె. ఆవృత్తాంతమును సర్వమును శ్రీరాముఁడు విని మిగుల నాశ్చర్యముకలవాఁడై లక్ష్మణునితో నిట్లనియె. తమ్ముఁడా! లక్ష్మణుఁడా! భూలోకమునందుఁ గలరాజు లనందఱ రప్పింపుమనియె. అందుకు లక్ష్మణుఁ డంగీకారమును పొంది దూతలను బంపె. అంతట నారామదూతలు సకల దేశములకును బోయి రామాజ్ఞను దెలిపి వచ్చి శ్రీరామునితో నిట్లనిరి. ఓరఘుకులోత్తమా! కొందఱు రాజులు నీయాజ్ఞ నవలంబించిరి. కొందఱు నీయాజ్ఞను తిరస్కరించిరి. అట్లు చేయుటకు కారణము చంపికానుమతీ స్వయంవరమై యున్నది. నీయాజ్ఞను శిరసావహించిన సుగ్రీవాదులు తమతమ యాజ్ఞానుసారముగ ననేకవేల సేనలతోఁ గూడ వచ్చుచున్నారనియె. అట్లు చెప్పిన దూతలవాక్యములను విని పద్మపత్రములవంటి నేత్రములుకల శ్రీరాముఁ డు ఆరాజులందఱును నాబాణఘాతములను కోరుచున్నారు. కావున ముందుగ కుంభకర్ణునిపుత్రుని జంపి పిమ్మట నారాజులనందఱి వధించెద ననియె. ఈవిధము గఁజెప్పి సుదినమును విచారించుకొని బంధువులతోడను సైన్యముతోడను గూడు కొనినవాఁడై మూలకాసురుని సంహరించుటకై నయోధ్యాపట్టణమునొక్క బయ లునకువచ్చె. అప్పుడు స్వల్పసైన్యసమేతముగ యూపకేతుపుర పట్టణము నందుం

చె. కుశాదులేన్గురు బాలురు రామునితోఁ గూడ బయలువెడలిరి. అంతట శ్రీరాముఁడు సకలసైన్యమును విమానమునందు స్థాపించె. అంతలోపల సకలరాజులును తమతమ సైన్యములతోఁ గూడ వచ్చి శ్రీరామునకు నమస్కరించి యెదుట నిలిచిరి. అట్లు సైన్యసమేతముగ వచ్చిన రాజులనుగూడ శ్రీరాముఁడు తన విమానమునం దెక్కునటుల నాజ్ఞాపించె. ఆసమయమునందు సుగ్రీవుఁడు పదునెనిమిది పద్మముల వానరులతోఁ గూడ విమానాగ్రము నధిష్ఠించె. అంతట శ్రీరాముఁడు సీతాసహితముగ విమానము నధిష్ఠించె. పిమ్మట నానావిధములయిన దేశములను జూచుచు నాకాశమార్గముచేత లంకాపట్టణమునకుఁ బోయె. అప్పుడు మూలకాసురుఁడు శ్రీరాముఁడు యుద్ధమునకు వచ్చిన వృత్తాంతమును విని పదికోట్లమంది రాక్షసులను వెంటఁ బెట్టుకొని యుద్ధమును చేయుటకు నేగుదెంచె. అంతట నారాక్షసులు తమ పాదములచేత వానరులను దన్నిరి. వానరులును వారిని పాదములచేతఁ దాడనమును చేసిరి. ఈవిధముగ నాయిరు తెగలవారికిని ఏడుదినములు మిగుల భయంకరమైన యుద్ధము జరిగె. ఆయుద్ధమునందుఁ జచ్చిన వానరులను హనుమంతుఁడు సంజీవినిని గొనివచ్చి జీవింపఁజేసె. అంతటఁ గొన్ని దినములకు రాక్షససైన్యమునందు నాల్గింట నొక్కపాలు నిలిచె. అట్లు తనసైన్యమంతయును నశించుటచేత మూలకాసురుఁడు కోపోద్దీపితుఁడై మంత్రులను యుద్ధమునకుఁ బంపె. అప్పుడు శ్రీరామభటులు నానావిధములయిన యాయుధములచేత నారాక్షసులను గొట్టిరి. ఆరాక్షసులును రామభటులమీద నానావిధములయిన యాయుధములను ప్రయోగించిరి. అంతఁ గొంతసేపటికి రామభటులా మూలకాసురుని మంత్రులు మొదలగువారిని యమపురమునకుఁ బంపిరి. అట్లు తనమంత్రులందఱును మరణమును పొందుటను విని మూలకాసురుఁడు దివ్యమగు రథము నెక్కి స్వల్పసైన్యముతోఁ గూడ బయలువెడలె. అట్లు బయలువెడలి యుద్ధమును జేయుచుండె. అప్పు డనేకవేల వానరాదులమీద నానావిధములయిన యస్త్రములను ప్రయోగించె. మఱియును నానావిధములయిన దుందుభిధ్వనులను ప్రయోగించె. మఱియు నాయుద్ధమునం దామూలకాసురుఁడు రామసైన్యమును సర్వమును మూర్ఛను పొందించె. అప్పుడు కుశాదులు బయలువెడలి మిగుల భయంకరమైన యుద్ధమును చేసిరి. అంతట కుశుఁడు తనబాణములచేత మూలకాసురుని లంకాపట్టణమునందుఁ బడవైచె. పిమ్మటఁ గొంతసేపటికి రాక్షసుఁడు మూర్ఛనుండి తేరి రథశస్త్రములు పుట్టుటకొఱకు అభిచారికహోమమును ప్రారంభించె. అట్లు ప్రారంభించి లంకాద్వారములను మూసి గుహయందుఁ బ్రవేశించె. అప్పు డాహోమధూమమునుజూచి విభీషణుఁడు కల్పవృక్షముక్రింద బంధువులతోఁ గూర్చుండియున్న శ్రీరామునితో నిట్లనియె. ఓ రఘుకులోత్తమా! మూలకాసురుఁడు హోమమును చేయుచున్నాఁడు. ఆహోమము సంపూర్తిని పొందెనేని జయింప శక్యము కానివాఁడగునయా. ఇవ్వి

ధముగ విభీషణుఁడు చెప్పుచుండఁగా దేవతలతోఁగూడ బ్రహ్మదేవుఁడు శ్రీరాము నిదగ్గరకు వచ్చె. అట్లు వచ్చిన బ్రహ్మదేవునకు శ్రీరాముఁడు సకలోపచార సహితముగఁ బూజనుజేసె. అప్పు డాబ్రహ్మదేవుఁడు శ్రీరామునితో నిట్లనియె. ఓ రఘుకులోత్తమా! నేను మూలకాసురునకు వరములనిచ్చితిని. ఆమూలకాసురుఁడు వీరులవలన మరణము కలుగకుండునట్లు వరమునుగోరె. అట్టివరమునకు నేనంగీకారమును పొందితిని. కావున నీమూలకాసురుఁడు పురుషులవలన మరణమును పొందువాఁడుకాఁడు. కాఁబట్టి వీఁడు స్త్రీహస్తమువలన మరణమును పొందునని తెలిసికొనుము. వీని మరణమునకు మఱియొకకారణ మేదియును లేదు. తొల్లి యీ మూలకాసురునకు స్త్రీవలన మరణము కలుగునట్లు మునివరుఁడు శపించియుండెను. కాఁబట్టి రఘుకులోత్తమా! ఈమూలకాసురునకు సీతాహస్తమువలన మరణముకలుగును. కావున సీతను రప్పించి యీమూలకాసురుని వధయింపుమని చెప్పి యాబ్రహ్మదేవుఁడు తనలోకమునకుఁ బోయెను. అప్పుడు శ్రీరాముఁడు విభీషణునితో నిట్లనియె. ఓ రాక్షసోత్తమా! ఇప్పుడు మూలకాసురుని హోమమునకు విఘ్నమును చేయఁగూడదు. సీత యిక్కడకు వచ్చినపిమ్మట నాహోమమునకు విఘ్నమును కల్పింపవలయునని చెప్పి గరుడునిరప్పించి యిట్లనియె. ఓ గరుడుఁడా! నీవు పుష్పకవిమానమునెక్కి శీఘ్రముగ నయోధ్యాపట్టణమునకుఁ బోయి సీతన్ముకభాగమునందెక్కించుకొని సీతను ఇక్కడకుఁ దోడ్కొనిరమ్ము. హనుమంతునిగూడ నిక్కడకుఁ దోడ్కొనిపొమ్ము. ఆహనుమంతుఁడు నిన్న నలుదిక్కులనుండియు నపాయము రాకుండునట్లు సంరక్షించుచున్నాఁడు. కావున మీరిరువురును శీఘ్రముగఁ బొండనిన విని యాయిరువురును శ్రీరామునకు నమస్కరించి యయోధ్యాపట్టణమునకుఁ బోయిరి.

ఇట్లు శ్రీయానందరామాయణాంతర్గత రాజ్యకాండమునందలి
నాల్గవసర్గ ముగిసెను.

---

* సీతామహాదేవికి రామవిరహము కలుగుట. *

ఓ శిష్యోత్తమా! విష్ణుదాసా! అట్లు శ్రీరాముఁడు యుద్ధమునకై తరలి పోయిన పిమ్మట సీతామహాదేవి అయోధ్యాపట్టణమునందుండి శ్రీరాముని మనస్సునందు స్మరించుచు వియోగముచేత వ్యాకులమైన మనస్సుకలదియును కన్నీళ్లచేత వ్యాప్తమైన ముఖముకలదియును నై యుండెను. మఱియు నాసీతామహాదేవి రామవియోగదుఃఖమును సహింపలేక యొకప్పుడు మేడలమీదను మఱియొకప్పుడు ఉద్యానవనమునందును మఱియొకకాలమునందు సరయూతటమునందు విహరించుచుండెను. ఇంతియగాక యప్పుడప్పుడు నృత్యగీతాదులను జూచుచుండెను. మఱియొక సమయమునందు శ్రీరామునకు జయము కలుగుటకొఱకు కార్తికేయుని పూజించుచుండెను. ఇంకొక సమయమునందు తులసీఅశ్వత్థములకు ప్రదక్షిణములను చేయుచుండెను. మఱి

యును బ్రాహ్మణులచేత మన్యుసూక్తాదులను పఠింపజేయుచుండె. మఱియునాసీతామహాదేవి గోమయముచేత నాంజనేయవిగ్రహమును గోడయందు వ్రాసిపూజించుచు దినదినమందును అంగుళమాత్రాధికముగ నా యాంజనేయునితో కానలవ్రద్ధినిపొందించుచుండె. మఱియును దుర్గాదేవిని పూజించుచు శతరుద్రీయపూర్వకపారాయణమును బ్రాహ్మణులచేత చేయించుచుండె. మఱియునాసీతామహాదేవి గణేశునిహనుమంతుని పూజించుచుండె. కార్తికేయయంత్రమును స్థాపించి పూజించుచుండె. మఱియును సర్వకాలముల యందును మంచకమునందు శ్రీరాముని పూజించుచుండె. ఒక్కొకసమయమునందు రామవియోగదుఃఖముచేత సర్వాలంకారములను విడిచిపెట్టి చెలికత్తియలనడుమకూర్చుండి నిద్రలేకయుండుచుండె. ఒకానొకప్పుడు మేడయందుకూర్చుండి కాకమునుబిలచి యోకాకమా! నాకు శ్రీరామదర్శనము శీఘ్రమునయ్యెయెడల నీవులేచిపొమ్మనియును కానియెడల కదలకుండు మనియును చెప్పుచుండును. అట్లుసీతామహాదేవి యడిగినప్పుడా కాకము ఎగిరిపోవుచుండును. అప్పుడు సీతామహాదేవి కొంచెముగ ధైర్యముకలదై యుండును. అంతటవాయువు తోనిట్లనును. ఓవాయుదేవా! నీవుశ్రీరాముని స్పృశించివచ్చి నన్నుస్పృశింపుమని ప్రార్థించును. మఱియొకప్పుడు చంద్రునిజూచి యోచంద్రుడా! నీకిరణములతో శ్రీరామునిస్పృశించి వచ్చి యాకిరణములను నాయందువ్యాపింపజేయుమని ప్రార్థించుచుండును. మఱియును, శుక్లపక్షమునందలి ద్వితీయాతిథియందును సర్వాలంకారభూషితురాలై చెలికత్తియలతోఁగూడ చంద్రుని పూజించుచుండును. అత్రిమునివరుని భార్యయిచ్చిన పసపునుపూసికొనుటకుండు నితరమైన యాభరణములను స్పృశింపకయేయూరకుండె. మఱియు నాసీతామహాదేవి చందనపుష్పమాలాదుల నంగీకరింపకుండె. మఱియును శ్రీరామదర్శనేచ్ఛచేత నానావిధములయిన శకునములను జూచుచుండును. మఱియును, రాముడు తననువిడిచిపోయినది మొదలుకొని యభ్యంగోద్వర్తనములను విడిచిపెట్టె. మఱియును సీతామహాదేవి విరహాగ్నికలది యగుటచేత ఇష్టాన్నము తాంబూలము కేశబంధనము మొదలగువానిని పరిగ్రహింపకయుండె. మఱియును పరపురుషునితో మాటలాడుటను విడిచియుండె. మఱియు నెప్పుడును నవ్వులేనిదై యుండె. ఇంతియగాక మోమునెత్తి యన్యవస్తువులను చూడనిదియైయుండె. మఱియు నితరులకు గనఁబడనిదియును శయ్యమీదఁ బరుండనిదియును అద్దమునుచూడనిదియును చిత్రములగు వస్త్రకంచుకములను ధరింపనిదియును, వాకిటరానిదియును, యానదియందు స్నానమును చేయనిదియును, ఉద్యానవనాదులకు బోనిదియును నై యుండె. మఱియు ననేకవిధములయిన యుపవాసవ్రతముల నాచరించుచుండె. మఱియును, హనుమంతునకు వటకమాలను సమర్పింతుననియును, గణాధిపతికి పూర్ణముకల మోదకములు నివేదింతుననియును, దుర్గాదేవికి బలిదానమును చేయుదుననియును, చండికకు నాలుకనుకోసి రక్తమును సమర్పింతునని

యును, ప్రార్థించుచుండును. మఱియు నానావిధములయిన వ్రతముల నాచరింతు నని అయ్యోదేవతలను ప్రార్థించుచుండును. మఱియును శ్రీరామదర్శనము కలుగును గుడశ్రితములగు తిలలను ఏకోత్తరవృద్ధిగా భుజించుచుండె. ఈవిధముగ దినదినమునను వ్రతములను చేయుచుండె. రాత్రులయందు నిద్రలేనిదై యుండె. ఈవిధముగ సీతామహాదేవి దినదినమందును విరహాతురురాలై శాంతిని పొందకయుండె. మఱియు నీవిధముగానే యూర్మిళాదులుకూడ తమతమ భర్తలయాగమమునుగోరి యనేకములయిన వ్రతములను సలుపుచుండిరి. మఱియును, వారందఱును తమతమ వియోగాగ్నిచేతఁ బ్రజ్వలించుచుండిరి. మఱియును వారందఱును కొంచెమైనను సుఖములేనివారై యుండిరి. మఱియు నాసమయమునందు మయూరములుకూడ నృత్యమును వదలె. పంజరమునందున్న చిలుకలు పాటలనువిడిచిపెట్టె. మఱియు నితరములయిన పక్షులన్నియును తమతమ స్వజాతిపక్షులతో క్రీడలను వదలియుండెను. ఇట్లు సీతాదులు వ్రతనియమముల నాచరించుచుండఁగా హనుమద్గరుడులు అయోధ్యాపట్టణమునకు వచ్చిరి. ఆసమయమునందు సీతామహాదేవికి వామభుజస్పందాది శుభశకునములయ్యె. అట్టిశుభచిహ్నములనుజూచి సీతామహాదేవి స్వల్పముగ సంతోషము కలదయ్యె. ఇంతలోపల గరుడహనుమంతులు సభాస్థానికిబోయి తమయాగమన వృత్తాంతమును యూపకేతువునకు దెలిపిరి. ఆవృత్తాంతమును సర్వమును విని యూపకేతువు సీతామహాదేవికి దెలిపె. ఆవృత్తాంతమును సీతామహాదేవి విని మిగుల సంతోషముకలదై యాశుభదినమందే రామవాక్యానుసారముగ మిగులవేగముకల గరుడునిమీఁద నెక్కె. ఆసమయమున దగ్నిహోత్రమును ముందునిడుకొని పురోహితులతోఁగూడ బయలువెడలె. భర్తసమీపమునందు లేనపుడు అగ్నిహో[illegible]ముతోఁగూడ భార్యయగునది సీమోల్లంఘనమును చేయఁగూడదను శాస్త్రము ఈసమయమునందు దోషమును గలిగింపఁజాలదు. ఆపత్కాలమునందు అగ్నిహోత్రముతోఁగూడ స్త్రీలు పయనమై పోవచ్చునని శాస్త్రమునందుఁ జెప్పబడినది. భూమియందున్న బ్రాహ్మణులచేత దేవచర్తియు నాచరింపఁగూడదు. అట్లు సీతామహాదేవి బయలువెడలినపిమ్మట హనుమంతుఁడు గరుడున కపాయము రాకుండునట్లు నలుదిక్కులను గనిపట్టిచూచుచు బోవుచుండె. అప్పుడు సీతామహాదేవి నానావిధములయిన దేశములను జూచుచు లంకాపట్టణమునకుబోయె. పోయి కల్పవృక్షముక్రింద గూర్చున్న శ్రీరామునిజూచె. అంతట గరుడునిదిగి శ్రీరామునకు నమస్కారమునుచేసె. అప్పుడు శ్రీరాముఁడు సీతామహాదేవిని జూచి హేసీతా! నీముఖమిప్పుడు వివర్ణమైయుండుటకు కారణమేమి? నీశరీరము మిగుల కృశించియుండుటకు హేతువేమి? అనినవిని సీతామహాదేవి లజ్జాస్మితములు కలదగుచు వినోదముగ శ్రీరామున కిట్లనియె. రఘుకులోత్తమా! నీవియోగమువలన నీయవస్థయంతయును సంప్రాప్తమాయెనని తెలిసికొనుము. నిన్నువదలినది మొదలుగా నాకునిద్రా

హారములు లేవు. యోగినివలె నిన్నే ధ్యానించుచున్నాను. నీముఖమునకు సమానమగు చంద్రునికూడ నాచేతఁ జూడఁబడలేదు. నీతో మాట్లాడుట లేనందున చిలుకలు మొదలగు వానితోఁగూడ సంభాషించుటను విడిచిపెట్టితిని. నీసంబంధము లేక పోవుటచేత వాయు సంబంధమునుగూడ విడిచిపెట్టితిని. మఱియు నో రఘుకులోత్తమా! నీకు జయము కలుగుటకొఱకు నానావిధములయిన యమనియమాదుల నవలంబించియుంటినని విని శ్రీరాముఁడు సంతోషముతో సీతామహాదేవిని మాటిమాటికిని నాలింగనము చేసికొని కరములచేత కుచములను స్పృశించి యధరామృతమును గ్రోలె. అంతట మరుదినమునందు శ్రీరాముఁడు ముందును స్నానమును చేసి సీతనుగూడ స్నానము చేయించి యస్త్రవిద్యా శస్త్రవిద్యలను అస్త్రశస్త్రాహ్వాన విసర్జనములను ఉపదేశించె. మఱియును సమస్తమైన ధనుర్విద్యను నుపదేశించె. అంతట రామాజ్ఞచేత లక్ష్మణుఁడు రథమును సిద్ధముజేసె. అనేకములగు శస్త్రాస్త్రములను గదా పద్మాద్యాయుధములను రథములందుంచె. దారుకుని సారథినిగాఁజేసి గరుడధ్వజమును గల్పించె. మఱియును, శైబ్యసుగ్రీవ బలాహక మేఘపుష్పములు వాయువేగమువంటి వేగముకల గుఱ్ఱముల నధిష్ఠించి యారథమునకుఁ గట్టునునిలిచిరి. మఱియు నారథమునందు ఛత్రచామరాదులు సిద్ధము చేయఁబడియె. అట్లుసిద్ధమును చేయఁబడిన రథమునుజూచి శ్రీరాముఁడు సీతామహాదేవితో నిట్లనియె. ఓసీతా! నీవీ రథము నెక్కి మూలకాసురునిజూపింపుమనియె. అట్లు శ్రీరాముఁడు చెప్పినవాక్యమును విని శుభమోహాపి శయగు సీతను బంపె. అంత నాతామసికూడ శ్రీరామునకు నమస్కరించి రథము నెక్కి మిగులవేగముగ రథమును దోలించె. అప్పుడు శ్రీరామప్రేరితులై వానరబృందములను లంకాపట్టణమునకుఁ బోయి హోమమునుచేయుచున్న మూలకాసురుని చలింపఁజేసిరి. అట్లు మూలకాసురుని హోమమునకు విఘ్నమునుగల్పించి మరల శ్రీరామునిదగ్గరకు వచ్చిరి. అంతనక్కడ మూలకాసురుఁడు కోపోద్దీపితుఁడై రథము నెక్కి యుద్ధమునకు బయలు వెడలె. అట్లు యుద్ధసన్నద్ధుఁడై వచ్చుచుండఁగ నామూలకాసురుని మకుటము క్రిందఁబడె. అవ్విధముగ నపశకునము గలిగినను మూలకాసురుఁడు గర్వముచేత వెనుకకుఁబోక యుద్ధమునకు నతివేగముతో వచ్చె. అప్పుడు ఛాయారూపముతోనున్న సీతామహాదేవి లక్ష్మణాది సైన్యముతోఁగూడ నామూలకాసురుని మార్కొనియె.

ఇట్లని రాజ్యకాండమునందలి యెనిమిదవసర్గ ముగిసెను.

---

* శతముఖరావణాసురుని సంహారవర్ణనము *

శిష్యోత్తముఁడవైన యో విష్ణుదాసా! అనంతరమందు ఛాయారూపముతోనున్న సీతామహాదేవి మిగుల గొప్పదైన యాధనుస్సును ఓంకారమును చేసి మిగుల వేగముగ రణాంగములోనికి బోయె. అప్పుడు భయంకరములయిన కోరలను

స్తనములును కలదియును, మెఱపుతీగెలవలె మెఱయుచున్న శిరోరుహములు కలదియును, తాటిమ్రానులవంటి పిక్కలుకలదియును, చేటలవంటి పాదములుకలదియును, పర్వతగుహవంటినోరు కలదియును, మేఘముయొక్క కాంతివంటి కాంతిగలదియును, వ్రేలాడుచున్న జిహ్వకలదియును, తెరవఁబడిన నోరుగలదియును, అధికమైన శిరస్సు కలదియును, అయిన సీతామహాదేవినిచూచి యామూలకాసురుఁడు మిగుల భయముకలవాఁడై తొట్రుపడుచున్న వాక్యములతో నిట్లనియె. ఓసీ నీవెవతెవు ఏమినిమిత్తమున నిక్కడకువచ్చితివి. ఎందుకొఱకు యుద్ధమునుచేయఁ దలఁచుచున్నావు. నీయభిప్రాయమును సర్వమును దెలుపుము. నీవు నాయెదుట స్థిరముగా నుండఁజాలవు. నీకు జీవింపవలయు ననియెడు కోర్కె కలిగియున్నయెడలఁ దొలఁగిపొమ్ము. నేను స్త్రీలయందు పౌరుషమును జూపువాఁడను గాననియె. ఆసమయమునందు నిజసీతారాములు విమానమునుండి చూచుచున్న యాతిఘోరరూపముతోనున్న సీతామహాదేవి యామూలకాసురుని బెదరించుచు నిట్లనియె. ఓ మూలకాసురా! నన్నుఁ జండికనుగాఁ దెలిసికొనుము. తొల్లియును నానిమిత్తముగనే నీకులమంతయును నశించె. పూర్వమునాయందు పంక్తిపాతముకల బ్రాహ్మణుని నీవు చంపినవాఁడవైతివి. కావున నిప్పుడు నిన్నుఁజంపి యాబ్రాహ్మణుని ఋణమును దీర్చికొనియెదనని చెప్పి యాసీతామహాదేవి ధనుస్సునుచేఁబూని యతనియందైదుబాణములను బ్రయోగించె. అంతట నామూలకాసురుఁడు ఆఛాయాసీతమీఁద బాణములను బ్రయోగించె. అప్పుడు వానరాదులందఱును గోపురాట్టాలకాదులయందు నిలిపించి యాసీతారాక్షసుల యుద్ధమును చూచుచుండిరి. మఱియు నప్పుడు సీతారాములు విమానమునందుండి యాయుద్ధమును చూచుచుండిరి. అప్పుడు ఛాయారూపముతోనున్న సీతామహాదేవి మూలకాసురుఁడు ప్రయోగించు బాణములనన్నిటిని ఛేదించె. అట్లు మూలకాసురుని బాణములను ఛేదించి మరల నాలుగుబాణములను బ్రయోగించి గుఱ్ఱములనుజంపి యామూలకాసురుని ధనుర్ముకుటములను క్రిందఁబడవైచె. అనంతరమామె రథచక్రములను హతముచేసె. అప్పుడా మూలకాసురుఁడు వేఱొక రథమునెక్కి మరల యుద్ధమును చేయనారంభించె. అప్పుడు మూలకాసురుఁడు ఛాయాసీతమీఁద నాగ్నేయాస్త్రమును బ్రయోగించె. అంతట ఛాయాసీత మేఘాస్త్రమును బ్రయోగించె. అట్లు ప్రయోగించి యాగ్నేయాస్త్రమును నివారించె. అంతట నామూలకాసురుఁడు పర్వతాస్త్రమును బ్రయోగింపగా వాయవ్యాస్త్రముచేత నివారించె. అనంతరమందు సర్పాస్త్రమును గారుడాస్త్రముచేత నివారించె. ఈవిధముగ నయ్యిరువురును నేడుదినములు మిగుల భయంకరమైన యుద్ధముచేసిరి. అంతట నాఛాయాసీత మిగుల రౌద్రిగాదై చండికాస్త్రముచేత మూలకాసురుని జంపఁదలచినదై యామహాస్త్రమును మూలకాసురునిమీఁదఁ బ్రయోగించె. ఆసమయమునందు లోకమంతయును చలించె. సముద్రము లల్లకల్లోలముల

దెను. దశదిక్కులయందును రజస్సువ్యాపించె. అంతట నాచండికాస్త్రము మూల కాసురుని శిరస్సునుఛేదించె. ఛేదించి యతనిశరీరమును దీసికొనిపోయి లంకాపట్ట ణమునందలి రాజద్వారమునందుఁ బడవైచె. ఆసమయమునందు లంకాపట్టణమున హాహాకారములు చెలంగె. దేవదుందుభులుమ్రోగె. దేవతులందఱును నాకాశము నందుండి పుష్పవర్షమును గురిపించిరి. అంతట ఛాయారూపముతో నున్న సీతామ హాదేవి సీతారాముల దగ్గఱకువచ్చి యాసీతారాములకు నమస్కరించి సీతాదేహ మునందు లయమునుపొందె. అప్పుడు మరల దేవవాద్యములు మ్రోగె. అప్సర స్త్రీలు నృత్యములనుచేసిరి. వందిమాగధాదులు స్తోత్రములను చేసిరి. నటాదు లు నృతములను సల్పిరి. అప్పుడు బ్రహ్మాది దేవతులందఱును శ్రీరాముని దగ్గ రకువచ్చి సీతారాములకు నమస్కరించి యనేకవిధముల సీతామహాదేవిని స్తో త్రముచేసిరి. అప్పుడు బ్రహ్మదేవుఁ డిట్లని యభినుతించె. " బ్రహ్మోవాచ ॥ జనకాత్మజే రాఘవప్రియే కనక భాసురే భక్తపాలకే । దశరథాత్మజ ప్రాణవల్లభే తవపదాంబుజా లిశ్శిరోస్తుమే॥ మూలకాసురప్రాణఘాతికే రామరక్షితే రామసేవితే । రామమోహినిస్యందనస్థితే త్వత్పదాంబుజాలిశ్శిరోస్తుమే ॥ రామమంచకాధి ష్ఠితే రమే రామజీవితే రామలాలితే । రామసంస్తుతే రామరంజితే త్వత్పదాంబుజా లిశ్శిరోస్తుమే ॥ లోకపావని శ్రీరజేవగే భూమికన్యకే లోకపాలికే । పద్మలోచన స్వాత్మజేశ్వరే త్వత్పదాంబుజాలిశ్శిరోస్తుమే ॥ కింజలోచనే నాగిగామిని స్వీయన. తుష్టిరమ్య రూపిణే । రుక్మభూషితే పత్తికాంకితే త్వత్పదాంబుజాలిశ్శిరోస్తుమే ॥ జలరుహాననేచిత్రవాసినిత్వవసిసర్వదా స్వీయసేవకాన్ । మునిరిపూన్సదా మోక్ష దాయకే త్వత్పదాంబుజాలిశ్శిరోస్తుమే ॥ త్వన్మృషేషణా ద్రాక్షసాం పతిః ప్రాప సంక్షయం రామసత్ప్రియే । త్వద్దృగీక్షణాల్లజ్జితామృగీత్వత్పదాంబుజాలి శ్శిరో స్తుమే ॥ కుశలహాంబికే జలరుహాననే జలరుహేక్షణే పాదదాయకే । మధురిసుస్వనే నూపురీస్వనేత్వత్పదాంబుజాలిశ్శిరోస్తుమే ॥ ఘ్రాణముత్తమంతస్మితాననే శేధర శ్శుభోబింబవన్నిభః । అద్యనైత్వయామూలకాసురే మారితోరణే తారితానయమ్" అని బ్రహ్మదేవుఁడు స్తోత్రముచేసె. ఈస్తోత్రమును పఠించిన పురుషుఁడు సకలాభి లాషలును ఫలములగును. శిష్యోత్తముఁడవైన యోవిష్ణుదాసా! ఈవిధముగ బ్ర హ్మాదిదేవతలు స్తోత్రమునుచేసి వస్త్రాలంకార మండనములచేత సీతారాములను పూజించిరి. అనంతరమందా బ్రహ్మాదిదేవతలు రామునిచేతఁ బూజింపఁబడిరి. అంతట నాదేవతలందఱును రామాజ్ఞనుపొంది స్వర్గలోకమునకుఁ బోయిరి. అట్లు బ్రహ్మాది దేవతలు పోయినపిమ్మట విభీషణుఁడు శ్రీరామునితో నిట్లనియె. ఓరఘుకులోత్తమా! తొల్లియును నీవు లంకాపట్టణములోనికి వచ్చినవాఁడవు కావు. కావున నిప్పుడైనను లంకాపట్టణములోనికివచ్చి నన్నుఁ గృతార్థునిగాఁ జేయుమనిన విని శ్రీరాముఁడం ముఁ కంగీకారమునుపొందె. అంతట శ్రీరాముఁడు విమానారూఢుఁడై మిత్రగృహ

మునకుఁబోయెను. పోయి విభీషణుని లంకాపట్టణమునం దభిషిక్తునిగాఁ జేసె. అప్పుడు లంకాపట్టణమునందు అత్యద్భుతమైన యుత్సవమయ్యె. అంతట విభీషణుఁడు వస్త్రాలంకార రత్నాదులచేత సీతారామాదుల సన్మానించె. మఱియు వానరయూథములందు రాక్షసు లందఱును తమ సకలధనమును శ్రీరామునకు సమర్పించిరి. అంతట శ్రీరాముఁడు రావణునిచేతఁ బూజింపఁబడిన కపిల వారాహమూర్తిని పూజించుట కభిలషించె. అప్పుడు విభీషణుఁడు ఆకపిలవారాహమూర్తిని శ్రీరామునకు సమర్పించె. ఆవిగ్రహమును తొల్లి కపిల మునివరుఁడు తన మనస్సుచేత నిర్మించె. దానిని చిరకాలము దేవేంద్రుఁడు పూజించుచుండెను. అంతట రావణుఁడా యింద్రుని గొట్టి యావిగ్రహమును గొనివచ్చె. అట్టి విగ్రహమును విభీషణుఁడు శ్రీరామునకు నర్పించె. అంతట శ్రీరాముఁ డావిగ్రహమును విమానమునందు స్థాపించె. అప్పుడు సీతామహాదేవి మఱఁదులు పుత్రులు శ్రీరాముఁడు మొదలగు వారితోఁ గూడ నశోకవనమునందుఁ బ్రవేశించి మిగుల శ్రేష్ఠమైన శింశుపా వృక్షమును చూచె. మఱియు నావృక్షమును శ్రీరామునకుఁ జూపె. అంతట నాసీతామహాదేవి శ్రీరాముని కనిష్ఠికనవలంబించి యావనమంతయును తిరిగితిరిగి చూచె. మఱియు నాసీతామహాదేవి తానున్నాసనాదులనుజూపె. అనంతరమందు సీతామహాదేవి వస్త్రాభరణాదులచేత త్రిజటను సంతోషము కలదానినిగాఁ జేసె. అట్లు చేసి సరమతో నిట్లనియె. ఓసరమా! నేను ఈత్రిజటవలన రాక్షసులనుండి కాపాడఁబడితిననియె. ఇట్లు చెప్పి సరమహస్తమునందు త్రిజటాకరమును సమర్పించె. నన్నుఁ జూచినట్లు చూచుమనియె. పిమ్మట సీతాదేవి తననివాసస్థలమునకుఁబోయె. మఱియు నీరులనే నానావిధములయిన నికుంభిలాది స్థలములనుజూచె. అంతట శ్రీరాముఁడు విభీషణాదులతోఁ గూడుకొని పుష్పకారూఢుఁడై బయలువెడలె. ఆసమయమునందు విభీషణుఁడు లంకాపట్టణమును పాలించుటకు నియమించె. మఱియును శ్రీరాముఁడు లంకాపట్టణమును విడిచిపోవునపుడు ధనుస్సును చేతిధరించి లంకాపట్టణము చుట్టునుదిరిగె. అట్లు తిరుగుచు శ్రీరాముఁడు విభీషణునితో నిట్లనియె. ఓవిభీషణుఁడా! ఈధనుస్సుతో నీకు రక్షను చేయుచున్నాను. నాధనుస్సుయొక్క రేఖను దాటుట కెవ్వరికిని శక్యముగాదు. ఓ విభీషణా! నీవీబాణమును ధరింపుమని బాణమును సమర్పించె. నానామముచేత సంకితమైన యీబాణము నీకు సంరక్షకమైయుండును. నాబాణమును హస్తమున ధరించిన నిన్ను నెవ్వఁడును జయింపఁజాలఁడని చెప్పె. ఇవ్విధముగఁ జెప్పి యాబాణమును సమర్పించె. అంతట విభీషణుఁడు రామముద్రకును రామబాణమునకును నమస్కారమునుచేసె. పిమ్మట శ్రీరాముఁడు విమానమునెక్కి యనేకములయిన దేశములను జూచుచు దాక్షిణాత్యులగు రాజులచేత పూజింపఁబడుచు నయోధ్యాపట్టణమునకుఁబోయెను. ఆసమయమున నయోధ్యాపట్టణమునం దనేకములయిన వాద్యములు మ్రోగె. అప్సరస్త్రీలు నృత్యములనుచేసిరి. అంతట యాకేతువు నగరజనుల

తోఁగూడ శ్రీరామునెదుర్కొనియె. అప్పుడు పురస్త్రీలు ప్రాసాదశిఖరముల నెక్కినవారై సీతారాములనుజూచి పుష్పవర్షములను గురిపించిరి. అంతట శ్రీరాముఁడు సకలరాజ సముదాయముతోఁగూడ సభయందుఁ బ్రవేశించె. అప్పుడు సీతామహాదేవి సంతుష్టమైన మనస్సుకలదై స్వకీయమందిరమునందుఁ బ్రవేశించె. శ్రీరాముఁడు కపిలవారాహమూర్తిని దేవపూజాగృహమునందుఁ బ్రవేశపెట్టె. అంతటనొక్కనాఁడు సంతోషముకలవాఁడై శ్రీరాముఁడా కపిలవారాహమూర్తిని శత్రుఘ్నున కిచ్చె. అంతట సీతామహాదేవి రామవియోగకాలమునందు సంకల్పించిన వ్రతములనన్నింటిని నెరవేర్చె. మఱియు ననేకములయిన వ్రతోద్యాపనములనుచేసె. అట్లుండఁగ నొక్కనాఁడు యమునాతీరమందున్న మునివరులు లవణాసురుని బాధసహింపఁజాలక శ్రీరామునిఁజూచుటకు వచ్చిరి. అనేకులగు మునివరులు వచ్చునపుడు తమకగ్రేసరునిగా చ్యవనమునివరుని నియమించుకొనిరి. అట్లు శిష్యప్రశిష్య గణముతోఁగూడ వచ్చినమునివరులను శ్రీరాముఁడుపూజించి మృదుమధుర వాక్యములచేత నామునివరులకు సంతోషమును గలిగించుచు నిట్లనియె. ఓమునికులోత్తములారా! మీరందఱు నొక్కపెట్టున వచ్చుటకు కారణమును దెలుపుడు. మీయభీష్టమును నెఱవేర్చుటకు సిద్ధముగనున్నాఁడను. మీరందఱును నన్నుఁజూచుటకు వచ్చుటచేత నేనుధన్యుఁడనైతిని. మీకుదుష్కరమైన కార్యమేదియో దానిని జేయుటకు నేనుసిద్ధముగనున్నాఁడను. తమతలంపును సెలవిండు. నాకు బ్రాహ్మణులే దైవతముగనున్నవారనినవిని యామునివరులలో నగ్రేసరుఁడగు చ్యవనమునివరుఁ డిట్లనియె. ఓరఘుకులోత్తమా! తొల్లి కృతయుగమునందు మధువను రాక్షసుఁడొక్కఁడుకలఁడు. వాఁడు మిగులధర్మాత్ముఁడును దేవబ్రాహ్మణపూజకుఁడునునై యుండె. అందువలన పరమశివుఁడు సంతసించి యతనికి శూలాయుధమునిచ్చి యీబాణము నెవ్వనియందుఁ బ్రయోగింతువో వాఁడు భస్మమైపోవునని యె. ఆమధువను రాక్షసునకు రావణుని చెలియలగు కుంభీనసభార్యయయ్యె. ఆకుంభీనసయందు లవణుఁడను కుమారుఁడుకలిగె. ఆలవణాసురుఁడత్యధికమైన పరాక్రమముకలవాఁడు. మఱియు నాలవణాసురుఁడు దురాత్ముఁడును దుర్ధర్షుఁడును దేవబ్రాహ్మణహింసకుఁడునునై యున్నాఁడు. పూర్వమునందు వానితండ్రియగు మధువనురాక్షసుని నీవుసంహరించితివి. అందువలన నీవుమధుసూదనుఁడను నామధేయముకలవాఁడవైతివి. ఇప్పుడు మేము లవణాసురుని చేతఁ బీడింపఁబడి యాబాధను సహింపలేక నిన్ను శరణమును పొందితిమనిరి. ఇవ్విధముగ చ్యవనాదిమునివరులు చెప్పినవాక్యమునువిని శ్రీరాముఁడు వారలభయపడకుఁడని చెప్పె. మఱియు నోమునివరులారా! ఆలవణాసురుని నశింపఁజేసెదను. మీరుభయమును వదలిపొండనియె. అనంతరమందు శత్రుఘ్నునిపిలిచి యిట్లనియె. ఓశత్రుఘ్నుడా! నిన్నిప్పుడే మధురారాజ్యమునకు పట్టాభిషిక్తునిగాఁజేసెదననిన విని శత్రుఘ్నుఁడిట్లనియె. ఓరఘుకులోత్తమా! నాకు రాజ్యమక్కరలేదు. నన్ను నీపాదపద్మములఁ

వదలి దూరముగనుండునట్లు చేయకుము. నేను నిన్ను వదలిపోఁజాలనని యనేకవిధ
ముల బ్రార్థించె. అట్లు చెప్పిన శతృఘ్నుని వచనములనువిని శ్రీరాముఁడు భర
తునిపిలిచి శతృఘ్నునితోఁజెప్పిన విధముగా నే చెప్పఁగా నతఁడును అంగీకారము
ను పొందకపోయె. అనంతరమందా రాజ్యమునకు సుబాహు యూపకేతువులను
పట్టాభిషిక్తులనుగాఁజేసి తనయెదుటనున్న శతృఘ్నునితో నిట్లనియె. ఓతమ్ముఁడా!
నాపేరుగల యీ బాణమును గైకొనుము. ఈ బాణముచేత లోకకంటకుఁడగు లవణా
సురుని దేవేంద్రుఁడు వృత్రాసురుని వధించిన విధముగ క్షణమాత్రములోపల వధిం
పఁగల వని చెప్పి యీ బాణమునిచ్చి మఱియు నిట్లనియె. ఓతమ్ముఁడా! ఆలవణాసు
రుఁడు శూలమునుపూజించి గృహమునందుంచి యరణ్యమునకుఁ బోవును. పోయి
భక్షణార్థము జంతువులను సంహరించుటకు యత్నించును. కావున నీవిప్పుడు బయ
లువెడలిపోయి యాలవణాసురుఁడు మరల గృహమునకు రాకమునుపే వధింపు
ము. మఱియును నీవుపోయి యాలవణాసురుఁడు పట్టణములోనికి శూలము నిమి
త్తముపోకుండునట్లు పురద్వారము నడ్డగింపుము. అట్లు పురద్వారమడ్డగించుటచేత
నాలవణాసురుఁడు కోపోద్దీపితుఁడై నీతో యుద్ధము చేయును. ఆసమయమునందు
నీవీబాణమును బ్రయోగింపుము. ఈబాణముచేత నాలవణాసురుఁడు మరణమును
పొందును. ఇవ్విధముగ లవణాసురునివధించి యమునానదియందున్న మధురాపట్ట
ణమునందుఁ బ్రవేశించి దానియందు సుబాహువునుంచుము. అనంతరమందు యూ
పకేతువును విదిశానగరమునందుఁ బ్రవేశపెట్టుము. ఈవిధముగఁ జేసినపిమ్మట నా
యొద్దకురమ్ము? మఱియు నోశత్రుఘ్నా! అయిదువేలరథములను, రెండువేలయేను
గురథములను, ఆరునూరుల యేనుగులను, పదివేలకాల్బలమును వెంటఁబెట్టుకొని పొ
మ్ము? నీవీయుద్ధమునకుఁ బోయివచ్చిన పిమ్మట నేను దుష్టరాజులను వధించుటకు
బయలు వెడలి పోయెదను. కావున నోతమ్ముఁడా! నీవు శీఘ్రముగ రమ్మనియె. ఇవ్వి
ధముగఁజెప్పి శ్రీరాముఁడు శత్రుఘ్నుని శిరస్సునుమూర్కొని బ్రాహ్మణాశీర్వచ
నములచేత సంతోషింపఁజేసె. అంతట శత్రుఘ్నుఁడు శ్రీరామునకు నమస్కరించి
మధువనమునకుఁ బోయె. అట్లుపోవునపుడు పూజార్థముగ కపిలవారాహమూర్తిని
గూడుకొనిపోయె. అనంతరమందు శ్రీరాముఁడు యూపకేతు సుబాహువులను
వారివారి భార్యలతోఁగూడఁ బంపె. మఱియు ననేకవేల దాసదాసీజనమును గోధ
నాదులను గూడఁబంపె. అంతట శతృఘ్నుఁడు బయలువెడలిపోయి శ్రీరామ
వాక్యమనారముగ లవణాసురునివధించి మధురాపట్టణమును నిర్మించి యందనేక
దేశములను విభజించి సుబాహువును మధురాపట్టణమునందుఁ బ్రవేశపెట్టె. యూప
కేతువును విదిశానగరమునందు భార్యాపుత్రాదులతోఁగూడఁ బ్రవేశపెట్టె. అనం
తరమందు శత్రుఘ్నుఁడు కొన్నిదినములు మధురాపట్టణమునందు నివసించి యాక
పిల వారాహమూర్తిని సుబాహువునకు నొసంగె. ఇప్పటికిని మధురాపట్టణమునం

దావిగ్రహముకలదు. అనంతరమందు శత్రుఘ్నుఁడు సైన్యసమేతముగ నయోధ్యాపట్టణమునకుఁ బ్రవేశించె. ప్రవేశించి జరిగినవృత్తాంతమును సర్వమును శ్రీరామునకుఁ దెలిపె. అనంతరము నొకనాఁడు కైకేయీనందనుఁడగు భరతుఁడు జనకమాతయగు యుధాజిత్తుచేతఁ బిలువఁబడి సైన్యముతోఁగూడ బయనమైపోయె. అన్నరామాజ్ఞచేత బయలువెడలిపోయి మూఁడుకోట్లగంధర్వులను సంహరించి యంతకుముందే యభిషేచనము చేయఁబడి పుష్కరుని పుష్కరావతియను పట్టణమునం దభిషిక్తునిగాఁ జేసె. అనంతరమందు తక్షుఁడనువాని తక్షశిలానగరమున కధిపతినిగాఁ జేసె. అప్పుడు తక్షుఁడా పట్టణమునందు దాసదాసీజనముతోఁగూడ నివసించె. అంతట భరతుఁడు బయలువెడలివచ్చి రామసేవాపరుఁడయ్యె. అనంతరమందు శ్రీరాముఁడు ప్రీతుఁడై లక్ష్మణునితో నిట్లనియె. తమ్ముఁడా! అంగదచిత్రకేతువుల నిరువురను దోడ్కొనిపోయి పశ్చిమదిక్కునందుఁ బ్రవేశించి దుష్టులను సర్వజనులకును అపకారమును చేయువారును అయిన మ్లేచ్ఛులనుజయించి గజాశ్వధనరత్నములు కల పట్టణమునకు నయ్యిరువుర నధిపతులనుగాఁ జేయుము. అయ్యిరువురకును నేనిదివఱకే పట్టాభిషేకమును చేసితిని. కావున నీవువారల వెంటబెట్టుకొనిపోయి నేను చెప్పినవిధముగఁ జేసి శీఘ్రముగ బయలువెడలి రమ్మనియె. అంతట లక్ష్మణుఁడు బయలువెడలిపోయి రామాజ్ఞానుసారముగ సర్వమును నెరవేర్చి మిగులవేగముగ రామునిపాదపద్మములను సేవించుటకువచ్చె. అంతట శ్రీరాముఁడు జ్యోతిష్కులను పిలిచి పూజించి భూమినిజయింపఁదలఁచినవాఁడై సుముహూర్తమును విచారింపుఁడనియె. పిమ్మట నాగణకులు సుముహూర్తమును విచారించిచెప్పిరి. అప్పుడు శ్రీరాముఁడా సుముహూర్తకాలమునువిని గణకులనుపూజించి వారివారిగృహములకుఁ బంపె. పిమ్మట శ్రీరాముఁడు లక్ష్మణునితో నిట్లనియె. ఓతమ్ముఁడా! లక్ష్మణా! భూమియందున్న సకలరాజులను జయించుటకు నేను విమానారూఢుఁడనై పోయెదను. శీఘ్రముగ చతురంగ బలమునుబంపుము. మఱియును పుష్పకవిమానమునందు నానావిధములయిన శస్త్రాస్త్రములనుంచుము. ఈపట్టణమును సుమంత్రుఁడు కాపాడునట్లు చేయుమనియె. ఈవిధముగ శ్రీరాముఁడు చెప్పిన వాక్యములనువిని లక్ష్మణుఁడు రామాజ్ఞానుసారముగ సర్వమును సిద్ధపఱచె.

ఇట్లని రాజ్యకాండమునందలి యానసర్గ ముగిసెను.

✱ శ్రీరాముఁడు భరతఖండమును జయించుట. ✱

అంతట శ్రీరాముఁడు భూలోకమునందలి రాజులనందఱను జయించుటకు నేను ప్రయత్నించితి ననియె. ఆవచనమును విని సీతామహాదేవి లజ్జకలదై, ఓరామచంద్రా! నీ వియోగమును నేను సహింపఁజాలను. కావున నేనుగూడ నీతో వచ్చెదననియె. అందులకు శ్రీరాముఁ డంగీకారమును పొంది సీతామహాదేవి లాల

నమునుచేసె. ఇంతలోపల నూర్మిళాదులును కుశలవాదుల భార్యలును మేముకూడ వచ్చెదమని సీతామహాదేవిని ప్రార్థించిరి. మఱియును తమతమ భర్తలయొక్క వియోగమును సహింపఁజాలమని ప్రార్థించిరి. అంతట సీతామహాదేవి యాయూర్మిళాదుల యభిప్రాయమును శ్రీరామునకుఁ దెలిపె. ఆవృత్తాంతమును విని శ్రీరాముఁ డంగీకారమును బొందె. అంతట సీతామహాదేవి శ్రీరామాభిప్రాయము నూర్మిళాదులకుఁ దెలిపి మీమీనివాసములకుఁ బొండనియె. పిమ్మట నాస్త్రీలందఱును తమతమ నివాసములకుఁ బోయిరి. అనంతరమందు శ్రీరాముఁ డారాత్రిని గడపి బ్రాహ్మణముహూర్తమునందు మనోహరమైన వందిగీతమును వినియె. పిమ్మట శ్రీరాముఁడు మేల్కాంచి నిత్యకృత్యములను నెరవేర్చుకొని శివపూజనుచేసి పురాణకథను విని యనేకములయిన దానములనుచేసె. అనంతరమందు ప్రయాణవిధానము నెరవేర్చి గణనాయకుని పూజించె. పిమ్మట నభ్యుదయిక శ్రాద్ధ ధృతశ్రాద్ధములను చేసె. అనంతరమందు కామధేను కల్పవృక్ష పుష్పక సురద్రుమమణిద్వయములను వేఱువేఱుగఁ బూజించి నూతనవస్త్రములను ధరించి తల్లులకు నమస్కారమునుచేసి బంధుజనులతోఁగూడ శిబికారూఢుండై పుష్పక విమానముదగ్గఱకుఁబోయె. పోయి పుత్రమిత్ర కళత్రాదులతోఁగూడ పుష్పకముపై నెక్కె. ఆసమయమందు కౌసల్యాది సకల స్త్రీజనమును యానముల నెక్కివచ్చి పుష్పకవిమానము నధిష్ఠించిరి. అప్పుడు నానావిధములయిన వాద్యములుమ్రోగె. వందిమాగధాదులు స్తోత్రమునుచేసిరి. వారాంగనలు నృత్యములను చేసిరి. నటులు గానమునుచేసిరి. అనంతరమందు శ్రీరాముఁ డావిమానమును ముందుగఁ దూర్పుదిక్కునకుఁ బొమ్మనియె. అంతట నావిమానము శ్రీరామాజ్ఞానుసారముగ తూర్పుదిక్కునకుఁబోయె. అట్లు శ్రీరాముఁడు బయలువెడలి పోవునపుడు సుమంత్రుఁడు నమస్కరించి యయోధ్యాపట్టణమునందు బ్రవేశించె. అంతట తూర్పుదేశమునందలి రాజులందఱును శ్రీరాముఁడు వచ్చినవృత్తాంతమును విని చేతులను ముకుళించుకొని శ్రీరాముని కెదురుగ వచ్చిరి. వచ్చి నానావిధములయిన కానుకలను సమర్పించి శ్రీరామునకు నమస్కరించిరి. అనంతరమందు తమతమ నగరములకుఁ దోడ్కొనిపోయి యనేకవిధములఁ బూజించిరి. పిమ్మట రామానుమతముచేత తమతమ సైన్యములతోఁగూడ పుష్పకవిమానము నధిష్ఠించిరి. పిమ్మట శ్రీరాముఁడు మగధదేశముల నన్నింటి నతిక్రమించి నానావిధదేశములను జూచుచు భూకీర్తియొక్క పట్టణమునకుఁబోయె. అప్పుడు భూకీర్తి యారాముని పుత్రమిత్రాది సహితముగఁ బూజించె. అనంతరమందు శ్రీరాముఁడు సముద్రతీరము ననుసరించి ద్రావిడదేశమునందుఁ బ్రవేశించె. పిమ్మట శ్రీరాముఁడు కృష్ణానదీతీరమునందలి యనేకదేశములను మెల్లమెల్లగ కాంతిపట్టణమునకుఁబోయె. అంతట కంబుకంఠుఁడు శ్రీరాముని పూజించె. అనంతరమందు చోళమండలము నతిక్రమించి యక్కడనున్న రాజులచేతఁ బూజింపఁబడియె. అనం

తరమందు కేరళదేశమునకుఁ బోయెను. పోయి విజయాపురవాసియగు విజయుఁడను రాజేంద్రునిచేతఁ బూజింపఁబడె. అనంతరమందు దేవగిరియను పట్టణమును స్వాధీనముగఁ జేసికొనిరి. పిమ్మట ననేకములయిన దుర్గములను స్వాధీనములయిన వానినిగాఁ జేసికొనిరి. అంతట వింధ్యాచల సమీపస్థమగున విరాటదేశమునకుఁ బోయి యాదేశాధిపతివలనఁ బూజింపఁబడి రేవాతీరమునందలి యోంకారేశ్వరుని పూజించె. అనంతరమందు మాలవదేశాధిపతులను జయించి యక్కడనుండి యుజ్జయినీ పట్టణమునకుఁ బోయెను. పిమ్మట నుగ్రబాహువును జయించి హేహయపట్టణమునకుఁ బోయెను. అంతట నక్కడ ప్రతీపుఁడను రాజేంద్రుని జయించి హస్తినాపట్టణమునకుఁబోయెను. అప్పుడు పురూరవవంశములయిన మువ్వురు రాజులు స్వల్పసైన్యమును వెంటఁబెట్టుకొని వచ్చి శ్రీరాముని మార్కొనిరి. పిమ్మట పుష్పకమునందున్న రామునిమీఁద ననేకములయిన శస్త్రములను వర్షింపఁజేసిరి. అంతట రామునకును వారికిని మూఁడుదినములు మిగుల భయంకరమైన యుద్ధముజరిగె. ఆయుద్ధముచేత గంగానది రక్తపూర్ణమయ్యె. అంతట నాల్గవదినమునందు శ్రీరాముఁడు వారల జయించి యాపట్టణమునందుఁ బ్రవేశించి వానర వైద్యుఁడగు సుషేణుని వానరసేనతోఁగూడ నాహస్తినాపట్టణమునందుఁ బ్రవేశించి చంద్రకులోద్భవులయిన యామువ్వురిని కారాగృహమునందుఁ బ్రవేశపెట్టె. అనంతరమందు సుబాహువుచేతఁ బరిపాలింపఁబడుచున్న మధురాపట్టణమునుజూచి యక్కడనుండి విదేశనగరమునకుఁ బోయెను. పోయి యూపకేతువునుచూచి యంతట పుష్కర కురుక్షేత్రములను జూచె. పిమ్మట నాశ్రీరాముఁ డాకాశమార్గముచేత మరుభూమి నతిక్రమించి మిగుల శ్రేష్ఠమైన గుర్జరదేశమునకుఁబోయెను. పిమ్మట ప్రభాసక్షేత్రమునకుఁబోయి యక్కడనుండి మల్లదేశమునకుఁబోయెను. పోయి గజాశ్వనగరమునందున్న యంగదునిచూచి యతనిచేతఁ బూజింపఁబడె. పిమ్మట ధనరత్ననగరమునందున్న చిత్రకేతువును జూచి యక్కడనుండి యానర్తదేశమునకుఁబోయి యక్కడనున్న రాజులచేతఁ బూజింపఁబడియె. అనంతరమందు పుష్కరుఁడను పుత్రునిజూచుటకు బుష్కరవతీపురమునకుఁ బోయెను. పిమ్మట శ్రీరాముఁడు తక్షశిలాహ్వయ నగరమునకుఁబోయి తక్షునిజూచి యక్కడనుండి భరతుని మేనమామ నివసించునగరమునకుఁబోయెను. పోయి యుధాజిత్తుచేతఁ బూజింపఁబడి యక్కడనుండి యాకాశమార్గమున మిగుల మనోహరమైన శకదేశమునకుఁబోయెను. అంతట శ్రీరాముఁడు యవనదేశమునందున్న రాజులను జయించి యక్కడనుండి తామ్రదేశమునకుఁబోయెను. అనంతరమందు మాయాపట్టణమునకుఁబోయి యక్కడనుండి కలాపగ్రామమునకుఁబోయెను. అంతట శ్రీరాముఁడు పూజ్యులగు నరనారాయణులను సేవించి యక్కడనున్న రాజులచేతఁ బూజింపఁబడియె. అనంతరమందు భారతేశుని జయించి వానిస్థానమునందుఁ దనయునుచరులలో నొక్కని స్థాపించె. పిమ్మట తొమ్మిదివేల యోజనముల విస్తీర్ణము కల

దియును, మిగుల మనోహరమును నగు పుణ్యదేశమునకుఁబోయి హిమాలయ పర్వతమునుజూచె. మఱియు నక్కడ నానావిధములయిన కౌతుకములనుజూచె.

ఇట్లని రాజ్యకాండాంతర్గతమైన తొమ్మిదవసర్గ ముగిసెను.

✱ శ్రీరాముఁడు జంబూద్వీపమును జయించుట. ✱

శిష్యోత్తముఁడవైన యోవిష్ణుదాసా! అనంతరమందు శ్రీరాముఁడు తొమ్మిదివేల యోజనముల విస్తీర్ణము కలదియును వాయునందనుఁడగు హనుమంతునకు నివాసస్థానమును అయిన కింపురుషవర్షమునకుఁబోయె. పోయి యక్కడనున్న నానావిధములయిన కౌతుకమును జూచుచు రాజసమూహముచేతఁ జుట్టఁబడి నవవాద్యఘోషములను వినుచు నందలి దేశముల నన్నిటినిజూచె. అనంతరమందు మిగుల మనోహరమైనదియును రెండువేలామడ వెడల్పుకలదియును, ఏనుబదియోజనముల పొడవు కలదియును, నానావిధధాతువులచేతఁ బ్రకాశించుచున్నదియును, అయిన హేమకూట పర్వతమునకుఁబోయె. పిమ్మట తొమ్మిదివేల యోజనముల పరిమితి కలదియును, నృసింహోపాసక ప్రహ్లాదునిచేతఁ బ్రకాశించుచున్నదియును, మిగుల మనోహరమును, అయిన హరివర్షమునకుఁబోయె. పోయి యందలి రాజుల జయించి యనేకములయిన కానుకలం గైకొని యక్కడనుండి రెండువేలామడ వెడల్పు కలదియును, లక్షయోజనముల పొడవుకలదియును మిగుల మనోహరమును అయిన నిషధపర్వతమునకుఁబోయె. అనంతరమం దిలావృతవర్షమునకుఁబోయె. పిమ్మట మేరుపర్వతమున కాశ్రయభూతమును, మేరువునకు దక్షిణదిక్కున నున్నదియును, మిగుల మనోహరముగఁ బ్రకాశించుచున్నదియును, జంబూద్వీపసూచకమును మిగుల విశాలమును అయిన జంబూవృక్షమును శ్రీరాముఁడు సీతామహాదేవికిఁజూపె. అనంతరమందు మేరుపర్వతమునకు పశ్చిమభాగమున మేరుపర్వతమున కాశ్రయభూతమును అయిన సుపార్శ్వపర్వతమునందు ప్రకాశించుచున్నదియును, మిగుల పొడవుగ నున్నదియును, మిగుల విపులమైనదియును, అతిమనోహరమును అయిన కదంబవృక్షమునుజూచి శ్రీరాముఁడు పరమానందమునుపొందె. మఱియును, మేరుపర్వతముయొక్క యుత్తరభాగమున కాశ్రయభూతమయిన కుముదనామక పర్వతమునందుఁ బ్రకాశించుచున్నదియును, మిగులఁ బొడవుగనున్నదియును, మిగుల మనోహరమును, అధిక విశాలమును, మిగుల స్థూలమున్ను అయిన వటవృక్షమునుజూచి శ్రీరాముఁడు మిగులసంతోషముకలవాఁడై యావృక్షమును సీతామహాదేవికిఁజూపె. అనంతరమందు మేరుపర్వతమునకు ఆశ్రయభూతమగు మందరపర్వతమందు ప్రకాశించుచున్నదియును, మిగుల విశాలమైనదియును, మిగులఁ బొడవైనదియును, అతిస్థూలమును మిగుల రమణీయమును అగు నసహాకార వృక్షమునుచూచి శ్రీరాముఁడు పరమానందమునుపొందె. మఱియు నాయిలావృత

వర్షమునందు ప్రకాశించుచున్న పరమశివునకు సీతాసమేతముగ శ్రీరాముఁడు నమస్కారమును చేసెను. అనంతరమందా వర్షవాసులగు రాజులచేత నమస్కరింపఁబడిన పాదపద్మములు కలవాఁడై శ్రీరాముఁ డక్కడనుండి తూర్పుదేశమునకు బోయెను. పోయి రెండువేలామడ వెడల్పు కలదియును, ముప్పదినాలుగువేలామడ పొడవు కలదియును, అయిన గంధమాదన పర్వతమును చూచెను. అనంతరమందు ముప్పదియొక వేలామడ పొడవు కలదియును హయగ్రీవోపాస్య భద్రాశ్వోపాసకాదిష్ఠితమును అయిన భద్రాశ్వమని యెడు పంచమవర్షమును చూచెను. పిమ్మట మేరుపర్వతమునకు పశ్చిమదిక్కునందున్నదియును రెండువేలామడ విశాలము కలదియును, ముప్పదినాలుగువేలామడ పొడవు కలదియును, మిగుల మనోహరమును అయిన మాల్యవత్పర్వతమును చూచెను. అనంతరమందు కేతుమాలవర్షమును చూచెను. అప్పుడా వర్షమునందలి వారందఱును శ్రీరామునకు నమస్కరించి యనేకములయిన కానుకలను సమర్పించిరి. అనంతరమందు మేరుపర్వతమున కుత్తరపుదిక్కున నున్నదియును, రెండువేలామడ పొడవు కలదియును, తొంబదివేలామడ పొడవు కలదియును అయిన నీలపర్వతమును చూచెను. పిమ్మట తొమ్మిదివేలామడ పొడవు కలదియును, మత్స్యోపాస్యమనూపాసకుండు కలదియును అగు రమ్యకవర్షమును చూచెను. అప్పుడక్కడనుండు రాజులందఱును శ్రీరామునకు నానావిధములయిన కానుకలను సమర్పించిరి. అనంతరమందు రెండువేలామడ వెడల్పు కలదియును ఎనుబదొక్కయామడ పొడవు కలదియును మిగుల మనోహరమును అయిన శ్వేతపర్వతమును చూచెను. అంతట నెనిమిదవదగు హిరణ్మయవర్షమును పొడఁగనియెను. అంతనక్కడనుండి బయలువెడలి రెండువేలామడ వెడల్పు కలదియును డెబ్బదియూఱు వేలామడ పొడవు కలదియును, అయిన శృంగవత్పర్వతమును చూచెను. పిమ్మట తొమ్మిదవదియును, తొమ్మిదివేలామడ పరిమితి కలదియును, మిగుల మనోహరమైనదియును అయిన యుత్తరకురువర్షమును జూచెను. చూచి యందలి రాజేంద్రునిచేతఁ బూజింపఁబడిన పాదపద్మద్వయము కలవాఁడై శ్రీరాముఁడు పరమానందమును పొందెను. అనంతరమందా శ్రీరాముఁడు జంబూద్వీపాధిపతియును, ఉత్తరాకురువర్షమునందున్నవాఁడును, అయిన సుబాహువనువానిని జయించి లంకాపట్టణమునకు బోయినపిమ్మట లవుని జంబూద్వీపమున కధిపతినిగాఁ జేయుదునని నిశ్చయించి కొంతకాలము వఱకును తనమంత్రియగు విజయుఁడనువానిని ఆ జంబూద్వీపమున కధిపతినిగాఁ జేసెను. మఱియు నో శిష్యోత్తమా! విష్ణుదాసా! ఇకను ననేకములైన వర్షఖండములను శ్రీరాముఁడు జయించెను. అవియన్నియును వర్ణింప నేరికిని శక్యముగాదు. ఈ విధముగ శ్రీరాముఁడు పుష్కరపత్రమువంటి జంబూద్వీపమును సర్వమును స్వాధీనమైనదానినిగాఁ జేసికొనియెను. ఆ మేరుపర్వతముయొక్క యగ్రభాగమునందు అష్టదిక్పతులను నివసించునట్టి యెనిమిదిపట్టణములు కలవు. ఆ యెనిమిదింటిని ఇంద్రాగ్నియమనిఋతివరుణవాయుకుబేరేశానులు పరిపాలించుచుందురు. ఆ యెనిమిదింటిలో నొ

కోటియును రెండువేల యేనూరామడ వెడల్పును పొడవునుగలవై యున్నయవి. మేరుపర్వతము లక్ష యోజనము లెత్తును ముప్పది రెండువేలామడ వెడల్పుకల శిరోభాగమును పదారువేలామడ వెడల్పుకల యధోభాగమునుకలదై యున్నది. మఱియు నా మేరుపర్వతముయొక్క యగ్రభాగమునందు యష్టదిక్పాలకుల పట్టణములయొక్క మధ్యభాగమునందు పదివేలామడ వెడల్పును పొడవునుకల బ్రహ్మపట్టణముకలదు. మఱియును సగరతనయులకు హామినిద్రఖ్యాటవిలస స్వర్ణప్రస్థము చంద్రశుక్లము ఆవర్తనులు రమణకము మందర హారిణము పాంచజన్యము సింహాలము లంకయనియును తొమ్మిది యుపద్వీపములుకలవు. ఆతొమ్మిదిద్వీపములను శ్రీరాముఁడు స్వాధీనములయినవానినిగాఁజేసికొనియె. మఱియును, భారతేలావృత వర్షములకంటె నితరములయిన యేనువర్షముల యందును అసంఖ్యాతములయిన నదులును పర్వతములును కలవు. వానియొక్క విస్తారమునువర్ణింప నెవరికిని శక్యముకాదు. అయినను ఇలావృతవర్షమునందలి ముఖ్యనదులను జెప్పెదను. అరుణోదము జంబునది పయోదధి ఘృతమధుగుడాన్నాంబర శయ్యాసనాభరణనామములు కలనదములుకలవు. మఱియును మధుధారానదులైదుకలవు. మఱియును సీతాలకనందా చక్షుర్భద్రలను నైదులు నాలుగు మేరుపర్వతమునకు నాలుగువైపులనుండియును ప్రవహించుచున్నవి. ఈనదులు నాలుగును జాహ్నవీభేదములేయని యెఱుఁగవలయును. ఆనదులలో సీతయను నది పూర్వసముద్రమునందును, చక్షుర్నది పశ్చిమసముద్రమునందును, భద్రయను నది యుత్తరసముద్రమునందును అలకనంద భరతవర్షముయొక్క దక్షిణభాగమునందలి సముద్రమునందును ప్రవేశించుచున్నవి. మఱియు నీ భారతవర్షమునందనేకములయిన సరిత్తులును పర్వతములును అనేకములుకలవు. అవి యెవ్వియనిన, మలయము మంగలప్రస్థము మైనాకము త్రికూటము ఋషభము కుటకము సహ్యము దేవగిరి ఋష్యమూకము శ్రీశైలము వైకుంఠము మహేంద్రము హారిధారము వింధ్యశక్తి మత్పర్వతము ఋక్షగిరి పారియాత్రము ద్రోణాచలము చిత్రకూటము గోవర్ధనము రైవతకము కకుభము నీలము గోకాముఖము ఇంద్రకీలము కామగిరి మొదలుగాఁగల పర్వతములనేకములు కలవు. అట్టిపర్వతములయొక్క నితంబములయందుఁ బుట్టిన నదీనదములనేకములుకలవు. అవి యెవ్వియనిన, చంద్రవశ, తామ్రపర్ణి యవటోదము, కృతమాల, వైహాయసి, కావేరి, వేణి, పయస్విని, శర్కరావర్తము, తుంగభద్ర, కృష్ణవేణి, భీమరథి, గోదావరి, నిర్వింధ్య, పయోష్ణి, తాపి, మహి, సురస, నర్మద, చర్మణ్వతి, సింధువు, అంధము, శోణము, మహానది, వేదస్మృతి, ఋషికుల్య, త్రిసామ, కౌశికి, మందాకిని, యమున, సరస్వతి, దృషద్వతి, గోమతి, సరయూ, రోధస్వతి, సప్తవతి, సుషోమ, శతద్రు, చంద్రభాగ, మరుద్వృధము, వితస్త, అసిక్ని, విశ్వ, అనునట్టి మహానదులనేకములుకలవు. ఓశిష్యోత్తమా! విష్ణుదాసా! ఉపద్వీపములతోఁగూడుకొనిన జంబూద్వీపమును సర్వమును శ్రీరాముఁడు స్వాధీనముగఁజేసి

కొనియె. అట్లు జంబూద్వీపమును సర్వమును స్వాధీనమైనదానినిగాఁ జేసికొనిన పిమ్మట శ్రీరాముఁడు లక్షయోజనముల విస్తీర్ణము కల యీ జంబూద్వీపమును దాటి ప్లక్షద్వీపమునకుఁ బోయె.

ఇట్లని యానందరామాయణాంతర్గత రాజ్యకాండమునందలి
యెనిమిదవసర్గ ముగిసెను.

---

* రాముఁడు ఆరుద్వీపములను జయించుట. *

ఓ శిష్యోత్తమా! విష్ణుదాసా! అనంతరమందు శ్రీమంతుఁడగు శ్రీరాముఁడు మిగులమనోహరమైన ప్లక్షద్వీపమునకుఁ బోయె. అది రెండులక్షలయోజనముల వెడల్పు కలదియును, సప్తవర్షములు కలదియును నై యుండె. అక్కడ నుపాస్యుఁడు సూర్యుఁడును ఉపాసకులు బ్రాహ్మణులును నై యుండిరి. మఱియు నాద్వీపమునందు హిరణ్మయమయిన ప్లక్షవృక్షము కలదు. ఆప్లక్షద్వీపము లవణసముద్రమున కవ్వల వెలుఁగొందుచున్నది. అట్టిద్వీపమునందలి శివవర్షమునకు శ్రీరాముఁడు ముందుగఁ బోయె. పోయిన పిమ్మట సకలపాపములను నశింపఁజేయునట్టి యరుణాయను నదియందు స్నానము చేసె. అనంతరమందు శ్రీరామునకు నావర్షాధిపతితో మిగులభయంకరమైన యుద్ధము జరిగె. అట్టియుద్ధమునం దారాజును జయించి యందలి రాజులచేతఁ బూజింపఁబడి యక్కడనుండి వజ్రకూటాచలమునకుఁ బోయె. ఆవజ్రకూటాచలము రెండుసముద్రములకు మధ్యభాగమునందుఁ గలదు. అంతట నాపర్వతమును దాటి యవయసవర్షమునకుఁ బోయె. అంతట నావర్షమునందలి నృణ్మానదీ జలమునందు స్నానమును చేసి యవయసేశ్వరునిదగ్గరకుఁ బోయె. అనంతరమందా రాజేంద్రునిచేతఁ బూజింపఁబడి యందలిరాజులను వెంటఁబెట్టుకొని యుపేంద్రసేన పర్వతమునకుఁ బోయె. పిమ్మట సుభద్రమను వర్షమునకు బోయె. అంతట శ్రీరాముఁడా ద్వీపమునందలి యాంగిరసీన యందు స్నానమును చేసి యావర్షాధిపతిచేతఁ బూజింపఁబడి యక్కడనుండి జ్యోతిష్మంతమను పర్వతమునకుఁ బోయె. పిమ్మట శాంతవర్షమునకుఁ బోయి యందలి సావిత్రీనదీ జలమునందు స్నానమును చేసె. అనంతరము దావర్షేశుని జయించి యావర్షమునందున్న రాజులనుగూడ జయించె. పిమ్మట సువర్ణపర్వతమునకుఁ బోయె. అంతట క్షేమవర్షమునకుఁ బోయి యాక్షేమవర్షమునందలి సుప్రభాతానదీజలమునందు స్నానమును చేసె. పిమ్మట క్షేమవర్షాధిపతిచేతఁ బూజింపఁబడి మిగులరమ్యమైన హిరణ్యష్ఠీవ నామధేయము కల పర్వతము నతిక్రమించె. అనంతరమం దమృతవర్షమునకుఁ బోయి యందలి రాజుచేతఁ బూజింపఁబడి సత్యంభరా నదీతోయమునందు స్నానమును చేసె. అంతట మేఘమాలపర్వతమును దాటి పుష్కరాఢ్యుఁడై యభయవర్షమునకుఁ బోయె. అనంతరమం దావర్షాధిపతిని జయించి సత్యంభరా నదీజలమునందు స్నానమును చేసె. పిమ్మట ప్లక్షద్వీపేశుఁడగు సుచంద్రుఁడను రాజును జయించె. అంతట మణికూటము

ను పర్వతమునుదాఁటె. అనంతరము నిక్షురసోదమను పేరుకలదియును, రెండులక్షల యోజనముల పరిమితికలదియును, అయిన సముద్రమునుదాటి నాలుగులక్షల యోజనముల పరిమితికల శాల్మలీద్వీపమునకుఁ బోయె. ఆద్వీపమునందు ప్రశస్తమైన శాల్మలీవృక్షము కలదు. మఱియును ఆద్వీపమునందలి వారిచేత సోముఁడను దేవుఁడు సేవింపఁబడుచుండె. ఆద్వీపమునందు మేరుపర్వతముయొక్క పూర్వదిక్కునఁ బ్రకాశించుచున్నది. మఱియు నాద్వీపమునందు సురోచనము, సౌమనస్యము, రమణకము, దేవవర్షము, పారిభద్రము, ఆప్యాయనము, అవిజ్ఞాతము, అనునట్టి ద్వీపము లేడుకలవు. మఱియు నక్కడ అనుమతి, సినీవాలి, సరస్వతి, కుహూ, రజని, నంద, రాక, అనునట్టి నదులుకలవు. మఱియును, శతశృంగము, వామదేవము, కుందము, కుముదము, పుష్పవర్షము, సహస్రశ్రుతి, స్వరసము, అనునట్టిపర్వతము లేడుకలవు. అట్లు శ్రీరాముఁ డాద్వీపమునందుఁ బ్రవేశించినపిమ్మట నాద్వీపాంతర్గత వర్షపాలురందఱ జయించె. అనంతరమునందాద్వీపాధిపతియగు సుబాహువుచేతఁ బూజింపఁబడి నాలుగులక్షల యోజనముల పరిమితికల సురోదమను సముద్రమును దాటి యెనిమిదిలక్షల యోజనముల పరిమితికల కుశద్వీపమునకుఁ బోయె. అచ్చటనుండు వారికి నగ్నిదేవుఁడు సేవింపఁదగినవాఁడై యున్నాఁడు. ఆద్వీపమునందు దేవతలచేతఁ జేయఁబడిన కుశస్తంభముకలదు. కావుననే యాద్వీపమునకు కుశద్వీపమని పేరుకలిగె. మఱియు నాద్వీపమునందు వసువు, వసుదానము, దృఢరుచి, నాభిగుప్తము, సత్యవ్రతము, వివిక్తము, వామదేవము, అనునట్టి ద్వీపము లేడుకలవు. మఱియు నాద్వీపమునందు రసకుల్య, మధుకుల్య, మిత్రవింద, శ్రుతివింద, దేవగర్భ, ఘృతచ్యుత, మంత్రమాల, అనునట్టి యేడునదులుకలవు. మఱియు నక్కడ చతుశ్శృంగము, కపిలము, చిత్రకూటము, దేవానీకము, ఊర్ధ్వరోమము, ద్రవిణము, అను నామధేయములు కల ప్రశస్తపర్వతములు కలవు. అట్టిద్వీపమునందలి రాజుల నందఱను జయించి యత్యధికమైన కీర్తినిపొందెను. అనంతరమందు కుశద్వీపపతిని జయించి మహాసేనను నిగుడించి సంతోషమునుపొందెను. పిమ్మట నెనిమిదిలక్షల యోజనముల పరిమితికల ఘృతసముద్రమును దాఁటె. దానిని దాటి క్రౌంచద్వీపమునకుఁ బోయె. ఆక్రౌంచద్వీపము కుశద్వీపముకంటె ద్విగుణితమైయున్నది. మఱియు నాద్వీపమునందు క్రౌంచమనియెడు పర్వతముకలదు. మఱియు నాద్వీపమునందు ఆమము, మధురుహము, మేఘపృష్ఠము, సుధామానము, భ్రాజిష్ఠము, లోహితార్ణము, వనస్పతి, అనువర్షము లేడుకలవు. మఱియును, వర్ధమానము, భోజనము, ఉపబర్హణము, నందము, నందనప్రశ్రేష్ఠము, సర్వతోభద్రము, శుక్లము, అనుపర్వతము లేడుకలవు. మఱియును, అభయ, అమృతౌఘ, ఆర్యక, తీర్థవతి, వృత్తిరూపవతి, పవిత్రవతి, శుక్ల, అను మహానదు లేడుకలవు. ఆనదులయందు స్నానమునుచేయుటచేత సకలపాపములను నశింపఁజేయును. ఇట్టిక్రౌంచద్వీపమునందలి సత్త్వవ్రా

ధిపతులచేతను గౌరవింపఁబడి క్రౌంచద్వీపముయొక్క కవ్వలనుండు క్షీరసముద్రమును దాటి శాకద్వీపమునకుఁ బోయె. ఆశాకద్వీపము ముప్పదిరెండులక్షల యోజనముల పరిమితికలది. ఆద్వీపమునందు మిగుల మనోహరమైన శాకవృక్షము కలదు. అక్కడ వాయురూపుఁడగు విష్ణుదేవుఁడు సేవింపఁదగినవాఁడై యున్నాఁడు. మఱియు నా ద్వీపమునందు పురోజవము, మనోజవము, పవమానము, ధూమ్రానీకము, చిత్రరూపము, బహురూపము, విశ్వాధారము, అనునట్టి వర్షములేడుకలవు. మఱియు నఘ, ఆయుర్ద, ఉభయస్పృష్టి, అపరాజిత, పుణ్య అనునట్టి నదులైదుకలవు. మఱియును, సహస్రశ్రుతి, నిజస్మృతి, అను రెండుప్రశస్తనదులుకూడ కలవు. ఈవిధముగ నేడు ద్వీపములయందును నేడునదులుకలవు. మఱియును, ఉరుశృంగము, బలభద్రము, శతకేసరము, సహస్రస్రోతము, దేవపాలము. మహానసము, ఈశానము, అనునట్టి పర్వతము లేడుకలవు. ఈవిధముగ శ్రీరాముఁడు సప్తద్వీపములయందును సంచరించి యచ్చటిరాజులచేతఁ బూజింపఁబడినవాఁడై శాకద్వీపపతినిగూడ జయించి యతనిచేతఁ బూజింపఁబడె. అంతటముప్పదిరెండులక్షల యోజనముల పరిమితికల దధిసముద్రమునుదాటి నాలుగులక్షల యోజనముల పరిమితికల పుష్కరద్వీపమునకుఁ బోయె. పోయి యాద్వీపమునకు చుట్టును మేఖలమువలె నున్నదియును, కనకశోభమును అయిన మానసోత్తరాచలమును చూచె. ఆద్వీపమునందు రమణకము, ధాతకి అనునట్టిప్రశస్తములై నవర్షములు రెండుకలవు. అట్టి రెండువర్షములకును అధిపతులగు నిరువురురాజులను జయించినపిమ్మట నాద్వీపేశ్వరుఁడగు సుదారాంగునిజూచి శ్రీరాముఁడు పరమానందమును పొందె. ఆద్వీపమునందు బ్రహ్మదేవుఁడు నివసించుటకుఁ దగినదియును, ద్వీపముయొక్క పేరునకుఁ దగినదియును అగుపుష్కరము కలదు. అక్కడనుండువారు కర్మమయమైన బ్రహ్మలింగమును పూజింతురు. ఆద్వీపమునందు పాపనాశములయిన నదులనేకములు కలవు. మఱియు నాద్వీపమునందు పదివేలామడ పొడవుకలదియును ప్రశస్తమును అయిన పర్వతమొక్కటికలదు. ఆపర్వతమునందు పూర్వభాగమునందు మిగుల మనోహరమైన యింద్రపట్టణమొకటి కలదు. దక్షిణభాగమునందు యమునిపురముకలదు. పశ్చిమదిక్కునందు వరుణుని పట్టణముకలదు. ఉత్తరపుదిక్కునందు కుబేరుని పట్టణముకలదు. ఈనాలుగు పట్టణములు మేరుపర్వతమునందలి నాలుగుపర్వతములకంటె ప్రశస్తములయినవి. మఱియు నాద్వీపమునందు భిన్నభిన్నములయిన నదులనేకములు కలవు. అంతట రాముఁడు వాని నన్నిటిని చూచి సీతామహాదేవికి సంతోషము కలుగుటకొఱకు శుద్ధోదక సముద్రమునుదాటి యొకకోటియు నేబదేడు లక్షలు నేబదివేల యోజనముల పరిమితికల భూలోకమునకుఁబోయె. పోయి యందలి రాజులచేతఁ బూజింపఁబడె. ఆభూలోకమునందలి మేరుమానసములయొక్క యంతరాళప్రదేశము ఒకకోటియు నేబదేడు లక్షలును నలుబదేడుయోజనముల పరిమితికలదై యున్నది. అట్టి భూమి

నిచూచినపిమ్మట అద్దమువలె నున్నదియును సువర్ణమయమును, దేవతలచేత ధిష్ఠింపఁబడినదియును ఎనిమిదికోటులును ముప్పదేనులక్షలును అగు యోజనముల పరిమితికలదియును నగుభూమినిజూచె. దానికవ్వల రెండుకోటు లిరువదియైదు లక్షల యోజనముల పరిమితికల లోకాలోకపర్వతములనుజూచె. ఆలోకాలోకపర్వతమునందు జగదాధారహేతువులై ఋషభము, పుండరీకము, కుముదము, వామనము, పుష్పదంతము, అపరాజితము, సుప్రతీకము, అనునట్టి దిగ్గజము లెనిమిది కలవు. మఱియు నాపర్వతమునందు షడ్గుణైశ్వర్య సంపన్నుఁడును, పరమమహాపురుషుఁడును, అధికమైన విభూతికలవాఁడును, అయిన దేవోత్తముఁడు సకల లోకహితముకొఱకు నివసించుచున్నాఁడు. దానికనంతరమందు ప్రసిద్ధమైన యోగేశ్వరగతిని చెప్పుచున్నాఁడు. ఓ శిష్యోత్తమా! ఈవిధముగ భూలోకము పంచాశత్కోటి గుణితమైనదని తెలియవలయును. ఈవిధముగ శ్రీరాముఁడు పంచాశత్కోటి భూమండలమును స్వాధీనముగఁ జేసికొని యక్కడనుండి బయలువెడలి యాకాశమార్గముచేత సకలద్వీపాదులను జూచుచు నయోధ్యాపట్టణమునకు నేగుదెంచె. అట్లు శ్రీరాముఁ డయోధ్యాపట్టణ సమీపమునకువచ్చి తన యాగమనవృత్తాంతమును సుమంత్రునకుఁ దెలిపె. అప్పుడు సుమంత్రుఁడు శ్రీరాముఁడు సకలలోకజయమునుపొంది వచ్చిన వృత్తాంతమును దెలిసికొని యయోధ్యాపట్టణమును సర్వమును నలంకరించె. అనంతరమున గజేంద్రమును ముందిడుకొని పౌరజానపదులతోఁగూడ శ్రీరామున కెదురుగఁబోయె. అట్లెదురుగవచ్చి యాసుమంత్రుఁడు శ్రీరామునకు నమస్కరించె. ఆసమయమునందు అప్సరోగణములు నృత్యమునుచేసిరి. నానావిధములయిన వాద్యములుమ్రోగె. వందిమాగధాదులు స్తోత్రమునుచేసిరి. అంతట శ్రీరాముఁడు పుష్పకమునెక్కియే రాజమార్గమునఁ బోవుచు పురజనులిచ్చినట్టి కానుకలను గ్రహించుచుండె. అంతట గృహసమీపమునకుఁబోయి విమానమునుండిదిగి సభలోనికిఁబోయి నిజాసనమునందుఁ గూర్చుండె. ఆసమయమునందు సకలరాజులును ఆశ్రీరామునకుఁజుట్టును గూర్చుండిరి. అనంతరమందు శ్రీరాముఁడు సకలరాజులకును నివసించుటకుఁ దగినస్థలములనుజూపుమని లక్ష్మణునకాజ్ఞాపించె. పిమ్మట దధిశ్రాద్ధాదులను సంపాదించి శ్రీరాముఁడు తనను కృతార్థునిగాఁదలఁచె. అంతట సకలరాజులచేతను బూజింపఁబడి లక్ష్మణానుమతమునుపొంది తనభ్రాతయగు భరతుని భరతాధిపతినిగాఁజేసె. కావుననే వసిష్ఠమునివరుఁడు జననకాలమునందే భరతుఁడని నామకరణమునుజేసె. అంతట నా శ్రీరాముఁడు తనపుత్రుఁడగు లవుని జంబూద్వీపాధిపతినిగాఁజేసె. అప్పుడు లవుఁడు విజయుని తనకు మంత్రినిగాఁజేసికొనియె. భరతుఁడు శత్రుఘ్నుని యౌవరాజ్యాభిషిక్తునిగాఁజేసె. శ్రీరాముఁడు తనరాజ్యమునందు కుశునకు యౌవరాజ్యాభిషేకమునుజేసె. లక్ష్మణుని తనమంత్రులలో ముఖ్యమంత్రినిగాఁజేసె. అప్పుడెల్లవారును

శ్రీరామునకు సహాయముగనుండిరి. అంతట శ్రీరాముఁడెల్ల వారినిబూజించి వారివారి దేశములకుఁబంపె. అప్పుడా రాజులందఱును శ్రీరామునకునమస్కరించి తమతమ దేశములకుఁబోయిరి. భరతుఁడు భారతవర్షమును జక్కఁగాఁ బరిపాలించుచుండె. లవుఁడు జంబూద్వీపమును మిగుల శ్లాఘ్యముగఁ బరిపాలించుచుండె. శ్రీరాముఁడు సప్తద్వీపములయందలి వృత్తాంతమును దెలిసికొని చక్కఁగఁ బరిపాలించుచుండె.

ఇట్లని యానందరామాయణాంతర్గత రాజ్యకాండమునందలి
తొమ్మిదవసర్గ ముగిసెను.

* శ్రీరాముఁడు యతిశూద్రగృధ్రములను శిక్షించుట. *

ఓశిష్యోత్తమా! విష్ణుదాసా! శ్రీరాముఁడు రాజ్యమునుచేయుచుండగ నొకనాఁడు రాజద్వారమునకు వెలుపల నొక్కశునకము మిగుల దీర్ఘమగుధ్వనితో రోదనమునుచేయుచుండె. ఆశునకధ్వనినివిని శ్రీరాముఁడు సభయందుండియే దూతనుబిలిచి శునకము దీర్ఘధ్వనితో రోదనమునుచేయుటకు కారణమును దెలిసికొనిరమ్మనియె. అంతట నాదూతపోయి యాశునకమును నివారించివచ్చి యోరఘుకులోత్తమా! నిష్కారణముగ శునకము రోదనమునుచేయుచున్నది. కావున నేనునివారింపఁగానే దూరముగఁబోయినదనియె. అంతట మఱుదినమందుఁగూడ శ్రీరాముఁడాశునకము యొక్క రోదనమునువినియె. మఱల పూర్వదినమునందు రామదూతపోయి నివారించె. మఱల మూఁడవదినమునందుఁగూడ శ్రీరాముఁడు శునకధ్వనినివిని తనయెదుట నున్న లక్ష్మణునితోనిట్లనియె. ఓతమ్ముఁడా! లక్ష్మణా! ఈశునకము మూఁడుదినముల నుండి రోదనమునుచేయుచున్నది. దానికష్టదుఃఖములుకలుగుటకు కారణమును దెలిసికొనిరమ్మనియె. ఆవచనమును లక్ష్మణుఁడువిని వల్లెయని మిగులత్వరకలవాఁడై దూతలనునియమించె. అంతట నారామదూతలుపోయి యోసారమేయమా! నిన్ను శ్రీరాముఁడు పిలుచుచున్నాఁడు. కావున నీవు శ్రీరామునిదగ్గరకువచ్చి నీదుఃఖకారణమును చెప్పుకొనుమనినవిని యాశునకమిట్లనియె. ఓరామదూతలారా! విష్ణుగృహమునందును, హోమశాలయందును, బృందావనమునందును, సభయందును, మఠమునందును, రాజగృహమునందును, గోష్ఠమునందును, పుణ్యస్థలమునందును, పుణ్యతీర్థమునందును, దేవాలయమునందును, పాకస్థానమునందును, రతిస్థానమునందును, స్నానసంధ్యలనుచేయు స్థలములయందును శునకములు ప్రవేశించుట తగదనియె. అంతట నారామదూతలు విస్మయముకలవారై శ్రీరామునిదగ్గరకువచ్చి యాశునకము చెప్పినమాటలను చెప్పిరి. ఆవచనమునువిని శ్రీరాముఁడునవ్వి పాదుకలను దెప్పించి వానినిదొడుగుకొని రత్నదండమును చేఁబూని మంత్రిసామంతాదులతోఁ గూడ శునకమున్నచోటునకువచ్చెం. వచ్చి యాశునకమునుజూచి శ్రీరాముఁడునవ్వుచు దానితో నిట్లనియె. ఓసారమేయమా! నీదుఃఖమునకు కారణమును చెప్పుము. ఓసార

మేయమా! నారాజ్యమునం దెవ్వఁడును దుఃఖమును పొందుటలేదు. కావున నీదుఃఖమును చెప్పుమనిన విని యాసారమేయము మాటిమాటికిని నమస్కారమునుచేసి యిట్లనియె. ఓరఘుకులోత్తమా! మార్గమధ్యమునందే నానిమిత్తముగ నీకు శ్రమను గల్పించితిని. ఓరామచంద్రా! నీవు చిరకాలముజీవింపుము. నేనేమియును నపరాధమును చేయకయే యొకయతిచేత రాతివలనఁ గొట్టఁబడితిని. అందువలన నాకాలు విఱిగి పోయినది. కాఁబట్టి నే నిప్పుడు నిన్ను శరణమును పొందితిననిన విని శ్రీరాముఁడు భటునిఁబంపి యాయతిని రప్పింపుమనియె. అంతట నాభటుఁడుపోయి యాయతిని బిలువఁగా నాయతి విహ్వలుఁడై శ్రీరాముని దగ్గరకువచ్చె. అట్లు వచ్చిన యతికి నమస్కారముచేసి శ్రీరాముఁ డిట్లనియె. ఓస్వామీ! నీవేమినిమిత్తముగ నీకుక్కయొక్క పాదమును విరుగఁగొట్టితివనిన యాయతి విని శ్రీరామునితో నిట్లనియె. ఓరఘుకులోత్తమా! నేను భిక్షార్థముగఁ దిరుగుచు నుండఁగా నీ శునకము నాభిక్షాన్నమును స్పృశించె. ఆసమయమునందు నేను మిగుల నాకలి చేతఁ బీడింపఁబడితిని. కావున నేను గోపముకలవాఁడనై బెదిరింపఁదలఁచి యొక రాతిని విసరివైచితిని. అందువలన నీశునకముయొక్క కాలువిఱిగె. నేను దీనికాలిని విరుగఁగొట్టఁ దలఁచియే రాతిని విసరివైచినవాఁడను గాననియె. ఆవచనమునువిని శ్రీరాముఁడు మరల నిట్లనియె. ఓపరివ్రాజకా! ఈశునకము జ్ఞానహీనమైన పశుజాతిలోఁ జేరినది. కావున నిది స్పృశింపఁదగును. ఇది స్పృశింపఁదగదు అనియెడు తెలివిలేనిది. కాఁబట్టి నీయన్నమును స్పృశించెను. ఇంతమాత్రముచేత నీశునకమునందు దోషమేమియును లేదని తలఁచుచున్నాను. నీయందే దోషము కలిగియున్నది. కావున నీవే దండింపఁదగినవాఁడవైతివని చెప్పి శ్రీరాముఁడా సారమేయముతో నిట్లనియె. ఓశునకమా! అపరాధము ఈయతియందే యున్నది. కావున నీయతిని నీచేతియందుఁ బెట్టితిని. నీయిష్టానుసారమగు శిక్షను విధింపుమనిన విని యాసారమేయ మిట్లనియె. ఓరఘుకులోత్తమా! ఈయతిని శివాలయాధిపత్యమునొసంగుమనియె. అంతట శ్రీరాముఁడా యతని శిబికయం దెక్కించి గంధపుష్పమాలాదులచేతఁ బూజించి వాద్యఘోషములతోడను నానావిధములయిన యుత్సవములతోడను శివాలయమునకుఁ దీసికొనిపోయి శివాలయాధిపత్యమునొసంగె. మఱియు నాయతికి వాని యజ్ఞానమునకుఁ దగిన ఫలము కలిగెనని శ్రీరాముఁడు తలఁచె. అనంతరమందు శ్రీరాముఁడు తనసభయందుఁ బ్రవేశించె. అప్పుడా కౌతుకమునుచూచుచున్న పురజనులందఱును శ్రీరామునితో నిట్లనిరి. ఓరఘుకులోత్తమా! ఈయతికి శునకము శివాలయాధిపత్యమును శిక్షనుగా విధించుటకు కారణమేమియో తెలియకున్నది. మఱియును, ఈయతి యిదివరకు భిక్షాన్నమునుదిని జీవించువాఁడు. ఇప్పుడు సుఖముగ జీవనమును చేయుచున్నాఁడు. దీనికిఁ దగిన కారణమును చెప్పుమనిన విని శ్రీరాముఁడిట్లనియె. ఓపురజనోత్తములారా! మీరాకుక్కనే యడుగుఁడు. అది

యీమానవదేహమును దీర్చఁగలదనియె. అంతట నాపురజనులందఱును నోసారమేయమా! నీయభిప్రాయమును జెప్పుమనిరి. అంతట నాశునక మిట్లనియె. ఓ పురజనోత్తములారా! కృషీవలనఁబుట్టిన ధాన్యసముదాయముకల కళ్లములయం దధికారమును పొందినవారును, శివాలయమఠారామదాన గ్రామములయం దధికారము కలవారును, రాజగృహమునందుఁ బ్రవేశించెడు యాచకులను నివారించువారును, అనాథస్త్రీబాలవిత్తములను హరించువారును, క్రూరముగ మాటలాడువారును, గోవిప్రశివద్రవ్యముల నపహరించువారును, అన్యాయమును చేయువారును, బ్రాహ్మణులు భుజింపఁదగిన ద్రవ్యమును, హోమద్రవ్యమును, విశేషముగ ద్రవ్యమును దొంగిలించువారును, మఱియొకజన్మమునందు కుక్కలై పుట్టుదురు. పూర్వజన్మమునందు నేను మఠాధిపత్యమును వహించియుండుటచేత నీజన్మమునందు కుక్కనైతిని. కావున నే నిప్పుడీ యతికి శివాలయాధిపత్యమును శిక్షనుగా విధించితిననిన యాపురజనులందఱును విని సందేహరహితులైరి. పిమ్మట నాపురజనులందఱును తమతమ గృహములకుఁబోయిరి. ఆయతియును దేహాంతమునందుఁ దన పాపవశమువలన శునకమై జన్మించె. ఆశునకము తనదు పాపఫలానంతరమందు ముక్తినిపొందె. అయోధ్యాపట్టణమునందు మరణమును పొందినవారికి పునర్జన్మము కలుగనేరదు. ఇట్టియయోధ్యాపట్టణమునందు యతిశునకమగుటయును శునకము ముక్తిని పొందుటయును, ప్రబలమైన కర్మమువలననే కాని మఱియొకటి కాదు. అయోధ్యాపట్టణమునందు శ్రీరాముఁడు పాలించుచున్న కాలమునందు సకల కార్యములును సత్యముగానే జరుగుచుండెను. అన్యాయమనునది కొంచెముగనైనను లేకయుండె. మఱియు నో శిష్యోత్తమా! అట్లుండఁగ నొక్కనాఁ డయోధ్యాపట్టణమునందు నివసించియున్న యొక బ్రాహ్మణునికుమారుఁడు అయిదుసంవత్సరముల వయస్సుకలవాఁడై మరణమునుపొందె. అంతట నాబ్రాహ్మణుఁడు భార్యాసమేతుఁడై యాశవమును దీసికొనివచ్చి యరుణోదయ కాలమునందు రాజద్వారమునునుంచె. అట్లు రాజద్వారమునందుఁబెట్టి యత్యధికముగ రోదనమును చేయుచుండె. మఱియుఁ నా బ్రాహ్మణుఁడు పుత్రశోకముచేత నధికముగ బాధింపఁబడుచున్నవాఁడును, కోపముకలవాఁడునునగుచు నిట్లనియె. ఓరామచంద్రా! నీవుసీతనుకౌగిలించుకొని యెట్లు నిద్రనుపొందుచున్నావు. నీరాజ్యమునందెవనియధర్మమువలన నాబాలుఁడు మరణమునుపొందెను. నీవైనను అధర్మమునుచేసియుండవలెను. ఇట్లుకాదేని మఱియొకఁడైన నధర్మమును చేసియుండ వలయును. రాజు అక్రమముగ సంచరించినయెడల మానవులు అల్పాయుష్యము కలవారగుదురు. కావున నీవు రాజ్యమునందుచేయుచున్న యధర్మమువలన నాపుత్రుఁడు మరణమునుపొందె. కాఁబట్టి నాపుత్రుఁడు జీవించుటకుఁ దగినయుపాయము నాలోచింపుము. నీవు నాపుత్రుని జీవింపఁజేయనియెడల భార్యాభర్తలగు మేమిరువురమును నగ్నియందుఁ బ్రవేశించెదము. నీతండ్రికి

బ్రాహ్మణశాపము కలిగినవిధముగ నీకుఁగూడ శాపముకలుగుననియె. అప్పుడా బ్రా
హ్మణునిభార్య సీతామహాదేవినుద్దేశించి యిట్లనియె. ఓసీతా! నీవు భర్తను కౌఁగి
లించుకొని యెట్లునిద్రనుపొందుచున్నావు. నీవును పుత్రులుకలదానవేకదా? కావు
ననీభర్తతోఁజెప్పి నాపుత్రుఁడు జీవించుటకుఁ దగినకార్యమును చేయింపుమనియె.
ఈవిధముగ నాదంపతులు చెప్పిన వాక్యములనువిని పురజనులందఱును నచ్చోటున
కువచ్చి మిగులవ్యగ్రమైన చిత్తముఁకలవారైరి. మఱియునప్పుడు సీతారాములుకూడ
ఆ దంపతులవాక్యమునువిని మిగుల విహ్వలమైన మనస్సుకలవారైరి. అంతటనా
సీతారాములు శయనగృహమునుండి బయలునకువచ్చిరి. వచ్చియాదంపతులదుఃఖ
ముచేతఁ దామును దుఃఖముకలవారైరి. అంతట శ్రీరాముఁడు వందిమాగధాదుల
స్తోత్రపాఠాదులను నివారించి మిగుల వేగముగ పుత్రశోకముచేత దుఃఖించుచున్న
యాదంపతులదగ్గరకుఁబోయిరి. అట్లుతమదగ్గరకువచ్చిన సీతారాములనుజూచి యా
దంపతులధికముగ దుఃఖమును పొందిరి. అప్పుడు శ్రీరాముఁడు వారల నూరార్చి
గద్గదస్వరముకలవాఁడై యిట్లనియె. ఓదంపతులారా! మీరుదుఃఖమునుపొందకుఁడు.
నావీర్యమును వినుఁడు. తగిన యుపాయమునుచేసి మీ కుమారుని బ్రదికించెదను.
మీ పుత్రుఁడు జీవింపక పోయిన యెడల నాకుమారుఁడగు కుశుని సమర్పించెదను.
మీరిరువురును నావాక్యమును సత్యముగనమ్ముఁడు? అంతట సీతామహాదేవి యా
బ్రాహ్మణునిభార్య నూరార్పఁ దలఁచి యిట్లనియె. ఓభామినీ! శ్రీరాముఁడు నీకు
పుత్రునిచ్చెదనని ప్రతిజ్ఞచేసె. కావున నేనుగూడ నీదుపుత్రుఁడు జీవింపనియెడల
నాకుఁ బ్రియుఁడగు లవుని సమర్పించెదను. ఈ కుశలవులచేత మీ పుత్రదుఃఖమును
పోఁగొట్టుకొనవచ్చును. అందువలన నీవు సౌఖ్యమునుపొందవచ్చును. కావున దుఃఖ
మును పొందకుమనియె. అప్పుడు శ్రీరాముఁడు ఆబ్రాహ్మణునితో నిట్లనియె. ఓ
బ్రాహ్మణోత్తమా! నీవుస్థిరుఁడవై యిక్కడనేయుండుము. నీవు విచారమునుపొంద
కుము. నీపుత్రునిజీవింపఁ జేసెదననియె. ఇవ్విధముగ జెప్పి లక్ష్మణునిచేత తైలద్రోణి
యందాశవమునుంచి క్రిమిదుర్గంధాదులుచేరకుండ నిలుపుమనియె. అనంతరమందా
రాముఁడు స్నానమునుచేసి ఖిన్నమానసుఁడై నిత్యకర్మానుష్ఠానమునుచేసె. పిమ్మట
సభలోనికిఁబోయి వసిష్ఠమునివరునితో నిట్లనియె. ఓ మునికులోత్తమా! నేనుధర్మ
యుతముగ రాజ్యమును పాలించుచుండఁగనె యీబ్రాహ్మణుని పుత్రుఁడు మరణ
మునుపొందె. ఈబ్రాహ్మణపుత్రుఁడు జీవించుటకుఁ దగినయుపాయమేదియో తెలు
పుమనియె. అట్లుశ్రీరాముఁడు చెప్పుచుండఁగ నంతరిక్షమునుండి యొక ధ్వని వినఁబడి
యె. అప్పుడెల్లవారును నిదేమనివిచారించుచుండఁగ నారదుఁడువీణనువాయించుచు
నాసభలోనికి విచ్చేసె. అప్పుడు శ్రీరాముఁ డెదురుగఁబోయి నమస్కరించి శాస్త్రో
క్తప్రకారముగఁ బూజించి సకలవృత్తాంతమును దెలియఁజేసి యిట్లనియె. ఓమునికు
లోత్తమా! ఈ బ్రాహ్మణశిశువు జీవించుటకుఁ దగినయుపాయమును బోధింపుము,

సీతయును నేనును కుశలవులనిచ్చెదమని ప్రతిజ్ఞనుచేసితిమి. ఏమినిమిత్తముగ నారాజ్యమునం దీబాలుఁడు మరణమునుపొందెనో నేనెఱుఁగ ననినవిని నారదమహాముని శ్రీరాముని కిట్లనియె. ఓరఘుకులోత్తమా! నీవిషయమై యెవ్వఁడును అధర్మము నాచరింపఁడు. నీవిప్పుడు బయలువెడలిపోయి భూమియందంతటను వెదకిచూడుము. భూమియందుఁ జరుగుచున్న వృత్తాంతము నేనెఱుఁగుదును. అయినను జనశిక్షకొఱకు నిన్నే పంపుచున్నాఁడను. ఓరఘుకులోత్తమా! అధర్మనిరతుఁడైన జనుని నీవ చూచిశిక్షింపుము. అధర్మమును నశింపఁజేయుటచేత నీశిశువు జీవింపఁగలఁడనియె. ఆవచనమునువిని శ్రీరాముఁడు నారదమునివరునిబంపి సీతామహాదేవి నాగరులు భ్రాతృమంత్రి గురువులుమొదలగువారితోఁగూడ పుష్పకవిమానమునెక్కె. అట్లు శ్రీరాముఁడు బయలువెడలినతోడనే యత్యధికమైన కోలాహలధ్వనికలిగె. ఆకోలాహలధ్వనినివిని శ్రీరాముఁడు మిగులభయముకలవాఁడై నలుదిక్కులయందును పరిశీలించిచూచె. అప్పుడు పురజనులందఱు నొక్కస్త్రీని జుట్టుకొనియుండిరి. ఆసమయమునందు శృంగిబేరపురమునుండి మఱియొకశవమువచ్చియుండె. అంతట విమానమునందున్న శ్రీరామునిజూచి యావిప్రాంగన హస్తములచేత రొమ్మునఁగొట్టుకొనుచు దీర్ఘస్వరముతో నేడ్చుచునిట్లనియె. ఓరఘుకులోత్తమా! నీరాజ్యమునందు సకలజనులును సుఖవంతులైయుండఁగా నేనొక్కతెమాత్రము భర్తృవిహీనురాలనైతిని. నీవుచేయుతప్పువలన నాభర్త మరణమునుపొందె. నీవు నన్నుఁజూచియును సిగ్గును పొందకుండుటకు కారణమేమి? నాభర్తను జీవింపఁజేయుము. అట్లుకాదేని నిన్ను శపింతుననియె. ఈవిధముగ నాబ్రాహ్మణస్త్రీ చెప్పినవాక్యమునువిని శ్రీరాముఁడు ఖిన్నమనస్కుఁడై యాబ్రాహ్మణస్త్రీని సంతోషపఱచుచు నిట్లనియె. ఓయంగనామణీ! కోపమునువిడిచిపెట్టుము. నీభర్తను జీవింపఁజేసెదను. ఇందుకొఱకే నేనుబయలువెడలిపోవుచున్నాను. నేనువచ్చువఱకును నీవు నాగృహమునందునివసింపుమనియె. ఈవిధముగఁజెప్పి యాయంగననూరార్చి యాశవమునుకూడ తైలద్రోణియందు బెట్టించిసుమంత్రునితోనిట్లనియె. ఓసుమంత్రుఁడా! నేనువచ్చువఱకును ఈశవమునుఅగ్నియందుకాచుచుఁ బ్రయత్నపూర్వకముగ రక్షించుచుండవలయును. మఱియు నీభూలోకమునందు మరణమును పొందఁదగనివాఁడు మరణమును పొందినయెడల అట్టివానిశవమును కాల్పవద్దని చాటింపు చేయవలయుననియె. ఈవిధముగ శ్రీరాముఁడు చెప్పిన వాక్యములను విని సుమంత్రుఁడు శ్రీరామాజ్ఞానుసారముగఁ బ్రవర్తించెదననియె. అంతట శ్రీరాముఁడు విమానారూఢుఁడై పశ్చిమోత్తరదిక్కునకు బయలువెడలిపోయె. అనంతరమందు తూర్పుదిక్కునకుఁ గూడఁబోయి పిమ్మట దక్షిణాభిముఖుడై పోయె. ఇంతలోపల అయోధ్యాపట్టణమునందు అయిదుశవములుకలిగె. వానినన్నిటిని తైలద్రోణియందుఁ బ్రవేశపెట్టె. ఆశవములలో మొదటిది మధురానగరమునుండియును, రెండవది ప్రయాగనుండియును, మూడవది హస్తినాపట్టణము